

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక


# వార్త

గుంటూరు

: fb.com/vaartha Digital

Published from Guntur,Ongole, Vijayawada,Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

14-6-2026 ఆదివారం సంపుటి: 32 సంచిక: 134 పేజీలు: 12 వెల: 8.00

## శత్రు మిస్సైళ్లను ఎదుర్కొనే రక్షణ వ్యవస్థ

9లో

యాంటీ షిప్ మిస్సైళ్లను ఢీకొట్టే టెక్నాలజీని పరీక్షించిన డిఆర్‌డిఒ


# ఇక భారీ టూరిజం ప్రాజెక్టులు

### పెట్టుబడులకు ముందుకు వస్తున్న జాతీయ, అంతర్జాతీయ సంస్థలు

### రాజమండ్రి సహా వివిధ ప్రాంతాల్లో మరిన్ని హోం స్టేలు

### అరకు, చింతపల్లి సహా 1015 చోట్ల కారవాన్ పార్కులు

### టెంపుల్ టూరిజానికి మరింత ప్రోత్సాహం: సిఎం చంద్రబాబు



**విజయవాడ, జూన్ 13 తర్వాత వార్త ప్రతినిధి :** రాష్ట్రం టూరిజం అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. ఎపి పర్యాటక పాలసీతో టూరిజం రంగంలో తీసుకుని వచ్చిన మార్పులకు గుర్తింపు లభించిందన్నారు. ఈ రంగంలో పెట్టుబడులకు జాతీయ. అంతర్జాతీయ సంస్థలు ముందుకు వస్తున్నాయన్నారు. పెరుగుతోన్న పర్యాటకుల ఫుట్‌ఫాల్‌కు అనుగుణంగా ఎపిలో హోటల్ గదులు, హోం స్టేలను త్వరితగతిన అందుబాటులోకి తీసుకొని వస్తున్నామని తెలిపారు. 2029 నాటికి రాష్ట్రంలో 50 వేల హోటల్ గదుల నిర్మాణం లక్ష్యాన్ని చేరుకోవాలని సిఎం చెప్పారు వివిధ పర్యాటక ప్రాంతాల్లో 10 వేలకు పైగా హోం స్టేలు కూడా అందుబాటులోకి తేవాలని స్పష్టం చేశారు. హోంస్టేలను అందుబాటు లోకి తీసుకువచ్చే అంశంపై ఎలాంటి పరిమితీ లేదని వివరించారు. రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డులో ఆమోదం తెలియజేసిన టూరిజం ప్రాజెక్టులు వేగంగా ఏర్పాటు అయ్యేలా చూస్తామన్నారు. రాష్ట్రంలోని వివిధ పర్యాటక ప్రాంతాలు, నగరాల్లో జాతీయ, అంతర్జాతీయ హోటల్ బ్రాండ్లు వచ్చేలా చూడాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామన్నారు. గోదావరి పుష్కరాల నాటికి కూడా రాజమహేంద్రవరం సహా వివిధ ప్రాంతాల్లో పెద్ద ఎత్తున హోం స్టేల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలన్నారు. హోంస్టేల నిర్వహణకు సంబంధించి రేటింగ్ కూడా పెట్టాలని ఆదేశించినట్లు సీఎం చంద్రబాబు సిఎంవో విడుదల చేసిన ప్రకటనలో వివరించారు. రెండేళ్ల కూటమి ప్రభుత్వంలో టూరిజంశాఖ ప్రగతిని వివరించారు. ఈ శాఖ నిర్వహిస్తున్న మంత్రి కందుల లక్ష్మీ దుర్గేష్ కుమార్ అభినందించారు. అరకు, చింతపల్లి, ముంచింగిపుట్టు, గాంధీవనం, మారేడుమిల్లి తదితర ప్రాంతాలతో పాటు కనీసం 1015 ప్రాంతాల్లో కారావాన్ పార్కులను ఏర్పాటు చేయాలని సూచించారు. కారావాన్లను పార్కింగ్ చేసుకుని కుటుంబంతో సురక్షితంగా ప్రకృతిని ఆస్వాదించేలా ఆయా పార్కుల్లో మౌలిక సదుపాయాలను కల్పించాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. రాష్ట్రంలోని ఎక్స్ పీరియన్స్ కేంద్రాల వద్ద కూడా ఈ తరహా ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు. తిరుపతి, విశాఖలలో అమ్యూజ్ మెంట్ పార్కుల ఏర్పాటుకు యాక్షన్ ప్లాన్ తయారు చేయాలని సిఎం సూచనలు జారీ చేశామన్నారు.
అటవీ, దేవాదాయ శాఖల సమన్వయంతో ఎకో, టెంపుల్ టూరిజానికి ప్రోత్సాహం ఇచ్చేలా ప్రాజెక్టులు చేపట్టాలని సిఎం పేర్కొన్నారు. ప్రసాద్, స్వదేశ్ దర్శన్ పథకాల కింద వివిధ దేవాలయాలు, దర్శనీయ స్థలాల అభివృద్ధికి చేపట్టిన ప్రాజెక్టులను 2026 మే నాటికి సిద్ధం చేయాలని అన్నారు. దీనికి సంబంధించి మరో రూ.663 కోట్లతో కేంద్రానికి ప్రతిపాదనలు పంపినట్టు వివరించారు. గండికోట, సూర్యలంక, అరకు బొర్రా గుహలు తదితర ప్రాంతాలను ప్రముఖ పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దేందుకు అవసరమైన కార్యాచరణ చేపట్టాలన్నారు. గోదావరి పుష్కర ఘాట్‌ను ఆగస్టు నాటికి, హేవ్ లాక్ బ్రిడ్జిపైకి పర్యాటకులను అనుమతించేలా ఈ ఏడాది డిసెంబరు నాటికి పనులు పూర్తి చేయానే సంకల్పంతో ఉన్నట్లు సిఎం స్పష్టం చేశారు. రాష్ట్రంలో పర్యాటకాన్ని ప్రోత్సహించేందుకు ప్రత్యే >>2



# వార్‌కు ఫుల్‌స్టాప్!

### జెనీవాలో ఇరాన్, అమెరికా శాంతి ఒప్పందానికి అంతా సిద్ధం

### ఉభయ పక్షాల మధ్య తుది దశకు చర్చలు

### ఒప్పందం ఖాయమన్న పాక్ ప్రధాని షరీఫ్

**ఇస్లామాబాద్, జూన్ 13:** దాదాపు 3 నెలలకుపైగా పశ్చిమాసియాలో తీవ్ర ఉద్రిక్తతలకు ముగింపు కార్డు పడుతోంది. స్విట్జర్లాండ్ రాజధాని జెనీవా వేదికగా ఒప్పందంపై అమెరికా, ఇరాన్, ఇజ్రాయెల్ ప్రతినిధులు సంతకాలు చేస్తారన్న సమాచారం వెలుగులోకి వచ్చింది. దీనికితోడు ట్రంప్ కూడా తన ట్రూత్‌పోస్టులో ఐరోపాదేశాల్లోనే ఒప్పందం జరుగుతుందని కూడా ధృవీకరించారు. ఇపుడు తాజాగా పాక్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ అమెరికా ఇరాన్ మధ్య శాంతి ఒప్పందం మరో 24 గంటల్లో ఖరారయ్యే అవకాశం ఉందని పాకిస్థాన్ ప్రకటన చేసారు. అమెరికా ఇరాన్ మధ్య >>2

# పెట్టుబడులు లక్ష్యంగా నేడు సింగపూర్‌కు సిఎం చంద్రబాబు



సింగపూర్ సెక్రటేరియట్

### సిఐఐ రోడ్‌షోలో పాల్గొననున్న సిఎం

### సింగపూర్ ప్రధాని, మంత్రులు, పారిశ్రామిక వేత్తలతో వరుస భేటీలు

**విజయవాడ జూన్ 13,ప్రభాతవార్తప్రతినిధి:** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రెండు రోజుల పాటు సింగపూర్‌లో పర్యటించనున్నారు. 14 తేదీ ఉదయం 11.35 గంటలకు బెంగళూర్ నుంచి సిఎం సింగపూర్ బయల్దేరి వెళ్లనున్నారు. సింగపూర్ చేరుకున్న అనంతరం 15వ తేదీన సింగపూర్ కాలమానం ప్రకారం ఉదయం 10.30 గంటలకు ఆ దేశంలోని భారత హై కమిషనర్ శిల్పక్ అంబులేతో మొదటగా సిఎం సమావేశం అవుతారు. పర్యటనలో తొలిరోజు స్టార్టప్ వెంచర్ కాపిటలిస్టులతో జరిగే రౌండ్ టేబుల్ కాన్ఫరెన్సుకు సిఎం హాజరవుతారు. అనంతరం యూఎన్ హాబిటాట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనాక్లాడియా రాస్ బాచ్‌తో విందు సమావేశంలో ముఖ్యమంత్రి పాల్గొంటారు. సింగపూర్ సీనియర్ మంత్రి లో యెన్ లింగ్‌తో సమావేశం అవుతారు. తర్వాత గూగుల్ క్లౌడ్ ఏపీఏసీ అధ్యక్షుడు కరణ్ భజ్వా, జిఐసి ఎగ్జిక్యూటివ్ కమిటీ అడ్వైజర్ లిమ్ సియాంగ్ గౌన్‌తో చర్చిస్తారు. వైసీహెచ్ లాజిస్టిక్స్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ రాబర్ట్ యాప్‌తోనూ, నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ సింగపూర్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ టాన్ యెంగ్ చెయ్‌తో భేటీ అవుతారు. సింగపూర్ ప్రధానమంత్రి లారెన్స్ వాంగ్‌తోనూ పలు అంశాలపై చర్చిస్తారు. సింగపూర్ విదేశాంగ మంత్రి వివియన్ బాలకృష్ణన్‌తోనూ భేటీ అవుతారు. సిఐఐ ఆంధ్రప్రదేశ్ ప్రతినిధి బృందంతోనూ సమావేశం అవుతారు. హోం మంత్రి కె షణ్ముగమ్, మానవ >>2

### వైజాగ్ విషాదం

## స్టీల్‌ప్లాంట్ ఘటనలో మరొకరి మృతి

### పదికి చేరిన మృతుల సంఖ్య



**విశాఖపట్నం (గాజువాక), జూన్ 13, ప్రభాతవార్త:** వైజాగ్ స్టీల్ ప్లాంట్‌లో ఇటీవల జరిగిన ఘోర ప్రమాదం మరో కుటుంబంలో విషాదాన్నినింపింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కార్మికుడు సూరిబాబు శనివారం మృతి చెందడంతో ఈ ప్రమాదంలో మృతుల సంఖ్య 10కి చేరింది. ప్రమాదం జరిగినప్పటి నుంచి తీవ్ర గాయాలతో విశాఖపట్నంలోని సెవెన్ హిల్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సూరిబాబు ఆరోగ్య పరిస్థితి విషమించడంతో వైద్యుల ప్రయత్నాలు ఫలించక కన్నుమూశారు. ఆయన మృతితో కుటుంబ సభ్యులు, బంధువులు శోకసంద్రంలో మునిగిపోయారు. సూరిబాబు భార్య వరలక్ష్మి >>2

# 'చిన్నారి అదృశ్యం'పై వీడని మిస్టరీ

### కేసుకు ఆధారంగా ఉన్న పెంపుడు కుక్క మృతి

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, జూన్ 13,ప్రభాతవార్త:** కాకినాడ జిల్లా తుని మండలం దొండవాక పంచాయతీ పరిధిలోని సిహెచ్ అగ్రహారం గ్రామంలో ఈనెల 6వ తేదీన మూడేళ్ల చిన్నారి సుంకర జ్ఞానేశ్వరి (జాహ్నవి) అదృశ్యమైన సంఘటన మిస్టరీగా మారింది. అగ్రహారం గ్రామంలో కొండను ఆనుకుని ఉన్న పామాయిల్ తోటలో కాపలాదారుగా ఉంటున్న సుంకర గణేష్, భవాని దంపతుల కుమార్తె జ్ఞానేశ్వరి. అదే పామాయిల్ తోటలో గణేష్ కుటుంబం నివాసం ఉంటుంది. చిన్నారి జ్ఞానేశ్వరి ఆడుకుంటూ పెంపుడు కుక్కతో సహా ఈనెల 6వ తేదీన అదృశ్యమైంది. ఈ సంఘటనపై నమోదైన కేసులో భాగంగా చిన్నారి కోసం పోలీసులు అప్పటినుండ గాలింపు చర్యలు మొదలు పెట్టారు. నిర్విరామంగా పోలీసులు పాపకోసం గాలింపు చర్యలు చేపడుతున్నా ఎటువంటి ఆధారం లభించలేదు. మూడు రోజుల తర్వాత చిన్నారితో పాటు అదృశ్యమైన పెంపుడు కుక్క చిన్నచిన్న గాయాలతో తిరిగి ఇంటికి చేరుకుంది. దీంతో పోలీసులు, కుటుంబ సభ్యులు కుక్క ద్వారా పాప ఆచూకీ లభిస్తుందని భావించారు. ఇంటికి వచ్చిన కుక్క ప్రవర్తన భిన్నంగా ఉండడంతో పోలీస్ అధికారులు వెటర్నరీ వైద్యులతో కుక్కకు వైద్య సేవలు అందించారు. కుక్క సాధారణ స్థితికి వచ్చిన తర్వాత సాంకేతిక నిపుణుల సహకారంతో పోలీసులు కుక్క మెడకు జిపిఎస్ ట్రాకర్‌ని అమర్చి వదిలిపెట్టారు.
జిపిఎస్ ట్రాకర్ ఆధారంగా కుక్క వెళ్లిన ప్రాంతాలలో పోలీసులు గాలింపు చర్యలు చేపట్టినా పాపకు సంబంధించి ఎటువంటి ఆచూకీ లభించకపోవడంతో చిన్నారి మిస్సింగ్ కేసు మిస్టరీగా మారింది. పోలీసులు చిన్నారి అదృశ్యం కేసును చేదించేందుకు ఆధారంగా భావించిన ట్రాకర్ అమర్చిన పెంపుడు >>2

# కార్మిక సంక్షేమంలో సంస్కరణలు

### పారిశ్రామిక భద్రతకు అత్యున్నత ప్రాధాన్యం

### డిజిటల్, ఇఎస్ఐ వైద్యసేవల విస్తరణ

### నిర్మాణ కార్మికులకు పలు సంక్షేమ పథకాలు

### - మంత్రి వాసంశెట్టి సుభాష్ వెల్లడి



**విజయవాడ,జూన్13,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల సంక్షేమాన్ని కేవలం ఒక ప్రభుత్వ కార్యక్రమంగా కాకుండా సామాజిక బాధ్యతగా, అభివృద్ధి లక్ష్యంగా భావించి పనిచేస్తోందని రాష్ట్ర కార్మిక, ఫ్యాక్టరీలు, బాయిలర్లు. ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్ శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. సిఎం చంద్రబాబు సహకారంతో కార్మిక శాఖతో సహ తమ పరిధిలోని మంత్రిత్వ శాఖలన్ని అభివృద్ధి దిశలో అడుగులు వేస్తున్నాయన్నారు. రాష్ట్ర అభివృద్ధి పునాదులు కార్మికుల శ్రమతోనే నిర్మితమవుతాయని, అందువల్ల కార్మిక సంక్షేమం, సామాజిక భద్రత, ఆరోగ్య రక్షణ, నైపుణ్యాభివృద్ధి, పారిశ్రామిక భద్రత వంటి అంశాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. రెండేళ్లకాలం తమ పరిధిలోని మంత్రిత్వశాఖలపై మంత్రి ఒక సమాచార పత్రం విడుదల చేసారు. గత రెండేళ్లలో కార్మిక శాఖలో చేపట్టిన సంస్కరణలు, సంక్షేమ కార్యక్రమాలు, డిజిటల్ సేవలు, నిర్మాణ కార్మిక సంక్షేమ చర్యలు, ఇఎస్ఐ వైద్య సేవల విస్తరణ, పారిశ్రామిక భద్రతా కార్యక్రమాల పురోగతిని వివరించారు.
ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కార్మిక సంక్షేమ వ్యవస్థను పునరుద్ధరించేందుకు చర్యలు ప్రారంభించిందన్నారు. నిర్మాణ కార్మికుల కోసం నిలిచిపోయిన సంక్షేమ పథకాలను మళ్లీ ప్రారంభించడమే కాకుండా వాటిని మరింత బలోపేతం చేసే చర్యలు చేపట్టినట్లు తెలిపారు. గతంలో నిలిచిపోయిన భవన. ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాలను ప్రభుత్వం మార్చి 2026 నుండి పునరుద్ధరించిందన్నారు. వివాహ బహుమతి రూ..20,000, ప్రసూతి ప్రయోజనం రూ..20,000, సహజమరణ సహాయం రూ.60,000, అంత్యక్రియల ఖర్చులు రూ.20,000 చొప్పున అందజేస్తోందన్నారు. ఈ మొత్తాలను మరింత పెంచే ప్రతిపాదనలు ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయన్నారు. అన్ని ప్రయోజనాలను ఆధార్ ఆధారిత డిబిటిద్వారా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసే విధానం అమలు చేయడం ద్వారా పారదర్శకతను తీసుకురావడం జరిగిందన్నారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం 2024-25లో రూ.675.39 కోట్లు, 2025-26లో రూ.733.19 కోట్లు, మొత్తంగా రూ.1,408.58 కోట్లు సెస్ వసూలు చేయడం జరిగిందన్నారు. ఈ నిధులను కార్మికుల సంక్షేమం, నైపుణ్యాభివృద్ధి, సామాజిక భద్రతా కార్యక్రమా >>2



శనివారం తడవద్ద దగ్ధమవుతున్న బస్సు

## కార్మికుల బస్సు దగ్ధం

### తప్పిన ప్రాణాపాయం

**తడ, జూన్ 13 ప్రభాతవార్త:** శ్రీసిటీ కార్మికులు ప్రయాణిస్తున్న బస్సు తిరుపతి జిల్లా తడ పట్టణ సమీపంలోని జీరో పాయింట్ వద్ద అగ్నికి ఆహుతైంది. శనివారం ఉదయం 8 గంటల సమయంలో శ్రీ సిటీ ఐఎంఒపి పరిశ్రమకు చెందిన ఎస్‌బిఎల్‌టి ప్రవేట్ ట్రావెల్ బస్సు కార్మికులను ఎక్కించుకొని వెళుతున్న సమయంలో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో డ్రైవర్ అప్రమత్తమయ్యాడు. కార్మికులు బస్సు దిగిపోవడంతో ఎలాంటి ప్రాణ నష్టంజరగలేదు. షార్ట్‌సర్క్యూట్ కారణంగా బస్సులో మంటలు చెలరే >>2

# కూలిన విమానం



### ఐదుగురు మృతి

**గౌహతి, జూన్13:** అస్సాంలోని జోర్హాట్ వైమానిక స్థావరంలో విమాన ప్రమాదం చోటుచేసుకుంది. భారత వైమానిక దళానికి చెందిన రవాణా విమానం ఎయిర్‌బేస్ లోపల ల్యాండ్ అవుతుండగా మంటలు చెలరేగడంతో కూలిపోయింది. ఈ ఘటనలో వాయుసేనకు చెందిన ఐదుగురు సిబ్బంది ప్రాణాలు కోల్పోయారని ఐఎఎఫ్ అధికారులు వెల్లడించారు. తీవ్రంగా గాయపడిన కో పైలట్‌కు ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రమాదానికి గల కారణాలను తెలుసుకునేందుకు అత్యున్నత స్థాయి దర్యాప్తునకు ఆదేశించినట్లు అధికారులు పేర్కొన్నారు. మృతులను స్క్వాడ్రన్ లీడర్ ప్రశాంత్ సింగ్, ఫ్లైట్ లెఫ్టినెంట్ శుభమ్ కుమార్, సార్జెంట్ జితేంద్ర శర్మ, అగ్నివీర్‌కు చెందిన ఖేమరామ్ కుమావత్, డానిష్, ఆలమ్‌గా గుర్తించారు. విమాన ప్రమాదంలో వాయుసేనకు చెందిన అయిదుగురు సిబ్బంది ప్రాణాలు కోల్పోవడంపై రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన వాయుసేన యోధుల కుటుంబాలకు అండగా ఉంటామని పేర్కొన్నారు. దేశానికి వారు అందించిన సేవలను ఎల్లప్పుడూ గుర్తుంచుకుంటామన్నారు. ప్రమాదంపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలని అధికారులను ఆదేశించినట్లు ఎక్స్‌లో పోస్టు పెట్టారు.

### కొత్త ఆర్మీ చీఫ్‌గా లెఫ్టినెంట్ జనరల్ ధీరజ్‌సేథ్ 9లో

# వర్షంతో రైతుల్లో చిగురిస్తున్న ఆశలు

### అనంతపురం జిల్లాలోని పలు మండలాల్లో వర్షాలు

### తుంగభద్ర రిజర్వాయర్ ఎగువ భాగంలో వానలు నిల్!

### ఎల్‌నినో ప్రభావంతో రైతుల్లో కొనసాగుతున్న ఆందోళన

**అనంతపురం, జూన్ 13 ప్రభాతవార్త బ్యూరో:** ఈ యేడాది ఎలినినో సూపర్ ఎలినినోగా మారి ఉష్ణోగ్రతలు పెరుగుతాయని, తద్వారా రుతు పవనాలకు ఆటంకాలు ఏర్పడుతాయని, తద్వారా వర్షాలు తగ్గే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు అభిప్రాయ పడుతున్న నేపథ్యంలో రైతుల్లో ఎక్కడో తెలియని ఆందోళన నెలకొంది. ఎక్కువ పెట్టుబడి పెట్టి పంటలు సాగు చేస్తే ఫలితం ఉంటుందా లేదా అనే సందిగ్ధ పరిస్థితి వెనుకబడిన అనంతపురం జిల్లాలో రైతుల్లో ఆందోళన నెలకొంది. ఈ పరిస్థితుల్లో రెండు రోజులుగా ఆకాశం మేఘావృతం కావడం, అడపాదడపా వర్షాలు వస్తుండటం, కొన్ని మండలాల్లో ఎక్కువ వర్షపాతం నమోదు కావడంతో రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఈ యేడాది కూడా వర్షాలు వస్తాయన్న ఆశతో ఎక్కువ పెట్టుబడితో పంటలు సాగు చేసేందుకు, సేద్యం పనులు చేసుకునేందుకు రైతులు సిద్ధం అవుతున్నారు. ప్రభుత్వం సబ్సిడి విత్తన వేరుశనగ విత్తనాలను కూడా పంపిణీకి సిద్ధం కావడంతో రైతుల్లో ఉత్సాహం వస్తోంది. శుక్రవారం రాత్రి అనంతపురం జిల్లాలో వివిధ మండలాల్లో వర్షాలు పడ్డాయి. వర్షాలు పడటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని పామిడిలో 84.6, పెద్దవడుగూరు 44.8, యాడికిలో 44.2, పెద్దపప్పూరులో 40.4, బొమ్మనహాళ్‌లో 40.2, అనంతపురం రూరల్‌లో 36, అనంతపురం అర్బన్‌లో 30.2, కుందుర్పిలో 28.2, బుక్కపట్నంలో 27.00, కణేకల్లు, కళ్యాణదుర్గంలో 21 చొప్పున, శింగనమలలో 20.8 మి.మీ వర్షం కురిసింది. అదే విధంగా మడకశిరలో 74.6, రొళ్లలో 57.4, రొద్దంలో 53.6, 53.2 లేపాక్షి, సోమందేపల్లిలో 52.2, చిలమత్తూరులో 43.6, హిందూపురంలో 42.6, పరిగిలో 36.4, నల్లమాడలో 32, గుడిబండలో 31.2, పెనుకొండలో 19.6 మి.మీ వర్షం కురిసింది. ఇదే విధంగా మరో వారం రోజులు అన్ని మంవడలాల్లో వర్షాలు పడాలని రైతులు ఆశతో ఎదురు చూస్తున్నారు. తాడిపత్రి, గుత్తి, వజ్రకరూరు, యల్లనూరు, యాడికి, కళ్యాణదుర్గం, శింగనమల, గార్లదిన్నె, రాప్తాడు, రాయదుర్గం, నార్పల, గుంతకల్లు లాంటి మండలాల్లో ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనప్పటి నుంచి అనుకున్న స్థాయిలో వర్షాలు పడలేదని తెలుస్తోంది.

**ఒట్టి కుండలా తుంగభద్ర రిజర్వాయర్ :**
ఆంధ్ర-కర్ణాటక ఉమ్మడి ప్రాజెక్టు అయిన తుంగభద్ర జలాశయం ఎగువ ప్రాంతమైన అగుంబే, తీర్థహల్లి తదితర ప్రాంతాల్లో ఈ సమయంలో భారీ వర్షాలు పడేవి. కర్ణాటకలోని పశ్చిమ కనుమల్లో విస్తారంగా భారీ >>2

14-6pg2exHMNWJQEV_14-6pg2exHMNWJQEV.qxd 13/Jun/26 11:48 PM Page 1






శనివారం అగర్తలాలో శాంతినికేతన్ మెడికల్ కాలేజీలో ఒక మహిళా ఉద్యోగిని హత్యచేసారన్న ఆరోపణపై నిరసన తెలుపుతున్న సిఐటియు మద్దతుదారులను అదుపులోకి తీసుకున్న పోలీసులు

# మరొకరి మృతి

>> కుమారుడు లోకేష్, కుమార్తె ప్రమీలతో కలిసి పెదగంట్యాడ మండలం సీతానగరం గ్రామంలో నివాసం ఉంటున్నారు. కుటుంబానికి ప్రధాన ఆధారంగా ఉన్న సూరిబాబు మృతితో ఆ కుటుంబం దిక్కుతోచని స్థితిలో పడింది.మృతదేహం గ్రామానికి చేరుకోనున్న నేపథ్యంలో సీతానగరం గ్రామంలో విషాద వాతావరణం నెలకొంది. గ్రామస్తులు, బంధువులు పెద్దసంఖ్యలో కుటుంబ సభ్యులను పరామర్శిస్తూ ధైర్యం చెబుతున్నారు.వైజాగ్ స్టీల్ ప్లాంట్ ప్రమాదంలో వరుసగా ప్రాణనష్టాలు చోటుచేసుకోవడం కార్మిక వర్గాలను కలచివేస్తోంది. ఇప్పటికే తొమ్మిదిమంది ప్రాణాలు కోల్పోగా, సూరిబాబు మృతితో ఆ సంఖ్య పది మందికి చేరింది. ఈ ఘటనపై కార్మిక సంఘాలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తూ, బాధిత కుటుంబాలకు తగిన పరిహారం అందించడంతో పాటు భవిష్యత్తులో ఇటువంటి ప్రమాదాలు జరగకుండా కఠిన భద్రతాచర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నాయి. వైజాగ్ ఉక్కు కర్మాగార చరిత్రలో ఈ ప్రమాదం విషాదకర అధ్యాయంగా నిలవగా, మరో కార్మికుడి మృతి కార్మిక కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని నింపింది.

# కార్మికుల బస్సు దగ్ధం

>> గాయి. కొద్ది సమయంలోనే బస్సు అగ్నికి ఆహుతి అయింది. దట్టమైన మంటలు కమ్ముకోవడంతో తడ పరిసర ప్రాంతాల ప్రజలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. కిలోమీటర్ల మేర ట్రాఫిక్ స్తంభించింది. ఎస్సై కొండప్ప నాయుడు వారి సిబ్బంది సమస్యను అదుపులోకి తీసుకొచ్చారు. తరచూ అపాచీ, శ్రీ సిటీపరిశ్రమల బస్సులు ప్రమాదాలు జరుగుతుండడంతో కార్మికులు భయాందోళనలకు గురవుతున్నారు. ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుల యాజమాన్యం ఇష్టమొచ్చిన రీతిలో నాణ్యతా ప్రమాణాలు లోపించిన కాలం చెల్లిన బస్సులు నడపడం అవగాహన అనుభవం లేని డ్రైవర్లతో వాహనాలు నడిపించడం వల్లే తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని విమర్శలు వినిపిస్తున్నాయి. సంబంధిత అధికారులు బస్సుల నాణ్యత ప్రమాణాలపై దృష్టి సారిస్తే లైసెన్సులు లేకుండా బస్సులు నడుపుతున్న డ్రైవర్లపై బస్సుల యాజమాన్యంపై చర్యలు చేపట్టితే ప్రమాదాలు అరికట్టే అవకాశం ఉందని ప్రాణాలు అరిచేతిలో పెట్టుకుని ప్రయాణించవలసిన పరిస్థితి ఏర్పడిందని కార్మికులు స్థానికులు ఆవేదన చెందుతున్నారు.

# సింగపూర్‌కు సిఎం చంద్రబాబు

>> వనరుల శాఖ మంత్రి టాన్ సీ లెంగ్‌తో చివరిగా భేటీ అవుతారు. రెండవ రోజు పర్యటనలో భాగంగా 16వ తేదీ ఉదయం కాకతీయ కల్చరల్ అసోసియేషన్ సిబిఎస్ 361ను ముఖ్యమంత్రి ప్రారంభిస్తారు. ఏపీపీసీ సెమికండక్టర్ రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొంటారు. సుర్బానా జురాంగ్‌అమరావతి ప్లానింగ్ సమావేశానికి హాజరవుతారు. అనంతరం సింగపూర్ ఉప ప్రధానమంత్రి, వాణిజ్య మంత్రి గాన్ కిమ్ యాంగ్ బృందంతో సమావేశం అవుతారు. తర్వాత 'వరల్డ్ సిటీస్ సమ్మిట్' లీడర్షిప్ ప్లీనరీలో పాల్గొని ప్రసంగిస్తారు. తర్వాత వరల్డ్ సిటీస్ సమ్మిట్ ఎగ్జిబిషన్ సందర్శిస్తారు. సింగపూర్ పెవిలియన్, ఇన్నోవేటర్ల అలయ్, గూగుల్ టెక్నాలజీస్ స్టాల్స్ ప్రధానంగా పరిశీలిస్తారు. సీట్రియమ్ సమావేశంలోనూ పాల్గొంటారు. పర్యటనలో చివరిగా సీఐఐ పార్ట్‌నర్షిప్ సమ్మిట్ 2026 బిజినెస్ రోడ్ షోలో పాల్గొంటారు. సింగపూర్ పర్యటనకు ముఖ్యమంత్రి వెంట పురపాలక శాఖ మంత్రి నారాయణ, పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్, పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి సురేశ్ కుమార్, ఇడిబి సిఇఒ షన్మోహన్, సిఆర్‌డిఎ అధికారుల బృందం కూడా వెళ్లనుంది. రాజధాని అమరావతి నిర్మాణ ప్రాజెక్టులు సహా రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించేందుకు సిఎం బృందం సింగపూర్‌లో పర్యటించనుంది. 16 తేదీ రాత్రి 10 గంటలకు ముఖ్యమంత్రి స్వదేశానికి తిరిగి రానున్నారు.

# వీడని మిస్టరీ

>> కుక్క శనివారం మృతి చెందడంతో కుటుంబ సభ్యులలో ఆందోళన మరింత పెరిగి పాప కోసం కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. కాకినాడ జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పెద్దాపురం ఎస్డిపిఓ తిలక్ నేతృత్వంలో తుని రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ జి. చెన్నకేశవ రావు ఆధ్వర్యంలో తుని రూరల్ ఎస్సై కృష్ణమాచారి, కోటనందూరు ఎస్సై టి. రామకృష్ణ, తొండంగి ఎస్సై జగన్మోహన్‌తో పాటు పెద్దాపురం డివిజన్ పరిధిలోని పోలీస్ యంత్రాంగం వారం రోజులుగా చిన్నారి జ్ఞానేశ్వరి ఆచూకీ కోసం అహర్నిశలు శ్రమిస్తున్న ఎటువంటి ఫలితం లేకపోవడం తో పాప కుటుంబ సభ్యులు, పోలీసులు విస్మయం చెందుతున్నారు. ఎస్‌డిఆర్‌ఎఫ్, ఫైర్ సిబ్బందిని సమన్వయం చేసుకుంటూ సుమారు 300 మంది పోలీసులు చిన్నారి జ్ఞానేశ్వరి ఆచూకీ కోసం గాలిస్తున్నారు. డ్రోన్స్లు,డాగ్ స్క్వాడ్‌తో కొండలను,తోటలను జల్లెడ పట్టిన పోలీసులు కిడ్నాప్ కోణంలో కూడా దర్యాప్తు వేగవంతం చేస్తున్నారు. అందుబాటులో ఉన్న సిసి కెమెరాల పుటేజీ పరిశీలించారు. తుని బస్టాండ్, రైల్వే స్టేషన్, నర్సీపట్నం రోడ్డు తదితర ప్రాంతాల్లో సైతం పోలీసులు గాలిస్తున్నారు. ఎనిమిది రోజులు గడుస్తున్న చిన్నారి మిస్సింగ్‌కు సంబంధించి ఒక్క ఆధారం లభించకపోవడంతో పాప క్షేమంగానే ఉంటుందా అనే కోణంలో సర్వత్రా చర్చనీయాంశంగా మారింది . ఏది ఏమైనా ప్రజల ప్రార్థనలు, పోలీసుల శ్రమ ఫలించి చిన్నారి తల్లి జ్ఞానేశ్వరి క్షేమంగా అమ్మ ఒడికి చేరాలని కోరుకుందాం.

## చిన్నారి అదృశ్యం ఘటనపై డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ ఆరా

**విజయవాడ.జూన్ 13,ప్రభాతవార్త ప్రతినిధి:** తుని మండలంలో చిన్నారి అదృశ్యం ఘటనపై డి.సిఎం పవన్ ఆరా తీశారు. ఈ మేరకు కాకినాడ జిల్లా ఎస్పీ బిందుమాధవ్‌తో ఆయన ఫోన్‌లో మాట్లాడారు. ఎన్డీఆర్‌ఎఫ్ బృందాల సేవలు కూడా వినిగియోగించుకోవాలని పవన్ తెలిపారు. అటవీశాఖ, బేస్‌క్యాంప్ వాచర్స్, నిపుణుల సాయం తీసుకోవాలని చెప్పారు. పాప ఆచూకీ కోసం 400 మంది సిబ్బంది గాలిస్తున్నట్లు ఎస్పీ బిందుమాధవ్, పవన్‌కు వివరించారు. అత్యాధునిక డ్రోన్లతో గాలింపు జరుపుతున్నామని తెలిపారు. చిన్నారి ఇంటి పరిసరాల్లో 38 సిసి కెమెరాల ఫుటేజ్ పరిశీలించామని చెప్పారు. ఈ క్రమంలోనే దర్యాప్తు మరింత వేగవంతం చేయాలన్న డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ ఎస్పీని ఆదేశించారు.

# ఇక భారీ టూరిజం ప్రాజెక్టులు

>> కంగా ఓ బోర్డు లేదా కమిటీ ఏర్పాటు చేసి ప్రాజెక్టులను ముందుకు తీసుకువెళ్లాలని సిఎం నిర్ణయించామన్నారు. ఆ క్రమంలో కార్యచరణ చేపట్టామన్నారు.. పర్యాటకశాఖ, అటవీ, దేవాదాయ, పోలీసు, మెరైన్ ఇలా వేర్వేరు శాఖల సమన్వయం కోసం సిఎస్ అధ్యక్షతన దీనిని ఏర్పాటయి కార్యచరణ సాగిస్తుందన్నారు.స్పష్టం చేశారు. హౌస్ బూట్లు, హెలీ టూరిజంతో పాటు ఉడాన్ పథకం కింద సీ ప్లేన్‌లను కూడా ప్రోత్సహించాలని అన్నారు. విశాఖ, విజయవాడ, శ్రీశైలం, గండికోట, కంభం చెరువు లాంటి చోట్ల వాటర్ ఏరో డ్రోమ్స్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం అందించాలని సూచించారు. సముద్ర విహారాన్ని ప్రోత్సహించేలా విశాఖ, నెల్లూరులోని కృష్ణపట్నం పోర్టుల నుంచి క్రూజ్ నౌకలను కూడా నిర్వహించేలా చూడాలన్నారు. తెలంగాణా లాంటి ల్యాండ్ లాక్డ్ రాష్ట్రాల నుంచి కూడా పర్యాటకులు దీనికి పెద్ద ఎత్తున ఆకర్షితులు అవుతారన్నారు. రాష్ట్రంలోని వేర్వేరు ప్రాంతాల్లో ఏర్పాటు చేసే టెంట్ సిటీలను కేటగిరీలుగా విభజించి ప్రోత్సహిస్తే అందరికీ అందుబాటులోకి వస్తాయన్నారు. కనీసం వెయ్యి టెంట్ సిటీలను గోదావరి పుష్కరాల నాటికి అందుబాటులోకి తేవాలని సీఎం సూచనలు జారీ చేశారు. క్రియేటివ్ ఎకనామినీ ప్రోత్సహించేందుకు కంటెంట్ క్రియేషన్ పెద్ద ఎత్తున జరగాలన్నారు. క్రియేటివ్ ఎకానమీని సృష్టించేలా అమరావతి క్రియేటివ్ సిటీగా ఎదగాలన్నారు. బాలివుడ్ స్టార్ సంజయ్ దత్ కూడా క్రియేటివ్ ఎకనామీ ప్రాజెక్టు ఏర్పాటు చేసేందుకు ఆసక్తి చూపించారన్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన ఐకానిక్ డెస్టినేషన్ స్కీమ్ కింద విశాఖ, తిరుపతి నగరాలను అభివృద్ధి చేయాలని.. ప్రతీ ఐకానిక్ డెస్టినేషన్‌కు రూ.500 కోట్ల వరకూ వెచ్చించేందుకు ఆస్కారం ఉందని ముఖ్యమంత్రి వివరించారు. గత ఏడాదిలో పర్యాటక ప్రాంతాలకు 30.92 కోట్ల మంది పర్యాటకుల ఫుట్ ఫాల్ నమోదైందని ఈ ఏడాదిలో 9 నెలల కాలానికిగానూ 21 శాతం మేర వృద్ధి కనిపించిందని.. ఇది మరింత పెరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రధాన ఆలయాలను అనుసంధానించి టెంపుల్ టూరిజం కూడా ఇంటిగ్రేట్ చేయాలని సీఎం సూచించారు. సూర్యలంక బీచ్‌ను ప్రత్యేకంగా అభివృద్ధి చేసేందుకు యాక్షన్ ప్లాన్ చేపట్టాలన్నారు. వీటితో పాటు తిరుపతిలో ఉన్న చెరువులు, అమరావతి ప్రాంతంలోని కాలువలు, విశాఖ సహా వేర్వేరు ప్రాంతాలను సుందరీకరణ చేపట్టాలని సిఎం స్పష్టం చేశారు.

# కార్యాచరణ దిశగా తిరుపతి ఫిల్మ్ సిటీ విజన్: మంత్రి దుర్గేష్

**తిరుపతి,జూన్ 13ప్రభాతవార్తప్రతినిధి:** ఆధ్యాత్మిక నగరం తిరుపతిని చిత్ర నిర్మాణ , పోస్ట్‌ప్రొడక్షన్ కేంద్రంగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో పారడాక్స్ పిక్చర్స్ చేపట్టిన ప్రైవేట్ రంగ ప్రయత్నానికి గుర్తింపుగా రాష్ట్రపర్యాటక మంత్రి కందుల దుర్గేష్ "తిరుపతి ఫిల్మ్ సిటీ" విజన్ పోస్టర్‌ను ఆవిష్కరించారు.ఆంధ్రప్రదేశ్‌లో అభివృద్ధి చెందుతున్న సృజనాత్మక ఆర్థిక వ్యవస్థకు మరింత ఊతమిస్తూ, పారడాక్స్ పిక్చర్స్ వ్యవస్థాపకురాలు, నిర్మాత కావ్య పర్యాటక, సాంస్కృతిక సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్‌ని కలిసి, ప్రతిపాదిత "తిరుపతి ఫిల్మ్ సిటీ" కార్యక్రమం పురోగతిని వివరించారు.సిఎం చంద్రబాబునాయుడు ఆశయాలకనుగుణంగా సృజనాత్మక ఆర్థిక వ్యవస్థ దిశగా కృషి చేయాలని సూచించారు. గత రెండు సంవత్సరాలుగా తిరుపతిలో సినీ మౌళిక వసతుల అభివృద్ధి కోసం పారడాక్స్ పిక్చర్స్ చేపట్టిన కార్యక్రమాలను కావ్య మంత్రికి వివరించారు. ప్రస్తుతం అభివృద్ధి చెందుతున్న స్టూడియో సౌకర్యాలలో చిత్ర నిర్మాణ మౌళిక వసతులు,ఎడిటింగ్ సూట్లు,డబ్బింగ్ థియేటర్లు, రీరికార్డింగ్ సౌకర్యాలు సంగీత నిర్మాణ కేంద్రాలు,పోస్ట్‌ప్రొడక్షన్ సేవలు వంటి విభాగాలు ఉన్నాయి. ప్రస్తుతం నాలుగు ఎకరాల విస్తీర్ణంలో నాలుగు అంతస్తుల కార్యాలయ సముదాయం నుంచి ఈ కార్యక్రమం కొనసాగుతుండగా, విస్తరణ ప్రణాళికలు కూడా కొనసాగుతున్నాయని మంత్రికి వివరించారు. రాష్ట్రంలో విశాఖపట్నం, అమరావతి, తిరుపతి నగరాల్లో సినీ పరిశ్రమ అభివృద్ధి చెందాలనే విస్తృత దృక్పథం నుంచే ఈ కార్యక్రమానికి స్ఫూర్తి లభించిందని కావ్య తెలిపారు.

హైదరాబాద్‌కు పరిమితం కాకుండా ఇతర నగరాల్లో కూడా సినిమా మౌలిక వసతులు ఏర్పడాలనే చర్చలు మొదలైనప్పుడు, ఎదురు చూడకుండా మేమే ముందడుగు వేయాలని నిర్ణయించుకున్నామని తెలిపారు. తిరుపతిలో సినీ మౌలిక వసతుల నిర్మాణాన్ని ప్రారంభించామని పేర్కొన్నారు. స్వయం సమృద్ధిగల సినీ పరిశ్రమను నిర్మించడం, నైపుణ్యాధారిత ఉపాధి అవకాశాలను సృష్టించడం, దీర్ఘకాలిక సినీ ఎకోసిస్టమ్‌ను అభివృద్ధి చేయడమే మా ధ్యేయం" అని ఆమె అన్నారు.. తిరుపతి పరిసర ప్రాంతాల నుంచి గణనీయ సంఖ్యలో నటులు, సాంకేతిక నిపుణులు, సహాయక కళాకారులు, సిబ్బందికి అవకాశాలు కల్పించబడుతున్నాయన్నారు. స్థానికంగా అందుబాటులో ఉండే సినీ పరికరాల వ్యవస్థను సృష్టించడం ఈ ప్రాజెక్ట్ సాధించిన ముఖ్య విజయాలలో ఒకటిగా నిలిచింది. ఈ.కార్యక్రమాన్ని మంత్రి కందుల దుర్గేష్ అభినందించారు. త్వరలోనే సిఎం చంద్రబాబునాయుడును కలసి వివరిస్తామన్నారు.

# ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు

## మెగా జాబ్ మేళాతో యువతకు ఉద్యోగావకాశాల వేదిక

## కర్నూలులో 1,500 ఉద్యోగాలు.. యువతకు మంత్రి భరత్ పిలుపు

**కర్నూలు, జూన్ 13: ప్రభాతవార్త :** ప్రభుత్వం నిర్వహిస్తున్న జాబ్ మేళాలను యువత సద్వినియోగం చేసుకొని అనుభవాన్ని పెంపొందించుకుని భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని పరిశ్రమలు, వాణిజ్యం మరియు ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టిజి భరత్ పిలుపునిచ్చారు. కర్నూలు క్లస్టర్ యూనివర్సిటీలో నిర్వహించిన నాలుగో మెగా జాబ్ మేళాను ఆయన ప్రారంభించి మాట్లాడారు. కర్నూలులో ఇప్పటివరకు నిర్వహించిన మూడు మెగా జాబ్ మేళాల్లో కేవలం 50 శాతం మంది మాత్రమే ఉద్యోగ అవకాశాలను వినియోగించుకున్నారని మంత్రి తెలిపారు. ఈసారి 19 కంపెనీలు సుమారు 1,500 ఉద్యోగాలతో యువతకు అవకాశాలు కల్పించేందుకు ముందుకు వచ్చాయని, ఉద్యోగాలు సాధించిన వారు వెంటనే చేరి అనుభవం సంపాదించాలని సూచించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. ఓర్వకల్ ఇండస్ట్రియల్ హబ్‌లో రిలయన్స్, అగస్త్యా, గ్రీన్ హైడ్రోజన్, సోలార్, విండ్ పవర్ వంటి భారీ పరిశ్రమలు ఏర్పాటవుతున్నాయని, వాటి ద్వారా యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని తెలిపారు.

# మళ్లీ దేవాదాయ శాఖలోకే బ్రాహ్మణ కార్పొరేషన్

**విజయవాడ జూన్ 13 ప్రభాతవార్త ప్రతినిధి:** బ్రాహ్మణుల సుదర్ఘీ డిమాండ్‌ను కూటమి ప్రభుత్వం నెరవేర్చింది.మళ్లీ దేవాదాయ శాఖలోకే బ్రాహ్మణ కార్పొరేషన్‌ను తీసుకుని వచ్చింది బ్రాహ్మణ కార్పొరేషన్ దేవాదాయ శాఖ పరిధిలోకి తీసుకొస్తామని ఎన్నికలు మందు హామీ ఇచ్చింది. దీంతో ఈ మాటలను నిలబెట్టుకుంది. తాజాగా ఉత్తర్వుల జారీ చేసింది. కాగా ఎంతో కాలంగా బ్రహ్మణ కార్పొరేషన్ కొనసాగిన వారిని జగన్ ప్రభుత్వం బిసి సంక్షేమ శాఖ పరిధిలోకి తీసుకెళ్లింది. దీంతో తమను దేవాదాయశాఖ కార్పొరేషన్‌లోనే ఉంచాలని డిమాండ్ చేశారు. కానీ గతప్రభుత్వం పెడచెవిన పెట్టింది. దీంతో 2024 ఎన్నికల ముందు కూటమి నాయకులను బ్రాహ్మణులుకలిసి సమస్యను విన్నవించారు. దీంతో తాము అధికారంలోకి వస్తే కచ్చితంగా సమస్యను పరిష్కారిస్తామని హామీ ఇచ్చారు. ఈ మేరకు తాజాగా అడుగులు వేశారు. బ్రాహ్మణ కార్పొరేషన్‌ను దేవాదాయ శాఖలోనే ఉంచుతూ ప్రభుత్వం జీవో విడుదల చేసింది. దీంతో బ్రాహ్మణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో తమకు అందాల్సిన సంక్షేమ పథకాలు, దక్కాల్సిన ప్రాధాన్యత దక్కుతుందని బ్రాహ్మణుల ఆనందనం వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు చెబుతున్నారు.

# నేడు రాష్ట్రంలో మోస్తరు నుంచి భారీ వర్షాలు

**విజయవాడ, జూన్ 13,ప్రభాతవార్తప్రతినిధి:** నైరుతి రుతుపవనాల ప్రభావంతో ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా వాతావరణం మేఘావృతం కానుంది. పలు జిల్లాల్లో మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. రేపు శ్రీకాకుళం, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లో తేలికపాటి వర్షాలు కురవనున్నాయని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ అధికారులు తెలిపారు.అంతేకాకుండా పలుచోట్ల పిడుగులతో కూడిన తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. వర్షం పడే సమయంలో చెట్లు, హోర్డింగ్స్ వద్ద నిలబడొద్దని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ అధికారులు హెచ్చరించారు. ఇవాళ సాయంత్రం 6 గంటల నాటికి మార్కాపురం జిల్లా కోవిలంపాడులో 41 మిల్లీమీటర్లు, అనంతపురం జిల్లా తేరన్నపల్లిలో 24 మిల్లీ మీటర్లరు, వైఎస్సార్ కడప జిల్లా సింహాద్రిపురంలో 22.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. దీనికితోడు వర్షపు గాలుల వల్ల ఎక్కడైనా విద్యుత్ వైర్లు తెగిపడి ఉంటే వాటిని గమనిస్తూ వీలైనంత దూరంగా ఉండాలని విపత్తుల నిర్వహణ సంస్థ అధికారులు హెచ్చరించారు.

## జూలై 1న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అనంతపురం రాక

**అనంతపురం జూన్ 13 ప్రభాతవార్త బ్యూరో:** అనంతపురం జిల్లా బుక్కరాయసముద్రం మండల పరిధిలో ఉన్న ఆంధ్రప్రదేశ్ కేంద్ర విశ్వవిద్యాలయం ప్రథమ స్నాతకోత్సవానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము హాజరుకానున్నట్లు తెలియ వచ్చింది. జూలై 1న జంతులూరు గ్రామంలో జ్ఞానసీమ ప్రాంగణంలో ఘనంగా స్నాతకోత్సవం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్రపతివిశ్వవిద్యాలయ విజిటర్ హోదాలో విచ్చేయనున్నట్లు సమాచారం.

2020 నుంచి 2026 బ్యాచ్‌లకు చెందిన 1,200 మందికి పైగా విద్యార్థులకు పట్టాలు,61 మంది ప్రతిభావంతులైన విద్యార్థులకు బంగారు పతకాల ప్రదానంచేయనున్నట్లు సమాచారం.

## వారం - వర్జ్యం

14-06-2026, ఆదివారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
అధిక జ్యేష్ఠమాసం, ఉత్తరాయణం
గ్రీష్మ ఋతువు, కృష్ణపక్షం, మృగశిర కార్తె
చతుర్దశి మ.2.19
రోహిణి రా.10.13
వర్జ్యం : మ.3.14-సా.4.37
2) రా.3.06 -తె.4.30
దు.సా.4.51-సా.5.43
రాహుకాలం - సా.4.30-6.00

## వార్తాఫలం

**మేషం:** ఆకస్మిక ప్రయాణాలలో నూతన వ్యక్తులతో పరిచయాలు ఏర్పడుతాయి. క్రయవిక్రయాలలో ప్రోత్సాహం లభిస్తుంది.

**వృషభం:** ఇంటా బయటా అనుకూల స్థితి. జీవితభాగస్వామి సలహాలు తీసుకుంటారు. ఆరోగ్య విషయంలో నిర్లక్ష్యం తగదు.

**మిథునం:** ఆప్తుల నుండి సహాయం అందుతుంది. పోటీ పరీక్షలలో ఇంటర్వ్యూలలో విజయం సాధిస్తారు.

**కర్కాటకం:** దూరప్రాంతాలలో ఉన్న మీ వారి క్షేమ సమాచారం ఆనందానికి కారణం అవుతుంది. వాహనసౌలభ్యం కలదు.

**సింహం:** సంతాన పురోభివృద్ధి బాగుంటుంది. వ్యాపారాలకు తగిన లాభాలు పొందుతారు ఆరోగ్యం జాగ్రత్త అవసరం.

**కన్య:** ఎంతోకాలంగా ఎదురు చూస్తున్న అవకాశాలు లభిస్తాయి. ఆభరణాలు, వాహనాలు కొనుగోలు చేస్తారు.

**తుల :** కుటుంబ సభ్యుల నుండి ప్రోత్సాహం లభిస్తుంది. కీలక సమాచారం అందుకుంటారు. బాకీలు వసూలవుతాయి.

**వృశ్చికం:** పెట్టుబడులకు అనుకూలమైన కాలం. కాంట్రాక్టులు లాభిస్తాయి. ప్రముఖుల నుండి కీలక సమాచారం.

**ధనుస్సు:** పనులు నిదానంగా పూర్తి చేస్తారు. మొండి బాకీలు వసూలవుతాయి. ధనలాభం పొందుతారు. స్పెక్యులేషన్ కలిసి వస్తుంది.

**మకరం:** ఉద్యోగంలో అనుకోని చిక్కులు ఎదురవుతాయి. సేవా కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటారు. వాహనసౌఖ్యం.

**కుంభం:** ప్రతి చిన్న విషయానికి జీవిత భాగస్వామితో సంప్రదింపులు సాగిస్తారు. సహోద్యోగుల అండదండగా నిలుస్తారు.

**మీనం:** ముఖ్యమైన దరఖాస్తు ఫారాలకు జత చేయవలసిన పత్రాలను పరిశీలించుకోవడం చెప్పదగిన సూచన.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



శనివారం భోపాల్‌లో ఎన్డీయే ప్రభుత్వం 12 సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భంగా నాగేశ్వర్ మహదేవ్ ఆలయంలో జరిగిన స్వచ్ఛతా కార్యక్రమంలో పాల్గొన్న కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్

# కార్మిక సంక్షేమంలో సంస్కరణలు

>> లకు వినియోగించేందుకు కార్యాచరణ రూపొందించబడిందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 25 ఇంటిగ్రేటెడ్ లేబర్ అమినిటీస్ కాంప్లెక్సుల ఏర్పాటుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. ఈ కేంద్రాల ద్వారా ఉపాధి సమాచారం, మంచి నీరు, వైఫై, పారిశుధ్య సౌకర్యాలు, కార్మికుల నమోదు, సంక్షేమ అవగాహన, నైపుణ్యాభివృద్ధి సేవలు ఒకేచోట అందుబాటులోకి రానున్నాయని తెలిపారు. భవిష్యత్తులో రాష్ట్రంలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలకు ఈ నమూనాను విస్తరించే దిశగా చర్యలు కొనసాగుతున్నాయన్నారు.

**ఇఎస్ఐ సేవల విస్తరణ - కార్మిక కుటుంబాలకు మెరుగైన వైద్య సేవలు**

గత రెండు సంవత్సరాలలో ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్ శాఖ కార్మికుల ఆరోగ్య భద్రత, వైద్య సేవల విస్తరణ, మౌలిక సదుపాయాల బలోపేతం మరియు డిజిటల్ గవర్నెన్స్ రంగాలలో విశేష పురోగతి సాధించిందని మంత్రి తెలిపారు. ప్రస్తుతం 15.32 లక్షల మంది ఇఎస్ఐ. భీమా వ్యక్తులు మరియు దాదాపు 60 లక్షల మంది లబ్ధిదారులకు సమగ్ర వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆరోగ్య సేవల సామర్థ్యాన్ని పెంచేందుకు 92 మంది వైద్య, పారామెడికల్ మరియు పరిపాలనా సిబ్బందికి పదోన్నతులు కల్పించడం జరిగిందన్నారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని రాష్ట్రవ్యాప్తంగా 30 కొత్త ఇఎస్ఐ డిస్పెన్సరీలు, 57 ప్రస్తుత డిస్పెన్సరీల అప్‌గ్రేడేషన్, అలాగే విశాఖపట్నం మరియు అమరావతిలో రెండు ఇఎస్ఐసి మెడికల్ కాలేజీల స్థాపనకు చర్యలు చేపట్టబడ్డాయన్నారు. అత్యవసర వైద్య సేవల బలోపేతం కోసం సిఎస్ఆర్ భాగస్వామ్యంతో 3 అంబులెన్సులను సమీకరించడం జరిగిందన్నారు. అదే విధంగా, గ్రీవెన్స్ రీడ్రెస్సల్ వ్యవస్థ, మొబైల్ హెల్త్ అప్లికేషన్లు, ధన్వంతరి-ఇఔషధి సమన్వయం వంటి కార్యక్రమాల ద్వారా డిజిటల్ హెల్త్ గవర్నెన్సుకు శ్రీకారం చుట్టి, పారదర్శకమైన మరియు ప్రజాకేంద్రిత వైద్య సేవల అందుబాటును మరింత మెరుగుపర్చడం జరిగిందని మంత్రి తెలిపారు.

**పారిశ్రామిక భద్రతకు అత్యున్నత ప్రాధాన్యత....**

రాష్ట్రంలో పారిశ్రామిక భద్రతను అత్యున్నత ప్రాధాన్య అంశంగా గుర్తించిన ప్రభుత్వం 'జీరో యాక్సిడెంట్స్' లక్ష్యంతో సమగ్ర కార్యాచరణను అమలు చేస్తోందని మంత్రి తెలిపారు. పరిశ్రమల్లో ప్రమాదాలను ముందస్తుగా నివారించడం, కార్మికుల ప్రాణభద్రతను కాపాడడం మరియు సురక్షితమైన పనివాతావరణాన్ని నెలకొల్పడం కోసం విస్తృత స్థాయిలో చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు.

# వార్‌కు ఫుల్‌స్టాప్!

>> చర్చలు దాదాపు తుది దశకు చేరుకున్నాయని, ఒప్పందం ఖరారైన వెంటనే డీల్‌పై ఎలక్ట్రానిక్ విధానంలో సంతకాలు జరిగేలా పాకిస్థాన్ ఏర్పాట్లు చేస్తున్నట్లు షరీఫ్ తెలిపారు. దీనికి సంబంధించి ఆయన సోషల్ మీడియా ప్లాట్‌ఫాం ఎక్స్‌లో శనివారం ఓ పోస్ట్ చేశారు. శాంతి ఒప్పందానికి మేం ఎప్పుడూ ఇంత దగ్గరగా రాలేదు. మరో 24 గంటల్లోనే ఒప్పందం ఖరారయ్యే అవకాశం ఉంది. తర్వాత ఎలక్ట్రానిక్ సంతకాలు, వచ్చే వారమే సాంకేతిక స్థాయి చర్చలు జరుగుతాయని పాకిస్థాన్ పిఎం పేర్కొన్నారు. ఈ క్రమంలోనే చర్చల సమయంలో ఎంతో సహకరించిన అమెరికా ఇరాన్ ప్రభుత్వాలకు షరీఫ్ కృతజ్ఞతలు తెలిపారు. మద్దతు ఇచ్చిన పశ్చిమాసియాలోని ఇతర దేశాలకు కూడా ధన్యవాదాలు చెప్పారు. దీర్ఘకాలిక శాంతి దిశగా ఈ చారిత్రక ఒప్పందం బలమైన పునాది వేస్తుందని విశ్వసిస్తున్నట్లు వెల్లడించారు. షరీఫ్ ప్రకటనకు ఒకరోజు ముందుగా ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీకూడా ఈ ఒప్పందం గురించి వ్యాఖ్యలు చేశారు. ఇస్లామాబాద్ అవగాహనా ఒప్పందం ఇంతకుముందెన్నడూ లేనంత దగ్గరలో ఉంది. తుది ఒప్పందం పూర్తయ్యే వరకు మీడియా ఊహాగానాలన్నింటికీ దూరంగా ఉండాలని చెప్పారు. అరాగ్చీ పోస్ట్‌ను యూఎస్ ప్రెసిడెంట్ డొనాల్డ్ ట్రంప్ కూడా తన సోషల్ మీడియా ఖాతాలో పోస్ట్ చేయడం విశేషం. అయితే ఇక్కడ ఒప్పందం తుది దశకు చేరుకుంటుందన్న తరుణంలోనే ఇరాన్‌పై ట్రంప్ మరోసారి విమర్శలు గుప్పించారు. ఇరాన్ మీడియా కథనాల్ని తీవ్రంగా తప్పుబట్టారు. ఇరాన్ మీడియా ప్రకటనలకు, చర్చల్లో అంగీకరించిన అంశాలకు సంబంధం లేదని వ్యాఖ్యానించారు. ఒప్పందంలోని విషయాల్ని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ వెల్లడించారు. ఇరాన్ ఓడరేవులపై అమెరికా విధించిన దిగ్బంధనాన్ని ఎత్తి వేయడం సహా హర్మూజ్ జలసంధి నిర్వహణలో పలు కీలక మార్పులు వంటివి ప్రతిపాదిత ఒప్పందంలో ఉన్నట్లు తెలిపారు. ఇదే సమయంలో ఇరాన్ వద్ద ఉన్నటువంటి యురేనియం అంశాన్ని కూడా చర్చల్లో పరిష్కరించే ప్రయత్నాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఇటు ఒప్పందానికి చేరువైనట్లు ప్రకటనలు వస్తుండగా మరోవైపు హర్మూజ్ జలసంధిలో శనివారం వాణిజ్య నౌకల్ని లక్ష్యంగా చేసుకున్న పలు ఇరాన్ డ్రోన్లను అమెరికా కూల్చివేసినట్లుగా ప్రకటించడం ఆందోళనలు రేకెత్తిస్తోంది. ఇస్లామాబాద్‌లో మొదటి విడత చర్చలు ఫలితం ఇవ్వకపోయినా ఇప్పుడు ఒప్పందం దిశగా పురోగతి కనిపిస్తోంది.ఈ అత్యున్నత స్థాయి సమావేశంలో అమెరికా సంయుక్త రాష్ట్రాల తరఫున ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ స్వయంగా పాల్గొని ఒప్పందంపై సంతకం చేసే వీలుందని సమాచారం. ఇరాన్ పార్లమెంట్‌స్పీకర్ మొహమ్మద్‌బాకర్ ఘాలిబాఫ్ కూడా ఈపత్రాలపై సంతకాలు చేయనున్నట్లు దౌత్యవర్గాలు భావిస్తున్నాయి. అయితే ఈ సమావేశ వేదికను అధికారికంగా ఖరారు చేయాల్సి ఉంది.

# వర్షంతో రైతుల్లో చిగురిస్తున్న ఆశలు

>> వర్షాలు వస్తే తుంగభద్ర జలాశయంలోకి తుంగ, భద్ర నదుల నుంచి భారీగా నీరు వచ్చేది. అయితే ప్రస్తుతం ఎలినినో ప్రభావం వల్ల వర్షాలు లేకపోవడంతో తుంగభద్ర జలాశయం ఒట్టి కుండలా ఉంది. తుంగభద్ర జలాశయంలో కేవలం 10 టీఎంసీల లోపే నీరు ఉంది. మంచి పథకాల కోసం ఆ నీటిని నిల్వ ఉంచినట్లు కనిపిస్తోంది. గత ఏడాది తుంగభద్ర డ్యాం గేట్ కొట్టుకు పోవడంతో కేవలం 68 టీఎంసీల నీటిని మాత్రమే నిల్వ చేయగలిగారు. ఆ నీటినే ఆంధ్ర-కర్ణాటక రైతులకు విడుదల చేశారు. కానీ ఈ యేడాది సరికొత్తగా తుంగభద్ర రిజర్వాయర్‌కు సంబంధించి గేటుతోపాటు అన్నింటినీ కొత్తగేట్లు బిగించారు. ఎపిలోని కూటమి ప్రభుత్వం కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వం సహకారంతో తుంగభద్ర బోర్డు 33 క్రస్ట్ గేట్లను విజయవంతంగా మార్చడంలో సక్సెస్ అయ్యింది. ఈ సీజన్‌లో తుంగభద్ర జలాశయం ఎగువ ప్రాంతంలో వర్షాలు పడితే డ్యాం పూర్తి సామర్థ్యం 105.78 టిఎంసిల నీటిని నిల్వ చేసేందుకు అవకాశం ఉంది. ఈ పరిస్థితుల్లో జలాశయం పై భాగంలో వర్షాలు వస్తే ఎక్కువ సామర్థ్యంతో నీటిని నిల్వ చేసేందుకు అవకాశం ఉన్నందున అనంతపురం, కర్నూలు జిల్లాలకు సాగునీరు వచ్చే అవకాశం ఉందని రైతులు ఆశిస్తున్నారు. ఎలినినో ప్రభావం రుతు పవనాలపైన ఏ మేరకు ఉంటుందో వేచి చూడాల్సిందే. గత యేడాది తుంగభద్ర రిజర్వాయర్‌లోకి ఇదే రోజుకు 25.589 టిఎంసిల నీరు ఉంటే, ఈ యేడాది ఇదే రోజుకు 9.90 టిఎంసిల నీరు ఉంది. గత ఏడాది ఇదే రోజు టిబి డ్యాంలోకి 8,269 క్యూ సెక్కుల నీరు వస్తుంటే, ఈ ఏడాది ఇదే రోజు సగటున 157 క్యూసెక్కుల నీరు వస్తోంది. తుంగభద్ర జలాశయం ఎగువ ప్రాంతం తీర్థహల్లి, అగుంబే ప్రాంతాల్లో త్వరలో భారీ వర్షాలు వస్తాయని ఆశిద్దాం.

# కాల్వలు, కరకట్టలు పటిష్టపరచాలి

## నీటి ప్రవాహాలకు ఆటంకం లేకుండా చూడాలి

## జలధార- జలహారతి పనులపై సమీక్షలో సిఎం చంద్రబాబు

**విజయవాడ జూన్ 13,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రస్తుతం జరుగుతోన్న జలధార- జలహారతి పనుల్లో గొలుసుకట్టు చెరువుల పునరుద్ధరణఅభివృద్ధికి అత్యంత ప్రాధాన్యతివ్వాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు. జలధార పనులను ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని సీఎం స్పష్టం చేశారు. శనివారం సీఎం క్యాంప్ కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జలధారజలహారతి పనుల పురోగతిపై సీఎం చంద్రబాబు సమీక్షించారు. ఉపాధి హామీ నిధులను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకునేలా జలధార పనులు చేపట్టాలన్నారు. ఉపాధి హామీ నిధుల వినియోగంలో అలసత్వాన్ని ప్రదర్శించవద్దన్నారు. నీటి మిగులు బేసిన్ల నుంచి తక్కువ నీటి లభ్యత ఉన్న బేసిన్లను కనెక్ట్ చేసే పనులను చేపట్టాలని కలెక్టర్లను ఆదేశించారు.

జలధార పనుల కింద చెక్ డ్యామ్‌లు, ఇంకుడు గుంతలు, ఫామ్ పాండ్‌లు, కాంటూర్ కందకాల పునరుద్ధరణ పనుల్లో ఎలాంటి జాప్యం ఉండకూడదని స్పష్టం చేశారు. చిన్న వాగుల అభివృద్ధికి వాల్మీకిపురం వాగు అభివృద్ధి మోడల్ పరిశీలించాలని సూచించారు. నీటి భద్రత విషయంలో ప్రతీ జిల్లా ఒక వినూత్నమైన విధానాన్ని అమలు చేయాలని ముఖ్యమంత్రి చెప్పారు. జలధార మొదటి విడత పనులు పూర్తయిన తర్వాత చెక్ డ్యామ్‌లు, ఫామ్ పాండ్‌లు, చెరువులకు గండ్లు పడకూడదన్నారు. నీటి ప్రవాహానికి ఆటంకం లేకుండా కాలువలు, కరకట్టలలో అడ్డంకులు తొలగించాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఈ మేరకు అధికారులు క్షేత్రస్థాయిలో పనులను పర్యవేక్షించాలని సీఎం ఆదేశించారు. జలధార వల్ల కలిగే లాభాలను ఇరిగేషన్, అవేర్ వంటి సంస్థలు ఎప్పటికప్పుడు అంచనా వేయాలన్నారు. జిల్లాల వారీగా భూగర్భ జలాల పునరుద్ధరణ లెక్కలను సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి చెప్పారు.



## కేశినేని నానిపై కేసు

**విజయవాడ,జూన్ 13,ప్రభాతవార్తప్రతినిధి:** విజయవాడ లోక్‌సభ నియోజకవర్గ మాజీ సభ్యుడు కేశినేని శ్రీనివాస్(నాని)పై పోలీసులు కేసు నమోదు చేసారు. తనపై సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్నారని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని)ఇచ్చిన ఫిర్యాదును పరిశీలించిన పోలీసులు కేశినేని నానిపై కేసు నమోదు చేశారు. ఇటీవల కాలంలో తనను లక్ష్యంగా చేసుకుని అసత్య ప్రచారం చేస్తున్నారని కేశినేని చిన్ని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపడుతున్నారు. కాగా తనపై ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ అధికారులకు కూడా కేశినేని నాని ఫిర్యాదు చేయడమే కాకుండా, చంద్రబాబుకు లేఖలు రాయడం చికాకుగా మారడంతో చిన్ని కేశినేని నానిపై ఫిర్యాదు చేసినట్లు ఆయన వర్గీయులు వెల్లడించారు. ఇక తనపై నమోదైన కేసుపై నాని స్పందించారు.కేసులకు, బెదిరింపులకు తాను భయపడబోనని ఆయన ఎక్స్ వేదికగా తెలిపారు. తాను విజయవాడ ఎంపీ చేసిన దానిపై చంద్రబాబు కు పథ్నాలుగు నెలల క్రితం లేఖ రాశానని, అయితే పథ్నాలుగు నెలల తర్వాత తనపై పోలీసు కేసు నమోదు చేయడం ఏంటని ప్రశ్నించారు.ప్రభుత్వ, ప్రజాసంబంధిత ఆస్తుల విషయంలో మాజీఎంపీగా తాను ప్రశ్నించే అధికారం ఉందని కేశినేని నాని అభిప్రాయపడ్డారు. కేసులతో తనను భయపెట్టలేరని, అలాగే బెదిరింపులకు తాను లొంగేవ్యక్తిని కానని

## నలుగురు మావోయిస్టులకు బెయిల్

**విజయవాడ,జూన్ 13,ప్రభాతవార్తప్రతినిధి:** విజయవాడ శివార్లల్లో గత ఏడాది అరెస్టైన నలుగురు మావోయిస్టులకు ఎట్టకేలకు బెయిల్ లభించింది. బెయిల్ జారీ సందర్భంలో న్యాయస్థానం విధించి షరతులకు అనుగుణంగా నిందితులు పూచీకత్తు అందజేసిన తరువాత మాత్రమే జైలు నుంచి విడుదల అవుతారు.మావోయిస్టు తరపు న్యాయవాదులు అందించిన సమాచారాన్ని పొడియం రెంగు అలియాస్ బీమ (ఏ1), మడకం మదన్ అలియాస్ మదనన్న (ఏ2), సోది మనీలా (ఏ3), సోది మంగి (ఏ4)లకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.గోపీ షరతులతో కూడిన బెయిల్‌ను మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా కోర్టు ఉత్తర్వులను అనుసరించి ప్రతి నిందితుడు రూ.25వేల చొప్పున రెండు పూచీకత్తులు సమర్పించాల్సి ఉంటుంది.అందులో ఒకరు స్థానిక వ్యక్తి పూచీకత్తుదారుగా ఉండాలని కోర్టు ఆదేశం చింది. కోర్టుఅనుమతి లేకుండా మావోయిస్టులు పటమట పోలీస్ స్టేషన్ పరిధిని దాటి వెళ్లరాదని స్పష్టం చేసింది. ఈ షరతులు పాటించిన అనం తరం నలుగురు మావోయిస్టులు జైలు నుంచి విడుదల కానున్నారు.గత ఏడాది నవంబర్‌లో విజయవాడలోని కానూరు వద్ద ఉన్న కొత్త ఆటో నగర్ లోని ఒ భవనంలో మావోయిస్టులు బస చేస్తున్నట్లు వచ్చిన పక్కా సమాచారంతో ఆక్టోపస్, గ్రేహౌండ్స్ పోలీసులు విస్తృతస్థాయిలో తనిఖీలు జరిపారు. స్థానిక పోలీసుల సహకారంతో నలువైపుల నుంచి భవనాన్ని తమ ఆధీనంలోకి తీసుకున్నారు. ఆ క్రమంలోనే నవంబర్ 18వ తేదీన విజయవాడ నగరంలోని పలు ప్రాంతాల్లో పోలీసులు ప్రత్యేక ఆపరేషన్ నిర్వహించి ఈ నలుగురు మావోయిస్టులను అరెస్టు చేశారు. అనంతరం వారిపై పటమట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. అప్పటి నుంచి వీరు నెల్లూరు లోని కేంద్రకారాగారంలో జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్నారు నిందితులు 200 రోజులకు పైగా జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న నేపథ్యంలో డిఫాల్ట్ బెయిల్ మంజూరు చేయాలని వారి తరపు న్యాయవాది పిచ్చుక శ్రీనివాస్ జిల్లాకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కేసు విచారణలో భాగంగా పోలీసులు దాఖలు చేసిన ఛార్జిషీట్‌పై కోర్టు కొన్ని అభ్యంతరాలు వ్యక్తం చేసి తిరిగి పంపించిందని ఆయన వాదించారు. మావోయిస్టుల తరఫున న్యాయవాది శ్రీనివాస్ మాట్లాడుతూ నిందితులు చాలా కాలంగా జైలులో ఉన్నారని, చట్టపరంగా వారికి డిఫాల్ట్ బెయిల్ మంజూరు చేయాల్సిన అవసరం ఉందనివాదించారు. అంతేకాకుండా కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ కగార్ ప్రభావంతో మావోయిస్టులు ఆయుధాలు వదిలి లొంగిపోతున్న పరిస్థితులు ఏర్పడ్డాయని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. మరోవైపు ప్రభుత్వం తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ వెంక టేశ్వరరావు తమ వాదనలు వినిపించారు. ఈ నెల 2వ తేదీన ఇరుపక్షాల వాదనలు పూర్తయ్యాయి. ఇరుపక్షాల వాదనలు పరిశీలించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. గోపీ, నిందితుల తరపు వాదనలతో ఏకీభవిస్తూ నలుగురికీ బెయిల్ మంజూరు చేశారు.

## ఆర్జీయూకేటీ బీటెక్ ప్రవేశాల ఫలితాలు విడుదల: మంత్రి లోకేష్

**విజయవాడ,జూన్ 13,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లోని రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ (ఆర్జీయూకేటీ) ఆరు సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ బీటెక్ కోర్సు 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించిన తాత్కాలిక ఎంపిక జాబితాను ఏపీ విద్యాశాఖ విడుదల చేసింది. ఈ మేరకు ఆన్‌లైన్‌లో ఎంపిక ఫలితాలను ఏపీ విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేశ్ ఎక్స్ వేదికగా విడుదల చేశారు. నూజివీడు, ఆర్కే వ్యాలీ, ఒంగోలు, శ్రీకాకుళం క్యాంపస్‌లలో ప్రవేశాల కోసం ఎంపిక ప్రక్రియ పూర్తి చేశారు.మొత్తం 44,104 దరఖాస్తులు అందగా, వాటిలో 4,040 మంది విద్యార్థులను



తాత్కాలికంగా ఎంపిక చేశారు. ఎంపికైన వారిలో 96.7 శాతం మంది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులే ఉండటం విశేషం. గ్రామీణ ప్రతిభకు పెద్దపీట వేస్తూ ప్రవేశాలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. విద్యార్థుల ఎంపిక లేఖలు అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. అలాగే విద్యార్థుల సహాయం కోసం వాట్సాప్ హెల్ప్‌డెస్క్ నంబర్ 9552300009 ను కూడా అందుబాటులోకి తీసుకొచ్చారు. విద్యా రంగంలో సమాన అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పని చేస్తోందని, గ్రామీణ విద్యార్థుల సాధికారతకు ఈ ప్రవేశాలు దోహదపడతాయని ఏపీ విద్యాశాఖ అధికారులు తెలిపింది.

## రాజధాని పరిధిలో మొత్తం 69 బ్రిడ్జిలు: మంత్రి నారాయణ

**విజయవాడ,జూన్ 13,ప్రభాతవార్తప్రతినిధి:** రాజధాని అమరావతి పరిధిలోని కొండవీటి వాగు, పాలవాగులపై మొత్తం 69 బ్రిడ్జిల నిర్మాణం జరుగుతోందని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పి. నారాయణ తెలిపారు. ఈ రెండు వాగులపై జరుగుతున్న వంతెనల పనులను మంత్రి పి. నారాయణ శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని అమరావతిలో ఎక్కడా నీటి నిల్వలు లేకుండా అవసరమైన ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఈ రెండువాగులపై మొత్తం 69 బ్రిడ్జిల నిర్మాణం జరుగుతోందని, వర్షపు నీరు సాఫీగా సాగిపోయేలా ఇంజనీరింగ్ ప్రణాళికలతో పనులు వేగవంతం చేశామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా



ఆయన మీడియాతో మాట్లాడుతూ.. అమరావతిలో కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణానికి కేంద్ర క్యాబినెట్ ఇప్పటికే ఆమోదం తెలిపిందన్నారు. అమరావతి భవనాల నిర్మాణ వ్యయంపై వైసిపి నేతలు చేస్తున్న ఆరోపణలను మంత్రి తీవ్రంగా ఖండించారు. కేంద్ర ప్రభుత్వ రెసిడెన్షియల్ కాంప్లెక్స్ నిర్మాణానికి చదరపు అడుగుకు రూ. 3,945 ఖర్చు అవుతుంటే, అమరావతి హ్యాపీనెస్ట్ నిర్మాణానికి రూ. 3,393, గెజిటెడ్ అధికారుల నివాసాలకు రూ. 3,684 మాత్రమే వ్యయం అవుతోందని తెలిపారు. ఐకానిక్ భవనాలు కావడం వల్లే కొన్నింటికి కొద్దిగా ఖర్చు ఎక్కువ అవుతుందని, పార్లమెంట్ భవనా నికైనా, తెలంగాణ సచివాలయం నిర్మాణానికైనా తొలిసారి పిలిచిన టెండర్లుకి, పూర్తయ్యేనాటికి భారీగా ఖర్చు యిందని, ఖర్చు పెరగడం సహజమేనని పేర్కొన్నారు. వైసిపి నాయకులు ఇకనైనా అబద్ధపు ప్రచారాలు మానకపోతే వచ్చే ఎన్నికల్లో వారికి 11 సీట్లు కూడా రావంటూ వ్యాఖ్యానించారు.

## గవర్నర్ నజీర్‌కు గుమ్మడి గోపాలకృష్ణ కృతజ్ఞతలు

**విజయవాడ, జూన్ 13,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రతిష్టాత్మక కేంద్ర సంగీత నాటక అకాడమీ పురస్కారాన్ని అందుకున్న సందర్భంగా తన గురించి గౌరవపూర్వకంగా ప్రస్తావిస్తూ ప్రశంసలు తెలియజేసిన రాష్ట్ర గవర్నర్ జస్టిస్ ఎస్. అబ్దుల్ నజీర్ ఆంధ్రప్రదేశ్ నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా గుమ్మడి గోపాలకృష్ణ మాట్లాడుతూ పద్యనాటక రంగానికి తాను చేసిన సేవలను గుర్తించి, తెలుగు శాస్త్రీయ నాటక సంప్రదాయ పరిరక్షణకు, ప్రోత్సాహానికి అవసరమైన ప్రేరణను అందించినందుకు గవర్నర్‌కి వినమ్ర ప్రణామాలు తెలియజేశారు.కేంద్ర సంగీత నాటక అకాడమీ పురస్కారం తనకు లభించడం వ్యక్తిగత గౌరవం మాత్రమే కాకుండా, తెలుగు పద్యనాటక రంగానికి, కళాకారులకు, నాటకాభిమానులకు లభించిన గుర్తింపుగా భావిస్తున్నానని పేర్కొన్నారు. ఈ పురస్కారం తెలుగు నాటక రంగం, సంస్కృతి,సాంప్రదాయ కళారూపాల అభివృద్ధికి మరింత అంకితభావంతో సేవలు అందించేందుకు తనకు నూతన ఉత్సాహాన్ని, స్ఫూర్తిని కలిగించిందన్నారు. తెలుగు నాటక సంప్రదాయ వైభవాన్ని భావితరాలకు అందించేందుకు, యువతలో నాటక కళపై ఆసక్తి పెంపొందించేందుకు, రాష్ట్ర నాటక అకాడమీ ద్వారా మరింత కృషి కొనసాగిస్తానని గోపాలకృష్ణ తెలిపారు.

## లిక్కరు స్కామ్‌లో కీలక లబ్ధిదారు జగనే: మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి

**విజయవాడ,జూన్ 13,ప్రభాతవార్తప్రతినిధి:** మద్యపాన నిషేధం చేస్తామని లిక్కరును పూర్తిగా ఆదాయ వనరుగా మార్చుకున్నారని గత వైసీపీ ప్రభుత్వంపై సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. మద్యం కుంభకోణంలో రూ. 3500 కోట్లు దోచుకొని డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని ఆరోపించారు. మద్యం కుంభకోణంలో అంతిమ లబ్ధిదారుడు గొడ్డలి పార్టీ నాయకుడు జగనే అని వ్యాఖ్యానించారు. కల్తీ మద్యం తయారు చేసి 30 వేల మంది మహిళల పుస్తెలు తెంచారని దుయ్యబట్టారు.

చిన్నాన్నను చంపిన వ్యక్తికి ప్రజల ప్రాణాలు ఒక లెక్క కాదన్నారు. కల్తీ మద్యం ద్వారా దోచుకున్న సొమ్ముతో సినిమాలు, వ్యాపారాలు చేశారని మంత్రి తెలిపారు. వైసీపీ మాజీమంత్రి కారుమూరి నాగేశ్వరరావు మద్యం రవాణా దోపిడీ చేశారని ఆరోపించారు. డొల్ల కం పెనీల ద్వారా రవాణా ఛార్జీలు పెంచి రూ.400 కోట్లు దోచుకున్నారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వంలో సురక్ష యాప్ ద్వారా నాణ్యమైన మద్యం అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు. ప్రజలు గొడ్డలి పార్టీని తిరస్కరించిన విషయాన్ని గొడ్డలి పార్టీ నాయకులు గుర్తు చేసు కోవాలని అన్నారు. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్‌తో సూపర్ హిట్ కొట్టిందన్నారు. మద్యం కుంభకోణంలో తాడేపల్లి గేట్‌ను ఈడీ టచ్ చేసిందన్నారు. రాష్ట్రంలో శాశ్వతంగా గొడ్డలి పార్టీని ప్రజలు మూసివేశారని డోలా బాల వీరాంజనేయ స్వామి వ్యాఖ్యానించారు.

## ఒపి నుంచి వైద్య సేవల వరకు సరికొత్త మార్పులు: మంత్రి సత్యకుమార్

**విజయవాడ,జూన్ 13, ప్రభాతవార్తప్రతినిధి:** వైద్య రంగంలో అన్ని వర్గాల ప్రజలకు ప్రయోజనం కల్పిస్తున్నామని ఏపీ ఆరోగ్య,వైద్యశాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ స్పష్టం చేసారు.అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి, అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలను కూటమి ప్రభుత్వం అందిస్తోందని. రెండేళ్లలో ఆరోగ్యశాఖ పరంగా చేసిన అభివృద్ధి, ప్రణాళికలను ప్రజలకు చెబుతున్నామని తెలిపారు. అన్ని వర్గాలకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ఓపీ సేవల నుంచి వైద్య సేవల వరకు అన్నింటిలో సరికొత్త మార్పులు తెచ్చామని తెలిపారు. ఎవరు ఆస్పత్రికి వచ్చినా ఆ రికార్డును డిజిటల్ చేశామన్నారు.అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి, అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలను కూటమి ప్రభుత్వం అందిస్తోందని మంత్రి సత్యకుమార్ వెల్లడించారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ తిరుపతిలో జరిగిన బహిరంగ సభలో ఇదే విషయాన్ని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చెప్పారన్నారు. రెండేళ్లలో ఆరోగ్య శాఖ పరంగా చేసిన అభివృద్ధి, ప్రణాళికలను ప్రజలకు చెబుతున్నామని తెలిపారు. అన్ని వర్గాలకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ఓపీ సేవల నుంచి వైద్య సేవల వరకు అన్నింటిలో సరికొత్త మార్పులు తెచ్చామని తెలిపారు. ఎవరు ఆస్పత్రికి వచ్చినా ఆ రికార్డును డిజిటల్ చేశామన్నారు.ఆరోగ్యశ్రీ, 108 అత్యవసర సేవలను దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి తీసుకుని వచ్చారన్నారు.ఈ సేవలను అమలు చేస్తూనే మెరుగైన సంస్కరణలు తెచ్చామన్నారు. పథకాల పేర్లు మారినంత మాత్రం చేత సేవలు నిర్వీర్యం కావన్నారు.మాజీ ముఖ్యమంత్రి జగన్ కనీస అవగాహన లేని రీతిలో మాట్లాడుతున్నారన్నారు. ఆరోగ్య శాఖలో అనేక సంస్కరణలను సీఎం చంద్రబాబు తీసుకువచ్చారని మంత్రి తెలిపారు. రియాక్టివ్, క్యూరేటివ్ స్థాయి నుంచి ప్రిడెక్టీవ్ విధానాన్ని తీసుకువచ్చినట్లు తెలిపారు. ప్రజల వద్దకే వెళ్లి 45 రకాల వైద్య పరీక్షలు ఉచితంగా చేయిస్తున్నామన్నారు. ముందుగానే వారి సమస్యలను గుర్తించి అవసరమైన మందులు అందిస్తున్నామని తెలిపారు. టెలిమెడిసిన్ ద్వారా ప్రజలకు ఉన్న సందేహాలను వైద్యుల ద్వారా సమాధానాలు ఇప్పిస్తున్నామని చెప్పారు. మీడియా కూడా తమ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించినట్లు తెలిపారు. ఎక్కడా ఎటువంటి సమస్య ఉన్నా తమ దృష్టికి తెచ్చి పరిష్కారం అయ్యేలా చేశారన్నారు. నేడు ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే వారి సంఖ్య గణనీయంగా పెరిగిందన్నారు. మంచి సేవలు అందుతున్నాయని ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. ఇది తాము చెబుతున్న మాటలు కాదని గణాంకాలే తమ పని తీరును చెబుతున్నాయని మంత్రి సత్యకుమార్ పేర్కొన్నారు.



## మద్యం కుంభకోణంలో అడ్డంగా దొరికిన జగన్ అండ్ కో: మంత్రి కొల్లు

**విజయవాడ జూన్ 13 ప్రభాతవార్త ప్రతినిధి:** మద్యంలో రూ.వేల కోట్ల కుంభకోణం చేసి జగన్ అండ్ కో అడ్డంగా దొరికిందని ఎక్సైజ్ శాఖ మంత్రికొల్లు రవీంద్ర ధ్వజమెత్తారు. గొడ్డలి పోటు, వెన్నుపోట్లకు జగన్ బ్రాండ్ అంబాసిడర్ అని వ్యాఖ్యానించారు. పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ జగన్ లాంటి వారు ఆంధ్రప్రదేశ్‌లో ఉండకూడదనే 11 సీట్లు ఇచ్చి కూర్చోబెట్టారు. సెంటు స్థలం పేరుతోనూ వేల కోట్ల స్కామ్ చేశారు. కులాల, మతాల మధ్య చిచ్చుపెట్టాలని గొడ్డలి పార్టీ కుట్ర చేస్తోంది. వాటిని దీటుగా ఎదుర్కొంటాం. గొడ్డలి పార్టీని ప్రజలు భూస్థాపితం చేసే రోజు దగ్గరలోనే ఉంది. కూటమి రెండేళ్ల పాలనలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేశాం అని అన్నారు.కూటమి ప్రభుత్వంపై కుట్రలు జల్లే క్రమంలో జగన్ ప్రతి సారి అభాసు పాలవుతున్నాడన్నారు.ఆయన చవకబారు ఎత్తుగడలతో ప్రజలు విసిగిపోయారన్నారు.ఈ సారి జగన్ అసెంబ్లీలోకి అడుగు పెట్టే పరిస్దితులుండవేమో అన్నారు.

## కాపు మహిళలను మోసగించిన డీసీఎం: వరుదు కళ్యాణి

**విజయవాడ, జూన్ 13 ప్రభాతవార్త ప్రతినిధి:** సూపర్ సిక్స్ అమలు చేసే వరకు తాము పోరాటం చేస్తామని వైసీపీ ఎమ్మెల్సీ వరుదు కళ్యాణ వెల్లడించారు. కాపు మహిళలను డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ మోసం చేశారని,దీనిపై తీవ్ర ఆందోళన చేస్తామన్నారు. తాడేపల్లి వైసీపీ కార్యాలయంలో మాట్లాడుతూ రెండేళ్ల పాలనలో కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ఆమె ఎండగట్టారు. అంతేకాదు సీఎం చంద్రబాబు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేశ్ పై పలు అభియోగాలు చేసారు. ఆడబిడ్డ నిధికి ముఖ్యమంత్రి చంద్రబాబు తూట్లు పొడిచారని మండిపడ్డారు. 2కోట్ల మంది మహిళలకు ఆయన వెన్నుపోటు పొడిచ3ఆరని వరుదు కళ్యాణి ఆరోపించారు. తిరుపతి సభకు విజయోత్సవ సభకు బదులుగా వెన్నుపోటు సభ అని పేరు పెడితే బాగుండేదని వరుదు కళ్యాణి విమర్శించారు. ఇంట్లో ఎంతమంది ఉంటే అంత మందికి మహిళలకు ఆడబిడ్డ నిధి పథకం ఇస్తామని చంద్రబాబు చెప్పిన విషయాన్ని గుర్తు చేసిన వరుదు కళ్యాణి తల్లికి వందనం మొదటి ఏడాది ఎగ్గొట్టారని చెప్పారు. నిరుద్యోగులకు ఇస్తామన్న భృతి ఏమైందని ప్రశ్నించారు. సిడిఎన్ అంటే చీటింగ్ బోగస్ నాయుడు అని ఎద్దేవా చేశారు.

కూటమి నాయకులకు దమ్ము, ధైర్యం ఉంటే ప్రజలు ఇంటికి వెళ్లి సూపర్ సిక్స్ అమలు చేశామని చెప్పాలన్నారు. వైఎస్ జగన్ కంటే ఎక్కువ పథకాలు ఇస్తామని పవన్ కళ్యాణ్ చెప్పారని మంత్రి లోకేశ్‌ను సైతం గల్లా పట్టుకొని నిలదీయడానికి ప్రజలు సిద్దంగా ఉన్నారని ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి హెచ్చరించారు.

## తిరుమలలో డిసిఎం పవన్ చిత్రపటం ప్రదర్శన


### ఆలయం ముందు భక్తుల అత్యుత్సాహం: చల్లంగా ఉండాలని దీవెనలు

**తిరుమల,జూన్ 13ప్రభాతవార్తప్రతినిధి:** పవిత్ర పుణ్యక్షేత్రం తిరుమలలో గోవింద నామం తప్ప మరేనామం ఉచ్చరించడానికి వీలులేదంటూ ఏకంగా తీర్మానం చేసిన టిటిడి అందుకు విరుద్ధంగా ఓ భక్తబృందం శనివారం సాయంత్రం ఏకంగా ఆలయం ముందు పవన్‌కల్యాణ్ ఫోటో చూపి మాట్లాడటం సంచలనంగా మారింది. కొందరు జనసేన పార్టీ అభిమానులు ఇలా చేయడంతో అక్కడ ఉన్న భక్తులు కొంత అవాక్కయ్యారు. తిరుమలలో దేవుని నామస్మరణ తప్ప మరెలాంటి మాటగానీ, పదంగానీ వినిపించదు. మరీ ఏకంగా శనివారం సాయంత్రం జనసేనపార్టీ అభి మానులైన భక్తులు రాష్ట్రంలో పవన్ కల్యాణ్ పాలన, ఆయన చేస్తున్న మంచి పనులు గురించి వివరించారు. ఒక్కసారిగా ఆయన చల్లంగా ఉండాలని, పవన్ బిడ్డా అంతా మంచి జరగాలని ఆశీర్వదిస్తూ ఓ భక్తకుటుంబం అఖిలాండం వద్ద వ్యాఖ్యలు చేసింది. తిరుమలలో జనసైనికుల అత్యుత్సాహంతో ఆలయం ఎదుట రాజకీయ చిత్రపటం ప్రదర్శన చేయడం కలకలం రేపింది. "పవన్ కళ్యాణ్ అనే నేను" పుస్తకాన్ని ప్రదర్శించి వీడియో చిత్రీకరించిన యువకులు సామాజిక మాధ్యమంలో వైరల్‌చేశారు. దీంతో ఇదీ కాస్తటాఫిక్‌గా మారింది. తిరుమలలో రాజకీయ ప్రచారంపై నిషేధం ఉన్నా ఉల్లంచారని భక్తులు ఆగ్రహం వెలిబుచ్చారు. మరీ అక్కడ ఎలాంటి తీవ్రపదజాలం లేకున్నా చిత్రపటం ప్రదర్శన విమర్శలకు దారి తీసింది. దీనిపై టిటిడి అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారనేది వేచిచూడాల్సిందే.




## తిరుమల సమాచారం

## 25 నుంచి ప్రసన్న వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు




**తిరుమల,జూన్ 13ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడి ఆధ్వర్యంలోని తిరుపతి జిల్లా వడమాలపేటమండలం అప్పలాయగుంట ప్రసన్న వేంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు జూన్ 25 నుండి జూలై 3వ తేదీ వరకు వైభవంగా నిర్వహించనున్నారు. ఉత్సవాలకు ముందుగా 23న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం, 24న సాయంత్రం అంకురార్పణ ఘనంగా జరగనున్నాయి. బ్రహ్మోత్సవాల్లో ప్రతిరోజూ ఉదయం 8 నుండి 9 గంటల వరకు, రాత్రి 7 నుండి 8 గంటల వరకు స్వామివారు వివిధ దివ్య వాహనాలపై విహరించి భక్తులను అనుగ్రహించనున్నారు.జూన్ 25 న ధ్వజారోహణం, పెద్దశేష వాహనం,జూన్ 26న ఉదయం చిన్నశేష వాహనం, రాత్రి హంస వాహనం, 27 న ఉదయం సింహ వాహనం, రాత్రి ముత్యపుపందిరి వాహనం,28న ఉదయం కల్పవృక్ష వాహనం, కల్యాణోత్సవం, రాత్రి సర్వభూపాల వాహనం, 29 న మోహినీ అవతారం, రాత్రి గరుడ వాహనం, 30న ఉదయం హనుమంత వాహనం, రాత్రి గజ వాహనం, జులై 1న ఉదయం సూర్యప్రభ వాహనం, రాత్రి చంద్రప్రభ వాహనం, జూలై 2న ఉదయం రథోత్సవం, రాత్రి అశ్వవాహనం, జూలై 3న చక్రస్నానం, ధ్వజావరోహణం జరుగుతాయి. జూన్ 28వ తేదీ సాయంత్రం 4 నుండి 6 గంటల వరకు ప్రసన్న వేంకటేశ్వరస్వామికల్యాణోత్సవం భక్తిశ్రద్ధల మధ్య నిర్వహించనున్నారు. గృహస్తులు (ఇద్దరు) 500 రూపాయలు చెల్లించి పాల్గొనవచ్చు. పాల్గొనే దంపతులకు ఒక ఉత్తరీయం, ఒక రవికె, ఒక లడ్డు, ఒక అప్పం బహుమానంగా అందజేయనున్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా టిటిడి హిందూ ధర్మప్రచార పరిషత్, దాససాహిత్య ప్రాజెక్టు, అన్నమాచార్య ప్రాజెక్టు, ఎస్వీ మ్యూజిక్ కళాశాలల ఆధ్వర్యంలో ప్రతిరోజూ ఆధ్యాత్మిక ప్రసంగాలు, భక్తి సంగీత కార్యక్రమాలు, సాంస్కృతిక ప్రదర్శనలు, భజనలు, కోలాటాలు నిర్వహించి భక్తులను ఆధ్యాత్మిక పరవశంగా జరుగుతాయి.

## 16 నుంచి పెరియాళ్వార్ ఉత్సవాలు

### ప్రబంధ పాశురాల గానామృతంతో ఆధ్యాత్మిక వైభవం

**తిరుమల,జూన్ 13ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడి ఆధ్వర్యంలోని తిరుపతిలోని గోవిందరాజస్వామి ఆలయానికి అనుబంధంగా ఉన్న లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో ఈనెల 16 నుండి 25వ తేదీ వరకు పెరియాళ్వార్ ఉత్సవాలు భక్తి శ్రద్ధలతో వైభవంగా నిర్వహించనున్నారు. ఉత్సవాలలో భాగంగా ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో పెద్దజీయర్ స్వామి, చిన్నజీయర్ స్వామి తమ శిష్యబృందంతో కలిసి పెరియాళ్వార్‌వారి సన్నిధిలో దివ్య ప్రబంధ పాశురాలను నివేదించనున్నారు. పాశురాల గానామృతంతో ఆలయ ప్రాంగణం భక్తి పారవశ్యంతో మార్మోగనుంది. 25న తిరుమంజనం, గరుడ-గజ వాహనాలపై దివ్య విహారం చేయనున్నారు. ఉత్సవాల చివరి రోజైన జూన్ 25న ఉదయం పెరియాళ్వార్‌కు తిరుమంజనం నిర్వహించనున్నారు. అనంతరం సాయంత్రం గోవిందరాజ స్వామి గరుడవాహనంపై, పెరియాళ్వార్ గజవాహనంపై ఆలయ నాలుగు మాడవీధుల్లో విహరించి భక్తులకు దివ్యమంగళ దర్శనం ప్రసాదించనున్నారు.

పెరియాళ్వార్ మహా విష్ణువుకు అత్యంత ప్రీతిపాత్రుడైన పరమభక్తుడు. భక్తి సంప్రదాయంలో విశిష్ట స్థానాన్ని పొందిన ఆయన, ఆండాళ్ అమ్మకి తండ్రి. ప్రతిరోజూ తులసీమాలలను తయారు చేసి స్వామివారికి సమర్పిస్తూ భగవత్సేవలో జీవితాన్ని అంకితం చేశారు. ఆయన సాన్నిధ్యంలో పెరిగిన ఆండాళ్ అమ్మవారు మన్నారాయణునినే తన భర్తగా భావించి భక్తి మార్గంలో ఆదర్శంగా నిలిచారు. దివ్య ప్రబంధాలలో ఎన్నో అమూల్యమైన పాశురాలను రచించిన పెరియాళ్వార్‌కు శ్రీమహావిష్ణువు సాక్షాత్కారం కలిగిన మహాభాగవతుడిగా



## టిటిడికి ట్రక్కు విరాళం

**తిరుమల,జూన్ 13ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామికి పలు రకాలుగా విరాళాలు వెల్లువెత్తుతున్నాయి. దాతలు శ్రీవారిపై భక్తి విశ్వాసాలతో విరాళాలందిస్తున్నారు. శనివారం ఉదయం అశోక్ లేలాండ్ లిమిటెడ్ సంస్థ టిటిడికి 31,72,532 లక్షల రూపాయలు విలువైన ట్రక్కును విరాళంగా అందించింది. ఈ మేరకు సంస్థ అధ్యక్షుడు సంజీవ్ కుమార్ శ్రీవారి ఆలయం ముందు వాహనానికి ప్రత్యేక పూజలు నిర్వహించి ట్రక్కు తాళాలను ,రికార్డులను టిటిడి ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరికి అందజేశారు. ఈ కార్యక్రమంలో టిటిడి రవాణా విభాగం ఇన్‌చార్జ్ జీఎం లక్ష్మీప్రసన్న, తిరుమల డిఐ కృష్ణయ్య పాల్గొన్నారు.

## రూ.44లక్షలు విరాళమిస్తే దాతపేరున అన్నప్రసాదాలు వడ్డింపు

**తిరుమల,జూన్ 13ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీవేంకటేశ్వర స్వామి దర్శనార్థమ్ తిరుమలకు వస్తున్న లక్షలాదిమంది భక్తులకు రుచిగా, శుచిగా అన్నప్రసాదాలు వడ్డించేందుకు దాతలకు అవకాశం కల్పించారు. ఈ పథకం క్రింద దాత ఒకరోజుకు 44లక్షలు రూపాయలు విరాళాలిస్తే దాత స్వయంగా వచ్చి వడ్డించే అవకాశమేగాక దాత పేరు ప్రదర్శన చేస్తారు. తిరుమలకొండపై భక్తులు ఆకలి అనేది తెలియకుండా అక్షయ పాత్రలా వచ్చిన ప్రతి ఒక్క భక్తుడికి రుచిగా అన్నప్రసాదాలు మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాదం భవనంలోనేగాక మరికొన్ని ప్రాంతాల్లో అన్నప్రసాదాలు అందిస్తున్నారు. ఇందుకుగాను ఒకరోజు విరాళ పథకం ప్రారంభించి, ఉదయం అల్పాహారం కోసం 10లక్షలు రూపాయలు, మధ్యాహ్నం భోజనం కోసం 17లక్షలు, రాత్రి భోజనం కోసం 17లక్షలు రూపాయలు అందించి దాతలు స్వయంగా భక్తులకు అన్న ప్రసాదాలు వడ్డించవచ్చు. అన్నప్రసాద భవనంలో ఉదయం



8.30గంటల నుండి 10.30 గంటల వరకు చట్నీతో కలిపి ఉప్మా, పొంగళి, సేమ్యా ఉప్మా అందిస్తారు. ఉదయం 11గంటల నుండి సాయంత్రం 4గంటల వరకు ,తిరిగి సాయంత్రం 5గంటలనుండి రాత్రి11.30గంటల వరకు చక్కెరపొంగలి, చట్నీ,అన్నం, కూర, సాంబారు, రసం ,మసాలవడ మజ్జిగతో భక్తులకు వడ్డిస్తున్నారు. ఎస్వీఅన్నప్రసాదం ట్రస్ట్ కు విరాళాలు కూడా 2,500 కోట్ల రూపాయలకు చేరిన విషయం విదితమే. ఈ ఆదాయంపై వచ్చే వడ్డీతోనే ఇప్పుడు ఎంతో నాణ్యతతో,రుచిగా అన్నప్రసాదాలు భక్తులకు వడిస్తున్నారు. రోజుకు లక్షమందివరకు భక్తులుఅన్నప్రసాదాలను భక్తితో స్వీకరిస్తున్నారు.

## కొండంతా ఎటుచూసినా భక్తజనం

### శ్రీవారి దర్శనానికి 26గంటలు

**తిరుమల,జూన్ 13ప్రభాతవార్తప్రతినిధి:** వేసవి సెలవులు ముగియడం,విద్యాసంస్థలు పున:ప్రారంభంతోబాటు వారాంతం రెండురోజులు సెలవులు రావడంతో తమ మొక్కులు తీర్చుకునేందుకు పిల్లలతో కలిసి పెద్ద ఎత్తున తిరుమలకు భక్తులు చేరుకుంటున్నారు. శనివారం ఉదయానికి తిరుమలలో భక్తుల రద్దీ మునుపెన్నడూ లేని విధంగా కొనసాగుతోంది. శ్రీవారి దర్శనార్థందేశం నలు మూలల నుంచి తరలివచ్చిన భక్తులతో ఏడుకొండలు జనసందోహంగా మారాయి. స్వామివారి దర్శనం కోసం భక్తులు క్యూ కాంప్లెక్స్ వెలుపల కిలోమీటర్ల మేర క్యూలైన్లలో గోగర్భమ్‌డ్యామ్ వరకు వేచి ఉన్నారు. ఎలాంటిదర్శనం టోకెన్లులేని సాధారణ భక్తులకు శ్రీవారి సర్వదర్శనం (శీఘ్రదర్శనం కానిది) లభించడానికి సుమారు 26గంటల సమయం పడుతోంది. ఓవైపు ఎండలు,మరోవైపు చిరుజల్లులు కురుస్తుండటంతో క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులకు ఎటు వంటి ఇబ్బందులు కలుగకుండా టిటిడి అధికారులు సేవలందిస్తున్నారు. చూసుకుంటున్నారు.

అధికారులు నిరంతరాయంగా మంచి నీరు, పాలు,మజ్జిగ, అన్నప్రసాదాల పంపిణీ చేస్తు న్నారు. శనివారం సాయంత్రం వరకు 45వేల మంది భక్తులు దర్శనం చేసుకున్నారు.

## 'సహస్ర దీపాలంకరణ' సేవలో ఆకట్టుకున్న శోభారాజ్ కీర్తనలు

**తిరుమల,జూన్ 13ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడి ఆస్థాన విద్వాంసురాలు, పద్మశ్రీ డాక్టర్ శోభా రాజు శిష్యులతో కలిసి శని వారం సాయంత్రం వేళ తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామికి "సహస్ర దీపాలంకరణ" సేవా కార్యక్రమంలో సంకీర్తనా కైంకర్యేం చేశారు. తొలుతగా "అన్నమయ్య గాయత్రి" మంత్రంతో ప్రారంభించి, బహుళ ప్రజా దరణ పొందిన అన్నమయ్య కీర్తన "కంటి నఖిలాండ కర్తనధికుని గంటి"ని భక్తి పూర్వ కంగా ఆలపించారు. తన స్వీయ రచనలో "తోడూ నీవే నీడా నీవే అంతా నీ దయ గోవింద" అనే సంకీర్తన భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. గాత్రంపై అభిరామ్, మానస పటేల్ మరియు వాయిద్య కీబోర్డ్ కళ్యాణ్, తబలా పాండు సహాకారం అందించారు. అనంతరం ఆలయ వేద పండితుల ఆశీర్వ చనంతో డాక్టర్ శోభా రాజు దంపతులుకు, కళాకారులకు స్వామి వారికి ఇచ్చిన హారతి, తీర్థ ప్రసాదాలు అందజేశారు.


14-6pg4_14-6pg4.qxd 13/Jun/26 11:51 PM Page 1



# ముదురుతున్న 'తెలుగు' జలవివాదాలు

భాగ్యనగర్ భాస్కర్ కుమార్

దేశవ్యాప్తంగా ఎల్‌నినో ప్రభావంతో నైరుతి రుతుపవనాల విస్తరణ మందకొడిగా కొనసాగుతోంది. దేశంలో వర్షాభావంతో సాగునీటికి, తాగునీటికి కొరత ఏర్పడే ప్రమాదం పొంచి ఉందని దేశ,అంతర్జాతీయ పర్యావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఆలమట్టి నుంచి కృష్ణాడెల్టావరకు గైక్వార్డు ప్రాజెక్టు నుంచి గోదావరి డెల్టాల సిస్టమ్ వరకు 18 ప్రధాన రిజర్వాయర్లలలో గరిష్ఠంగా 793.94 టిఎంసి నీరు నిల్వ ఉండాల్సి ఉండగా అందులో ప్రస్తుతం 280.39 టిఎంసిలు మాత్రమే నిల్వ ఉంది. గత ఏడాది జూన్ మొదటి వారం వరకు 292.55 టిఎంసిలు ఈ రిజర్వాయర్లలో నీరు నిలిచి ఉంది. కృష్ణ బేసిన్‌లో గత ఏడాది నైరుతి రుతుపవనాలు మంచి వర్షాన్ని ఇచ్చాయి. పోయిన ఏడాది జూన్ 10 జూరాల గేట్లు ఎత్తి కిందికి లక్ష కూసెక్కుల నీటిని కిందికి వదిలారు. శ్రీశైలంలో జూన్ మూడోవారం వరకు జూరాల నుంచి సుమారు 8టిఎంసిల నీరు చేరుకొన్నది. గోదావరి నది పరివాహక ప్రాంతంలో ఆలస్యంగా ప్రాజెక్టుల్లోకి నీరు వచ్చి చేరింది. తెలుగు రాష్ట్రాలకు జీవనాడులుగా ఉన్న కృష్ణా గోదావరి నదుల్లో పుష్కలంగా నీరు ప్రవహించిన రోజుల్లోనే నీటి పంపకాల విషయంలో గిల్లికజ్జాలు పెట్టుకొంటున్నాయి. నాగార్జున సాగర్‌పై ఇరు రాష్ట్ర పోలీసులు బాహాబాహీకి దిగిన రోజులున్నాయి. తెలంగాణ ఆధీనంలోని ఎన్ఎస్‌పి ఆనకట్టను సగం వరకు ఆంధ్రాపోలీసులు ఆక్రమించుకొన్నారు.కెఆర్ఎంబి సూచనలు పక్కనబెట్టి ఆంధ్రప్రదేశ్ నీటిని ఎక్కువ తరలించుకొని పోతుందని తెలంగాణ ఆరోపణలు చేయడం లేదు మా వాటాను మేం తీసుకొని పోతున్నామని ఆంధ్రప్రదేశ్ పాలకులు విమర్శలు చేయడం నిత్యకృత్యంగా మారింది. ఈ యేడు పుష్కల వర్షం ఉన్నా కూడా కృష్ణ జలాలలో కేవలం25శాతం మాత్రమే నీటిని ఉపయోగించుకొన్నామని తెలంగాణ అంటోంది. గోదావరి జలాలు కృష్ణాబేసిన్‌కు తరలించడంతో ఎగువ రాష్ట్రాలకు ఇవ్వాల్సిన నీటివాటాను కర్ణాటక 16 టిఎంసిలు పైనే కృష్ణా జలాల నుంచి వాడుకోవడానికి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ఏకపక్షంగా అనుమతి ఇవ్వడంతో వివాదంగా మారింది. సూపర్ ఎల్‌నినో ప్రభావ వర్షాభావ పరిస్థితులు ఎదురవుతే ప్రాజెక్టుల్లో ఆశించిన స్థాయిలో నీరు చేరకపోతే రాబోయే రోజుల్లో మరింత ముదిరిపోయే అవకాశం ఉంది. కృష్ణా ట్రిబ్యునల్ అవార్డు తీర్పు త్వరలోనే ప్రకటించే అవకాశం ఉంది. తెలంగాణకు ఆంధ్రప్రదేశ్‌కు నీటి వాటాలు కొత్తగా పంపిణీ చేయనున్నారు. ఇలాంటి సమయంలో పోలవరం కావేరి లింక్ చేయడం కూడా వివాదానికి



దారితీస్తోన్నది. తెలంగాణ సమాజం మొత్తం గోదావరి జలాలలో 968 టిఎంసిలకు అనుమతులు ఇచ్చాకే ఇంటర్ లింక్ చేయాలని కోరుతోన్నది. ఇచ్చంపల్లి కావేరి అనుసంధానం చేయాలని ఇంటర్ లింక్ చేసిన నీళ్లలో సగం తెలంగాణకు ఇవ్వాలని పేచి పెడుతోంది. పోలవరం కావేరి లింక్ చేయడం తెలంగాణ నుంచి వ్యతిరేకత వస్తోంది. ఆంధ్రకు ఇప్పటికే ఒక జాతీయ ప్రాజెక్టు ఉందని ఇచ్చంపల్లి కడితే ఇక్కడ కూడా ఒక జాతీయ ప్రాజెక్టు వస్తోందని భావిస్తోంది.అంతేకాదు ఇచ్చంపల్లి నాగార్జున సాగర్ అనుసంధానం వల్ల తెలంగాణలో అనేక కరవుపీడిత ప్రాంతాలకు నీటివసతి ఏర్పడే అవకాశం ఏర్పడుతోంది. గోదావరిపై ఇప్పటికే తెలంగాణ సుమారు 139 టిఎంసిల వినియోగంకు కేంద్ర జలసంఘం చేసిన విన్నపాలు పెండింగ్‌లో ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వంలో ఆంధ్రప్రదేశ్ పాలక పార్టీలు భాగస్వాములు కావడంతో జలశక్తి కార్యాలయంలో తన పట్టును చంద్రబాబు పెంచుకొన్నారు. జలశక్తి మంత్రిత్వ శాఖ సెక్రటరీగా ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కాంతారావుకు పోస్టింగ్ ఇచ్చుకొని ఆ రాష్ట్రం నీటి ప్రయోజనాలు పరిక్షణకు అనువైన వాతావర్ణం ఏర్పాటు చేసుకొన్నారు. దీనితో తెలంగాణకు చెందిన గోదావరిపై నీటి వినియోగం కోసం సిడబ్ల్యుసిలోఉన్న ప్రతిపాదనల పెండింగ్‌లో పడ్డాయి. 139 టిఎంసిలకు అనుమతులు వస్తాయా రావా అనే సంశయం ఇప్పుడు తెలంగాణ సమాజంలో నెలకొంది. రాబోయే రోజుల్లో గోదావరి మీద తెలంగాణ ప్రాజెక్టులకు అనుమతులు ఇస్తారా అనే శంక కూడా మొదలైంది. ఇది ఇలా ఉంటే పోల వరం కావేరి అనుసంధానం చేస్తే గోదావరిలో 213 టిఎంసిల నీరు తెలంగాణ కోల్పో యే అవకాశం ఉందని తెలంగాణ ప్రాంత నీటినిపుణులు ఆందోళన చెందుతున్నారు. కేంద్రప్రభుత్వం ఈ ప్రాజెక్టుకు అనుమతి ఇస్తే గోదావరిలో తెలంగాణకుఅన్యాయం జరుగుతుందని భయాందోళనలు మొదలైనాయి.గోదావరి జలాలను కృష్ణా పరివాహకానికి తరలిస్తే జిడబ్ల్యుడిటి అవార్డు ప్రకారం.. 14: 21: 45 నిష్పత్తి ప్రకారం హక్కులు ఎగువ రాష్ట్రాలకు సంక్రమిస్తాయి. 14 కర్ణాటకకు, 21 మహారాష్ట్రకు, 45 తెలంగాణకు నీటివాటాలు ఆంధ్రప్రదేశ్ ఇవ్వాల్సి ఉంటుంది. పోలవరం విషయంలో అవార్డు పాసైందని ప్రచారం జరుగుతోంది. 80 టిఎంసిల కంటే ఎక్కువ నీళ్లు తీసుకెళ్తే ఇవే హక్కులు సంక్రమిస్తాయి. బనకచర్ల, నల్లమల సాగర్ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రతిపాదనలు విరమించుకొన్నాడు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి గోదావరిలో మిగులు జలాలు ఉన్నాయనీ అంటే బిఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్‌రావు మిగులు జలాలు లేవని, మిగులు జలాలపై ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని పేచిపెడుతున్నారు. గోదావరి మిగులు జలాల విషయం కేంద్రమే స్పష్టం చేయడంతో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ఇప్పుడు గోదావరికావేరి ఇంటర్ లింకింగ్‌ను ముందుకు తీసుకొచ్చారు.2014 నుంచి గోదావరి కావేరి అనుసంధానం తెరపైకి వచ్చింది. తెలంగాణ భూభాగం టచ్ కాకుండా గోదావరి నీటిని తీసుకెళ్లే ప్రయత్నం వల్ల తెలంగాణకు తీవ్ర అన్యాయంజరుగుతోందని తెలంగాణ వారు ఆందోళన చెందుతున్నారు రూపాయి ఖర్చు లేకుండా ఇచ్చంపల్లి వద్ద జాతీయ ప్రాజెక్టు కింద నిర్మించుకునే అవకాశం కోల్పోవడంతోపాటు. సమ్మక్క సాగర్ 47 టిఎంసిలనీటిని కూడా వదులుకోవాల్సి వస్తోందని భావిస్తున్నారు. తుమ్మిడి హట్టి ప్రాణహితపై 152 అడుగుల ఎత్తుతో ప్రాజెక్టు కట్టడానికి మహారాష్ట్రా ముఖ్య మంత్రికి తెలంగాణ ముఖ్యమంత్రి లేఖ రాసినా ఉలుకూపలుకు లేకపోవడంతో తెలంగాణలో రాజకీయంగా వేడెక్కింది. కేంద్ర మంత్రులు రాష్ట్ర ప్రభుత్వం మధ్య మాటల యుద్ధం నడిచింది. ఆంధ్రప్రదేశ్ దాదాపు రూ. 14100 కోట్ల కేంద్ర నిధులతోభారీ సాగు ప్రాజెక్టుల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేసుకొంది. గోదావరి డెల్టా జీవనాడిఅయిన ధవళేశ్వరం బ్యారేజీని పునరుద్ధరించేందుకు ప్రభుత్వం రూ. 150 కోట్లు కేటాయించింది. పాత గేట్లను తొలగించి కొత్తవి అమర్చే పనులను ప్రభుత్వం ప్రారంభించింది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రెండు రోజులు మహబూబ్‌నగర్ జిల్లాలో మకాం వేసి అక్కడి పెండింగ్ ప్రాజెక్టులపై సమీక్ష చేశారు. ప్రతి ప్రాజెక్టును కాలపరిమితో పూర్తిచేయడానికి లక్ష్యం కూడా విధించారు. మరోవైపు తెలం గాణలో సీతారామ ఎత్తిపోతల పథకం/సీతమ్మసాగర్ బహు ళార్థ సాధక ప్రాజెక్టు లోని సీతమ్మసాగర్ బ్యారేజీ నిర్మాణానికి అవసరమైన పర్యావరణ అనుమతులను సాధించడానికి రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. దేవాదులప్రాజెక్టును ప్రారంభించి పాతిక సంవత్సరాలు గడిచి పోయినా.. ఇప్పటివరకు ప్రాజెక్టుకు అవసరమైన భూసేకరణ పూర్తికాలేదు. ఇది ఒక ఆందోళనకర పరిస్థితిగా మారింది. ●

తుమ్మహట్టి బ్యారేజీ సమగ్ర ప్రాజెక్టు నివేదిక సిద్ధం చేసే బాధ్యతను ఏడు నెల క్రితం డిసెంబర్ మొదటివారంలో ప్రభుత్వం ఆర్వీ అసోసియేట్స్‌కే అప్పగించింది. ఆ సంస్థ సర్వే ప్రక్రియను ప్రారంభించింది. ఐఐటీ హైదరాబాద్ సహకారంతో ఈ డిపిఆర్‌ను సిద్ధం చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది.బ్యారేజీ ప్రతిపాదిత నిర్మిత ప్రదేశం నుంచి మైలారం గ్రామందాకా 75కిలోమీటర్ల గ్రావిటీ కెనాల్ సర్వే, మైలారం నుంచి సుందిళ్ల బ్యారేజీ దాకా టన్నెల్ అలైన్‌మెంట్‌పై సర్వే కూడా ఆ సంస్థ చేపట్టాల్సి ఉంటుంది. డీపీఆర్‌కు అనుమతులు సాధించే బాధ్యతను కూడా ప్రభుత్వం ఆ సంస్థకే అప్పగించింది. డిపిఆర్ తయారీ మూడు నెలల్లో, కేంద్ర జల వనరుల సంఘంలోని వివిధ డైరెక్టరేట్లనుంచి క్లియరెన్స్ తీసుకోవడం వంటి ప్రక్రియను ఏడాదిలోపు పూర్తి చేయాల్సి ఉంటుంది. బ్యారేజీని 148, 150, 152 మీటర్ల ఎత్తుతో కట్టడం వల్ల కలిగే ముంపుపై పుణెలోని కేంద్ర నీరు, విద్యుత్ పరిశోధన సంస్థ ఇప్పటికే అధ్యయనం చేసింది. ఈ విషయంలో నిపు ణుల అంచనాలు,లెక్కలు సరైనవేనా? కావా? నిర్ధారించే బాధ్యతను కూడా ప్రభుత్వం ఆర్ వి అసోసియేట్‌కే అప్పగించింది. ఇప్పటిదాకా కాళేశ్వరం ప్రాజెక్టు డిజైన్ జోలికి పోకుండానే తుమ్మిడిహెట్టి డిపిఆర్ సిద్ధం చేయడానికి సూచనలు వస్తున్నాయి. అయితే కాళేశ్వరం లో భాగంగా అయితేనే ప్రాజెక్టు బెన్‌ఫిట్ కాస్ట్ రేషియో (ప్రాజెక్టుకు వెచ్చించేది ఎంత.. తిరిగి వచ్చేదెంత)పై కచ్చితంగా లెక్కలు సరిపోతాయని అధికారులు చెబుతున్నారు. మేడి గడ్డ నుంచైనా తుమ్మిడిహెట్టి నుంచైనా నీళ్లు అంతిమంగా చేరాల్సింది శ్రీపాద ఎల్లంపల్లికే నని, ఆ ప్రాజెక్టు వద్ద ఉన్న కాళేశ్వరం పంపులతో పాటు సుందిళ్ల బ్యారేజీని కూడా వాడుకుంటున్నప్పుడు తుమ్మిడిహెట్టి బ్యారేజీ కూడా కాళేశ్వరంలో భాగంగానే కడుతున్నా మని ప్రభుత్వం మున్ముందు ప్రకటించనుంది.

# మరో అవతారం!

ఎ.వి.వి ప్రసాద్

పశ్చిమ బెంగాల్

రాజకీయ వైకుంఠ పాళిలో ఎవరు ఎప్పుడు నిచ్చెనలెక్కుతారో, ఎవరు ఎటువంటి పాము నోట చిక్కుతారో చెప్పడం కష్టం. నిచ్చెన ఎక్కుతూ హఠాత్తుగా పాము నోట పడే పరిస్థితి వస్తుంది. పైనుంచి మళ్లీ అట్టడుగుకు చేరుకోవలసి వస్తుంది. వరుసగా మూడు సార్లు ముఖ్యమంత్రి కావడమే గాక ప్రత్యర్థి బిజెపిని ఓ ఆట ఆడించిన మమతా బెనర్జీ ఇప్పుడు సరిగ్గా అదే పరిస్థితిలో ఉన్నారని గతవారం పరిణామాలను బట్టి అనుకోవలసి వస్తుంది. పార్టీ ఓడిపోవడం కంటే ఆ పార్టీ నుంచి ఒక్కొక్కరు జారిపోవడమే ఇప్పుడామెను మరింత కృంగదీస్తున్నట్లుగా కనిపిస్తోంది. గతవారం ఆమె ఇండియా కూటమి సమావేశానికి హాజరు కావడం తొలుత అందరికి ఆశ్చర్యాన్ని కలిగించింది. తర్వాత కాంగ్రెస్ అధిష్ఠానంతో ఆమె జరిపిన చర్చలు మరింత ఆశ్చర్యాన్ని కలిగించాయి. రెండో పర్యాయం సిఎం అయినప్పటినుంచే మమత వైఖరిలో చాలా మార్పు వచ్చింది. కాంగ్రెస్‌తో కలిసి నడిస్తే పార్లమెంటులో తగిన స్థానం లభించకపోవచ్చునే ఆలోచనతో క్రమంగా ఆ పార్టీకి చాలా దూరం జరిగారు. సోనియా, రాహుల్‌ను కొన్ని సార్లు నేరుగా విమర్శించారు కూడా. మూడేళ్ల క్రితం ఇండియా కూటమి ఏర్పడినప్పుడుతొలుత ఆ కూటమిలో కీలక పాత్ర వహించినా తర్వాత ఆ కూటమికి కూడా దూరమయ్యారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్ వేర్వేరుగానే పోటీ పడ్డాయి. కాంగ్రెస్ అభ్యర్థులను ఓడించవలసిందిగా మమత పిలుపునిచ్చారు కూడా. అక్కడితో కూటమితో పూర్తిగా తెగతెంపులు జరిగాయి.కానీ ఎన్నికల్లో ఓడిపోయి పదవి పోగానే ఆమె మళ్లీ కూటమికి చేరువై సోనియా, రాహుల్‌తో సన్నిహితంగా కనిపించడమే విశేషం. అంతేగాక గతవారం సోనియా గాంధీతో రెండుసార్లు 'అంతరంగిక' సమావేశం జరిపారని కూడా వినిపించింది. మమతా బెనర్జీ నాయకత్వంలోని తృణమూల్ కాంగ్రెస్‌ను కాంగ్రెస్‌లో విలీనం చేయబోతున్నారనే వదంతులు ఆ వెంటనే వ్యాపించాయి. నిప్పు లేనిదే పొగ రాదన్నట్లు ఆ ప్రచారంలో కూడా కొంత నిజం ఉందనే అనిపించింది. కాంగ్రెస్ అధిష్ఠానం పెట్టిన కొన్ని షరతులపై ఇంకా ఒక నిర్ణయం తీసుకోనందువల్లనే ఆలస్యమవుతున్నట్లుగా తెలుస్తోంది. అయితే పశ్చిమ బెంగాల్‌లో కాంగ్రెస్ పరిస్థితి కూడా నిరాశాజనకంగానే ఉంది.పరిస్థితి క్షీ ణించిన కాంగ్రెస్‌తో చేతులు కలపడం వల్ల ప్రయోజనం ఉంటుందా! అని మమత ఆలోచిస్తు న్నట్లుగా తెలుస్తోంది. 2024లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ కు దేశవ్యాప్తంగా 99 సీట్లు రాగా, తృణమూల్‌కు ఒక్క బెంగాల్‌లోనే 29 సీట్లు వచ్చాయి. కూటమి భాగ స్వామ్య పక్షమైన డిఎంకె కు తమిళనాట 22 సీట్లు వచ్చాయి. ఇప్పుడు ఆ డిఎంకె, మూడు సీట్లున్న ఆప్ కూడా కూటమికి దూరమయ్యాయి. అంటే కూటమి నుంచి ఓపాతిక సీట్లు జారిపోయినట్లే.



మమతా బెనర్జీ

తృణమూల్ కాంగ్రెస్ తిరిగి కూటమిలోకి వచ్చి నా ఆ పార్టీకి ఎంపీలు గాని, ఎమ్మెల్యేలు గాని మునుపటిలా లేరు. తృణమూల్ లోని 60మంది పైగా ఎమ్మెల్యేలు, 20మంది పైగా ఎంపీలు ఇప్పటికే జారుకున్నారు. వారంతా బిజెపిలోకి వెళ్లబోతున్నారని వేరే చెప్పక్కర్లేదు.అంటే తృణమూల్ తిరిగి ఇండియా కూటమిలో ఉన్నా, కూటమి మొత్తం బలం 200 దాటకపోవచ్చు.ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో తృణమూల్‌కు 80 సీట్లు రాగా ఇప్పుడు వారిలో 60 మంది పైగా రెబెల్ గ్రూపుగా ఏర్పడ్డారు. ఆ ఎమ్మెల్యేలే గాక, మమతకు 'లాయల్' ఉన్నారనుకొంటున్న మరి కొందరు ఎమ్మెల్యేలు కూడా గత శుక్రవారం ముఖ్యమంత్రి సువేందు నిర్వహించిన ఓ కార్యక్రమానికి హాజరు కావడాన్ని బట్టి చివరికి మమత గ్రూపులో ఓ నలుగురైదుగురు ఎమ్మెల్యేలే మిగలవచ్చునీ, అభిషేక్ బెనర్జీ అనుచరులు కూడా ఎవరూ మిగిలేట్లు కనిపించడం లేదనీ తెలుస్తోంది. ఈ పరిస్థితిలో తృణమూల్‌ను ఇండియా కూటమిలో కొనసాగించినా, లేక కాంగ్రెస్‌లో విలీనం చేసుకున్నాఒరిగే ప్రయోజనం ఏదీ ఉండకపోవచ్చు. ఆ విషయం గ్రహించినందునే తృణమూల్ విలీన ప్రతిపాదనపై నిర్ణయాన్ని కాంగ్రెస్ వాయిదా వేసుకున్నట్లు చెబుతున్నారు. తాజా అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు రెండు సీట్లు మాత్రమే వచ్చాయి. 1977 వరకు రాష్ట్రంలో ఆధిపత్యాన్ని కొనసాగించిన కాంగ్రెస్ తర్వాత వామపక్షాలు, ఆ తర్వాత తృణమూల్‌కు, తాజాగా బిజెపికి తన సీట్లు, ఓట్లను కోల్పోయింది. ఇప్పుడు కేవలం రెండు సీట్లు, దాదాపు మూడు శాతం ఓట్లు మాత్రమే ఉన్న కాంగ్రెస్‌లో విలీనమైతే 40 శాతం ఓట్లున్న తృణమూల్‌కు కలిగే ప్రయోజనం ఎంత? అనే ప్రశ్న వినిపిస్తోంది.207సీట్లు,45శాతం ఓట్లు ఉన్న బిజెపిని ఎదుర్కొనడానికి కాంగ్రెస్ బలం సరిపోతుందా? అనే ప్రశ్న కూడా తృణమూల్ నేతల నుంచి వినిపిస్తోంది. తృణమూల్‌లోని మెజారిటీ ఎమ్మెల్యేలు ఇప్పుడు రెబెల్ గ్రూపుగా ఏర్పడి తమకు ప్రత్యేక గుర్తింపు ఇవ్వాలని అసెంబ్లీ స్పీకర్‌ను కోరుతున్నారు. వారికి ఆ గుర్తింపు లభిస్తే ఒరిజినల్ తృణమూల్ కాంగ్రెస్ తమదే అని వారు చెప్పవచ్చు. మహారాష్ట్రలో శివసేన, ఎన్సీపీకి పట్టిన గతే తృణమూల్‌కు కూడా పట్టవచ్చు. ఆ పరిస్థితిలో మమత తృణమూల్ గ్రూపు కాంగ్రెస్‌లో విలీనం సాధ్యమవుతుందా! అన్నదీ సందేహమే. రెబెల్ ఎమ్మెల్యేల సంఖ్య ఇప్పటికే 68కి,రెబెల్ ఎంపీల సంఖ్య 25కు చేరినట్లు తాజాసమాచారం.అంటే మమత గ్రూపులో 95 శాతం ఖాళీఅయినట్లే అనుకోవాలి. ఈ పరిస్థితిలో ఆమె కొత్త అవతారం ఎత్తినా ఎంతవరకు సక్సెస్ అవుతారనే సందేహం అందరిలో కలుగుతోంది.మమత వ్యూహాలు ఎప్పుడూప్రత్యేకంగానే ఉంటాయి. ఈ తుపాను లోంచి బయటపడడానికి ఆమె ఏ అవతారం ఎత్తుతారో చూడాలి. ఇండియా కూటమిలో కొనసాగినా, లేకపోయినా తృణమూల్ కు కలిగే ప్రయోజనం ఏదీ లేదనే పరిశీలకులు భావిస్తున్నారు. ఈ పరిస్థితిలో

# 'నాటో' పై ట్రంప్ జులుం!

గన్ని మోహన్

బెల్జియం

పశ్చిమాసియా ఉద్రిక్తతలతో తల మునకలవుతున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ ఓ పక్క ఇరాన్‌కు సాయం అందిస్తున్న దేశాలను మచ్చిక చేసుకుంటూనేఇప్పుడు నాటో సైనిక కూటమిపై దృష్టిసారించారు. రెండోప్రపంచ యుద్ధం తర్వాత ఏర్పడిన నాటో కూటమికి యుద్ధవిమానాలు,యుద్ధనౌకలు సహా నిఘావ్యవస్థలన్ని కూడా తగ్గించాలని ట్రంప్ నిర్ణయించారు. ఇప్పటివరకూ ఐరోపా రక్షణకు అత్యంత బాసటగా నిలిచిన ట్రంప్ ఈ నిర్ణయానికి కారణం హర్ముజ జలసందిని పూర్తి స్థాయిలో తెరిపించడంలో నాటోకూటమి కలిసి రాలేదన్నదే ఆయన కోపం. అందుకే వైమానిక, నేవీ మద్దతును తగ్గించాలని నిర్ణయించారు. ఇప్పటివరకూ నాటోకు అందుబాటులో ఉన్న 150 ఎఫ్16, ఎఫ్15 ఇ యుద్ధవిమానాలను 100కు తగ్గించాలని అలాగే సముద్రజలాలపై నిఘాకోసం వినియోగించే విమానాల సంఖ్యను కూడా 26నుంచి 15కు తగ్గించాలని నిర్ణయించింది. అలాగే గగనతలంలోనే ఇంధనం నింపే ట్యాంకర్ జట్లను కూడా నాటోకు పూర్తిగా నిలిపివేయాలని నిర్ణయించింది. ఇందుకు కారణం కేవలం హర్ముజ్, బాబ్ ఎల్‌మండెజ్ జలసంధుల్లో నెలకొన్న అనిశ్చితిని కట్టడిచేయడంలో అమెరికాకునాటో కూటమి కలిసిరాలేదన్న అక్కసుఒక్కటే. ఉత్తర అట్లాంటిక్ ఒప్పంద సంస్థగా పిలిచే ఈ నాటోఐరోపా కూటమి దేశాలకు అత్యంత భద్రత నిచ్చే అతిపెద్ద సైనిక కూటమిగా నిలిచింది. ముందు 12దేశాలతో ఏర్పాటైన ఈ కూటమి32 దేశాలకు విస్తరించింది. రష్యా దూకుడును కట్టడి చేసేందుకు ఆనాడు ఏర్పాటు చేసిన ఈ కూటమి ప్రపంచంలోనే అతిపెద్ద ఉమ్మడి సైనిక కూటమి అని చెప్పాలి. సభ్యదేశాల్లో ఏ ఒక్క దేశంలో భద్రత కొరవడినా, దాడులు జరిగినా నాటో స్పందించి రక్షణగా నిలుస్తుంది. బెల్జియంలోని బ్రస్సెల్స్ కేంద్రంగా పనిచేస్తోంది. ప్రస్తుతం నెదర్లాండ్స్ మాజీ ప్రధాని మార్క్‌రుట్టే సెక్రటరీ జనరల్‌గా వ్యవహరిస్తున్నారు. ఆనాడు రష్యాను నిలువరించేందుకు సరిహద్దు దేశాలు నార్వే, ఫిన్‌ల్యాండ్, ఎస్తోనియా,లాత్వియా, లిథువేనియా, పోలండ్ దేశాలు కూడా నాటో సభ్యదేశాలుగా ఉన్నాయి. అలాగే ఉక్రెయిన్‌పై రష్యా దూకుడును కట్టడిచేసేందుకు నాటో సభ్యదేశాలు కూడా దౌత్యపరంగా పనిచేస్తున్నాయి. అవి పోలండ్,రొమేనియా, స్లోవేకియా దేశాలున్నా రష్యా తనదాడులు నిలపడంలేదు. తాజాగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత 'మాగా' లక్ష్యంగా దూకుడుగా వెళుతున్న సంగతి తెలిసిందే.ప్రపంచదేశాలకు కొరకరాని కొయ్యగా తయారయిన ట్రంప్ తాజాగా నాటోపై ఫోకస్ పెంచారంటే ఆ సైనిక కూటమిని నిర్వీర్యంచేసి నిస్తేజం చేయాలన్న కాంక్ష ఆయనలో కనిపిస్తోంది. కొత్తగా నాటోలో ఫిన్‌ల్యాండ్, స్వీడన్ దేశాలు కూడా చేరాయి. ఈ కూటమి మొత్తం రష్యా విస్తరణ కాంక్షను అడ్డుకునేందుకేనని స్పష్టంగా చెప్పవచ్చు. రష్యాకు పాశ్చాత్యదేశాల మధ్య ఉన్న ఉద్రిక్తతలను కట్టడిచేసి రష్యా ఆధిపత్యం తగ్గించేందుకే ఈ కూటమి పనిచేస్తుంది.ఇందులో భాగంగానే నాటో ఆధ్వర్యంలో ఉక్రెయిన్‌కు సైనిక, ఆయుధ సాయం అందించాలనేది వ్యూహం అయితే ఇందుకు రష్యా ససేమిరా అంగీకరించకపోవడంతో ఉక్రెయిన్‌కు ఆయుధ సమస్య కూడా పెరిగిందనే చెప్పాలి. నాటోలో ఉన్న 32 దేశాల కూటమి మొత్తం జిడిపి 38 లక్షలకోట్ల డాలర్లుగా ఉంటుంది. అత్యంత శక్తివంతమైన సైనిక కూటమిగా ప్రపంచంలో విస్తరించింది. ప్రస్తుతం 30లక్షల దళాలున్నాయి. మరింతగా విస్తరించేందుకు ఈనాటో పనిచేస్తున్న సంగతి తెలిసిందే. ఈకూటమిపై ట్రంప్ ఫోకస్ పెంచడానికి ప్రత్యేక కారణం అటు హర్ముజ్, బాబ్‌ఎల్‌మండెజ్ జలసంధుల్లో ఇరాన్‌ప్రభావం తగ్గించడంలో కలిసిరాలేదన్న దుగ్ధతోపాటు గల్ఫ్ దేశాల్లోని అమెరికా సైనిక స్థావరాలపై ఇరాన్ క్షిపణి దాడులుచేయడం కూడా ట్రంప్‌ను కలవరపరిచింది. అంతేకాకుండా చైనా,రష్యాలు ఇరాన్‌కు రహస్యంగా ఆయుధసాయం అందిస్తున్నాయన్న అనుమానాలు కూడా ట్రంప్‌లో పెరిగిపోయాయి. వీటన్నింటి దృష్ట్యా నాటో కూటమి స్పందించలేదన్న అక్కసు ట్రంప్‌లో బలంగా నాటుకుపోయింది. ట్రంప్ భావిస్తున్నట్లుగానాటో కూడా ప్రత్యక్షంగా స్పందించిన సందర్భాలుకూడా లేవు. ప్రత్యేకించి ఇరాన్, ఇజ్రాయెల్, అమెరికా సైనిక చర్యల్లో పాల్గొనలేదు. నాటో సభ్యదేశాలు కూడా అమెరికా పిలుపునకు స్పందించలేదు.గత సంఘటనలు దృష్టిలో ఉంచుకున్న ట్రంప్ నాటోపైఫోకస్ పెంచారని స్పష్టం అవుతోంది. సభ్యదేశాలైన ఫ్రాన్స్,బ్రిటన్, జర్మనీ వంటి దేశాలు కూడా హర్ముజ్‌పై స్పందించకపోగా నాటోపరంగా ఒత్తిడి కూడా తీసుకురాకపోవడం కూడా ట్రంప్ కన్నెర్రకు కారణమైంది. అంతేకాకుండా నాటోకు నిధుల సాయంలో అతిపెద్ద వాటా కూడా అమెరికాకు ఉంది. 600 మిలియన్ డాలర్లు సాలీనా నిధులు అందించడంతోపాటు ఆయుధసామగ్రి కూడా అందిస్తోంది.నాటో నిర్వహణ వ్యయంలో 15.88 శాతం అమెరికాయే భరిస్తోంది.అందువల్లనే నాటోపై ట్రంప్ ఆగ్రహంతో ఉన్నారు.ఇతరదేశాలు కూడా తమ జిడిపిలో 2శాతం చొప్పున నిధులు అందిస్తున్నాయి. అమెరికా తన రక్షణరంగ బడ్జెట్ 980 బిలియన్ డాలర్లు అంటే నాటోమొత్తం 32 సభ్యదేశాల జిడిపిలో 60శాతానికి సమానంగాఖర్చుచేస్తోంది. అందువల్లనే అమెరికా నాటోపై పెత్తనం మాదే నన్నట్లుగా వ్యవహరిస్తోంది. కేవలం రష్యాను కట్టడిచేసేందుకే ఏర్పాటు చేసిన ఈ కూటమి భవిష్యత్తులో నిర్వీర్యం అవుతుందా?ట్రంప్ తన హఠాత్ నిర్ణయాలతో ఒకవేళ నాటో నుంచి వైదొలుగుతారా అన్నది ఐరోపా కూటమి దేశాలతోపాటు ప్రపంచదేశాల్లో నలుగుతున్న జవాబు లేని ప్రశ్న.ఈప్రశ్నకు సమాధానం కూడా సమీప భవిష్యత్తులో ట్రంప్ నుంచే వెలువడాల్సి ఉంటుందని ఐరోపా కూటమిబలంగా విశ్వసిస్తోంది. అమెరికానాటోపట్ల అనుసరించే భవిష్యత్తు వైఖరి ట్రంప్ సమాధానంపైనే ఆధారపడి ఉంది. ●



మార్క్ రుట్టే

# వాతావరణ సంక్షోభానికి ప్రకృతే పరిష్కార మార్గం

డి జె మోహన రావు

ఒకప్పుడు వాతావరణ మార్పులు అంటే భవిష్యత్తులో సంభవించే ప్రమాదంగా మాత్రమే భావించేవారు. శాస్త్రవేత్తల నివేదికలు, అంతర్జాతీయ సదస్సులు, పర్యావరణవేత్తల హెచ్చరికలకే పరిమితమైన అంశంగా కనిపించేది. అయితే నేడు ఆ పరిస్థితి పూర్తిగా మారిపోయింది. వాతావరణ సంక్షోభం ఇక భవిష్యత్తు ముప్పు కాదు. మన దైనందిన జీవితాలను ప్రభావితం చేస్తున్న వాస్తవం. వేసవి పూర్తిగా ప్రారంభం కాకముందే దేశంలోని అనేక ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు 45 డిగ్రీల సెల్సియస్‌ను దాటుతున్నాయి. మరో వైపు, కొన్ని గంటలపాటు కురిసే భారీ వర్షాలు నగర జీవితాన్ని స్తంభింపజేస్తున్నాయి. ప్రపంచ వాతావరణసంస్థ ప్రకారం 2024 సంవత్సరం ప్రపంచ చరిత్రలోనే అత్యంత వేడిగా నమోదైంది. పారిశ్రామిక యుగానికి ముందున్న సగటుతో పోలిస్తే భూగోళ సగటు ఉష్ణోగ్రత దాదాపు 1.5 డిగ్రీల సెల్సియస్ మేర పెరిగింది. కరవులు, వరదలు, అటవీ అగ్నిప్రమాదాలు, తుఫాన్లు మరింత తీవ్రరూపం దాల్చుతున్నాయి. ఇవన్నీ ప్రకృతి సమతుల్యత దెబ్బతింటోందన్న హెచ్చరికలే. ఈ హెచ్చరికలు మన అభివృద్ధి నమూనాలను, జీవన విధానాలను పునఃపరిశీలించుకునే అవకాశంగా మారాలి. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా కార్బన్ ఉద్గారాల తగ్గింపు, పునరుత్పాదక ఇంధనాల వినియోగం, హరిత సాంకేతికతల అభివృద్ధిపై చర్చ జరుగుతోంది.ఇవన్నీ అవసరమైన చర్యలే. అయితే వాతావరణ సంక్షోభాన్ని సమర్థంగా ఎదుర్కోవాలంటే ఒక ప్రాథమిక ప్రశ్నకు సమాధానం వెతకాల్సిందే. భూమిపై జీవం కోట్లాది సంవత్సరాలుగా అనేక మార్పులను ఎదుర్కొంటూ ముందుకుసాగింది. ఉష్ణోగ్రతల హెచ్చుతగ్గులు, ప్రకృతి విపత్తులు, పర్యావరణ పరిణామాల మధ్య ప్రకృతి తనను తాను పునర్నిర్మించుకుంటూ నిలబడింది. అందుకే ప్రకృతిని కేవలం సంరక్షి ం చాల్సిన వనరుగా మాత్రమే కాకుండా, నేర్చుకోవాల్సిన గురువుగా కూడా చూడాలి. వాతావరణ సంక్షోభానికి పరిష్కార మార్గాలను సూచించే అనేక సూత్రాలు ప్రకృతి లోనే నిక్షి ప్తమై ఉన్నాయి. ప్రకృతి చెప్పే మొదటి పాఠం వైవిధ్యమే బలం అని. ప్రకృతిలో ఏ వ్యవస్థా ఏకరూపంగా ఉండదు. అడవుల్లో వందలాది రకాల చెట్లు, మొక్కలు, పక్షులు, జంతువులు, సూక్ష్మజీవులు పరస్పర సహకారంతో జీవిస్తాయి. ఈ వైవిధ్యమే వాటి స్థిరత్వానికి, మనుగడకు మూలం. ఐక్యరాజ్యసమితి జీవవైవిధ్య అంచనాల ప్రకారం ప్రపంచవ్యాప్తంగా దాదాపు 10లక్షల జాతులు అంతరించిపోయే ముప్పును ఎదుర్కొంటున్నాయి. ఒక జాతి నష్టపోయినా మొత్తం వ్యవస్థ కుప్పకూలదు. వాతావరణ మార్పుల కాలంలో ఈపాఠం మరింత ప్రాధాన్యం సంతరించుకుంటోంది. వ్యవసాయ రంగాన్నే తీసుకుంటే, ఒకే పంటపై ఆధారపడే విధానాలు అధిక ప్రమాదాన్ని ఎదుర్కొంటున్నాయి. వర్షపాతం మారినా, తెగుళ్లు వ్యాపించినా రైతు ఆదాయం మొత్తం దెబ్బతింటుంది. అదే మిశ్రమ పంటలు, స్థానిక విత్తనాలు, వ్యవసాయ అటవీ విధానాలు అదనపు రక్షణ కల్పిస్తాయి. కాబట్టి జీవ వైవిధ్య పరిరక్షణ అనేది కేవలం పర్యావరణ అంశం మాత్రమే కాదు, అది ఆహార భద్రత, ఆర్థిక భద్రత, సామాజిక స్థిరత్వానికి కూడాపునాది. ప్రకృతి చెప్పే రెండో పాఠం పునరుద్ధరణ సామర్థ్యం. శాస్త్రీయ పరిభాషలో దీనిని రెసిలియెన్స్ అంటారు. ప్రకృతిలో ఏ వ్యవస్థా శాశ్వత స్థితిలో ఉండదు. పరిస్థితులకు అనుగుణంగా తనను తాను మార్చుకుంటూ ముందుకు సాగుతుంది. వరదల తర్వాత నదులు మళ్లీ తమ ప్రవాహాన్ని సర్దుబాటు చేసుకుంటాయి. అగ్నిప్రమాదాల అనంతరం అడవులు క్రమంగా పునరుజ్జీవనం పొందుతాయి. ఇదే ప్రకృతి అసలు బలం. నేడు ఇదే లక్షణం మానవ సమాజానికీ అత్యవసరం. నగరాలు, గ్రామాలు, వ్యవసాయ వ్యవస్థలు, మౌలిక సదుపాయాలు వాతావరణ మార్పులను తట్టుకునే సామర్థ్యాన్ని పెంచుకోవాలి. వరదలు వచ్చినప్పుడు నీటిని పూర్తిగా బయటకు పంపే ప్రయత్నం చేయడం కంటే, దానిని నిల్వ చేసుకునే సహజ వ్యవస్థలను బలోపేతం



చేయడం మరింత ప్రయోజనకరం. వర్షపు నీటి సంరక్షణ, చెరువుల పునరుద్ధరణ, భూగర్భ జలాల పునర్భరణ వంటి చర్యలు వాతావరణ అనుకూలతను పెంచుతాయి. ప్రకృతి చెప్పే మూడో పాఠం పరిమితుల పట్ల గౌరవం. ప్రకృతిలో ప్రతి వ్యవస్థకు ఒక భరించే సామర్థ్యం ఉంటుంది. నదులు, అడవులు, నేలలు, సముద్రాలు అన్నింటికీ హద్దులు ఉన్నాయి. ఆ పరిమితులను దాటినప్పుడు సమతుల్యత దెబ్బతింటుంది. ప్రస్తుతం ఎదురవుతున్న అనేక పర్యావరణ సమస్యలకు మూల కారణం ఇదే. అధిక భూగర్భ జల వినియోగం, అడవుల నరికివేత,తీరప్రాంతాల ఆక్రమణ, సహజ జలవనరుల విధ్వంసం వంటి చర్యలు ప్రకృతి పరిమితులను విస్మరించిన ఫలితాలే. అభివృద్ధి అంటే ప్రకృతిని జయించడం కాదని, దానితో సమన్వయంగా ముందుకు సాగడమేనని ఈ పాఠం గుర్తు చేస్తుంది. భవిష్యత్తు అభివృద్ధి నమూనాలు కూడా ప్రకృతి సామర్థ్యాలను గౌరవించే విధంగానే రూపుదిద్దుకోవాలి. వాతావరణ మార్పులను ఎదుర్కొనే క్రమంలో ప్రపంచవ్యాప్తంగా ప్రకృతి ఆధారిత పరిష్కారాలకు ప్రాధాన్యం పెరుగుతోంది. శాస్త్రవేత్తలు, విధాన నిర్ణేతలు, అంతర్జాతీయ సంస్థలు ప్రకృతి అందించే సేవల విలువను మరింత స్పష్టంగా గుర్తిస్తున్నాయి. దీనికి అడవులే ఉత్తమ ఉదాహరణ. ప్రపంచంలో అతిపెద్ద సహజ కార్బన్ నిల్వ కేంద్రాలుగా అవి పనిచేస్తాయి. ప్రపంచ కార్బన్ ఉద్గారాల్లో సుమారు 30 శాతం వరకు శోషించడంలోఅడవులు, ఇతర సహజ పర్యావరణ వ్యవస్థలు కీలక పాత్ర పోషిస్తున్నాయని ఐక్యరాజ్యసమితి పర్యావరణ కార్యక్రమంఅంచనా వేస్తోంది. వర్షపాతం చక్రాన్ని ప్రభావితం చేయడం, నేల సారాన్ని కాపాడటం, జీవ వైవిధ్యానికి ఆశ్రయం కల్పించడం వంటి అనేక సేవలను అవి అందిస్తాయి. అందువల్ల అడవుల సంరక్షణ అనేది కేవలం పర్యావరణ కార్యక్రమం కాదు, వాతావరణ విధానంలో కీలక అంశం.చిత్తడి నేలలు, చెరువులు, సరస్సులు, మడ అడవులు కూడా అమూల్యమైన సేవలను అందిస్తున్నాయి. ఇవి వరద నీటిని నిల్వ చేస్తాయి, తీర ప్రాంతాలను రక్షి స్తాయి, భూగర్భ జలాలను పునరుద్ధరిస్తాయి. అయితే పట్టణీకరణ, భూ వినియోగ మార్పుల కారణంగా ఈ వ్యవస్థలు వేగంగా కనుమరుగ వుతున్నాయి. ఈ నష్టాన్ని పూడ్చుకోకుండా వాతావరణ అనుకూల అభివృద్ధి గురించి మాట్లాడటం అసంపూర్ణమే. నగరాల్లో ప్రకృతి పాత్రను కూడా కొత్తగా నిర్వచించాల్సిన అవసరం ఉంది. ప్రపంచ జనాభాలో సగానికి పైగా ప్రజలు ఇప్పటికే నగరాల్లో నివసిస్తున్నారు. భారతదేశంలోనూ పట్టణీకరణ వేగంగా విస్తరిస్తోంది. కాంక్రీటు నిర్మాణాలు పెరగడం, పచ్చదనం తగ్గిపోవడం వల్ల నగరాలు అధిక ఉష్ణోగ్రతలతో సతమతమవుతున్నాయి. చెట్లు, పార్కులు, నగర అడవులు, గ్రీన్ కారిడార్లు ఉష్ణోగ్రతలను తగ్గించడమే కాకుండా గాలి నాణ్యతను మెరుగుపరుస్తాయి. ప్రజారోగ్యా నికి కూడా తోడ్పడతాయి. భారతదేశానికి నీటి వనరుల పరిరక్షణ మరింత కీలకం. ప్రపంచ జనాభాలో దాదాపు 18శాతం మంది భారతదేశంలో నివసిస్తున్నప్పటికీ,ప్రపంచ మంచినీటి వనరుల్లో కేవలం 4 శాతం మాత్రమే మనకు అందుబాటులో ఉన్నాయి. నీతి ఆయోగ్ అంచనాల ప్రకారం దేశంలో సుమారు 60 కోట్ల మంది ప్రజలు ఇప్పటికే నీటి ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు. వాతావరణ మార్పుల ప్రభావంతో ఈ ఒత్తిడి మరింత పెరుగుతోంది. అందువల్ల సంప్రదాయ నీటి సంరక్షణ వ్యవస్థలు, చెరువులు, కుంటలు, వర్షపు నీటి సేకరణ పద్ధతుల పునరుద్ధరణ అత్యవసరంగా మారింది. అంతేకాదు, భారతీయ సమాజంలో శతాబ్దాలుగా కొనసాగుతున్న స్థానిక పర్యావరణ జ్ఞానం కూడా విలువైన సంపద. నీటి నిర్వహణ, భూసార పరిరక్షణ, సామూహిక వనరుల సంరక్షణకు సంబంధించిన అనేక సంప్రదాయ పద్ధతులు గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికీ కనిపిస్తాయి. ఆధునిక శాస్త్ర సాంకేతికతతో వాటిని అనుసంధానిస్తే మరింత స్థిరమైన ఫలితాలు సాధ్యమవుతాయి. వాతావరణ చర్య అనేది ప్రభుత్వాలకే పరిమితమైనబాధ్యత కాదు. పరిశ్రమలు, విద్యాసంస్థలు, స్థానిక సంస్థలు, పౌర సమాజం, ప్రతి వ్యక్తి ఇందులో భాగస్వాములు కావాలి. శక్తి వినియోగాన్ని తగ్గించడం, నీటిని పొదుపుగా వినియోగించడం, వ్యర్థాలను తగ్గించడం, పచ్చదనాన్ని పెంచడం వంటి చర్యలు వ్యక్తిగత స్థాయిలో చిన్నవిగా కనిపించినా, సమిష్టిగా అవి పెద్ద మార్పుకు దారితీస్తాయి. ప్రకృతి

## ఆరుగురు బాల కార్మికులకు విముక్తి

గుంటూరు, జూన్ 13, ప్రభాత వార్త ప్రతినిధి : గుంటూరు జిల్లా కార్మిక శాఖ, ఫ్యాక్టరీస్ డిపార్ట్ మెంట్ , చైల్డ్ లైన్ డిపార్ట్ మెంట్ సంయుక్తంగా శనివారం మిర్చి యార్డ్ పరిధిలోని మిర్చి గ్రేడింగ్ పాయింట్ లలో తనిఖీలను నిర్వహించారు. ఈ తనిఖీలలో ఆరుగురు బాల కార్మికులను గుర్తించి వారిని స్కూల్ కు వెళ్ళే ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా ముగ్గురు యజమానులు పై కేసులు నమోదు చేశారు. బాల కార్మికులు ఎక్కడైనా పనిచేస్తుంటే 1098, 9492555157 నెంబర్లకు సమాచారం అందించాలని కోరారు. ఈ తనిఖీలలో డిప్యూటీ లేబర్ కమిషనర్ గాయత్రి దేవి, ఇన్స్ పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ వాసంతి, చైల్డ్ లైన్ డిపార్ట్ మెంట్ సిబ్బంది పాల్గొన్నారు.

## తూర్పు శాసనసభ్యులు నసీర్ అహ్మదును ఘనంగా సత్కరించిన రాజా మాస్టారు

గుంటూరు విద్య జూన్ 13 ప్రభాతవార్త : హజ్ యాత్రకు వెళ్లి తిరిగి వచ్చిన గుంటూరు తూర్పు శాసనసభ్యులు నసీర్ అహ్మద్ ను రాష్ట్ర గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్, శ్రీ వికాస్ విద్యా సంస్థల అధినేత దాసరి రాజా మాస్టారు శనివారం ఘనంగా సత్కరించారు. పుష్ప గుచ్ఛాన్ని అందించి శాలువా కప్పి అభినందించారు. గుంటూరు జిల్లా టీడీపీ కార్యాలయంలో జరిగిన,క్లస్టర్, కొఆర్డినేటర్,యూనిట్ ఇంచార్జిలు, బి ఎల్ ఏ లు,డివిజన్ పార్టీ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులకు



నిర్వహించిన ఎస్ ఐ ఆర్ కార్యక్రమ అవగాహన కార్యక్రమములో "హజ్ యాత్రను దిగ్విజయంగా పూర్తి చేసుకుని,తిరిగి పార్టీ కార్యక్రమాలలో క్రియాశీలకంగా పాల్గొంటున్న హాజీ మహమ్మద్ నసీర్ అహమ్మద్ ను రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ మాజీ చైర్మన్,దాసరి రాజా మాస్టారు సత్కరించారు . జిల్లా పార్టీ అధ్యక్షులు పిల్లి మాణిక్యాలరావు,పరిశీలకులు ఈశ్వర్,మాజీ డిప్యూటీ మేయర్ లు సజీల,గౌస్,తదితరులు, ఎమ్మెల్యే ను సత్కరించిన వారిలో ఉన్నారు

## ఏపీ ఆర్జీయూకేటీ ట్రిపుల్ ఐటి లకు 4,040 మంది విద్యార్థులు ఎంపిక

గుంటూరు విద్య జూన్ 13 ప్రభాతవార్త: ఆంధ్ర ప్రదేశ్ ఆర్జీయూకేటీ ట్రిబుల్ ఐటీ లలో ప్రవేశాలకు అర్హులైన విద్యార్థుల ఎంపిక జాబితాలను రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ విడుదల చేశారు. నూజివీడు, ఆర్కే వ్యాలీ, ఒంగోలు, శ్రీకాకుళం క్యాంపస్‌లకు ఎంపిక జరిగిన విద్యార్థుల జాబితాలను విడుదల చేశారు. ఎంపికైన విద్యార్థులు నిర్ణీత తేదీల్లో సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హాజరు కావలసి ఉంది. నూజివీడు, ఆర్కే వ్యాలీ క్యాంపస్లకు ఎంపికైన విద్యార్థులు ఈనెల 19 ,20 తేదీల్లో కౌన్సిలింగ్ కు హాజరు కావలసి ఉంది. ఒంగోలు క్యాంపస్ క ఎంపికైన విద్యార్థులు ఈనెల 22, 23 తేదీలలో కౌన్సిలింగ్ కు హాజరు కావలసి ఉంది. శ్రీకాకుళం క్యాంపస్ కి ఎంపికైన విద్యార్థులు ఈనెల 23, 24 తేదీలలో కౌన్సిలింగ్ కు హాజరు కావలసి ఉంది. మొత్తంగా 4,040మంది విద్యార్థులు ఆర్ జి యు కె టి లకు ఎంపికయ్యారు. వీరిలో 96.7 ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులే కావడం గమనార్హం. గ్రామీణ విద్యార్థులకు నాణ్యమైన ఉన్నత ఇంజనీరింగ్ విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యయంగా ఆంధ్రప్రదేశ్లో ఆర్ జి యు కే.టి లను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. విద్యార్థులకు పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో వచ్చిన అత్యున్నత మార్కులను బట్టి ఆరేళ్ల ఇంటిగ్రేటెడ్ బిటెక్లో ప్రవేశాలకు ఈ విశ్వవిద్యాలయం అవకాశాలను కల్పిస్తుంది.

## మండల విద్యాశాఖ అధికారులు పాఠశాలలను సందర్శించాలి

గుంటూరు విద్య జూన్ 13 ప్రభాతవార్త : గుంటూరు జిల్లాలోని మండల విద్యాశాఖ అధికారులు అందరూ క్రమం తప్పకుండా ప్రతిరోజు ఆయా పాఠశాలలను సందర్శించాలని గుంటూరు జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ షేక్ సలీం భాష సూచించారు. సందర్శనకు వెళ్లేటప్పుడు మండల స్టేటస్ ను ఆన్లైన్లో చూసుకొని రెస్పాండ్ కావాలని తధానుగుణంగా ఫాలప్ చేయాలన్నారు. విద్యార్థులు పాఠశాలకు నూరు శాతం హాజరు అయ్యేటట్లు చర్యలు చేపట్టాలన్నారు. పదవ తరగతి విద్యార్థులకు ఉదయం సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహించేలా చర్యలు చేపట్టాలన్నారు. మధ్యాహ్న భోజన పథకాన్ని వేడివేడిగా రుచికరంగా అందించే విధంగా చూడాలన్నారు. శుభ్రమైన త్రాగునీరుని అందించడమే కాకుండా వాష్ రూములు శుభ్రతగా ఉన్నాయా లేవా అని కూడా సందర్శనలో పరిశీలించాలన్నారు. రోజువారి జరిగే కల్చరల్, గేమ్స్, స్పోర్ట్స్ యాక్టివిటీస్ ఆయా స్కూల్స్ లో జరుగుతున్నాయా లేవా అనేది కూడా పరిశీలించాలన్నారు. ప్రతిరోజు ఉదయం 9 గంటలకు పాఠశాల లో జరిగే అసెంబ్లీకి ఏదో ఒక స్కూల్ కి హాజరు కావాలని విద్యార్థులకు ఎథిక్స్ మోరల్ వాల్యూస్ ఇన్స్పైరింగ్ మాటలు చెప్పాలన్నారు.

## రాజధాని రైతుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలి

గుంటూరు విద్య జూన్ 13 ప్రభాతవార్త : రాజధాని రైతుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని , రాజధాని ప్రాంతంలోని రైతుల నుంచి దశలవారీగా భూ సేకరణ, భూ సమీకరణ జరిపిన అంశాలలో రైతులకు తప్పకుండా ఎకరాకు కోటి రూపాయలు తో పాటు ప్లాట్లు ఇవ్వాల్సిందేనని, రైతులకు న్యాయం జరిగేంత వరకు ఆంధ్ర రాష్ట్ర సమితి పార్టీ పోరాటం చేస్తూనే ఉంటుందని కోటేశ్వరరావు స్పష్టం చేశారు.



రాజధాని రైతులకు న్యాయం జరగాలంటూ గత 349 రోజుల నుంచి పోరాటం చేస్తున్న జంజనం కోటేశ్వరరావు శనివారం పాత్రికేయులతో రాజధాని రైతుల సమస్యలపై మాట్లాడారు. రాజధాని రెండవ పూలింగ్, మూడవ విడత ల్యాండ్ పూలింగ్ ద్వారా 1 లక్ష 75 వేల ఎకరాలను రైతుల నుంచి సేకరించాలను కుంటున్నారన్నారు. ఈ కార్యక్రమానికి అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారని ఈ నేపథ్యంలో నిడుముక్కల, మోతడక, నిడమర్రు , తాడికొండ తదితర ప్రాంతాలలో భూ సేకరణ, భూ సమీకరణకు మూడవ ల్యాండ్ పూలింగ్ పేరుతో అధికారుల రంగం సిద్ధం చేస్తున్నారన్నారు. భూ సేకరణ, భూ సమీకరణ భూములు ఇచ్చిన ప్రతి రైతుకు ప్యాకేజీ ప్రకారం ఎకరానికి కోటి రూపాయలు 1250 గజాల చదరపు ప్లాటు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అధికారులు పరిపాలన మరచి రియల్ ఎస్టేట్ వ్యాపారం దిశగా ఆలోచన చేస్తున్నారని విమర్శించారు. గత 12 సంవత్సరాల నుండి రాజకీయ నాయకులకు రియల్ ఎస్టేట్ వ్యాపారం తప్ప రైతుల కష్టనష్టాలు పట్టడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వాస్తవానికి రాజధాని ప్రాంతంలోని రైతుల కష్టాలు స్పష్టమైన రీతిలో ముఖ్యమంత్రి దృష్టికి ఉన్నతాధికారులు తీసుకువెళ్లడం లేదని పేర్కొన్నారు. రైతులు ఏమి కోరుతున్నారు వారి ప్రధాన సమస్యలు ఏమిటి డిమాండ్ ఏమిటి అనే అంశంలో ఉన్నత అధికారులు సరైన రీతిలో ముఖ్యమంత్రి దృష్టికి తీసుకు వెళ్ళట లేదని కోటేశ్వరరావు ప్రధానంగా ఆరోపించారు .ముఖ్యమంత్రిని సైతం తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శలు తలెత్తుతున్నాయన్నారు. నాయకుల కంటే ప్రజలు చాలా తెలివైన వారని ఆ విషయాన్ని ప్రజా ప్రతినిధులు, అధికారులు గమనించాలన్నారు. రైతు ప్రయోజనం కొరకు గత 349 రోజుల నుంచి పోరాటం చేస్తుంటే పాలక ప్రభుత్వం ఎన్నో ఇబ్బందులు, ఇక్కట్లకు నన్ను గురి చేస్తున్నప్పటికీ రైతుల శ్రేయస్సు లక్ష్యంగా పోరాటం చేస్తున్నానన్నారు. రాజధాని అభివృద్ధిలో ప్రభుత్వం వద్ద నిధులు లేకపోతే ప్రైవేటు కంపెనీల భాగస్వామ్యంతో ముందుకు వెళ్తే అభివృద్ధి ముందుకు వెళుతుందన్నారు. అలాగే నవ్యాంధ్ర రాజధాని అమరావతి అభివృద్ధి అంశంలో ముఖ్యమంత్రి కన్న కలలు సాకారం అవుతుందని జంజనం కోటేశ్వరరావు పేర్కొన్నారు.

గుంటూరు వార్త

## యోగా సాధన ద్వారా సంపూర్ణ ఆరోగ్యం

### జిల్లా కలెక్టర్ సాయికాంత్ వర్మ

గుంటూరు, జూన్ 13, ప్రభాతవార్త ప్రతినిధి : దైనందిన జీవితంలో యోగాను భాగస్వామ్యం చేసుకుంటే సంపూర్ణ ఆరోగ్యవంతులుగా జీవించవచ్చునని జిల్లా కలెక్టర్ సాయికాంత్ వర్మ తెలిపారు.15 రోజుల యోగ ప్రచార కార్యక్రమంలో భాగంగా శనివారం మంగళగిరిలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం ప్రాంగణంలో జిల్లా స్థాయి యోగా కార్యక్రమం నిర్వహించారు. తొలుత యోగ శాస్త్ర పితామహుడు మహర్షి పతంజలి చిత్రపటానికి పూలమాలవేసి, యోగ గురువులతో కలసి జిల్లా కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ



ఆరోగ్యవంతమైన అలవాట్ల ద్వారానే ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడుతుందన్నారు. భారతదేశం ప్రపంచానికి అందించిన సాధనం యోగా అని అన్నారు. వివిధ దేశాల ప్రజలు యోగాను ఆచరిస్తున్న పరిస్థితుల్లో గుంటూరు జిల్లా ప్రజలు కూడా ప్రతిరోజు వారి దినచర్యలో భాగంగా యోగాన్ని మలుచుకోవటానికి ప్రయత్నించాలన్నారు. అనారోగ్య సమస్యలు దరిచేరకుండా సంపూర్ణ ఆరోగ్యంతో పాటు ఆర్థికంగా ఉన్నత స్థితిలో ఉంచుతుందన్నారు. యోగా ద్వారా శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. యోగా అనేది కేవలం కొన్ని ఆసనాలకు మాత్రమే పరిమితం కాకూడదని, ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలన్నారు. నిత్యం యోగా సాధన వల్ల ఒత్తిడి లేని ఉత్సాహభరితమైన, క్రమశిక్షణతో కూడిన జీవనశైలి అలవడుతుందని తెలిపారు. యోగాను మన పూర్వీకులు అందించిన అమూల్యమైన సాంస్కృతిక వారసత్వంగా పేర్కొన్నారు. ప్రస్తుతం చాలా మందిని వేధిస్తున్న దీర్ఘకాలిక వ్యాధుల నియంత్రణకు, సంపూర్ణ ఆరోగ్యానికి ప్రాణాయామం వంటి యోగా సాధనలు ఎంతో మేలు చేస్తాయని పేర్కొన్నారు.

## అలల ఉధృతికి కొట్టుకుపోతున్న యువకుడిని కాపాడిన చీరాల శక్తి బృందం పోలీసులు

బాపట్ల,జూన్13,ప్రభాతవార్త,ప్రతినిధి: సముద్ర స్నానానికి దిగి, రాకాసి అలల తాకిడికి లోతుకు కొట్టుకుపోతున్న ఓ యువకుడిని తీరంలో విధుల్లో ఉన్న పోలీసులు ప్రాణాలకు తెగించి కాపాడారు.



బాపట్ల జిల్లా రామాపురం సముద్ర తీరంలో శనివారం ఉదయం చోటుచేసుకున్న ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. పోలీసుల సకాలంలో స్పందించిన తీరుపై పర్యాటకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పోలీసుల కథనం ప్రకారం గుంటూరు పట్టణానికి చెందిన శాఖమూరి కళ్యాణ్ (21) అనే యువకుడు శనివారం వరుస సెలవు దినాలు కావడంతో తన స్నేహితులతో కలిసి సరదాగా గడిపేందుకు రామాపురం బీచ్‌కు వచ్చాడు. మిత్రులతో కలిసి సముద్రంలో స్నానం చేస్తుండగా, ఒక్కసారిగా వచ్చిన భారీ అల కళ్యాణ్‌ను సముద్రం లోపలికి లాక్కెళ్లిపోయింది. దీంతో ఆందోళనకు గురైన అతని స్నేహితులు ఒడ్డున గట్టిగా కేకలు వేశారు.

**దేవుడిలా వచ్చిన శక్తి బృందం...**

సరిగ్గా అదే సమయంలో అక్కడ విధుల్లో ఉన్న చీరాల శక్తి బృందం కానిస్టేబుల్ సుబ్బారావు, హోం గార్డులు షేక్ మీరా, నాగరాజులు అలల ఉధృతిని సైతం లెక్కచేయకుండా వెంటనే సముద్రంలోకి దూకారు. మునిగిపోతున్న కళ్యాణ్‌ను చాకచక్యంగా పట్టుకుని, క్షేమంగా ఒడ్డుకు తీసుకువచ్చారు. అనంతరం బాధితుడికి ప్రథమ చికిత్స అందించి, సురక్షి తంగా స్నేహితులకు అప్పగించారు. ఈపూరుపాలెం ఎస్ఐ బాధితులకు, వారి స్నేహితులకు సముద్ర తీరంలో ప్రాణాపాయాల తీవ్రతపై ప్రత్యేక కౌన్సిలింగ్ ఇచ్చారు. ప్రాణాలు కాపాడిన పోలీసు సిబ్బందిని పర్యాటకులు, స్థానికులు ప్రత్యేకంగా అభినందించారు.

**యాత్రికుల భద్రతే ప్రాధాన్యత: ఎస్పీ ఉమామహేశ్వర్**

హెచ్చరికలు దాటి లోతుకు వెళ్లొద్దని తెలిపారు. వరుస సెలవుల నేపథ్యంలో హైదరాబాద్, తెలంగాణతో పాటు పొరుగు జిల్లాల నుండి పర్యాటకులు భారీగా వచ్చే అవకాశం ఉందని ముందుగానే ఊహించి సూర్యలంక, రామాపురం, వాడరేవు తీరాల్లో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. బీచ్‌లలో నిఘా కోసం డ్రోన్లు, పెట్రోలింగ్ కోసం స్పీడ్ బోట్లు, ఏటీవీ వాహనాలను వాడుతున్నాం. పర్యాటకులు పోలీసుల సూచనలు పాటించాలి. హెచ్చరికలను దాటి లోతుకు వెళ్లి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని ఆయన తెలిపారు.

## సెల్ఫీ వీడియో తీసుకొని యువ రైతు ఆత్మహత్య

గుంటూరు జూన్ 13, ప్రభాతవార్త ప్రతినిధి : పల్నాడు జిల్లాలో విషాదం చోటుచేసుకుంది. అప్పుల బాధ తట్టుకోలేక ఓ యువ రైతు బలవన్మరణానికి పాల్పడ్డాడు.ఆత్మహత్యకు ముందు సెల్ఫీ వీడియో తీసుకొని తన ఆవేదనను వెల్లడించడం స్థానికంగా కలకలం రేపుతోంది.ఈ ఘటన పల్నాడు జిల్లా బొల్లాపల్లి మండలం రావులాపురం గ్రామంలో చోటుచేసుకుంది. " ఏడేళ్ల క్రితం తీసుకున్న అప్పుకు ఇప్పటికే రూ. 18 లక్షలు కట్టాను. ఇంకా కట్టమని వేధిస్తున్నావు. నీవు వచ్చినప్పుడల్లా వేలకు వేలు ఖర్చు పెట్టలేను. నా చావుకు ప్రకాష్ రావు నీవే కారణం.. తనకు ఇవ్వాల్సిన డబ్బును స్వామి తన భార్యకు ఇవ్వు" అంటూ అప్పుల ఊబిలో కూరుకుపోయిన అన్నపరెడ్డి నాగిరెడ్డి (30) అనే యువ రైతు కళ్ల నిండా నీళ్లతో చనిపోయే ముందు తన ఫోన్‌లో సెల్ఫీ వీడియోను రికార్డు చేసుకున్నాడు. ఈ వీడియోను రికార్డు చేసిన కాసేపటికే నాగిరెడ్డి తన పొలంలోనే పురుగుమందు తాగి బలవన్మరణానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నాగిరెడ్డి ఏడేళ్ల క్రితం పత్తిపాడు మండలం బోయపాలెం గ్రామానికి చెందిన కళ్యాణితో కులాంతర వివాహం చేసుకున్నాడు. కారంపూడికి చెందిన పెళ్లిళ్ల బ్రోకర్ ప్రకాష్ రావు ఈ పెళ్లి సంబంధం కుదిర్చాడు. అదే సమయంలో నాగిరెడ్డికి కొంత సొమ్ము ప్రకాష్ రావు వడ్డీకి ఇచ్చాడు.



అంతేకాకుండా, భార్య పిన్ని కొడుకు స్వామికి డబ్బు అవసరం ఉండటంతో అతనితో కూడా ప్రకాష్ రావు దగ్గరే అప్పు ఇప్పించాడు. ఈ అప్పులకు గ్యారెంటీగా నాగిరెడ్డికి చెందిన పొలం డాక్యుమెంట్లను ప్రకాష్ రావు తాకట్టు పెట్టుకున్నాడు. ఈ క్రమంలో రైతు నాగిరెడ్డికి ఉన్న నాలుగు ఎకరాల పొలంతో పాటు, మరో మూడు ఎకరాలు కౌలుకు తీసుకుని పంటలు సాగు చేసేవాడు. వచ్చిన ఆదాయంలో పెట్టుబడులు పోగా మిగిలిన డబ్బునంతా భార్యకు తెలియకుండా వడ్డీ వ్యాపారి ప్రకాష్ రావుకు చెల్లిస్తూ వచ్చాడు. ఈ ఏడాది మిరప పంట సాగు చేయగా సుమారు 200 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. ఆ మిరపకాయలను యార్డులో విక్రయించగా వచ్చిన డబ్బును కూడా ప్రకాష్ రావుకే ఇచ్చినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. 18 లక్షల వరకు డబ్బు కట్టిన ఇంకా కట్టాలని వేదిస్తుండటంతో నాగి రెడ్డి పురుగుమందు తాగి బలవన్మరణానికి పాల్పడినట్లు తెలిపారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వినుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటన స్థానిక గ్రామస్తులను, బంధువులను తీవ్ర కలచివేసింది. మృతునికి భార్య కళ్యాణితో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల టెన్త్ విద్యార్థులకు ప్రతిరోజు స్లిప్ టెస్ట్

గుంటూరు విద్య జూన్ 13 ప్రభాతవార్త : గుంటూరు జిల్లాలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ మున్సిపల్ ఎయిడెడ్ తదితర ప్రభుత్వ ఉన్నత పాఠశాలల పదవ తరగతి విద్యార్థులకు ఈనెల 16వ తేదీ నుంచి జూలై 31వ తేదీ వరకు ఆదివారాలు సెలవు దినాలు మినహా ప్రతిరోజు సాయంత్రం నాలుగు నుంచి ఐదు గంటల మధ్య 20 మార్కులు కి గంట వ్యవధి తో స్లిప్ టెస్టులు నిర్వహించాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఆయా ప్రధానోపాధ్యాయులకు సూచించారు. ఆయా సబ్జెక్టులకు సంబంధించిన నిపుణులైన ఉపాధ్యాయులు ప్రశ్నలను తయారు చేసి ముందస్తుగానే సాఫ్ట్ కాపీని సమర్పించాలని డీఈవో పేర్కొన్నారు. స్లిప్ టెస్ట్ ల ప్రశ్నాపత్రాలు ఏ రోజుకు ఆరోజు ప్రధానోపాధ్యాయులకు గ్రూపుల ద్వారా పంపే ఏర్పాట్లు చేయనున్నారు. ఈ విధానం ద్వారా ఆయా విద్యార్థుల విద్యా ప్రగతి సబ్జెక్టుల వారీగా ప్రతిరోజు ఆ సబ్జెక్టు ఉపాధ్యాయులకు తెలుసుకునే వీలు కలుగుతుంది .తద్వారా మొదటి నుంచే విద్యార్థుల విద్యా ప్రగతికి బాటలు వేయటానికి మార్గం సుగమనమవుతుంది .జిల్లా విద్యాశాఖ అధికారి తీసుకున్న ఈ నిర్ణయం టెన్త్ పబ్లిక్ పరీక్షలలో విద్యార్థుల అధిక ఉత్తీర్ణతకు దోహదపడుతుంది. స్లిప్ టెస్టులు నిర్వహణ సంబంధించి గుంటూరు జిల్లా కామన్ ఎగ్జామినేషన్ బోర్డు కార్యదర్శి నిర్దిష్ట షెడ్యూల్ ని కూడా తయారు చేసి అమల్లోనికి ప్రవేశపెట్టారు. ప్రతిరోజు స్లిప్ టెస్టులు సబ్జెక్టుల వారిగా నిర్వహించటం వలన ఆయా సబ్జెక్టు ఉపాధ్యాయులకు బాధ్యత విద్యార్థులకు చదువు పట్ల శ్రద్ధ పట్టుదల కలగటమే కాకుండా విద్యార్థులు సబ్జెక్టులు పట్ల పట్టు సాధించడానికి కూడా మరింత అవకాశం ఏర్పడే వీలుంది. ప్రతిరోజు స్లిప్ టెస్టులు నిర్వహించడం వలన ఆయా విద్యార్థులు ఏ సబ్జెక్టులో డల్ గా ఉన్నారు. ఏ సబ్జెక్టులో రాణిస్తున్నారు అనే అంశాలను మూల్యాంకనం చేసుకొని తద్వారా చదువులో వెనుక పడుతున్న విద్యార్థులను ముందుకు తీసుకురావడానికి, బాగా చదివే విద్యార్థులను మరింత విద్యా ప్రగతి వైపు మళ్ళించటానికి మరింత అవకాశాలు ఉన్నాయి. ప్రస్తుతం అన్ని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ఇదే విధంగా ప్రతిరోజు విద్యార్థులకు స్లిప్ టెస్ట్ లు పెడుతూ విద్యార్థుల విద్యా ప్రగతిని మూల్యాంకనం చేస్తూ సంవత్సరాంతంలో అత్యున్నత స్థాయిలో విద్యార్థుల నుంచి పబ్లిక్ పరీక్షల ద్వారా ఉత్తీర్ణతను రాబట్టుకుంటున్నారు. గుంటూరు జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ షేక్ సలీం భాషా తీసుకున్న ఈ నిర్ణయం మంచి ఫలితాలను రాబట్టుతోందని పలు ఉపాధ్యాయులు హర్షిస్తున్నారు.

ప్రజాపాత్రికేయుడు ప్రబీర్ పుర్కాయస్త పై పెట్టిన కేసులు రద్దుచేయడంపై అవగాహన సంస్థ హర్షం

గుంటూరు కల్చరల్,జూన్ 13,ప్రభాతవార్త : ప్రజాపాత్రికేయుడు,న్యూస్ క్లిక్ వ్యవస్థాపకుడు ప్రబీర్ పుర్కాయస్థపై పెట్టిన కేసులు రద్దుచేస్తూ ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన తీర్పు హర్షణీయమని అవగాహన సంస్థ స్వాగతిస్తుంది.ఆయనపై కేసుల బనాయింపు కొనసాగింపుల్లో చట్టప్రక్రియ దుర్వినియోగం అయిందని కోర్టు వ్యాఖ్యానించడం కేంద్ర ప్రభుత్వానికి గట్టి చెంపదెబ్బగా పరిగణించాలని అవగాహన సంస్థ ప్రకటిస్తుంది.ప్రబీర్ ప్రజాపక్షాన తన జీవితాన్ని అంకితం చేసుకున్న మేధావి అని ఇంజనీరైన తన ఉద్యోగాన్ని వదలుకొని న్యూస్‌క్లిక్ వెబ్ పోర్టల్ ద్వారా ప్రజా జర్నలిజం వైపు నిలిచారని,మీడియా విస్మరించిన అనేక ప్రజా సమస్యలను,ఉద్యమాలను వెలుగులోనికి తీసుకొచ్చిన గొప్ప జర్నలిస్టు అని అవగాహన సంస్థ ప్రశంసిస్తుంది.

## సాహిత్య నాటక కళారంగ పోషకులు మానవతావాది బాలచందర్

గుంటూరు కల్చరల్,జూన్ 13,ప్రభాతవార్త : తన వృత్తి ధర్మాన్ని సమర్థవంతంగా నిర్వహిస్తూ సాహిత్యానికి,కళారంగానికి, సమాజానికి సేవలందించిన సత్రాజు బాలచందర్ మహోన్నత వ్యక్తి అని అవగాహన సంస్థ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సాహితీవేత్తలు,కళాకారులు,సమాజసేవకులు నివాళులర్పించారు.స్థానిక అవగాహన సంస్థ కార్యాలయంలో మనమూ పాడుదాం రండి బృంద



సభ్యులు కళారంగ పోషకులు బాలచందర్ సంస్మరణ సభ జరిగింది.సభలో అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి మాట్లాడుతూ వృత్తిరీత్యా డాక్యుమెంట్ రైటర్ అయినా కవులు,కళాకారులు,సాహితీవేత్తల గుండెల్లో ఓ డాక్యుమెంటరీగా నిలిచిపోయారన్నారు.దస్తావేజు వృత్తికి నిఘంటువుగా ఆ రంగంలో పేరొందిన బాలచందర్ "సంస్కృతి" అనే సంస్థను నెలకొల్పి ఎందరో పేద,ప్రతిభా కళాకారులను ఆదుకున్నారని,ఎన్నో మంచి గ్రంధాలను పుస్తక ప్రియులకు అందించారన్నారు.అప్పాజోస్యుల విష్ణుభొట్ల ఫౌండేషన్ నిర్వాహకులు అప్పాజోస్యుల సత్యనారాయణ సహచర్యంతో అద్భుతమైన,అరుదైన సాహిత్య కార్యక్రమాలను నిర్వహించి గొప్ప సాహితీ వేత్తలను సత్కరించారన్నారు.కవి జమదగ్ని మాట్లాడుతూ బాలచందర్ సౌమ్యులు,సహృదయులు చిన్నా పెద్ద అందర్ని ఆత్మీయంగా పలకరించే వ్యక్తిత్వ సంస్కార సంపన్నులన్నారు.కార్యక్రమంలో అవగాహన సాంస్కృతిక కార్యక్రమాల కన్వీనర్ బిళ్ళా అశోక్,కళాకారులు శ్యామల కోటిరెడ్డి,గాయకులు కృష్ణప్రసాద్,రాజశేఖర్,తదితరులు బాలచందర్‌కు ఘనంగా నివాళులర్పించారు.

## ముగ్గురు భారత నావికుల్ని పొట్టనపెట్టుకున్న అమెరికా దుశ్చర్య

గుంటూరు కల్చరల్,జూన్ 13,ప్రభాతవార్త : ఓమన్ తీరంలోని చమురు నౌకపై క్షిపణిదాడి చేసి ముగ్గురు భారత నావికుల్ని పొట్టన పెట్టుకున్న అమెరికా దుశ్చర్య గర్హనీయమని అవగాహన సంస్థ ఖండిస్తుంది.ప్రాణాలు కోల్పోయిన ఆ ముగ్గురిలో ఒకరు పట్నాల సురేష్ విశాఖ వాసి కావడం మరంతి బాధాకరమని అవగాహన సంస్థ ప్రకటిస్తుంది.అమెరికా భారత నావికులపై చేసిన దాడిని ఇరాన్ ఖండించి తన మిత్రత్వాన్ని చాటుకుందని, ఈ దాడికి బాధ్యులను గుర్తించి కఠిన చర్యలు తీసుకునేలా భారత ప్రభుత్వం వ్యవహరించాలని అవగాహన సంస్థ విజ్ఞప్తి చేస్తుంది.

## పాత్రికేయుడు ప్రబీర్ పుర్కాయస్తపై పెట్టిన కేసులు రద్దుచేయడంపై అవగాహన సంస్థ హర్షం

గుంటూరు కల్చరల్,జూన్ 13,ప్రభాతవార్త : ప్రజాపాత్రికేయుడు,న్యూస్ క్లిక్ వ్యవస్థాపకుడు ప్రబీర్ పుర్కాయస్థపై పెట్టిన కేసులు రద్దుచేస్తూ ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన తీర్పు హర్షణీయమని అవగాహన సంస్థ స్వాగతిస్తుంది.ఆయనపై కేసుల బనాయింపు కొనసాగింపుల్లో చట్టప్రక్రియ దుర్వినియోగం అయిందని కోర్టు వ్యాఖ్యానించడం కేంద్ర ప్రభుత్వానికి గట్టి చెంపదెబ్బగా పరిగణించాలని అవగాహన సంస్థ ప్రకటిస్తుంది.ప్రబీర్ ప్రజాపక్షాన తన జీవితాన్ని అంకితం చేసుకున్న మేధావి అని ఇంజనీరైన తన ఉద్యోగాన్ని వదలుకొని న్యూస్‌క్లిక్ వెబ్ పోర్టల్ ద్వారా ప్రజా జర్నలిజం వైపు నిలిచారని,మీడియా విస్మరించిన అనేక ప్రజా సమస్యలను,ఉద్యమాలను వెలుగులోనికి తీసుకొచ్చిన గొప్ప జర్నలిస్టు అని అవగాహన సంస్థ ప్రశంసిస్తుంది.

# బాపట్లలో ఇసుక మాఫియా..

## సీఎం హెచ్చరించినా ఆగని అక్రమ తవ్వకాలు?...

### మైనింగ్ అధికారుల అండదండలతోనే దందా సాగుతోందన్న ఆరోపణలు

బాపట్ల,జూన్13,ప్రభాతవార్త,ప్రతినిధి: రాష్ట్రంలో ఉచిత ఇసుక విధానాన్ని పారదర్శకంగా అమలు చేయాలని, అక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పలుమార్లు హెచ్చరించినప్పటికీ బాపట్ల జిల్లాలో ఇసుక అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. వ్యవసాయ భూములు, ప్రభుత్వ స్థలాలు, చెరువుల పరిసర ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని ఇసుక మాఫియా రాత్రివేళల్లో భారీ యంత్రాలతో తవ్వకాలు నిర్వహిస్తోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ లోపం, సంబంధిత శాఖల నిరక్ష్యం కారణంగానే ఈ దందా నిరాటంకంగా సాగుతోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**రాత్రి వేళల్లో యంత్రాల హోరు:**

జిల్లాలోని పలు ప్రాంతాల్లో రాత్రి 10 గంటల నుంచి తెల్లవారుజామున వరకు అక్రమ ఇసుక తవ్వకాలు జరుగుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. జేసీబీలు, ఎక్స్కవేటర్ల సహాయంతో 20 నుంచి 30 అడుగుల లోతు వరకు భూమిని తవ్వి ఇసుకను లారీల ద్వారా తరలిస్తున్నారని పేర్కొంటున్నారు. పగటిపూట ఎలాంటి ఆనవాళ్లు కనిపించకుండా చర్యలు తీసుకుంటూ, రాత్రివేళల్లో పెద్ద ఎత్తున తవ్వకాలు నిర్వహించడం పరిపాటిగా మారిందని అంటున్నారు.

**పొలాలు చెరువులను తలపించేలా...**

అక్రమ తవ్వకాల కారణంగా పచ్చని వ్యవసాయ క్షేత్రాలు భారీ గుంతలుగా మారుతున్నాయి. ఒకప్పుడు పంటలతో కళకళలాడిన భూములు ఇప్పుడు చెరువులను తలపించే స్థితికి చేరాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లోతైన గుంతల కారణంగా భూముల వినియోగం కష్టంగా మారడమే కాకుండా, వర్షాకాలంలో ప్రమాదాలకు కూడా దారితీసే పరిస్థితులు ఏర్పడుతున్నాయని చెబుతున్నారు.



**పడిపోతున్న భూగర్భ జలాలు:**

అధిక లోతులో జరుగుతున్న తవ్వకాల ప్రభావం భూగర్భ జలాలపై తీవ్రంగా పడుతోందని రైతులు, గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో బోర్లు ఎండిపోతుండగా, మరికొన్ని చోట్ల నీటి మట్టం గణనీయంగా పడిపోయినట్లు పేర్కొంటున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే భవిష్యత్తులో సాగు నీటితో పాటు తాగునీటి సమస్య కూడా తీవ్రరూపం దాల్చే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.

**రహదారులకు ముప్పు:**

ప్రధాన రహదారులు, గ్రామీణ రోడ్లకు సమీపంలోనే అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. భారీ గుంతలు ఏర్పడటం వల్ల వర్షాకాలంలో నేల కుంగిపోయే ప్రమాదం ఉందని పేర్కొంటున్నారు. రహదారుల అంచులు బలహీనపడితే రవాణా వ్యవస్థకు అంతరాయం కలిగే అవకాశాలు ఉన్నాయని అభిప్రాయపడుతున్నారు. ప్రజల ప్రాణాలకు ముప్పు పొంచి ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు.

**అధికారులపై అనుమానాల మేఘం:** ఇసుక మాఫియా ఇంత బహిరంగంగా అక్రమాలకు పాల్పడుతున్నా సంబంధిత శాఖల అధికారులు సమర్థవంతమైన చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా మైనింగ్, జియాలజీ శాఖ అధికారుల పర్యవేక్షణపై ప్రజలు ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. అక్రమ తవ్వకాలు జరుగుతున్న ప్రాంతాలపై ముందస్తు సమాచారం ఉన్నప్పటికీ దాడులు, తనిఖీలు లేకపోవడం అనుమానాలకు తావిస్తోందని స్థానికులు అంటున్నారు.

జిల్లాలో జరుగుతున్న అక్రమ ఇసుక తవ్వకాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు. పర్యావరణానికి, వ్యవసాయానికి, భూగర్భ జలాలకు నష్టం కలిగిస్తున్న అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. తవ్వకాల వెనుక ఉన్న మాఫియా నెట్‌వర్క్‌ను ఛేదించడంతో పాటు, నిరక్ష్యంగా వ్యవహరించిన అధికారుల బాధ్యతను కూడా నిర్ధారించాలని కోరుతున్నారు. ఇప్పటికైనా సమగ్ర విచారణ జరిపి అక్రమ ఇసుక దందాకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేస్తున్నారు.

# పల్నాడు జిల్లా వార్త



## ముస్లిం మైనారిటీల అభ్యున్నతికి జనసేన కట్టుబడి ఉంది

చిలకలూరిపేట, జూన్ 13, ప్రభాతవార్త: ముస్లిం మైనారిటీల అభ్యున్నతికి, వారి సామాజిక, ఆర్థిక, విద్యాభివృద్ధికి జనసేన పార్టీ ఎల్లప్పుడూ ప్రాధాన్యత ఇస్తుందని జనసేన పార్టీ సెంట్రల్ ఆంధ్ర కో కన్వీనర్ పెంటేల బాలాజి అన్నారు. బాలాజి ముస్లింలకు పవిత్ర దినమైన శుక్రవారం మండలంలోని రాజాపేట మసీదు అభివృద్ధికి రూ. 52 వేలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో మతసామరస్యం వర్ధిల్లాలని, అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నప్పుడే నిజమైన అభివృద్ధి సాధ్యమని జనసేన నమ్ముతుందని పేర్కొన్నారు. జనసేన పార్టీ ముస్లిం సోదరుల సంక్షేమానికి కట్టుబడి ఉంటుందని, భవిష్యత్తులోనూ మైనారిటీల అభ్యున్నతికి, ఇలాంటి ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలకు తమ వంతు సహకారం ఎల్లప్పుడూ అందిస్తామని ఈ సందర్భంగా



ఆయన భరోసా ఇచ్చారు. అన్ని వర్గాల సంక్షేమమే జనసేన ధ్యేయం ఈ సందర్భంగా పెంటేల బాలాజి మాట్లాడుతూ, సమాజంలో మతసామరస్యం వర్ధిల్లాలని, ఏకత్వమే భారతదేశానికి బలమని పేర్కొన్నారు. కులమతాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నప్పుడే నిజమైన అభివృద్ధి సాధ్యమని, ఇదే జనసేన పార్టీ మూల సిద్ధాంతమని బాలాజి గుర్తుచేశారు. ముస్లిం మైనారిటీల హక్కుల పరిరక్షణకు, వారి జీవన ప్రమాణాల మెరుగుదలకు జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతున్నారని వివరించారు.పవిత్రమైన శుక్రవారం రోజున రాజాపేట మసీదు అభివృద్ధికి తన వంతుగా ఈ చిన్న సహాయాన్ని అందించడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానని బాలాజి ఆనందం వ్యక్తం చేశారు. మైనారిటీల సంక్షేమానికి జనసేన పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇస్తూ, భవిష్యత్తులోనూ ఇలాంటి ఆధ్యాత్మిక, సామాజిక, సేవా కార్యక్రమాలకు తమ వంతు సహకారాన్ని ఎల్లవేళలా అందిస్తామని ఈ సందర్భంగా ఆయన హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మసీదు కమిటీ ప్రతినిధులు, స్థానిక ముస్లిం పెద్దలు, జనసేన పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా కేక్ కటింగ్

చిలకలూరిపేట, జూన్ 13, ప్రభాతవార్త: మాజీ మంత్రివర్యులు, శాసన సభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు క్యాంపు కార్యాలయం నందు రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం విజయవంతంగా రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా కేక్ కటింగ్ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని వివిధ హోదాల్లో ఉన్న కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం మరియు పారదర్శక పాలన లక్ష్యంగా కూటమి ప్రభుత్వం గత రెండేళ్లుగా సమర్థవంతంగా పనిచేస్తోందని తెలిపారు.



ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రంలో మౌలిక వసతుల అభివృద్ధి, పెట్టుబడుల ఆకర్షణ, యువతకు ఉపాధి అవకాశాల కల్పన, రైతు సంక్షేమం మరియు మహిళా సాధికారతకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ ప్రభుత్వం ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా సుపరిపాలన అందిస్తూ, ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి పథంలో నడిపిస్తున్న కూటమి ప్రభుత్వానికి ప్రజల నుండి విశేష ఆదరణ లభిస్తోందని అన్నారు. రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని నాయకులు తెలిపారు. అనంతరం కూటమి ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు కూటమి ప్రభుత్వం మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, చిలకలూరిపేట వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ కరీముల్లా, పట్టణ పార్టీ అధ్యక్షుడు పఠాన్ సమద్ ఖాన్ , ప్రధాన కార్యదర్శి మద్దుమాల రవి, సీనియర్ నాయకులు జవాజి బాషా, మాజీ మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, క్లస్టర్ ఇంచార్జులు మద్దిబోయిన శివ, పట్టణ ఉపాధ్యక్షులు ముచికూరి మల్లి బాబు, క్లస్టర్ ఇంచార్జీలు టి.టి. రోడ్డు మస్తాన్ వలి, కొత్త కోటేశ్వరరావు, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ పిల్లి కోటేశ్వరరావు , సీనియర్ నాయకులు ఇనగంటి జగదీష్ , తుపాకుల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

## చోరీకి గురైన సెల్‌ఫోన్లు రికవరీ

చిలకలూరిపేట, జూన్ 13, ప్రభాతవార్త: సెల్ ఫోన్ల రికవరీలో పల్నాడు జిల్లాలోనే అత్యధికంగా సెల్ఫోన్లు రికవరీ చేసిన అర్బన్ సీఐ పి.రమేష్. చిలకలూరిపేట పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో పోయినటువంటి 15 సెల్ ఫోన్ లను రికవరీ చేసి చిలకలూరిపేట అర్బన్ సి.యస్ ఇన్స్పెక్టర్ ఆయిన పి. రమేష్ సెల్ ఫోన్ లను పోగొట్టుకున్న బాధితులకు అప్పగించారు.



## చిలకలూరిపేటలో జూన్ 16న మెగా జాబ్ మేళా

### 40 కంపెనీల్లో 2,000 ఉద్యోగ అవకాశాలు: తేళ్ల సుబ్బారావు

చిలకలూరిపేట, జూన్ 13, ప్రభాతవార్త: పట్టణంలోని నిరుద్యోగ యువత యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో ఈ నెల 16వ తేదీన మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు చిలకలూరిపేట విద్యాసంఘం చైర్మన్ తేళ్ల సుబ్బారావు తెలిపారు. ప్రత్తిపాటి ఫౌండేషన్, ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ సహకారంతో, మాజీ మంత్రి, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు మార్గదర్శకత్వంలో, ప్రత్తిపాటి శరత్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. శనివారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పట్టణంలోని ప్రత్తిపాటి గార్డెన్స్‌లో ఈ నెల 16వ తేదీ (మంగళవారం) ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జాబ్ మేళా కొనసాగుతుందని తెలిపారు. ఈ మేళాలో సుమారు 40 ప్రముఖ కంపెనీలు పాల్గొంటుండగా, దాదాపు 2,000 ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు.10వ తరగతి, ఇంటర్మీడియట్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, పీజీ తదితర విద్యార్హతలు కలిగిన అభ్యర్థులు ఈ జాబ్ మేళాలో పాల్గొనవచ్చని తెలిపారు. 18 నుంచి 35 సంవత్సరాల మధ్య వయస్సు గల యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ ప్రతిభకు తగిన ఉద్యోగాలను పొందాలని కోరారు.నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఇలాంటి కార్యక్రమాలను నిరంతరం ప్రోత్సహిస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, ప్రత్తిపాటి శరత్‌లకు ఈ సందర్భంగా తేళ్ల సుబ్బారావు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. యువత భవిష్యత్తు నిర్మాణానికి ఉపాధి కల్పన కీలకమని, ఈ జాబ్ మేళా ద్వారా వందలాది మంది యువతకు ఉద్యోగ అవకాశాలు లభించే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరిస్తున్న ప్రత్తిపాటి ఫౌండేషన్ కన్వీనర్ కందర్ల శ్రీనివాసరావు, నియోజకవర్గ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ కరిముల్లా తదితర ప్రముఖులతో పాటు వివిధ హోదాల్లో ఉన్న నాయకులు, ప్రజాప్రతినిధులు, సామాజికవేత్తలు సహకరిస్తున్నట్లు తెలిపారు. అర్హులైన అభ్యర్థులు తమ విద్యార్హతల ధ్రువపత్రాలు, బయోడేటాతో తప్పనిసరిగా హాజరై ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తేళ్ల సుబ్బారావు పిలుపునిచ్చారు.



## రాష్ట్ర దశ,దిశను మార్చిన కూటమి పాలన



నరసరావుపేట,జూన్ 13 ప్రభాతవార్త : రాష్ట్రంలో కూటమి పాలన ప్రారంభమై రెండేళ్లు పూర్తికావస్తుందని, రాష్ట్ర దశ,దిశ మార్చిన కాలమిదని టిడిపి రాష్ట్ర కార్యదర్శి నాగోతు సౌరయ్య అన్నారు. శనివారం స్థానిక కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజాసేవకు పునరంకితమవుతూ తిరుపతిలో నిర్వహించిన కూటమి సభ అద్భుతంగా విజయవంతమైనట్లు తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన సందేశం రాష్ట్ర అభివృద్ధికి,ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం ఏ విధంగా కృషి చేస్తుందో తెలియజేసిందని అన్నారు. ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ ప్రజా సేవకులుగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవడం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సారథ్యంలోని ప్రభుత్వానికి దక్కిందన్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో ఎన్ని కుట్రలు చేసినా అభివృద్ధిని అడ్డుకోలేరన్నారు. ప్రజలు ఇచ్చిన తీర్పుతో బాధ్యతను కూటమి ప్రభుత్వం తీసుకుందని తెలియజేశారు. అమరావతిని రాష్ట్ర రాజధానిగా కచ్చితంగా నిలబెట్టే కృషి జరుగుతుందన్నారు. రాజధానిపై రాజకీయ కుట్రలు ఎన్ని జరిగినా కేంద్రం సహకారంతో అన్ని వర్గాల ప్రజల ఆశీస్సులతో ప్రభుత్వం ముందుకు పోతుందన్నారు. సంక్షేమంతో పాటు గడిచిన రెండేళ్లలో 23 లక్షల కోట్ల పెట్టుబడులను రాష్ట్రానికి ముఖ్యమంత్రి చంద్రబాబు తీసుకువచ్చారని గుర్తు చేశారు. గత ప్రభుత్వ కాలంలో జరిగిన అరాచకాలు, అన్యాయాలు,అక్రమ అరెస్టుల నుండి ప్రజలను విముక్తి కలిగించిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉంటేనే రాష్ట్రానికి మంచి జరుగుతుందని, దేశానికే ఏపీ ఆదర్శంగా ఉంటుందని ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర కార్యదర్శి నాగోతు సౌరయ్య తెలియజేశారు.

## కృష్ణవేణి డిగ్రీ కళాశాలలో మెగా జాబ్ మేళా

నరసరావుపేట టౌన్, జూన్ 13 ప్రభాతవార్త : కృష్ణవేణి డిగ్రీ కళాశాలలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు శనివారం తెలిపారు. జాబ్ మేళా గోడపత్రికలను ఆవిష్కరించి వివరాలను తెలియజేశారు. ఈనెల 15వ తేదీన, సోమవారం కృష్ణవేణి డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా జరుగుతుందన్నారు. నరసరావుపేట తో పాటు పరిసర ప్రాంతాల యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మొత్తం 20 ప్రముఖ కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారని తెలియజేశారు. అభ్యర్థుల విద్యా అర్హతను బట్టి జీతం 15 వేల నుండి 30 వేల వరకు ఉంటుందని పేర్కొన్నారు. ఈ జాబ్ మేళాకు టెన్త్,ఇంటర్,ఐటిఐ, డిప్లమో,డిగ్రీ, బి.టెక్, ఫార్మసీ, పీజీ వరకు చదువుకున్న విద్యార్థులు అర్హులని తెలియజేశారు.వయసు 18 నుండి 30 సంవత్సరాలు ఉండాలని పేర్కొన్నారు.అభ్యర్థుల తమ బయోడేటా తో పాటు విద్యా సర్టిఫికెట్ల జిరాక్స్ లను, ఆధార్ కార్డు ప్రతులను,పాస్పోర్ట్ సైజు ఫోటోలతో నేరుగా ఇంటర్వ్యూలకు హాజరు కావాలని కోరారు. ఆసక్తిగల యువతో జాబ్ మేళాకు హాజరు కావచ్చని తెలియజేశారు. ముందుగా రిజిస్ట్రేషన్ లేని అభ్యర్థులు సైతం స్పాట్ రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చని ప్రిన్సిపాల్ నాతానివెంకటేశ్వర్లుసూచించారు. 9866929567నెంబర్ను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో అధ్యాపకులు బాలు, కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.



## విజయోత్సవ సభ ఏర్పాట్లు పరిశీలించిన ఎమ్మెల్యే చదలవాడ

నరసరావుపేట, జూన్ 13 ప్రభాతవార్త : అభివృద్ధి అంటే ఉమ్మడి కూటమి ప్రభుత్వానికే చెందుతుందని, గత వైసీపీ ప్రభుత్వం అరాచక పాలన కొనసాగించిందని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు విమర్శించారు. వైసిపి ఐదేళ్లలోచేయలేని అభివృద్ధిని కూటమి ప్రభుత్వం రెండేళ్లలో చేసి చూపించిందని, దానికి వైయస్సార్సీపి నాయకులు సిగ్గుతో తలవంచుకోవాలని అన్నారు. శనివారం స్థానిక లింగంగుంట్ల గ్రామంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం పక్కన ఉన్న పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాట్లను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ నెల 15వ తేదీ సోమవారం ఉమ్మడి కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహించనున్న విజయోత్సవ సభకు సంబంధించి ఏర్పాట్లను ఆయన పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ పల్నాడు జిల్లా అధ్యక్షులు షేక్ జాన్ సైదా, జనసేన జిల్లా అధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావు, బీజేపీ జిల్లా అధ్యక్షులు శశి కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చదలవాడ మాట్లాడుతూ ఉమ్మడి కూటమి రెండేళ్ల పాలన చూసి మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈర్ష్య పడుతున్నారని ఆరోపించారు. గత ఐదేళ్లలో వారు చేయలేని అభివృద్ధి పనులను కూటమి ప్రభుత్వం ఏర్పడిన రెండేళ్లలోనే చేసి చూపించిందని, దీనికి సిగ్గుతో తలవంచుకోవాలని ఎద్దేవా చేశారు. మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి పగటి కలలు కంటున్నారని, 2029 ఎన్నికల్లో కూడా నరసరావుపేట నియోజకవర్గంలో తానే ఎమ్మెల్యేగా గెలుస్తానని, రాష్ట్రానికి నారా చంద్రబాబు నాయుడు ఐదోసారి ముఖ్యమంత్రి అవుతారని ధీమా వ్యక్తం చేశారు. తెలుగుదేశం పార్టీ పల్నాడు జిల్లా అధ్యక్షులు జాన్ సైదా మాట్లాడుతూ ఉమ్మడి కూటమి విజయోత్సవ సభను జయప్రదం చేయాలని నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు పిలుపునిచ్చారు.



## రూరల్ పోలీస్ స్టేషన్ ఎదుట టిడిపి నాయకుడు రామిరెడ్డి ఆందోళన..

నరసరావుపేట క్రైమ్, జూన్ 13 ప్రభాతవార్త : పాలపాడు గ్రామంలో రైతుల కోసం రోడ్లు వేస్తుంటే, పోలీసులు కేసులు పెట్టి వేధిస్తున్నారని మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ పులిమి రామిరెడ్డి విమర్శించారు. శనివారం రూరల్ పోలీస్ స్టేషన్ ఎదుట గ్రామస్తులతో కలిసి ధర్నాకు దిగారు. పోలీసులు ఇప్పటివరకు తనపై ఐదు కేసులు పెట్టారని తాము అధికారంలో ఉన్నామా,లేమో కూడా అర్థం కావడం లేదని రామిరెడ్డి విచారం వ్యక్తం చేశారు. తాము ఇచ్చిన ఫిర్యాదులను పోలీసులు పట్టించుకోవడంలేదని, అభివృద్ధిని అడ్డుకుంటున్న వారు తప్పుడు ఫిర్యాదులు ఇస్తే మాత్రం తీసుకొని కేసులు కట్టారని అన్నారు. గ్రామంలో పార్టీ అధికారంలోకి రాగానే మట్టి రోడ్లను రైతుల సౌకర్యం కొరకు లింకు రోడ్లుగా మార్చి అభివృద్ధి చేశామన్నారు. ఇప్పటికే 10 కిలోమీటర్లకు పైగా రోడ్లు వేయడం జరిగిందన్నారు. రైతులకు మరో ఐదు కిలోమీటర్ల రోడ్ల అవసరం ఉన్నట్లు తెలిపారు. ఈ క్రమంలోనే పాలపాడు నుండి అన్నవరం గ్రామానికి రోడ్డు నిర్మిస్తున్నట్లు తెలిపారు. గ్రామానికి చెందిన సాయికృష్ణ అనే వ్యక్తి తెలుగు యువత నాయకునిగా ఉన్నారని, వారి కుటుంబ సభ్యులు రోడ్డుకు సంబంధించి అభ్యంతరాలు వ్యక్తం చేస్తూఅడ్డుపడుతున్నా రని తెలిపారు. పదే పదే తనపై జిల్లా కలెక్టర్ కు,ఎస్పీకి తప్పుడు సమాచారాలతో ఫిర్యాదు చేశారన్నారు. రూరల్ పోలీస్ స్టేషన్లో కేసులు తనపై పెట్టడం దారుణం అన్నారు. పార్టీకి దశాబ్దాలుగా సేవలందిస్తున్న తనపై కేసులు పెట్టడం బాధగా ఉందన్నారు. తెలుగుదేశం నాయకులు ఎవరైనా పాలపాడు వచ్చి సంఘటనపై విచారణ చేయాలన్నారు. రైతుల కోసం రోడ్డు వేయడం తప్ప అని ప్రశ్నించారు. సహకరించాల్సిన వారు తప్పుడు ఫిర్యాదులు చేసి కేసులు పెట్టిస్తున్న పార్టీ రాష్ట్ర నాయకత్వం పట్టించుకోవడం లేదన్నారు. పోలీసుల సైతం ఈ విషయంలో ఏమీ చేయలే మని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. నిరసన కార్యక్రమంలో పులిమిరామిరెడ్డి తో పాటు గ్రామస్తులు ఉన్నారు.



## కేసానుపల్లిలో రూ.2.36 కోట్ల అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం.. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ

నరసరావుపేట క్రైమ్, జూన్ 13 ప్రభాతవార్త : మండలంలోని కేసానుపల్లి గ్రామంలో శనివారం పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవాలు ఘనంగా జరిగాయి. నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలుసంయుక్తంగా మాట్లాడుతూ కేసానుపల్లి గ్రామంలో పలు అభివృద్ధి పనులను



ప్రారంభించుకుంటున్నామన్నారు. దాదాపు రూ.2.36 కోట్లతో రెండేళ్లలో పూర్తి చేసిన పనులను నేడు ప్రారంభించుకున్నామని తెలిపారు. గ్రామస్తులు ఎప్పుడూ కోరేది ప్రతి ఇంటికీ తాగునీటి కనెక్షన్. ఇచ్చిన మాట ప్రకారం సంవత్సరం క్రితం రూ.1.16 కోట్ల జలజీవన్ మిషన్ నిధులతో శంకుస్థాపన చేసిన పనులు నేడు పూర్తి చేశామన్నారు. దీంతో దాదాపు 2,500 ఇళ్లకు కుళాయి కనెక్షన్లు ఇవ్వడం జరిగిందన్నారు. ఇది ఒక కేసనపల్లిలోనే మాత్రమే కాదని, నరసరావుపేట నియోజకవర్గం మొత్తం, పార్లమెంట్ పరిధిలో ప్రతి ఇంటికీ కుళాయి నీరు ఇస్తున్నామని పేర్కొన్నారు. గ్రామంలో సీసీ రోడ్లకు రూ.1.10 కోట్లు, సైడ్ డ్రెయిన్‌కు రూ.15 లక్షలతో నిర్మాణం పూర్తి చేసి ప్రారంభించినట్లు వెల్లడించారు. హైస్కూల్‌కు వెళ్లే మట్టి రోడ్డును సిమెంట్ రోడ్డుగా మార్చినట్లు తెలిపారు. అలాగే రూ.50 లక్షలతో నూతన సచివాలయ భవనాన్ని ప్రారంభించినట్లు చెప్పారు.గ్రామంలో ఎన్టీఆర్ భరోసా కింద పెన్షన్లకు దాదాపు రూ.1.89 కోట్లు, తల్లికి వందనం కింద రూ.98 లక్షలు, అన్నదాత సుఖీభవ కింద రూ.50 లక్షలు, వాహనమిత్ర కింద ఆటో డ్రైవర్లకు రూ.6 లక్షలు, గోకుల షెడ్లకు రూ.14 లక్షలు, హౌసింగ్ కింద రూ.93 లక్షలు మంజూరు చేశామని వివరించారు. రానున్న 2029 ఎన్నికల్లో గ్రామ ప్రజల ఉమ్మడి కూటమి విజయానికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ పలనాడు జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లపాటి రామచంద్ర ప్రసాద్, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కొల్లి బ్రహ్మయ్య, కపలవాయి విజయ్ కుమార్, గట్టుపల్లి సత్యనారాయణ, మండల నాయకులు, గ్రామ ప్రజలు, అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అష్టాదశ శక్తి పీఠంలో మండలదీక్షగా చండీయాగం

సత్తెనపల్లి, జూన్ 13, ప్రభాతవార్త: లోకకళ్యాణార్థం సత్తెనపల్లి పట్టణంలో మొట్టమొదటిసారిగా నరసరావుపేట రోడ్డులో శక్తీపీఠంగా వెలుగొందుతున్న శ్రీ కనకదుర్గ అమ్మవారి ఆలయంలో 41 రోజులు నవరాత్రులు తో మండలదీక్షగా చండీమహాయాగం నిర్వహిస్తున్నామని తెలిపారు. భక్తులు పాల్గొనాలని యాగనిర్వాహకులు రాజశేఖర్ శర్మ తెలిపారు.

## ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీలు స్వీకరించిన ఎమ్మెల్యే కన్నా

సత్తెనపల్లి, జూన్ 13, ప్రభాతవార్త: సత్తెనపల్లి పట్టణం రఘురామ్ నగర్ కార్యాలయం నందు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో పాల్గొన్నతెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు సత్తెనపల్లి నియోజకవర్గ శాసన సభ్యులు కన్నా లక్ష్మీనారాయణకు ప్రజలు తాము ఎదుర్కొంటున్న సమస్యలపై వినతి పత్రాలు అందించారు. ప్రజల నుండి నేరుగా ఫిర్యాదులను స్వీకరించిన శాసనసభ్యులు కన్నా . గత ప్రభుత్వం మాదిరిగా కాకుండా ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు ... ఈ సందర్భంగా ప్రజలు. తన దృష్టికి కొన్ని సమస్యలు. గృహ,పెన్షన్, వైద్యం,పలు సమస్యలు తీసుకొచ్చారు. సమస్యల తక్షణ పరిష్కారానికి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.అందరి సమస్యలు పరిష్కరిస్తామని, హామీ ఇచ్చారు .




## భారీ వర్షం కారణంగా ఎమ్మెల్యే కన్నా ఆదేశాలతో లోతట్టు ప్రాంతాల్లో 'దరువూరి' ఆధ్వర్యంలో సహాయక చర్యలు

సత్తెనపల్లి, జూన్ 13, ప్రభాతవార్త: సత్తెనపల్లి పట్టణ పరిధిలో అకాల వర్షాల కారణంగా డ్రైనేజ్ వ్యవస్థలో ఏర్పడిన అడ్డంకుల వల్ల వరదనీరు కాలనీల్లోకి ప్రవేశించి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవడం జరిగింది . కావున తక్షణమే సత్తెనపల్లి శాసనసభ్యులు కన్నా లక్ష్మీనారాయణ ఆదేశాల మేరకు పల్నాడు జిల్లా తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు దరువూరి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో క్రేన్ సహాయంతో డ్రైనేజ్‌లోని అడ్డంకులను తొలగించే చర్యలు చేపట్టడం జరిగింది. వరద నీరు సాఫీగా వెళ్లేలా తక్షణ చర్యలు తీసుకొని కాలనీవాసులకు ఇబ్బందులు కలగకుండా సమస్యను పరిష్కరించడం జరిగింది. లోతట్టు ప్రాంతాలు జల మయం అయిన వార్డులు తిరిగి , క్రేన్,మునిసిపల్ సిబ్బంది తో వరద ప్రవాహం పూడికతీత, మరియు చప్టల దగ్గర అడ్డుపడిన చెత్త చెదారం తొలగించి.. లోతట్టు ప్రాంతాలు ప్రజలకు ఇబ్బందులు కలుగ కుండా దగ్గర ఉండి పర్యవేక్షించిన పలనాడు జిల్లా తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు దరువూరి నాగేశ్వర రావుకి స్థానిక ప్రజలు కృతజ్ఞతలు తెలియ చేయడం జరిగింది.



## నీటిలో మునిగిన నాగన్నకుంట

సత్తెనపల్లి, జూన్ 13, ప్రభాతవార్త: సత్తెనపల్లి పట్టణంలో శనివారం నాడు తెల్లవారుజామున కురిసిన భారీ వర్షాలకు, నాగన్నకుంట లోని లోతట్టు ప్రాంతాలు, రాజీవ గృహకల్ప అపార్ట్మెంట్ వెనుక వైపు, ఫ్లాట్స్ ఏరియాలలో, సుందరయ్య కాలనీ ప్రాంతాల్లో వీధులన్నీ చెరువులని తలపించేలా నీటితో నిండిపోయాయి.ఇళ్లలోనుండి బయటక్ రావాలంటే నరకయాతన పడ్డమంటున్న ప్రజలు.మున్సిపల్ కమీషనర్ ఆధ్వర్యంలో శానిటరీ ఇన్స్పెక్టర్, ప్రజారోగ్య శాఖ సిబ్బంది, శానిటరీ సెక్రటరీలు , సిబ్బంది కలిసి నర్సా రావుపేట రోడ్ లోని చప్టా వద్ద క్రేన్ లతో పారిశుధ్యంను తొలగిస్తున్న పనులను పర్యవేక్షణ చేశారు. ఎక్కడికక్కడ డ్రైనేజ్ లకు అడ్డంలేకుండా పారిశుధ్య సిబ్బంది చెత్తను తొలగించారు. ఏదిఏమైనా ఆక్రమణలు, ఇష్టా రాజ్యంగా కట్టిన కాల్వలు ఎక్కడికక్కడ నీరుపోయే మార్గం లేక ఇలాంటి సమస్యలు వస్తూ, పేద ప్రజలకు ఇలాంటి సమస్యలు వస్తున్నాయని, అధికారులు ఇలాంటి వాటిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి ఆక్రమణ్లు తొలగించేలా చూడాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు



## సత్తెనపల్లిలో భారీ వర్షం జలమయం అయిన శాలివాహన నగర్ శివారు నాగన్న గుంట లోతట్టు ప్రాంతాలు

సత్తెనపల్లి, జూన్ 13, ప్రభాతవార్త: సత్తెనపల్లి పట్టణం లో శనివారం తెల్లవారుజామున 4 గంటల నుండి కురిసిన భారీ వర్షానికి 17 వార్డ్ కుమ్మరి పాలెం శివారు సాయి భాస్కర్ నగర్ లో ఉన్న వాగు పొంగి వర్షపు నీరు కాలనీలో ఉన్న ఇళ్ల మధ్యలో చేరాయి. నాగన్న గుంట ఏరియాలో కూడా ఇళ్లల్లోకి నీరు చేరి ఇబ్బంది పడుతున్న ప్రజలు దీంతో మున్సిపల్ అధికారులు స్పందించి వాగు పూడిక తీయించి ఇళ్లలోకి వరద నీరు రాకుండా చేయాలనీ కాలనీ ప్రజలు కోరుతున్నారు.



## నిస్వార్థ సేవకు నిదర్శనం.... సత్తెనపల్లిలో సేవా యజ్ఞం!

సత్తెనపల్లి, జూన్ 13, ప్రభాతవార్త: అమెరికాలో స్థిరపడినా తమ మాతృభూమిపై మమకారంతో, పేద ప్రజల ఆకలి తీర్చడమే లక్ష్యంగా గుండవరపు అనిల్ కుమార్ జయశ్రీ దంపతులు నిర్వహిస్తున్న సేవా కార్యక్రమం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకం. దివంగత గుండవరపు వెంకటరావు గారి స్మరణార్థం, పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని ప్రముఖ సామాజిక సేవకుడు గంజి వీరాస్వామి నివాసం వేదికగా ఈ కార్యక్రమం అత్యంత ఘనంగా జరిగింది. గుండవరపు వెంకటరావు జ్ఞాపకార్థం 47 నిరుపేద కుటుంబాలకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. గత ఏడాది 20 కుటుంబాలతో ప్రారంభమైన ఈ సేవ, నేడు 47 కుటుంబాలకు విస్తరించడం విశేషం. కార్యక్రమానికి విచ్చేసిన ప్రతి ఒక్కరికీ స్నాక్స్ అందజేశారు.



**చిరంజీవి అభిరామ్ పుట్టినరోజు వేడుకలు :** గుండవరపు అనిల్ జయ దంపతుల కుమారుడు అభిరామ్ పుట్టినరోజు సందర్భంగా ఈ క్రింది సేవా కార్యక్రమాలు నిర్వహించారు.50 మంది పిల్లలకు చాక్లెట్లు, బిస్కెట్లు, మరియు శనగ ఉండల ప్యాకెట్ల పంపిణీచేశారు. పలువురు దాతలు ఉదారత చాటుకున్నారు. సభాధ్యక్షులు కట్టా శివ దుర్గారావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. పిన్నమనేని పాములయ్య ,గద్దె చలమయ్య ,పోతుగంటి రామకోటేశ్వరరావు (రెడ్ క్రాస్ వైస్ ప్రెసిడెంట్) గంగూరు కళ్యాణ్ ,విద్య ,షేక్ సైదా మాస్టర్ ,వంగర శ్రీనివాసరావు ,కుర్నేళ్ల మహేశ్వర రావు, ఉప్పల సుజాత ,మరియు స్థానిక పెద్దలు, సామాజిక సేవకులు గంజి వీరాస్వామి పాల్గొన్నారు.

## బిఎల్ఓస్‌కు అవగాహన

సత్తెనపల్లి, జూన్ 13, ప్రభాతవార్త: స్పెషల్ క్యాంపెయిన్ డే పురస్కరించుకుని రెవెన్యూ డివిజనల్ అధికారి మరియు సత్తెనపల్లి తహసిల్దారు హోలీ ఫ్యామిలీ స్కూల్ నందు పోలింగ్ స్టేషన్స్ వద్ద బిఎల్ఓస్‌కు మాపింగ్ గురించి వివరాలు తెలిపి ప్రతి బిఎల్ఓ కూడా సాధ్యమైనంతవరకు ఎక్కువగా ఓటర్లను మ్యాపింగ్ చేయవలసిందిగా ఆదేశించడం జరిగినది.



## రొంపిచర్ల లో మూడున్నర లక్షల విలువైన నగదు, బంగారం చోరీ

రొంపిచర్ల, జూన్ 13 ప్రభాతవార్త : మండల కేంద్రమైన రొంపిచర్లలో గల ఓ ఇంట్లో దొంగతనం జరిగిన సంఘటన శనివారం వెలుగులోకి వచ్చింది.ఈ సంఘటనలో ఆ ఇంట్లో నాలుగు లక్షల రూపాయల విలువైన సొత్తు చోరీ జరిగింది.దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.తెనాలి కి చెందిన బడిగుంచాల విజయ్ కుమార్ రెండు సంవత్సరాల క్రితం గ్రామానికి వచ్చి స్థానిక హైవే రోడ్డు సమీపంలో సాయిబాబా ఆలయం ప్రక్కన గల స్థలాన్ని అద్దెకు తీసుకుని ఇల్లు నిర్మించుకుని,వ్యాపారం చేసుకుంటూ జీవిస్తున్నారు.ఈ క్రమంలో రెండు రోజుల క్రితం ఇంటికి తాళం వేసి, కుటుంబ సభ్యులతో తన స్వగ్రామానికి వెళ్ళారు.ఇంటిలో ఎవరూ లేరని తెలుసుకున్న దొంగలు ఇంటి తాళం పగులగొట్టి, రాత్రి వేళల్లో ఇంట్లోకి ప్రవేశించి,లోపల బీరువాను పలుగుతో పగులగొట్టి, అందులో ఉన్న లక్ష రూపాయలు నగదు, మూడున్నర సవర్ల బంగారమును తీసుకుని వెళ్ళారు.తన స్వగ్రామం నుండి ఇంటికి వచ్చిన విజయ్ కుమార్ ఇంటి తాళం పగులగొట్టి, ఇంట్లోకి బీరువా తెరిచి, వస్తువులు,బట్టలు చిందరవందరగా పడి ఉండటాన్ని చూసి దొంగతనం జరిగినట్లు గుర్తించారు.తన ఇంట్లో జరిగిన దొంగతనంలో మూడున్నర సవర్ల బంగారము,లక్ష రూపాయల నగదు చోరికి గురైందని బాధితుడు విజయ్ కుమార్ తెలిపారు.సుమారు నాలుగు లక్షల రూపాయలు విలువకల సొత్తు చోరికి గురైందని బాధితుడు తెలిపారు.అనంతరం పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయగా పోలీసులు, క్లూస్ టీం సభ్యులు వచ్చి సంఘటన స్థలాన్ని పరిశీలించారు.నిత్యం జన సంచారం, సమీపంలో హైవే రోడ్డు పై ఎప్పుడూ వాహనాల తిరిగే ప్రదేశంలో దొంగతనం జరగటం చర్చనీయాంశంగా మారింది.ఈ మేరకు బాధితుడు విజయ్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లోకేశ్వరరావు తెలిపారు.

## డా.సాయి ప్రకాష్‌కు దీనమ్మ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ సత్కారం

రాజుపాలెం, జూన్ 13, ప్రభాతవార్త: దీనమ్మ అండ్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అనాధ పిల్లల వృద్ధుల ఆశ్రమ చైర్మన్ గరికిపాటి శంకర్రావు ఈ మధ్యకాలంలో బ్రెయిన్ స్ట్రోక్ కి గురైనారు. శంకర్రావు కివైద్య సేవలు అందించి వైద్య పరంగా సహాయ సహకారాలు అందించిన డాక్టర్ సాయి ప్రకాష్ గారిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆశ్రమంలో ఉన్న చిన్నారులకు ఆయన చేతుల మీదుగా స్కూల్ బ్యాగుల అందజేశారు. వృద్ధులకు చీరలు పంపిణీ చేశారు ఈ సందర్భంగా దీనమ్మ అండ్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ గౌరఅధ్యక్షులు అనిల్ కిరణ్ మాట్లాడుతూ వైద్య పరంగా సాయి ప్ డాక్టర్ సాయి ప్రకాష్ దీనమ్మ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ చైర్మన్ గరికిపాటి శంకర కి డాక్టర్ చేసిన సేవలు మరో లేవని ఆయన ఈ సందర్భంగా తెలిపారు ఈ సందర్భంగా డాక్టర్ సాయి ప్రకాష్ కి పూలమాలతో శాలువాలతో ఘనంగా సత్కరించారు.



## యోగ పై అవగాహన కార్యక్రమం

నగరం, జూన్ 13, ప్రభాత వార్త: యోగాతో శరీరం ,మనసు రెండిటికీ ఎన్నో రకమైన అద్భుతాలు జరుగుతాయని నగరం ఆయుర్వేద వైద్యురాలు డాక్టర్ మాధురి అన్నారు. శనివారం నగరం మండలంలోని బడేవారిపాలెంలో యోగాంధ్రా 2026 లో భాగంగా యోగ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ యోగాని నేర్చుకోవాలని యోగాతో మానసిక ఆందోళన తగ్గుతుందని దీనివల్ల అనేక రోగాలను జయించవచ్చు అని తెలియజేశారు. ప్రస్తుతం ఉన్న బిజీ జీవితంలో యోగాతో ప్రశాంతత కలుగుతుందని, క్రమం తప్పకుండా యోగా చేయడం వల్ల రక్తపోటు అదుపులో ఉంచుకోవచ్చు అని తెలియజేశారు. ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం పరుచుకుని యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొనాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రేమ్ చంద్ర, యోగా ఇన్స్ట్రక్టర్ ఉప్పు సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

## ట్రిబుల్ ఐటీకి ఎంపికైన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు

వట్టిచెరుకూరు, జూన్ 13, ప్రభాతవార్త: మండల పరిధిలోని గారపాడు, పల్లపాడు, వట్టిచెరుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గత విద్యా సంవత్సరం 10వ తరగతి పరీక్షల్లో ప్రతిభ చూపిన ముగ్గురు విద్యార్థులు ఒంగోలు ట్రిపుల్ ఐటీలో ప్రవేశానికి ఎంపిక కావడం ఆ పాఠశాలలకు గర్వకారణమని ఎంఈఓలు నిర్మల, సత్యనారాయణమూర్తి, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఎం.హనుమంతరావు, ఎం.శ్రీలత, కె.శాంతమ్మ శనివారం తెలిపారు. పదో తరగతిలో 575 మార్కులతో ఉత్తీర్ణత సాధించిన గారపాడు జడ్పీ పాఠశాల విద్యార్థిని షేక్ నసీమా, 571మార్కులతో ప్రతిభ చూపిన పల్లపాడు జడ్పీ పాఠశాల విద్యార్థి కొర్రపాటి సాయి నరసింహ, 570మార్కులతో ఉత్తీర్ణత పొందిన వట్టిచెరుకూరు జడ్పీ పాఠశాల విద్యార్థి కాకుమాను యశ్వంత్ రత్న, 572 మార్కులు సాధించిన కొర్నెపాడు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని బత్తుల హారిక ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎంఈఓలు, హెచ్ఎంలు మాట్లాడుతూ..విద్యార్థులను అభినందించి, వారి కృషి, పట్టుదల, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం వల్ల ఈ విజయం సాధ్యమైందని, భవిష్యత్తులో కూడా ఉన్నత లక్ష్యాలను సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు ప్రఖ్యాతలను సాధించాలని ఆకాంక్షించారు. పాఠశాల ఉపాధ్యాయ బృందం విద్యార్థులను ప్రశంసిస్తూ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపింది. ఈ విజయం పాఠశాలలో చదువుతున్న ఇతర విద్యార్థులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. విద్యార్థుల ఈ అద్భుత విజయంపై తల్లిదండ్రులు, గ్రామస్థులు హర్షం వ్యక్తంచేస్తూ అభినందనలు తెలిపారు.

## అంతర్రాష్ట్ర దొంగను అరెస్ట్ చేసిన తెనాలి రూరల్ పోలీసులు

తెనాలి జూన్13(ప్రభాతవార్త): ఇళ్లల్లో చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర నిందితుడు అరెస్ట్ చేసిన తెనాలి రూరల్ పోలీసులు.గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశాల మేరకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన ఏఐ సాంకేతిక వ్యవస్థను సమర్థవంతంగా వినియోగించి, హౌస్ చోరీకి గురైన నగదు రికవరీ చేయడంతో పాటు నిందితుడిని అరెస్టు చేశారు.శనివారం రూరల్ సీఐ కార్యాలయంలో,సీఐ నాయబ్ రసూల్ విలేకరుల సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు.

తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లాలోని మాదిరి మండలం మడుపల్లి గ్రామానికి చెందిన, బండి గోపి (తండ్రి: శ్రీనివాసరావు ) అనే వ్యక్తి జూన్ 9వ తేదీ ఉదయం సుమారు 11:50 గంటల సమయంలో నిందితుడు తెనాలి మండలం హాఫ్‌పేట గ్రామంలోని ఓ ఇంటిలో చొరబడి రూ.25,000 నగదు చోరీ చేసి స్విఫ్ట్ డిజైర్ కారులో వెళ్లిపోయినాడు, పిర్యాది అదే రోజు తెనాలి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా,ఎస్సై కే.ఆనంద్ కేసు నమోదు చేశారు.తెనాలి రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎస్.కే. నాయబ్ రసూల్ పర్యవేక్షణలో నిందితులు వెళ్లిన రూట్ లో సీసీ కెమెరాలు పరిశీలించి నిందితుడు వాడిన షిఫ్ట్ కార్ నెంబర్ను ట్రేస్ చేసి వాటి వివరాలను, వాహన వివరాలను, ఫొటోలను ఏఐ సాంకేతికత ఆధారంగా,సదరు కారు విజయవాడ నుండి తెనాలి పైపు వస్తున్నట్లు తెలుసుకుని ఆ వాహనాన్ని శనివారం ఉదయం 11 గంటల సమయంలో నందివేలుగు జంక్షన్ వద్ద నిందితుని పట్టుకోవటం జరిగినదని, నిందితుని వద్ద నుండి దొంగతనం చేయటానికి ఉపయేగించిన షిఫ్టిజైర్ కారు ను మరియు 5000/ డబ్బులను స్వాధీనపర్చుకున్నామని సీఐ నాయబ్ రసూల్ తెలిపారు.




ఈ సందర్భంగా ఇంటర్నెట్ ఆర్గనైజ్ ఏఐ సీసీటీవీ 360 యాప్ ద్వారా పలు కేసుల్లో పరారీలో ఉన్న నేరస్తులు, మిస్సింగ్ వ్యక్తులు మరియు చోరీకి గురైన వాహనాలను వేగంగా గుర్తించి, వాటిని ట్రేస్ చేయడంలో సాంకేతిక పరిజ్ఞానం కీలక పాత్ర పోషిస్తోందని పోలీసులు తెలిపారు.ఫిర్యాదు అందిన సకాలంలో స్పందించి, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి దొంగతనం చేసిన నిందితుని పట్టుకుని అరెస్ట్ చేసిన తెనాలి రూరల్ ఎస్ఐ కె.ఆనంద్ ని, సహకరించిన పోలీస్ సిబ్బందిని, వారికి దిశ నిర్దేశం చేసిన తెనాలి రూరల్ సీఐ నాయబ్ రసూల్ ని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ అభినందించారు. నిందితుని నేర చరిత్ర గమనిస్తే,తెలంగాణ రాష్ట్రం లోని కల్లూరు పోలీస్ స్టేషన్లో 1 కేసు,మధిర పట్టణ పోలీస్ స్టేషన్లో 6 కేసులు, బేకులపల్లి లో 1 కేసు, మరియిచో లో 1 కేసు మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కృష్ణ జిల్లా లో 2 కేసులు ప్రస్తుతం కోర్టు నందు విచారణలో ఉన్నాయని,ఇవి కాక కోర్టులో కొట్టివేసిన కేసులు 20 వరకు ఉన్నాయని సీఐ తెలిపారు.

## సంస్కరణల పేరుతో పురసేవలను ప్రైవేట్ పరం చేయటం అడ్డుకుంటాంసిపిఎం

తెనాలి జూన్13(ప్రభాతవార్త): సంస్కరణల పేరుతో పుర సేవలను ప్రైవేట్ సంస్థలకు కట్టబెట్టేవాన్ని ప్రజలు సమైక్యంగా అడ్డుకోవాలని సిపిఎం పార్టీ నాయకులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.శనివారం పట్టణంలోని చెంచుపేట ప్రజాసంఘాల కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో, సిపిఎం పట్టణ కార్యదర్శి కే. బాబు ప్రసాద్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం జీఓ నెం :975 మరియు 673 ద్వారా రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీలు,నగర పంచాయతీలు,కార్పొరేషన్ లలో 14,రకాల కీలక విభాగాలను ప్రైవేట్ పరం చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి అని చెప్పారు. రోడ్లు,మంచినీరు, పారిశుధ్యం,వీధిలైట్లు,ప్రైవేట్ వ్యక్తులకు ధారాదత్తం చేయటకు నిర్ణయం తీసుకున్నారు అని చెప్పారు. వీటికి తోడు ఇప్పుడు ఉచితంగా లభించే పుర సేవలను కూడా యూజర్ చార్జీలు వసూలు చేసుకునేందుకు ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించడం జరుగుతుందన్నారు. మున్సిపాలిటీలకు చెందిన ఆస్తులు బస్ స్టేషన్ లు, స్టేడియంలు,కమ్యూనిటీ కాంప్లెక్స్ లు భవనాలు కూడా ప్రైవేట్ పరం కాబోయే పరిస్థితి ఏర్పడింది అని చెప్పారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలు యొక్కువ శాతం పరిష్కారం కావడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు.నేటిటీరకాయ లో నేయి యింటి పీజీఆర్ఎస్ లో సమస్యలు పరిష్కారం కాకుండా ఉంటే పునాది అన్నారు. ఆక్టర్ కూర్పోషటానికి కూడా అవకాశం కల్పించడం లేదని అన్నారు. ప్రజలను సంతృప్తి పరిచే విధంగా మాటలు కూడా కరువు అయిపోయాయని చెప్పారు. తెనాలి పట్టణంలోని చెంచు పేట 28,వ వార్డ్ లో 500 అడుగుల నిడివి లింకు రోడ్డు కొరకు గత రెండు సంవత్సరాలుగా డజన్ పైగా అర్జీలు ఇచ్చినా నేటికీ రోడ్డు వేయలేదు అని చెప్పారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలో 2024,2025 సంవత్సరాలలో 3 అర్జీలు, మున్సిపల్ కమిషనర్ కార్యాలయంలో 6అర్జీలు, జిల్లా కలెక్టర్ కార్యాలయంలో రెండు అర్జీలు ఇచ్చినా, కనీసం గుప్పెడు మట్టి కూడా వేయలేదు అని చెప్పారు. వర్షం నీరు నిల్వ ఉండి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా అధికారులకు జాలి,సానుభూతి లేవని బాధను వ్యక్తం చేశారు. భార్యత,జవాబు దారి విధానం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తంచేశారు. పన్నులు చెల్లించే సీనియర్ సిటిజెన్ల పట్ల గౌరవం, మర్యాద లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రజలు అసోసియేషన్ లు పెట్టుకుని సమిష్టిగా కదలాలని ప్రభుత్వ నిర్ణయాలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ పోరాటాలు చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు షేక్.హుస్సేన్ వలి పాల్గొన్నారు.

## తెనాలి తెదేపా కార్యాలయంలో సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

తెనాలి మున్సిపాలిటీ జూన్13(ప్రభాతవార్త): మానవత్వమే ధ్యేయంగా ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా తెనాలి నియోజకవర్గంలోని ఐదుగురు నిరుపేద వైద్య చికిత్స కోసం రూ.6,73,516/ మంజూరైంది. ఈ మొత్తానికి సంబంధించిన చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. తెనాలి నియోజకవర్గ టీడీపీ ఇన్చార్జ్, మాజీ మంత్రి, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ చొరవ, ప్రత్యేక సహకారంతో ముఖ్యమంత్రి సహాయనిధి లెటర్ ఆఫ్ క్రెడిట్ నుంచి ఈ ఆర్థిక సహాయం మంజూరైనట్లు తెలుగుదేశం పార్టీ నాయకులు తెలిపారు. లబ్ధిదారుల వివరాలు,కళ్యగుంట (శ్రీలక్ష్మి,రేపల్లె నాగేంద్ర,ఏమినేని శ్రీహర్ష,పఠాన్ మహేర్మా,గంగాధర సాయి శివరావు లకు సిఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. మొత్తం రూ.7,73,516/ విలువైన చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఆపద సమయంలో ఆదుకున్నందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి, ప్రజల కోసం నిరంతరం కృషి చేస్తున్న ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ కి బాధిత కుటుంబ సభ్యులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో తెనాలి పట్టణ పార్టీ అధ్యక్షుడు మహమ్మద్ ఖుద్దూస్, జొన్నాదుల మహేష్, మల్లవరపు విజయ్, విస్సర్ల భరత్, పావులు సయ్యద్, ఫణిదపు దుర్గ, జాఫర్, కన్నయ్య, పూర్ణ తదితరులు పాల్గొన్నారు.



## బీసీలకు 34 శాతం స్థానిక రిజర్వేషన్లు అమలవ్వాలన్నా సుప్రీం 50 శాతం పరిమితి ఎత్తేయించాల్సిందే : కేసన శంకరరావు

తాడేపల్లి, జూన్ 13, ప్రభాతవార్త: రాష్ట్ర ఎన్డీఏ కూటమి ప్రభుత్వ ఎన్నికల వాగ్దానం స్థానిక సంస్థల ఎన్నికలకు 34 శాతం రిజర్వేషన్లు అమలు జరగాలన్నా సుప్రీంకోర్టు 50 శాతం పరిమితి ఎత్తేయించాల్సే ఉందని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు అన్నారు. సుప్రీం కోర్టు నిబంధన అసంబద్ధమైనదే గాకరాజ్యాంగ విరుద్ధమంటూ రాష్ట్ర కార్యాలయంలో "స్థానిక సంస్థల రిజర్వేషన్లు సుప్రీంకోర్టు 50 శాతం పరిమితి" అనే అంశంపై జరిగిన సమావేశంలో కేసన శంకర్రావు మాట్లాడుతూ ఇంకా వారు అగ్రవర్ణ పేదలకంటూ ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల పేరిట10 శాతమిచ్చినప్పుడే, మొత్తం రిజర్వేషన్లు 50 శాతం మించిపోయాయన్నారు. అప్పుడులేని అభ్యంతరం బీసీలకు స్థానిక సంస్థలలో జనాభా దామాషా మేరకు రిజర్వేషన్లు రాష్ట్ర ప్రభుత్వాలు పెంచుతున్నప్పుడే 50 శాతం మించిపోయాయని కొట్టేయడం ఎంతవరకు ధర్మమో?..న్యాయవ్యవస్థ మొత్తం పునఃసమీక్షించుకోవాలన్నారు. వాస్తవంగా అగ్రకులాలలో పేదలు మూడు నాలుగు శాతం మించి ఉండరని, వారు ఎప్పుడూ రోడ్డెక్కి అడగకుండానే వారికి 10 శాతం రిజర్వేషన్లు ఇచ్చారన్నారు. అలాంటప్పుడు జనాభాలో 52 శాతంగా ఉన్న బీసీలకు వారి జనాభా దామాషా మేరకు రిజర్వేషన్లు ఇవ్వడం న్యాయబద్ధం కాదా?..అని రాజకీయన్యాయ వ్యవస్థలను సూటిగా ప్రశ్నించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆ మొత్తం ప్రక్రియను కేంద్ర ప్రభుత్వంచే పూర్తి చేయించి చరిత్ర పుటలలో శాశ్వతంగా నిలిచిపోవాలని ఓబీసీ సమాజం ఆకాంక్షిస్తుందన్నారు.. ఇంకా ఈ మీడియా సమావేశంలో రాష్ట్ర యువజన అధ్యక్షులు పారేపల్లి మహేష్, జిల్లా నాయకులు సైదా, ధనుంజయ్ రావు, మంగళగిరి పట్టణ అధ్యక్షులు జొన్నాదుల వెంకటకృష్ణ, ఈశ్వర్, దా నా గౌడ్ పలువురు బీసీ నాయకులు పాల్గొని ప్రసంగించారు.



## హెల్మెట్..సీట్ బెల్ట్ తప్పనిసరి -ఎస్ఐ ప్రసాద్

కొల్లిపర,జూన్ 13 ప్రభాతవార్త: ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ పెట్టుకోవాలని చెబుతూ కారునడిపే వారు కూడా సీట్ బెల్ట్ దరించాలని ఎస్ఐ ప్రసాద్ అన్నారు.శనివారం మండల పరిధిలోని దావులూరు... అత్తోట.. శివలూరు తదితర గ్రామాల్లో ఎస్ఐ తన సిబ్బందితో కలసి వాహనాలను తనిఖీ చేసారు.ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ యువకులు మితిమీరిన వేగంతో వాహనాలను నడిపి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని హితవు పలికారు.ప్రతి వాహనానికి నెంబర్ ప్లేట్ తప్పనిసరిగా కనిపించే విధంగా అమర్చాలన్నారు.నిబంధనలు ఉల్లఘించరాదని..మద్యం సేవించి వాహనం నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.రోడ్డు ప్రమాదాలు అరికట్టేందుకే నిరంతర తనిఖీలు చేస్తున్నామన్నారు.మైనర్లు ఏ ద్విచక్రవాహనం అయినా నడిపినా వాహన యజమానులతో పాటు వారి తల్లిదండ్రులపై కేసు నమోదు చేయటం జరుగుతుందని ఎస్ఐ ప్రసాద్ హెచ్చరించారు.



## విద్యార్థులకు ట్రిపుల్ ఐటీ సీట్లు






కొల్లిపర,జూన్ 13 ప్రభాతవార్త: మండల పరిధిలోని అత్తోట,మున్నంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10 వ తరగతిలో విద్యనభ్యసించిన 5 గరు విద్యార్థులకు ట్రిపుల్ ఐటీలో స్థానం దక్కిందని ఎంఈవో కె.ఝాన్సి లత అన్నారు.శనివారం స్థానిక విద్యావనరుల కేంద్రంలో జరిగిన సమావేశంలో ఝాన్సి లత మాట్లాడుతూ మండలంలో అత్తోట హైస్కూల్లో అక్షయరమ్య,టి.హెబ్సి బా,వై.యోగాశ్రీ లకు ఇడుపులపాయలో జె.వినేష్‌కుమార్‌కు ఓ ంగోలులో మున్నంగి హైస్కూల్లో కె.యమునశ్రీకు నూజివీడులో ట్రిపుల్ ఐటీ సీట్లు వచ్చినట్లు ఎంఈవో తెలిపారు.

## చర్మకారులకు ఇండ్ల స్థలాలు ఇచ్చి ఆదుకోవాలి

కొల్లిపర,జూన్ 13 ప్రభాతవార్త: ఇంటి స్థలం లేక ఇబ్బ ందులు పడుతున్న చర్మకారులకు స్థలాలు ఇచ్చి కూటమి ప్రభుత్వం ఆదుకోవాలని చర్మకార సేవా సంఘం మండల అధ్యక్షుడు అశోక్‌కుమార్ అన్నారు.శనివారం మండల కేంద్రం కొల్లిపరలో ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరుతూ చర్మకార సేవా సంఘం నాయకులు నిరసన వ్యక్తం చేసారు.ఈ సందర్భంగా అశోక్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం సబ్సిడీపై బ్యాంకు రుణాలు ఇప్పించాలని ..చర్మకారులకు పించన్ సౌకర్యం కల్పించాలని కోరారు.కార్యక్రమంలో చర్మకార సేవా సంఘు: ఉపాధ్యక్షుడు సిద్దెల కోటేశ్వరరావు,కార్యదర్శి వందిపాటి ఏసురత్నం,నాయకులు దావీదు,శ్యామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.




## చెరువు అధునీకరించి నీటి సామర్థ్యాన్ని పెంచాలి ..ఆయకట్టు రైతులు అభ్యర్ధన

యడ్లపాడు, జూన్ 13, ప్రభాతవార్త : గత కొన్ని సంవత్సరాలనుండి తీవ్ర వర్షా బావ పరిస్థితులు నెలకొని రైతాంగం ఇబ్బందులు పడుతున్నారు. రెండు మేజర్ కాలువలు ఉండి కూడా చుక్కనీరు దిగువకు రాకపోవటం ఒక టైతే అయకట్టుక్రింద ఉన్న మాగాణి రైతుల పరిస్తితి మరోవింతగా తమారైంది. ఇదే సమస్యలకు గురైన మండలంలోని వంకాయలపాడు గ్రామ రైతుల పరిస్తితి. మండల పరిధిలోని వంకాయలపాడు గ్రామంలోని చెరువు విస్తీర్ణం 30 ఎకరాలు, సాగు భూమి సుమారు 60ఎకరాల వరకు ఉంది. అయితే కొన్ని సంవత్సరాలుగా అయకట్టు చెరువులో సరిపడా నీరులేక భూములు సాగుచేయలేకపోయామని, అయితే నేడు ఋతుపవనాలు అశాజనకంగా ఉంటాయన్న అశ రైతులలో నెలకొన్నదని, సరిపడా వర్షాలు పడితే సంబంధిత చెరువులో నీటి సమార్థ్యం సరిపడా నిల్వ ఉండే అవకాశాలు కనపడటం లేదని, చెరవు నిండా పిచ్చికంపతో నిండి పోవటంతో నీటి సమార్థ్యం తగ్గుతుందని, కావున మైనర్ ఇరిగేషన్ అధికారులు చొరవచూపి సకాలంలో చెవరు అధునీకరించాలని స్థానిక రైతులు కోరుతున్నారు. గడచిన కొన్ని సవంత్సరాల నుండి తిండి గింజలు, పశులకు మేత లేకపోవటంతో కొనుగోలు చేయక తప్పటం లేదని, ఈ ఏడాదన్నా వర్షాలు సకాలంలో పడితే చెరువుకు నీరు చేరితే సకాలంలో వరినాట్లు వేసుకోవాలన్న అశతో ఎదురుచూస్తున్నామని వారంటున్నారు. అధికారులు చొరవచూపాలని కోరుతున్నారు.



## సమగ్ర యాజమాన్య పద్దతులు అవలంభిస్తే అధిక లాభాలు సాధించవచ్చు

యడ్లపాడు, జూన్ 13, ప్రభాతవార్త : మండల పరిధిలోని అన్ని గ్రామాలలో అధికంగా పండించే పంట ప్రత్తి. ఇందులో సమగ్ర యాజమాన్య పద్దతులు అవలంభిస్తే అధిక లాభాలు సాధించవచ్చునని శాస్త్రవేత్తలు తెలుపుతున్నారు. అయితే ప్రత్తి పంటను దాదాపు అన్ని రకాల భూములలో సాగుచేయవచ్చేనని, మనరాష్ట్రంలో 80శాతం పైగా వర్షాధారంగాను, 20శాతం ఒకటి లేక రెండు తడులతో సాగుచేస్తున్నారని, ప్రత్తికి నేలలో 6.5 నుండి 7.5ఉదజని సూచిక వుంటే మంచిదని, కొంచెము ఎక్కువైనా పరవాలేదని, కాని ఉదజని సూచిక 5.5కు తగ్గివున్న అమ్ల భరిత భూముల్లో దిగుబడులు సరిగ్గారావని అంటున్నారు.



..ప్రత్తి పండించే పరిస్థితులు : ముఖ్యంగా నాలుగు రకాల పరిస్థితులలో ప్రత్తి పండించుచున్నారని, ఇందులో ఎర్రనేలల్లో వర్షాధారంగా, తేలికపాటి నల్ల భూముల్లో వర్షాధారంగాను, నల్లరేగడి భూముల్లో వర్షాధారంగాను, నల్లరేగడి భూముల్లో అరుతడి పంటగాను పండించుతున్నారని అన్నారు.

**..అనువైన రకాల ఎంపిక ముఖ్యం :** వర్షాధారం క్రింద తక్కువ కాలపరిమితి గల రకాలను ఎన్నుకోవటం ముఖ్యం. వర్షాధరం క్రింద నల్లరేగడి పొలాల్లో మధ్యకాలిక రకాలు, నీటిపారుదల క్రింద అధిక దిగుబడులివ్వగల దీర్ఘకాలిక రకాలయిననూ సాగుచేయవచ్చునన్నారు. రకాన్ని ఎన్నుకొనేటప్పుడు కాలపరిమితితోపాటు ముఖ్యంగా దిగుబడి సమర్థత, మొక్క పెరుగదల, ఎత్తు, పుష్పించటానికి పట్టేసమయం, అకుపై నూగుసాంద్ర, నాణ్యత పరిగణనలోకి తసుకోవాలని, విత్తనాన్ని నమ్మకమైన వ్యాపారసంస్థ నుండి కొనుగోలు చేసుకోవాలని సూచించుతున్నారు.

**..దుక్కి తయారు చేయటం :** భూమిని వేసవికాలములో నాగళ్లతో దుక్కిదున్ని, అ తరువాత రెండుమూడు సార్లు ట్రాక్టరు గొర్రుతో దున్నిన ఎడల భూమిలో ప్యూపాదశలో ఉన్న పురుగులు చనిపోతాయని, అధిక తేమను నిల్వ చేసుకొనుటకు ఉపయోగపడుతుందని అన్నారు. నేల చదరముగా లేనిచోట గుంటకు తోలి చక్కగా చదును చేయవలెనని, అ పిమ్మట సాళ్ళుతోలుకోవాలని అన్నారు. ఈ విధానము చేసుకుంటే విత్తనము చక్కగా మొలకెత్తుతుందన్నారు. అదే అరుతడి పంటగా తీసుకనే పక్షంలో బోదెలు వేసుకొని విత్తనం నాటుకోవల్సి ఉంటుందని అంటున్నారు.

**..నాటు సమయం :** అంధ్రా ప్రాతంలో జులై రెండవ పక్షం నుండి అగస్టు రెండవ పక్షం వరకు అవకాశం ఉంటుందన్నారు.

**..విత్తన మోతాదు :** ఎకరాకు 800నుండి900గ్రాములు బి.టి ప్రత్తి విత్తనం, బి.టి లేని ప్రత్తి విత్తనం 24గ్రాములు ఎకరం చుట్టూ నాటాలని తెలుపుతూన్నరు. పడిపాదులు వేయుట : విత్తిన పది రోజుల లోపు మొలకెత్తని చోటు మరలా విత్తుకోవాలి. మామూలు రకాలను కుదురుకు రెండు మొక్కలు ఉంచి మిగిలిన వాటిని మూడు వారాలలోపు పీకి వేసుకోవాలి.

..ఎదసేద్యం : పైరుతోపాటు కలుపు పెరుగుతుంది. కావున 3 నుండి 4 సార్లు గొర్రు మరియు గుంటకలను తోలి కలుపునుచ నివారించుకోవాలి. కలుపు ఎక్కువగా ఉన్నచోట్ల సేద్యపు పద్దుతులు, కూలీల ద్వారా కలుపుతీయటం వీలు కాని చోట లేక లాభదాయకం కాని చోట్ల రసాయనాల ద్వారా కలుపును నివారించవచ్చునన్నారు.

..రైతు సేవా కేంద్రాలు : రైతు మోస పోకుండా ఉండాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా రైతు సేవాకేంద్రాలను తీసుకు వచ్చింది. వీటి కారణంగా రైతుకు భరోసాతో కూడిన విత్తనం, ఎరువులు, పురుగు మందులు, గిట్టుబాటు ధరలు, రైతుకు పంటలో కావల్సిన మెళకువలు వంటి అనే అంశాలను దీనిలో చేకూర్చారు.

## వైకాపా మంగళగిరి పట్టణ బూత్ లెవెల్ ఏజెంట్స్ సమావేశం

మంగళగిరి, జూన్ 13, ప్రభాతవార్త: మంగళగిరి నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం మంగళగిరి పట్టణ బూత్ లెవెల్ ఏజెంట్స్ ముఖ్య సమావేశం ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి నాయకత్వంలో ఈ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య నాయకులు బూత్ లెవెల్ ఏజెంట్స్, ఎన్నికల ప్రక్రియలో పార్టీ బలోపేతంలో పోషించాల్సిన కీలక పాత్ర గురించి, వారు చేయవలసిన పనుల గురించి విస్తృతంగా వివరించారు. దొంతి రెడ్డి వేమారెడ్డి మాట్లాడుతూ బూత్ లెవెల్ ఏజెంట్స్ ఓటర్ల జాబితా పరిశీలన, ప్రతి బూత్ పరిధిలో ఓటర్ల జాబితాను నిరంతరం పరిశీలిస్తూ, కొత్త ఓటర్ల నమోదు, తప్పుల సవరణ, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, రాష్ట్ర ఆప్కో చైర్మన్ ఛిల్లపల్లి మోహనరావు, మంగళగిరి నియోజకవర్గ బూత్ కమిటీ అధ్యక్షులు దర్శి రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.



## డ్రైనేజీ సమస్య పరిష్కరించిన మున్సిపల్ కమీషనర్

తెనాలి మున్సిపాలిటీ జూన్13 (ప్రభాతవార్త): మున్సిపల్ కమిషనర్ రామ అప్పలనాయుడు శనివారం పట్టణం లోని 23వ వార్డు రాజీవ్ గృహ కల్ప అపార్ట్మెంట్స్ సముదాయాల వద్ద జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. అపార్ట్మెంట్స్ ప్రాంతంలో తలెత్తిన డ్రైనేజీ సమస్య పరిష్కారానికి వేస్తున్న డ్రైనేజీ పైప్ లైన్ పనులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. రాజీవ్ గృహకల్ప ప్రాంతానికి సంబంధించిన సెప్టిక్ ట్యాంక్ ను పరిశీలించారు. పనుల నాణ్యతను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సిబ్బందిని ఆదేశించారు. పనులు వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని సూచించారు.కమీషనర్ వెంట అసిస్టెంట్ ఇంజనీర్ సూరిబాబు,శానిటరీ ఇన్స్పెక్టర్ గుమ్మడి ప్రసాద్,పురపాలక సిబ్బంది పాల్గొన్నారు.



## గోగులమూడి పాఠశాల విద్యార్థి మహి ఆఫ్రిన్‌కు నగదు బహుమతులు

పెదనందిపాడు జూన్ 13 (ప్రభాతవార్త): పెదనందిపాడు మండలం గోగులమూడి జడ్పీ పాఠశాలలో మండల స్థాయిలో ప్రథమ స్థానం పొంది మొదటి ర్యాంకు. జిల్లాస్థాయిలో ద్వితీయ స్థానం పొందిన విద్యార్థిని పటాన్ మహి ఆఫ్రిన్ కు. పాఠశాల స్థాయిలో రెండో ర్యాంకు సాధించిన కట్టా వినీల. మూడో ర్యాంకు సాధించిన పటాన్ ఆర్షియ ఆఫ్రిన్. నాలుగో ర్యాంకు సాధించిన కూచిపూడి శిరీష. ఐదో ర్యాంకు సాధించిన శృంగారపు శ్రీ చరణ్ తేజ లకు. ధవి ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ప్రొఫెసర్ డాక్టర్ సి కె రామయ్య నగదు బహుమతులను సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా సీకే రామయ్య విద్యార్థుల గురించి మాట్లాడుతూ యువ ప్రతిభావంతులైన పేద విద్యార్థుల లక్ష్యాలను అంకితభావంతో ఉత్సాహంగా సాధించేలా. పలువురు ప్రముఖుల తో స్థాపించిన ధవి ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్ట్ కృషి చేస్తుందన్నారు. పాఠశాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న ఉపాధ్యాయులకు సి కె రామయ్య కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు. సంఘ సేవకులు గుంటుపల్లి అప్పారావు. వెల్లంకి శివరామ ప్రసాద్. లావు మాధవరావు. ఆ పాఠశాల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు సిబ్బంది పాల్గొన్నారు.



## కెఎల్ యులో ఘనంగా ముగిసిన 10 ఆంధ్రా బెటాలియన్ ఎన్ సిసి 17వ వార్షిక శిక్షణా శిబిరం

. తాడేపల్లి ,జూన్ 13 ,ప్రభాతవార్త: కే ఎల్ విశ్వవిద్యాలయంలో 10(ఎ) బాలికల బెటాలియన్ ఎన్‌సీసీ ఆధ్వర్యంలో పది రోజుల పాటు నిర్వహించిన వార్షిక శిక్షణా శిబిరం (ఎటిసి17) శుక్రవారం విజయవంతంగా ముగిసింది. శిబిర కమాండెంట్ లెఫ్టినెంట్ కల్నల్ ఎస్.వి.ఎస్. సుదర్శన్ నాయకత్వంలో నిర్వహించిన ఈ శిబిరంలో వివిధ కళాశాలలు మరియు పాఠశాలలకు చెందిన ఎన్‌సీసీ క్యాడెట్లు ఉత్సాహంగా పాల్గొన్నారు. శిబిరంలో డ్రిల్, ఆయుధ వినియోగం, ఫైరింగ్ శిక్షణ, నాయకత్వ



వికాసం, వ్యక్తిత్వ వికాస తరగతులు, క్రీడా పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు, క్విజ్ పోటీలు తదితర అంశాలపై ప్రత్యేక శిక్షణ అందించారు. క్యాడెట్లలో క్రమశిక్షణ, జట్టుకృషి, నాయకత్వ లక్షణాలు, దేశభక్తిని పెంపొందించేలా వివిధ కార్యక్రమాలను నిర్వహించారు. విజయవాడ ఎన్‌డిఆర్ఎఫ్ బృందం విపత్తు నిర్వహణ, రక్షణ, సహాయక చర్యలు, అగ్నిమాపక భద్రత, ప్రథమ చికిత్స అంశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే భారత సాయుధ దళాలలో ఉద్యోగ అవకాశాలపై డిప్యూటీ క్యాంప్ కమాండెంట్ మేజర్ అవినాశి పట్వాల్ క్యాడెట్లకు మార్గనిర్దేశం చేశారు. సిబార్ డెంటల్ కాలేజ్ ఆధ్వర్యంలో క్యాడెట్లకు ఉచిత దంత ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. శిబిరం విజయవంతం కావడంలో కేఎల్ విశ్వవిద్యాలయం అందించిన మౌలిక సదుపాయాలు, అధికారులు, ఏఎన్‌వోలు, సీటీఓలు, పీఐ సిబ్బంది, కార్యాలయ సిబ్బంది, పౌర సిబ్బంది చేసిన కృషి విశేషమని శిబిరాధికారులు పేర్కొన్నారు. ముగింపు కార్యక్రమంలో శిబిరంలో ప్రతిభ కనబరిచిన క్యాడెట్లకు బహుమతులు ప్రదానం చేసి అభినందించారు. పది రోజులపాటు సాగిన ఈ శిబిరం క్యాడెట్లకు విలువైన అనుభవాన్ని, జీవిత నైపుణ్యాలను అందించిందని అధికారులు తెలిపారు. శిబిరం విజయవంత నిర్వహణకు అధికారులు, ఏఎన్ఓలు, సీటీఓలు, పీఐ సిబ్బంది, కార్యాలయ సిబ్బంది, పౌర సిబ్బంది అందించిన అంకితభావపూర్వక సేవలు, కృషి విశేషంగా నిలిచాయని శిబిర అధికారులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో వర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారదివర్మ, ప్రో వైస్ చాన్సలర్లు డాక్టర్ ఎన్.వెంకట్ రామ్, డాక్టర్ కె.రాజశేఖరరావు, రిజిస్ట్రార్ డాక్టర్ కె. సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగం ఇంచార్జి డీన్ డాక్టర్ కెఆర్ఎస్.ప్రసాద్, డీన్ సలహాదారు డాక్టర్ హబీబుల్లా ఖాన్, అడ్మిషన్ల డైరెక్టర్ డాక్టర్ జె.శ్రీనివాసరావు, ఎన్ సిసి 10 ఆంధ్రా బాలికల బెటాలియన్ ప్రొఫెసర్ ఇంచార్జి పర్యవేక్షక అధికారి డాక్టర్ శశికళ తదితరులు పాల్గొన్నారు.

## పెదనందిపాడు సోమేశ్వర ఆలయంలో మాస శివరాత్రి శని త్రయోదశి ప్రత్యేక పూజలు.

పెదనందిపాడు జూన్ 13 (ప్రభాతవార్త) పెదనందిపాడు లోని పురాతన దేవాలయం శ్రీ బాలా త్రిపుర సుందరి సమేత శ్రీ సోమేశ్వర స్వామి వారి ఆలయంలో శనివారం మాస శివరాత్రి. శని త్రయోదశి సందర్భంగా గణపతి పూజ అఖండ స్థాపన సోమేశ్వర స్వామి వారికి మహన్యాస పూర్వక ఏకాదశి రుద్రాభిషేకాలు. బాలా త్రిపుర సుందరి అమ్మవారికి లలితా సహస్రనామ కుంకుమార్చన కార్యక్రమాలు. శనీశ్వరుడికి విశేష తైలాభిషేకాలు తదితర ప్రత్యేక పూజ కార్యక్రమాలను ఆలయ ప్రధాన అర్చకులు కొత్తలంక మురళీకృష్ణ ఆధ్వర్యంలో. అర్చక స్వాములు కొండకావూరి సాయి సుబ్రహ్మణ్య రాఘవ శర్మ. కొండవీటి ప్రసాద్ శర్మ లు.కర్తలుకే.ఉమామహేశ్వర రెడ్డిశాంతిదంపతులు.కావ్యసుధసాయి .నిఖిలేష్ రెడ్డి .పవన్ కుమార్, ఎస్ శ్రీనివాసరావు రాధారాణి దంపతులచే కూనిశెట్టి శ్రీనివాసు లక్ష్మీ పద్మజ ల నేత్రత్వంలో అత్యంత వైభవంగా కన్నుల పండుగగా శ్రావణానందంగా నిర్వహించి భక్తుల మెప్పును పొందారు. నిఖిలేష్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా వారి సహకారంతో ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సేవా కార్యక్రమాల్లో భక్త భజన సమాజాల వారు పాల్గొన్నారు.



## బాధిత కుటుంబానికి నాగ మోహన్‌కృష్ణ పరామర్శ



రేపల్లె, జూన్ 13, ప్రభాతవార్త:రేపల్లె మండలంలోని బొబ్బర్లంక గ్రామానికి చెందిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్త,వార్డు సభ్యుడు గుంటూరు ఐజాక్ పిడుగుపాటు కారణంగా మృతి చెందారు.శనివారం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త పీటా నాగ మోహన్‌కృష్ణ బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు.ఐజాక్ పార్థివ దేహాన్ని సందర్శించి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## వేంకటేశ్వర స్వామిని ఆరాధిస్తే సకల శుభాలు...



రేపల్లె, జూన్ 13, ప్రభాతవార్త:కలియుగ ప్రత్యక్ష దైవం వేంకటేశ్వర స్వామిని ఆరాధించే భక్తులకు సకల శుభాలు కలుగుతాయని జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు చెప్పారు.శనివారం రేపల్లె మండలంలోని పోటుమెరక జలార్తమ్మ ఎస్టీ కాలనీలో గల శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగాయి.భక్తులు విష్ణు సహస్రనామ పారాయణం చేశారు.పిరాట్లంక గంగానమ్మ తల్లి భజన భక్త సమాజం ఆధ్వర్యంలో భజన,సంకీర్తన కార్యక్రమాలు జరిగాయి.ఈ సందర్భంగా హేమశంకరరావు మాట్లాడుతూ కలియుగంలో వేంకటాద్రి తిరుమలకు మించిన క్షేత్రం మరొకటి లేదని వేంకటేశ్వర స్వామికి మించిన దైవం లేదన్నారు.అలాంటి దైవాన్ని ఆరాధిస్తే భక్తులకు స్వామివారి కరుణా కటాక్షాలు లభిస్తాయని చెప్పారు.ఈ కార్యక్రమంలో కోటేశ్వరరావు,ఎం.రేణుకస్వామి,జి.నరేష్,యానాది రావు,కాగితాల వాలేశ్వరరావు,చంటి,పూజారి కట్టా మహేష్,భక్తులు పాల్గొన్నారు.

## పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక ప్రచారం

గురజాల, జూన్ 13 ప్రభాతవార్త : సర్ కార్యక్రమంలో భాగంగా మ్యాపింగ్ శాతం తక్కువగా నమోదైన పోలింగ్ కేంద్రాలలో ప్రత్యేక ప్రచార కార్యక్రమాన్ని శనివారం గురజాల శాసనసభ నియోజకవర్గ ఎన్నికల నమోదు అధికారి, ఆర్డీవో మురళీకృష్ణ నిర్వహించారు. గురజాల పట్టణ, గ్రామీణ పరిధిలోని పోలీసు స్టేషన్లు 24,28,29,35,36,37,49,50,51లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సర్ లక్ష్యాలు, విధానాలపై బీఎల్‌వోలు, బీఎల్‌ఏలకు అవగాహన కల్పించారు. మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేయడం, అర్హులైన ఓటరును గుర్తించి నమోదు చేయడం, సమాచార సేకరణలో ఖచ్చితత్వం పాటించడం వంటి అంశాలపై సూచనలు చేశారు. సర్ కార్యక్రమం విజయవంతంగా పూర్తి చేయడానికి అధికారులు, సిబ్బంది, రాజకీయ పార్టీ ప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఆయన వెంట నగర కమిషనర్ శివన్నారాయణ, బీఎల్‌వోలు, బీఎల్ఏలు ఉన్నారు.



## ఆరోగ్య కేంద్రానికి వాచ్‌మెన్ దిక్కాయె!

### సాయంత్రం సమయంలో సిబ్బంది కరవు: ఇబ్బంది పడుతున్న రోగులు

కారంపూడి, జూన్ 13 ప్రభాతవార్త: మండల కేంద్రమైన కారంపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఓ చరిత్ర ఉంది. నిత్యం గర్భిణులు, బాలింతలు, రోగులు వైద్యశాలకు వచ్చి వైద్యసేవలు పొందేవారు. కారంపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి సుమారు 24 గ్రామాల ప్రజలు వచ్చి వైద్యం పొందేవారు. సరైన వైద్యశాలలు లేకపోవడంతో ఆర్ఎంపీ వైద్యులను ఆశ్రయించడం, పిడుగురాళ్ల, నరసరావుపేట పట్టణాలకు వెళ్లి వైద్యం చేయించుకునే పరిస్థితి ఏర్పడింది. పూర్వ వైభవాన్ని ప్రస్తుత సిబ్బంది తీసుకురావడం లేదని విమర్శలు ఉన్నాయి.



సామాన్య, మధ్య తరగతి ప్రజలు ప్రైవేటు వైద్యశాలలకు వెళ్లలేక ప్రభుత్వ వైద్యశాలను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం ప్రభుత్వ వైద్యశాలకు వచ్చే రోగుల కోసం అన్ని సౌకర్యాలు కల్పించినా సిబ్బంది లేకపోవడంతో నిరాశ చెందుతున్నారు. సాయంత్రం 4 గంటలయితే చాలు వైద్యసిబ్బంది కనుచూపు మేరా కూడా కనిపడరని తెలుస్తుంది. వైద్యశాలలో పనిచేస్తున్న వాచ్‌మెన్, స్వీపర్ వైద్యసిబ్బందిలా విధులు నిర్వహిస్తున్న వైనం వెలుచూసింది. అత్యవసరమైన తప్ప వైద్యాధికారి రావడం జరుగుతుంది తప్ప 24 గంటల వైద్యసేవలకు మాత్రం వైద్యశాలలో ఉండరని తెలుస్తుంది. అరకొర సిబ్బందితో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ కరవవడంతో వైద్యసిబ్బంది ఆడింది ఆట.. పాడింది పాటలా మారింది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వైద్యశాలకు సిబ్బందిని ఏర్పాటు చేయాలని, వాచ్‌మెన్, స్వీపర్లకు వైద్యసిబ్బంది చేసే పనులు అప్పగించకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

**వాచ్‌మెన్, స్వీపర్లు వైద్యసేవలు చేయకూడదు: జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ రవి**

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవలు వైద్యసిబ్బంది మాత్రమే చేయాలని, వాచ్‌మెన్, స్వీపర్ చేయకూడదని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ రవి అన్నారు. వైద్యసిబ్బంది చేయాల్సిన పనులు నైట్ వాచ్‌మెన్ కట్లు కడుతూ రోగులకు వైద్యసేవలు అందిస్తున్నారని సమాచారం వస్తే తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసి సిబ్బంది విధులు వారు చేస్తున్న పనులను పరిశీలిస్తామన్నారు. వైద్యసిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదన్నారు.

## రెండేళ్ల నమ్మకం, అభివృద్ధి, సంక్షేమం సభకు తరలిరండి: ఎమ్మెల్యే



మాచర్ల, జూన్ 13 ప్రభాతవార్త: కూటమి ప్రభుత్వ ఏర్పడి రెండు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా రెండేళ్ల నమ్మకం, అభివృద్ధి, సంక్షేమం పేరిట నరసరావుపేట పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో ఈ నెల 15న జిల్లా స్థాయిలో నిర్వహించే భారీ బహిరంగ సభకు కూటమి పార్టీల శ్రేణులు తరలిరావాలని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి పిలుపునిచ్చారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చి ప్రజలకు భరోసా, నమ్మకాన్ని కలిగిస్తున్న కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతగా పల్నాడు జిల్లాలోని ఎమ్మెల్యేలు, ఎంపీ, ఇన్‌ఛార్జి మంత్రుల సమక్షంలో జరిగే ఈ సభకు ప్రజలు, కూటమి పార్టీలైన టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని ఆయన కోరారు. ఇచ్చిన హామీలకు మించి ప్రజలకు మంచి చేస్తుంటే.. జగన్‌రెడ్డికి నిద్రపట్టక నిరసనల పేరుతో ప్రజలను మభ్యపెట్టాలని చూస్తున్నారని విమర్శించారు. ఐదేళ్ల వైసీపీ పాలన చూసిన ప్రజలు జీవితంలో జగన్‌రెడ్డిలాంటి సైకోకు ఓటు వేయొద్దని నిర్ణయించుకున్నారని, ఎన్ని కల్లబొల్లి మాటలు చెప్పినా మీ పప్పులు ఉడకవని ఎద్దేవా చేశారు.

## 3 రాజధానుల పేరుతో అమరావతిని హత్య చేశారు: టిడిపి నేత యాగంటి ధ్వజం



మాచర్ల, జూన్ 13 ప్రభాతవార్త: మూడు రాజధానుల పేరుతో రాజధాని లేకుండా చేయడంతోపాటు 33 వేల ఎకరాల భూములిచ్చిన రైతులను అయిదేళ్లు రోడ్డున పడేసి అమరావతి హత్య చేశారని టీడీపీ సీనియర్ నాయకులు యాగంటి మల్లికార్జునరావు అన్నారు. పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రివర్స్ టెండరింగ్ పేరుతో రూ.2 వేల కోట్లు దోచుకున్నారని వైసీపీని దుయ్యబట్టారు. అమర్‌రాజా, లులూ, ఫ్రాంక్లిన్, టెంపుల్టన్, రిలయన్స్, అదానీ డేటా సెంటర్ అన్నీ పక్క రాష్ట్రాలకు వెళ్లిపోయాయన్నారు. వైసీపీ పాలనలో అప్పుడు - దోపిడీ రూ.13 లక్షల కోట్లు అప్పు చేశారు. ప్రతి తలపై రూ.2.5 లక్షల అప్పు పెట్టారు. కరెంటు ఛార్జీలు తొమ్మిది సార్లు పెంచి పేదోడి నడ్డి విరిచారు. ఇసుక, మైనింగ్, లిక్కర్ మాఫియా రాజ్యమేలింది. ప్రకాశం జిల్లా దాహార్తిని తీర్చే వెలుగొండ ప్రాజెక్టును పట్టించుకోలేదు. టన్నెల్ పనులు పూర్తి చేయకుండా జగన్‌రెడ్డి ఓపెన్ చేశారని ఎద్దేవా చేశారు.


**కూటమిలో సుపరిపాలన:** పెట్టుబడిదారులకు స్వర్గధామంగా మారిందన్నారు. 1వ తేదీనే పింఛన్ల పంపిణీ, ఆడపడుచులకు 3 ఉచిత గ్యాస్ సిలిండర్లు, తల్లికి వందనం, అన్నదాత భరోసా, ఎస్సీ, ఎస్టీలకు ఉచిత విద్యుత్తు, ఆటో డ్రైవర్ల సేవలో, అన్నా క్యాంటీన్లు, స్త్రీశక్తి, మన ఇల్లు మన గౌరవం మత్స్యకారుల భరోసా వంటి సంక్షేమ పథకాలతో రాష్ట్రం పరుగులు పెడుతుందన్నారు.

## మధుమేహ వ్యాధిగ్రస్తులు పాదాల పట్ల జాగ్రత్త వహించాలి

మాచర్ల, జూన్ 13 ప్రభాతవార్త: మధుమేహ వ్యాధిగ్రస్తులు పాదాల పట్ల జాగ్రత్త వహించాలని యశోద హాస్పిటల్ వాస్క్యులర్ డాక్టర్ ఎస్.శ్రీకాంత్‌రాజు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దయాబెటిస్ అదుపులో లేని వారిలో కాళ్లలో రక్త ప్రసరణ నిలిచిపోవడం గాయాలు ఏర్పడటం, అవి మానకపోవడం అవి రోజురోజుకు తీవ్ర రూపం దాల్చడం జరుగుతుందని చెప్పారు. మధుమేహ వ్యాధిని అశ్రద్ధ చేస్తే నరాల బలహీనత ఏర్పడి, తద్వారా పాదాలకు గాయాలైన నొప్పి తెలియకపోవడం జరుగుతుందన్నారు. నిర్లక్ష్యం చేస్తే పాదాలను తొలగించే ప్రమాదం ఉందన్నారు. ప్రాథమిక దశలోనే డాప్లర్ స్కాన్ వంటి పరీక్షల ద్వారా ఈ ముప్పును పసిగట్టి కాళ్లను రక్షించుకోవచ్చన్నారు. సమావేశంలో యశోద ఆసుపత్రి మార్కెటింగ్ ప్రతినిధులు కె.చంద్రశేఖర్, ఖాసింవలి తదితరులు పాల్గొన్నారు.



## వెన్నుపోటు దినం జరుపుకోవడం సిగ్గుచేటు: సాతులూరి కుమార్



మాచర్ల, జూన్ 13 ప్రభాతవార్త: ప్రజా ప్రభుత్వ ఏర్పాటు ఉద్దేశించి వైసీపీ నాయకులు వెన్నుపోటు దినంగా జరుపుకోవడం సిగ్గుచేటు అని రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ సాతులూరి కుమార్ అన్నారు. అనంతరం ఆయన మాచర్లలో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు అయిన సందర్భంగా రాష్ట్ర ప్రజలు సంబరాలు చేసుకుంటుంటే, ప్రజలు సంతోషంగా ఉంటే తట్టుకోలేక వైసీపీ నాయకులు వెన్నుపోటు దినంగా జరుపుకోవడం ప్రజా విజయాన్ని అవమానించడమేనన్నారు .సొంత చెల్లిని, తల్లిని బజారుకి ఈడ్చారన్నారు. మెగా డీఎస్సీ పేరుతో నిరుద్యోగులను మోసం చేసిన జగన్ నోటిఫికేషన్ ఇవ్వకపోగా టీచర్లను బార్‌షాపుల దగ్గర కాపలా పెట్టి ఘోరంగా అవమానించారన్నారు. స్థానిక సంస్థలలో 2029 ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఘనవిజయం సాధిస్తుందని జోస్యం చెప్పారు.

## ఆధార్ క్యాంపులను అర్హులందరూ సద్వినియోగం చేసుకోండి

పొన్నూరు, జూన్ 13,ప్రభాతవార్త: పురపాలక సంఘం పరిధిలో ఈ నెల 16వ తేదీ నుంచి 19వ తేదీ వరకు, 22వ తేదీ నుంచి 24వ తేదీ వరకు ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు ఆధార్ క్యాంపులు నిర్వహించనున్నట్లు మునిసిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్‌బాబు తెలిపారు. అర్హులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ నెల 16వ తేదీ నుంచి 19వ తేదీ వరకు 26వ వార్డు, స్పెషల్ మునిసిపల్ ప్రాథమిక పాఠశాల, 3వ వార్డులోని సెయింట్ థామస్ కేరళ ఈఎం స్కూల్, 23వ వార్డు ఎస్సీ కాలనీ-1స్వర్ణవార్డు, 18వ వార్డు టీచర్స్ కాలనీ-2స్వర్ణవార్డు, 25వ వార్డు శ్రీరామ మునిసిపల్ ఉన్నత పాఠశాలలో ఆధార్ క్యాంపులు జరుగుతాయన్నారు. అదేవిధంగా 22వ తేదీ నుంచి 24వ తేదీ వరకు 24వ వార్డు శ్రీరామ మునిసిపల్ ప్రాథమిక పాఠశాల, 9వ వార్డు ఏపి ఉన్నత పాఠశాల, 23వ వార్డు, ఎస్సీ కాలనీ-2 స్వర్ణవార్డు, 18వ వార్డు టీచర్స్ కాలనీ-2స్వర్ణ వార్డు, 5వ వార్డు మునిసిపల్ ప్రాథమిక పాఠశాలల్లో ఆధార్ క్యాంపులు జరుగుతాయన్నారు. ఆధార్‌కార్డుల్లో పేర్లు మార్పులు, తప్పులు, చిరునామా మార్పులు తదితరాలను సరిచేసుకొనేందుకు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కమిషనర్ రమేష్‌బాబు కోరారు.



## ఆరుగురు విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపిక

పొన్నూరు, జూన్ 13,ప్రభాతవార్త: మండల పరిధిలో ఐదుగురు విద్యార్థులు ట్రిపుల్ ఐటికి ఎంపికైనట్లు మండల విద్యాశాఖాధికారి కొల్లి విజయభాస్కర్ తెలిపారు. మండల పరిధిలోని మాచవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన జె.బేబి సుప్రియ-576(ఆర్కే వ్యాలీ), యు.లక్ష్మీ ప్రసన్న-574, షేక్ ఆరీఫ్-573, ఆర్. సౌమ్య-572(ఒంగోలు)కు ఎంపికయ్యారన్నారు. అదేవిధంగా మండల పరిధిలోని మామిళ్ళపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని యు.నాగ వెంకట శ్రీలిఖిత(ఒంగోలు), పట్టణంలోని ఆలపాటి సుబ్బారాయుడు బాలికోన్నత పాఠశాలకు చెందిన అమృత(ఒంగోలు) ఎంపికయినట్లు విజయభాస్కర్ తెలిపారు. ఈ విద్యార్థులను ఉపాధ్యాయులు, విద్యార్థులు తల్లిదండ్రులు, తోటి విద్యార్థులు అభినందించారు.



## రెండేళ్ళలో రూ.1,845 కోట్లతో రేపల్లె నియోజకవర్గం అభివృద్ధి

### -మంత్రి అనగాని కృషితో ప్రజల సంక్షేమం


రేపల్లె, జూన్ 13, ప్రభాతవార్త:కూటమి ప్రభుత్వం రెండేళ్ళ పాలనలో రేపల్లె నియోజకవర్గానికి సాధించిన రూ.1845 కోట్ల నిధులతో ప్రజల సంక్షేమం,అభివృద్ధి కార్యక్రమాలు నెరవేరాయని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ స్పష్టం చేశారు.రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు,డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్‌ల సహకారంతో యువమంత్రి నారా లోకేష్ సారథ్యంలో ప్రజల విశ్వాసాన్ని పొందుతూ రేపల్లె నియోజకవర్గంలో సంక్షేమం,అభివృద్ధి వ్యవహారంలో సరికొత్త చరిత్ర సృష్టించామని మంత్రి అనగాని సత్యప్రసాద్ వెల్లడించారు.రేపల్లె నియోజకవర్గంలోని 42,696 మంది లబ్ధిదారులకు రూ.447.60 కోట్ల మేర పింఛన్ల పంపిణీ జరిగింది.28,634 మంది రైతులకు రూ.57.26 కోట్ల పంట పెట్టుబడి సహాయం లభించింది.తల్లికి వందనం పథకం కింద 27,203 మంది విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ.35.36 కోట్లు జమయ్యాయి.15,643 మంది మత్స్యకారుల ఖాతాల్లో వేటనిషేధ కాలానికి సంబంధించి రూ.31.28 కోట్ల నిధులు ఖర్చు చేసినట్లు అనగాని తెలిపారు.2342 డ్వాక్రా గ్రూపులకు రూ.324.24 కోట్ల ఆర్థిక సాయం పంపిణీ చేసామన్నారు.ముఖ్యమంత్రి సహాయనిధి కింద 1470 మంది లబ్ధిదారులకు రూ.16.20 కోట్ల మేర సిఎంఆర్ఎఫ్ చెక్కులు,ఎల్వోసీ పత్రాలను అందజేయడం ద్వారా ఆర్థిక ప్రయోజనం చేకూరిందని చెప్పారు.స్త్రీ నిధి పథకం కింద 3931 స్వయం సహాయక గ్రూపులకు రూ.95.26 కోట్లు సహాయం అందిదంటే కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు.స్త్రీ నిధితో కలుపుకుని బ్యాంక్ లింకేజీ ద్వారా రూ.419.50 కోట్ల రుణ సహాయం అందించడం ద్వారా నిరుపేద మహిళల ఆర్థిక స్వావలంభన సాధ్యపడిందని మంత్రి అనగాని సంతృప్తి వ్యక్తం చేశారు.రేపల్లె నియోజకవర్గంలో స్త్రీ శక్తి పథకం ద్వారా 40 లక్షల మంది మహిళలు ఉచితంగా ప్రయాణం చేయగలిగారన్నారు.రేపల్లె ఆర్టీసీ డిపోకు 16 నూతన బస్సులను సమకూర్చామని ఆయన తెలిపారు.మేనిఫెస్టోలో ఉదహరించకపోయినా ఉచిత బస్సు కారణంగా రేపల్లె నియోజకవర్గంలో నష్టపోయిన 1054 మంది ఆటో డ్రైవర్లకు ఏటా రూ.15 వేలు వంతున రూ.1 కోటి 55 లక్షల ఆర్థిక సహాయాన్ని అందించామని చెప్పారు.ప్రధానమంత్రి సూర్యఘర్ పథకం కింద 992 మంది లబ్ధిదారుల నివాసాలపై ఉచిత సోలార్ ప్యానెల్స్ ఏర్పాటుకు రూ.7.74 కోట్లు ఖర్చు చేశామని చెప్పారు.పల్లె పండుగ కింద రూ.52 కోట్ల నిధులతో గ్రామాలలో సిసి రహదారుల నిర్మాణాన్ని పూర్తి చేయించడంతో పాటు రేపల్లె నియోజకవర్గంలోని పోటుమెరక గౌడపాలెం,బండికాయలమోటు,పిల్లలవారి పాలెం గ్రామాల ప్రజల చిరకాల వాంఛగా మిగిలిన 100 ఏళ్ళ రహదారి కలను సాకారం చేసిన ఘనత తమకే దక్కుతుందని సత్యప్రసాద్ చెప్పారు.రూ.10 కోట్ల పంచాయతీరాజ్ నిధులతో బీటీ రహదారుల నిర్మాణం, రూ.4 కోట్ల డిఎంఎఫ్ నిధులతో సిసి రోడ్ల నిర్మాణ పనులు పూర్తి చేయించామని తెలిపారు.నిజాంపట్నం మండలంలోని దిండి ఆక్వాపార్క్ నిర్మాణ పనుల కోసం రూ.85 కోట్లు మంజూరు చేయించగా పనులు శరవేగంగా జరుగుతున్నాయని పేర్కొన్నారు.రేపల్లె డ్రెయిన్,భట్టి ప్రోలు అక్విడెక్ట్ పనులకు రూ.10.75 కోట్లు నిధులను మంజూరు చేయడం వలన రైతుల సమస్యలకు పరిష్కారమార్గం చూపించామని అనగాని చెప్పారు.రేపల్లెలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆధునీకరణ కోసం రూ.25 లక్షల డిఎంఎఫ్ నిధులు కేటాయించడంతో అభివృద్ధి నెరవేరి విద్యార్థులకు అధునాతన సౌకర్యాలు చేకూరాయని ఆయన వివరించారు.పట్టణంలో విద్యుత్ లో,హై ఓల్టేజీ సమస్యలు తలెత్తకుండా విద్యుత్ సరఫరాకు ఎటువంటి అంతరాయం కలుగకుండా ఉండేందుకు 33/11 కె.వి విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి అవసరమైన రూ.7 కోట్ల నిధులను విడుదల చేయించి శంకుస్థాపన ప్రక్రియ పూర్తిచేసినట్లు తెలిపారు.రేపల్లె పట్టణంలో రెవెన్యూ డివిజనల్,తహశీల్దార్ కార్యాలయాల నిర్మాణాన్ని దృష్టిలో ఉంచుకుని రూ.5 కోట్ల నిధులను మంజూరు చేయించామన్నారు.రేపల్లె ప్రాంత ప్రజల తాగునీటి అవసరాల కోసం రూ.69 కోట్లతో వాటర్ ట్యాంకులు,పైపులైన్ల నిర్మాణ పనులను చేపట్టి 90 శాతం పూర్తి చేయించామని తెలిపారు.రేపల్లె-తుమ్మల-గంగడిపాలెం డబుల్ లైన్ రోడ్డు నిర్మాణానికి రూ.49 కోట్లు నిధులను కేటాయించామన్నారు.రేపల్లె నియోజకవర్గంలో రూ.76 కోట్లతో ఆర్అండ్‌బి రహదారుల అభివృద్ధి జరుగుతోందన్నారు.రూ.10 కోట్ల ఎంజిఎన్ఆర్ఇజిఎస్ నిధులతో బీటీ రోడ్ల నిర్మాణ పనులు జరుగుతున్నాయని మరో రూ.10 కోట్ల నాబార్డు నిధులతో బీటీ రోడ్ల నిర్మాణం పూర్తిచేయించినట్లు చెప్పారు. కాల్వల్లో పూడికతీత పనుల కోసం రూ.7 కోట్ల ఓఅండ్ఎం నిధులను మంజూరు చేయించామని తెలిపారు.745 గోకులం షెడ్ల నిర్మాణం కోసం రూ.15 కోట్లు నిధులను విడుదల చేయించినట్లు ఆయన పేర్కొన్నారు.రూ.5 కోట్ల 70 లక్షల సిజిఎఫ్ నిధులతో దేవాలయాల అభివృద్ధికి చర్యలు తీసుకున్నామన్నారు.ప్రభుత్వ పాఠశాలలు,జూనియర్ కళాశాల విద్యార్థులకు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ద్వారా నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందిస్తూ ఆరోగ్యప్రమాణాలను మెరుగుపరుస్తున్నామని అనగాని సత్యప్రసాద్ తెలిపారు.రేపల్లె నియోజకవర్గంలోని నగరం,చెరుకుపల్లి మండలాల తహశీల్దార్ కార్యాలయాల నూతన భవన నిర్మాణాల కోసం రూ.కోటి 80 లక్షల నిధులను మంజూరు చేయించినట్లు చెప్పారు.రేపల్లె పురపాలక సంఘంలో రహదారులు,మురుగునీటి పారుదల వ్యవస్థ,ఇతర మౌలిక వసతులను కల్పించేందుకు రూ.88 కోట్లు నిధులను కేటాయించినందున ప్రజలకు ప్రయోజనం చేకూరుతున్నదని తన జీవితం రేపల్లె నియోజకవర్గ ప్రజల సంక్షేమానికే అంకితమని అనగాని సత్యప్రసాద్ వివరించారు.



## నేడు ఉచిత మెగా ఆరోగ్య శిబిరం

రేపల్లె, జూన్ 13, ప్రభాతవార్త:పట్టణంలోని మెడికల్ అండ్ కల్చరల్ అసోసియేషన్ హాలులో ఆదివారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు ఉచిత మెగా ఆరోగ్య శిబిరం నిర్వహిస్తున్నట్లు డయాబెటీస్ సెంటర్ నిర్వాహకులు శనివారం తెలిపారు.ఇండియన్ మెడికల్ అసోసియేషన్,మెడికల్ కల్చరల్ అసోసియేషన్‌ల సహకారంతో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో యాదృచ్ఛిక రక్త చక్కెర పరీక్ష,ఎత్తు,బరువు కొలత,బిఎంఐ గణన,రక్తపోటు తనిఖీ,డైటీషియన్ కౌన్సెలింగ్,కన్సల్టేషన్,కంటి పరీక్ష,దంత పరీక్షలు నిర్వహిస్తామని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు.

## జగన్ పాలనలోనే ప్రజల సంక్షేమం సాధ్యం:మోపిదేవి శ్రీనివాసరావు



రేపల్లె, జూన్ 13, ప్రభాతవార్త:ఆంధ్రప్రదేశ్‌లో జగన్ పాలనతోనే ప్రజా సంక్షేమం సాధ్యపడుతుందని ఎప్పుడు ఎన్నికలు జరిగినా జగన్ ముఖ్యమంత్రి కావడం ఖాయమని ప్రముఖ వ్యాపారవేత్త,సీనియర్ రాజకీయవేత్త, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు మోపిదేవి శ్రీనివాసరావు స్పష్టం చేశారు.రేపల్లె మండలంలోని తుమ్మల పంచాయతీకి చెందిన ప్రముఖులు శనివారం మోపిదేవి శ్రీనివాసరావుతో సమావేశమయ్యారు.జగన్మోహన్‌రెడ్డి నాయకత్వాన్ని బలపరుస్తూ మోపిదేవి శ్రీనివాసరావు ఆశయసాధన కోసం పనిచేస్తామని తుమ్మల పంచాయతీ పెద్దలు రేపల్లె మాచయ్య,రేపల్లె బాబు,రేపల్లె వేణు,కొండేటి రవి,అంజయ్య,నాయకులు,కార్యకర్తలు తెలిపారు.ఈ సందర్భంగా మోపిదేవి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రజల సమస్యలకు పరిష్కారం లభించాలంటే జగన్ అధికారంలోకి రావడమే సరైన మార్గమని చెప్పారు.కూటమి ప్రభుత్వ పాలనపై విసుగుచెందుతున్న ప్రజలు మార్పును కోరుకుంటున్నారని తెలిపారు.గతంలో జగన్ అమలు చేసిన సంక్షేమ పథకాలను గుర్తు చేసుకుంటున్నారని ఆయన పేర్కొన్నారు.వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అభ్యున్నతికి పార్టీ నాయకులు,కార్యకర్తలు కృషి చేయాలని ఆయన కోరారు.కూటమి ప్రభుత్వం వలన జరుగుతున్న నష్టాలపై ప్రజలలో అవగాహన కల్పించాలని ఆయన సూచించారు.

## సిబ్బంది సంక్షేమానికే మా తొలి ప్రాధాన్యం



బాపట్ల,జూన్13,ప్రభాతవార్త,ప్రతినిధి: పోలీస్ సిబ్బంది సంక్షేమానికి తాము అత్యంత ప్రాధాన్యతనిస్తామని బాపట్ల జిల్లా ఎస్పీ ఉమామహేశ్వర్ఫ్ తెలిపారు.. సిబ్బంది ఎదుర్కొంటున్న శాఖాపరమైన, వ్యక్తిగత సమస్యలను పరిష్కరించేందుకు శనివారం సాయంత్రం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో పోలీస్ సహచార్ ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లు, విభాగాల్లో పనిచేస్తున్న హోంగార్డులు, పోలీస్ సిబ్బంది ఎస్పీని నేరుగా కలిసి తమ వినతులను అందజేశారు.కుటుంబ సభ్యుల అనారోగ్య సమస్యలు, వ్యక్తిగత ఆరోగ్య కారణాలతో బదిలీలు, ఇతర శాఖాపరమైన ఇబ్బందులను ఎస్పీ దృష్టికి తీసుకెళ్లారు. సిబ్బంది సమస్యలను ఓపికగా విన్న ఎస్పీ, వాటిపై సానుకూలంగా స్పందించారు. తక్షణమే పరిష్కరించే వీలున్న సమస్యలకు అక్కడికక్కడే మార్గం చూపారు. మిగిలిన వినతులపై సీసీఎస్ డిఎస్పీ పి.జగదీష్ నాయక్, డీపీవో సిబ్బందితో సమీక్షి ంచి, వాటిని నిర్దిష్ట గడువులోగా, అత్యంత త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు.

**ప్రతి శుక్రవారంఎస్పీ సంపర్క్**

సిబ్బంది సంక్షేమం కోసం ప్రతి నెల రెండవ శనివారంపోలీస్ సహచార్ ఓపెన్ హౌస్‌నిర్వహిస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. దీనితో పాటు...ప్రతి శుక్రవారం మధ్యాహ్నం 3:00 గంటల నుండి సాయంత్రం 5:00 గంటల వరకుఎస్పీ సంపర్క్‌కార్యక్రమం అందుబాటులో ఉంటుందని వెల్లడించారు.ఈ సమయంలో సిబ్బంది నేరుగా ఫోన్ కాల్ ద్వారా తమ సమస్యలను తన దృష్టికి తీసుకురావచ్చని సూచించారు.

**హెల్మెట్ తప్పనిసరి!** సిబ్బంది అంతా తమ ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే సమయంలో ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని ఆయన స్పష్టం చేశారు.

## గ్రామీణులకు ఆయుష్ సేవలు విస్తృతం చేయాలి

బాపట్ల,జూన్13,ప్రభాతవార్త,ప్రతినిధి: భారతదేశ ప్రాచీన కాలం నుంచి ఎంతో ప్రాచుర్యం పొందిన ఆయుష్ ప్రాథమిక వైద్య సేవలను గ్రామీణ ప్రజలకు మరింత విస్తృతంగా అందుబాటులోకి తీసుకురావాలని బాపట్ల జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ వి. అధికారులను ఆదేశించారు. శనివారం పర్చూరు మండలం ఉప్పుటూరు గ్రామంలోని ఆయుష్ వైద్యశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్వర్ణ గ్రామ సచివాలయంలోని ఒక చిన్న గదిలో ఆయుష్ ఆసుపత్రిని నిర్వహించడాన్ని చూసి కలెక్టర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. అసలు చిన్న గదిలో ఆసుపత్రి నడపడం ఏంటని స్థానిక అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

**తక్షణమే ఆసుపత్రి మార్చండి!**



గతంలో శిథిలమై తొలగించిన పాత భవన స్థలంలోనే తిరిగి ఆయుష్ వైద్యశాలను నిర్మించాలని గ్రామస్తులు కలెక్టర్‌కు విజ్ఞప్తి చేయడంతో ఆయన ఆ స్థలాన్ని స్వయంగా పరిశీలించారు. కొత్త భవనం పూర్తయ్యే వరకు గ్రామంలోని ప్రజలకు వైద్య సేవలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా, స్థానిక ప్రాంతీయ వైద్యశాల (సీహెచ్‌సీ) నుంచే ఆయుష్ సేవలు అందించాలని గ్రామస్థులు కోరారు. దీనిపై తక్షణమే స్పందించిన కలెక్టర్.. ఆయుష్ ఆసుపత్రిని తక్షణమే ప్రాంతీయ వైద్యశాల ప్రాంగణంలోకి మార్చాలని నియోజకవర్గ ఇన్‌చార్జ్ అధికారిని ఆదేశించారు. అలాగే శాశ్వత ఆయుష్ వైద్యశాల భవన నిర్మాణానికి తగిన ప్రతిపాదనలు సిద్ధం చేసి వెంటనే పంపాలని అధికారులకు సూచించారు.అంతకుముందు కలెక్టర్ పర్చూరులోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ అద్దంకి నాంచారమ్మ దేవస్థానాన్ని సందర్శించారు. అమ్మవారిని దర్శించుకుని, ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు కలెక్టర్‌కు పూర్ణకుంభంతో స్వాగతం పలికి, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ తనిఖీల్లో కలెక్టర్ వెంట బాపట్ల ఆర్‌డీఓ ఎ. హరికుమార్, ఆయుష్ జిల్లా నోడల్ అధికారి డాక్టర్ డి. చంద్రశేఖర్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి (డీఎంహెచ్‌ఓ) డాక్టర్ ఎస్. విజయమ్మతో పాటు పలువురు స్థానిక అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## యాజలి గ్రామంలో అక్రమ మట్టి తవ్వకాలపై ప్రజల్లో ఆగ్రహం

కర్లపాలెం,జూన్13,ప్రభాతవార్త, కర్లపాలెం మండల పరిధిలోని యాజలి గ్రామంలో జరుగుతున్నట్లు ఆరోపణలు వస్తున్న అక్రమ మట్టి తవ్వకాలపై సంబంధిత అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని గ్రామ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో మట్టి తవ్వకాలపై సామాజిక మాధ్యమాల్లో విమర్శలు గుప్పించిన నాయకులు, ఇప్పుడు జరుగుతున్నట్లు ఆరోపణలు వస్తున్న అక్రమ తవ్వకాల విషయంలో మౌనం ఎందుకు పాటిస్తున్నారని వారు నిలదీస్తున్నారు.కాల్వ కట్టలు, బోది కాల్వలు, చెరువుల పరిసర ప్రాంతాల్లో కూడా మట్టి తవ్వకాలు జరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇంత జరుగుతున్నప్పటికీ సంబంధిత శాఖ అధికారులు స్పందించకపోవడం పలు అనుమానాలకు తావిస్తోందని వారు అంటున్నారు.అక్రమ మట్టి తవ్వకాల వెనుక ఎవరున్నారు? ఈ వ్యవహారంలో ఏ నాయకులు లేదా ప్రభావశీలులు ఉన్నారా? అనే అంశాలపై పూర్తి స్థాయి విచారణ చేపట్టాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. ముడుపులు చెల్లించిన వారికి చట్టాలు వర్తించవా, సామాన్య ప్రజలపై మాత్రమే అధికార యంత్రాంగం కఠినంగా వ్యవహరిస్తుందా అని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా యంత్రాంగం, గనుల శాఖ మరియు రెవెన్యూ అధికారులు స్పందించి యాజలి గ్రామంలో జరుగుతున్నట్లు ఆరోపణలు వస్తున్న అక్రమ మట్టి తవ్వకాలపై విచారణ జరిపి, వాస్తవాలు వెలుగులోకి తీసుకురావాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

## వెదుళ్లపల్లిలో విద్యార్థులకు ఉచిత కంటి, చెవి వైద్య శిబిరం

బాపట్ల,జూన్13,ప్రభాతవార్త,ప్రతినిధి: ీమండల పరిదిలోని వెదుళ్లపల్లి గ్రామంలో శ్రీ గోపరాజు రామచంద్రరావు రుక్మిణమ్మ చారిటబుల్ ట్రస్ట్, ఉచిత వైద్యశాల మరియు ఉచిత కంటి ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో పాఠశాల, కళాశాల విద్యార్థులకు శనివారం ఉచిత కంటి మరియు చెవి పరీక్షల శిబిరం అత్యంత విజయవంతంగా నిర్వహించారు. ఈ శిబిరంలో పరీక్షలు చేయించుకున్న విద్యార్థులకు అవసరమైన మందులను, కళ్ళజోళ్లను ఉచితంగా పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ప్రముఖ వైద్యులు డాక్టర్ బి. వినోద్ కుమార్ విద్యార్థులకు చెవి పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఆయన విద్యార్థులకు చెవి సంరక్షణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రత్యేక అవగాహన కల్పించారు. అలాగే డాక్టర్ అమృతపాణి పర్యవేక్షణలో ఆప్తోమెట్రిస్ట్ ఎం. సుభాషిని విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా కళ్ళజోళ్లను అందజేశారు.ఈ శిబిరంలో ప్రవాస భారతీయులైన డాక్టర్ మహదేవన్ మూర్తి నేమాని, డాక్టర్ మాధవి గోపరాజు,,ఇషా నెమాని, దివ్య వడ్లకొండలు పాల్గొని తమ ఉచిత వైద్య సేవలను అందించారు. అంతేకాకుండా, సంస్థ తరఫున అర్హులైన వారికి ఉచితంగా కళ్ళజోళ్లను, వినికిడి యంత్రాలను పంపిణి చేశారు. నోట్ :ఈ



## సేవా కార్యక్రమాల ద్వారానే గుర్తింపు

పొన్నూరు, జూన్ 13,ప్రభాతవార్త: సేవా కార్యక్రమాల ద్వారానే గుర్తింపు లభిస్తుందనడానికి నిదర్శనం నూతనంగా ఎంపికైన బేతాళ ఝాన్సీరాణి ఉదాహరణ అని లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు



నన్నపనేని రఘునాథ్ అన్నారు. స్థానిక లయన్స్ పాలీ సర్వీస్ సెంటర్‌లో జరిగిన ఝాన్సీరాణి అభినందన సభలో ఆయన మాట్లాడారు. ఝాన్సీరాణి లయన్స్‌క్లబ్ స్వర్ణపురి మహిళ అధ్యక్షురాలుగా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించారన్నారు. ఆమె చేసిన సేవా కార్యక్రమాల ద్వారానే జోన్ ఛైర్మన్ ఎంపికకు మార్గం సుగమమైందన్నారు. ఝాన్సీరాణి ఉపాధ్యాయురాలుగా ఉన్న సమయంలో ఎంతో మంది విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దారన్నారు. ఉద్యోగ విరమణ అనంతరం శేష జీవితాన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు లయన్స్‌క్లబ్‌ను ఎంచుకొని ముందుకు రావడం అభినందనీయమన్నారు. మునిసిపల్ మాజీ వైస్ ఛైర్మన్ ఆకుల సాంబశివరావు మాట్లాడుతూ సమాజానికి సేవ చేయాలనుకునేవారికి లయన్స్‌క్లబ్ చక్కని వేదిక అని చెప్పారు. రాష్ట్రంలోనే పొన్నూరు లయన్స్‌క్లబ్‌లకు విశేషమైన స్థానం ఉందన్నారు. నూతన కమిటి సభ్యులు కూడా మరిన్ని సేవా కార్యక్రమాలు చేయాలని సూచించారు. అనంతరం ఝాన్సీరాణిని శాలువాలతో, మెమెంటోతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రీజినల్ ఛైర్మన్ పరాశరం రంగవల్లి, లయన్స్‌క్లబ్ ఫ్రెండ్లీ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు సిఎస్ఆర్కే శర్మ, నూతన అధ్యక్షురాలు పరాశరం శేషుకుమారి, మాజీ అధ్యక్షురాలు మన్నవ అనసూయాదేవి, జి.కృష్ణకుమారి, మద్ది పద్మజ తదితరులున్నారు.

14-6Pg5-ff_14-6Pg5-ff.qxd 13/Jun/26 11:55 PM Page 1





# భారతీయ నౌకపై దాడి అవాస్తవం

## తప్పుడు సమాచారం నమ్మవద్దని విదేశాంగశాఖ వెల్లడి

**న్యూఢిల్లీ,జూన్ 13:** ఒమన్ తీరం లో భారతీయ సిబ్బంది ఉన్న మరో నౌకపై దాడి జరిగిందన్న సమాచారంపై భారత విదేశాంగ శాఖ స్పందించింది. మరో నౌకపై దాడి జరిగిందన్న వార్తలు అవాస్తవమని పేర్కొన్నది. భారత సిబ్బందితో ఉన్న లియాకీ ఫ్రీడమ్ అనే నౌక ఒమన్ తీరం వెంబడి ప్రయాణిస్తుండగా దాని నుంచి ఒక్కసారిగా స్పందన ఆగిపోయింది. దాంతో అమెరికా దాడి చేసిందంటూ పలు వార్తా పత్రికల్లో వార్తలు వచ్చాయి. ఈ ఘటనలో నలుగురు భారతీయ నావికులు మరణించారంటూ ప్రచారం జరిగింది. సామాజిక మాధ్యమాల్లో కూడా పెద్దఎత్తున పోస్టులు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలోనే విదేశాంగశాఖ స్పందించింది. ఆ నౌకలోని మాస్టర్‌తో మాట్లాడినట్లు పేర్కొన్నది. నౌకపై ఎలాంటి దాడి జరగలేదని ధ్రువీకరించింది. సిబ్బంది అందరూ సురక్షితంగా ఉన్నారని స్పష్టంచేసింది. ఇలాంటి తప్పుడు వార్తల ప్రచారంపై అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించింది. కాగా ఇటీవల ఒమన్ తీరం సమీపంలో భారతీయులు ఉన్న నౌకలపై వరుసగా దాడులు జరిగాయి. వారం వ్యవధిలో మూడు నౌకలను అమెరికా సైన్యం లక్ష్యంగా చేసుకుంది. ఈ ఘటనలో ముగ్గురు భారత నావికులు ప్రాణాలు కోల్పోవడం తీవ్ర ఆందోళన రేకెత్తించింది. భారత్ ఈ దాడులను తీవ్రంగా ఖండించింది. తక్షణమే ఈ చర్యలను ఆపేయాలంటూ అమెరికాపై నిరసన వ్యక్తం చేసింది. కాగా హర్మూజ్ జలసంధిలో ప్రయాణిస్తున్న వాణిజ్య నౌకలే లక్ష్యంగా ఇరాన్ డ్రోన్‌లు ప్రయోగించిందని అమెరికా దళాలు ఆరోపించాయి. ఈ ఆరోపణలను ఇరాన్ ఖండించింది.అమెరికాయే దాడులుచేసి తమపై అభియోగాలు నెట్టేస్తోందని ఇరాన్‌ప్రతినిధి ఆరోపించారు.

# మమత, అభిషేక్‌లకు ఉచ్చుబిగిస్తున్న సిఎం సువేందు!



**కోల్‌కత్తా,జూన్ 13:** పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు సంబంధించిన సంతకాల ఫోర్జరీ ఆరోపణల కేసు దర్యాప్తు ముమ్మరం అయింది. ఈ కేసులో సీఐడీ దూకుడుగా వ్యవహరిస్తోంది. ఇప్పటివరకు 13 మంది ఎమ్మెల్యేల వాంగ్మూలాలను నమోదు చేసింది. ఈ వ్యవహారంలో ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి, లోక్ సభ సభ్యుడు అభిషేక్ బెనర్జీ ఆరోపణలను ఎదుర్కొంటోన్నారు. ఆయనకు సీఐడీ తాజాగా నోటీసులు జారీ చేసింది. అదే సమయంలో ఆయన నివాసంపై కోల్‌కతా పోలీసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. కేంద్ర బలగాలు సైతం ఇందులో పాలుపంచుకోవడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ తెల్లవారు జామున 3 గంటల సమయంలో కోల్ కత కాళీఘాట్ లోని నివాసంలో ఈ సోదాలు ఆరంభం అయ్యాయి. ఉదయం వరకూ కొనసాగాయి. కేంద్ర భద్రతా బలగాల పర్యవేక్షణలో అత్యంత నాటకీయ పరిణామాల మధ్య సాగిన ఈ ఆపరేషన్ పశ్చిమ బెంగాల్ రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. అభిషేక్ బెనర్జీ వ్యక్తిగత సహాయకుడు సుమిత్ రాయ్‌కు సంబంధించిన ఓ కేసు ఆధారంగా ఈ సోదాలు జరిగినట్లు తెలుస్తోంది. నాలుగు గంటల పాటు సాగిన ఈ శోధన ముగిసిన అనంతరం అభిషేక్ విలేకరులతో మాట్లాడారు. తాళం పగలగొట్టి, ఇంట్లోకి ప్రవేశించి ప్రతి గదిలోనూ సోదాలు చేశారని ఆరోపించారు. ఈ పోలీస్ ఆపరేషన్ విషయం తెలియగానే మాజీ ముఖ్యమంత్రి, టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ ఆయన నివాసానికి చేరుకున్నారు. రాజకీయ కక్షసాధింపు చర్యలకు అడ్డు అదుపు ఉండట్లేదని, నానాటికీ దిగజారుతున్నాయని మండిపడ్డారు. అసెంబ్లీ సంతకాల ఫోర్జరీ కేసులో అభిషేక్ బెనర్జీని ఇటీవలే సీఐడీ అధికారులు దాదాపు ఆరు గంటల పాటు అభిషేక్ ను సంగతి తెలిసిందే. ఈ విచారణ ముగిసిన రెండు రోజుల వ్యవధిలోనే ఆయన నివాసంపై జరిగిన ఈ తాజా దాడి తృణమూల్ నేతల్లో తీవ్ర ఆగ్రహాన్ని తెప్పించింది. దర్యాప్తు సంస్థలు మరోసారి ఆయనకు సమన్లు ఇచ్చే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. మరోవైపు, పశ్చిమ బెంగాల్‌లో టీఎంసీ సీనియర్ నాయకుడు, ఎమ్మెల్యే మదన్ మిత్ర కూడా టార్గెట్ అయ్యారు. ఆయనకు చెందిన నివాసాలు, కార్యాలయాలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఏకకాలంలో ఏడు చోట్ల సోదాలు నిర్వహించింది. మున్సిపల్ నియామకాల కుంభకోణంలో భాగంగా దక్షిణేశ్వర్‌లోని ఆయన నివాసంలో ఈ తనిఖీలు చేపట్టారు. సుమారు 125 కంటే ఎక్కువ అక్రమ నియామకాలతో మిత్రాకు సంబంధాలు ఉన్నాయని, దళారుల ద్వారా ఆయన పెద్ద ఎత్తున లంచాలు తీసుకున్నారని ఈడీ అధికారులు ప్రాథమికంగా ఆరోపిస్తున్నారు.

# లీకేజిలపై రాహుల్ ఆందోళనలు!



**న్యూఢిల్లీ,జూన్ 13:** పేపర్ లీకేజీ, పరీక్షల్లో స్కాంలు వంటి అంశాల్లో కేంద్ర సర్కార్ వైఫల్యాలపై పోరాడేందుకు కాంగ్రెస్ సిద్ధమవుతోంది. ఆ పార్టీ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించింది. ఇటీవల నీట్ పేపర్ లీకేజీ, సీబీఎస్ఈ పరీక్షా ఫలితాల్లో అవకతవకలు, నిరుద్యోగం వంటి అంశాలపై రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ ఆందోళన కార్యక్రమాలు చేపట్టనుంది. ఈ విషయాన్ని కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ వెల్లడించారు. విద్యార్థులు, యువత, నిరుద్యోగులు, పలు సంస్థలతో కలిసి భారీ ఎత్తున వరుస నిరసనలు చేపడుతామన్నారు. ప్రస్తుతం కేంద్ర వైఫల్యం వల్ల యువత, విద్యార్థులు, నిరుద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వేణుగోపాల్ అన్నారు. ఈ నేపథ్యంలో అనేక ప్రాంతాల్లో రాహుల్ పర్యటించి ఆందోళన చేస్తారు. ముందుగా జూన్ 17న కోటలో విద్యార్థులతో సమావేశమవుతారు. అనంతరం ప్రయాగ్‌రాజ్ (అలహాబాద్) జూలై 10న, పాట్నాలో జూలై 11న, జూలై 14న ఢిల్లీలో రాహుల్ విద్యార్థులు, యువతతో కలిసి ఆందోళన చేస్తారు.

దేశంలో వరుసగా జరుగుతున్న పేపర్ లీకేజీలతో మిలియన్లకొద్దీ విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, వారి తల్లిదండ్రులు అదనపు ఖర్చులు భరించలేకపోతున్నారని, ఉద్యోగాల నియామకాల్లో, పరీక్షల నిర్వహణలో పారదర్శకత లోపించిందని వేణుగోపాల్ విమర్శించారు. ఈ నిరసనల్లో ఎన్ఎస్‌యూఐ, యూత్ కాంగ్రెస్, పీసీసీలు, డీసీసీలు పాల్గొంటారని వేణుగోపాలు తెలిపారు. కేంద్రానికి నిరసన తగిలేలా, అందరినీ ఏకం చేసే లక్ష్యంతో ఈ ఆందోళన కార్యక్రమాలుంటాయన్నారు.

# కొత్త ఆర్మీచీఫ్‌గా లెఫ్టినెంట్ జనరల్ ధీరజ్‌సేథ్!




**న్యూఢిల్లీ,జూన్ 13:** ఆర్మీ కొత్త చీఫ్‌గా లెఫ్టినెంట్ జనరల్ ధీరజ్‌సేథ్ నియమితులయ్యారు. ఆయన నియామకం ఈనెల 30వ తేదీనుంచి అమలులోకి వస్తుంది. ప్రస్తుత చీఫ్ ఆఫ్‌ది ఆర్మీస్టాఫ్ జనరల్‌ఉపేంద్ర ద్వివేది రిటైర్ అవుతున్న సంగతి తెలిసిందే. ఆర్మీస్టాఫ్‌కు వైస్‌చీఫ్‌గా లెఫ్టినెంట్ ఝనరల్ సేథ్ కొనసాగుతున్నారు. నేషనల్ డిఫెన్స్ అకాడమి పూర్వ విద్యార్థి అయిన సాయుధ దళాల్లోకి 1986 డిసెంబరులో వచ్చిచేరారు. నాలుగు దశాబ్దాలపాటు మిలిటరీలో కెరీర్‌ను కొనసాగించారు. నిర్వహణ, వ్యూహాల అమలులో మంచి సామర్థ్యం ఉన్న వ్యక్తి. సంస్థాగతంగా కూడా మంచి పట్టు ఉన్న అధికారిగా పేరుంది. భారత్ ఆర్మీ దళాల తుదముట్టించే వ్యూహాలకు ఆయనే పదును పెడతారు.

దళాల ఆధునీకరణపై లెఫ్టినెంట్ గవర్నర్ ఎక్కువ ఫోకస్‌పెట్టారు. భవిష్యత్తు యుద్ధ తంత్రాలను అమలుచేయడంలో ఆయన దిట్ట అని పేరుంది. జమ్ముకాష్మీర్‌లో కౌంటర్ ఇన్‌సర్జెన్సీ ఫోర్స్‌కు కమాండెట్‌గా వ్యవహరించారు. సుదర్శన్‌చక్ర కార్ప్స్‌కు లెఫ్టినెంట్ జనరల్ హోదాలో పర్యవేక్షణచేసారు. నైరుతి కమాండ్, దక్షిణ కమాండ్‌లను పర్యవేక్షించిన ఆయన సంక్లిష్టపరిస్థితులను అధిగమించే వ్యూహాలు అమలుచేసారు. లెఫ్టినెంట్‌ఝనరల్‌సేత్ వృత్తిపరంగా మిలిటరీ విద్యలో కూడా నిపుణులు. శిక్షణలో కూడా ఆయన ఉన్నతస్థాయి పదవుల్లోకొనసాగారు. ఎన్డీసీలో హైయ్యర్ కమాండ్ కోర్సు కూడా అభ్యసించారు. మధ్యప్రదేశ్‌లోని సైనిక్‌స్కూల్ పూర్వ విద్యార్థి. 1984లో జమ్ముకాశ్మీర్ రైఫిల్స్‌కు 1984లో పర్యవేక్షించారు

# శత్రు మిస్సైళ్లను ఎదుర్కొనే రక్షణ వ్యవస్థ

### - యాంటీ షిప్ మిస్సైళ్లను ఢీకొట్టే టెక్నాలజీని పరీక్షించిన డిఆర్‌డిఓ - పెరిగిన స్వదేశీ రక్షణ సామర్థ్యం - బిఎండి సామర్థ్యం ఉన్న ఎలైట్ దేశాల్లో భారత్



**న్యూఢిల్లీ,జూన్ 13:** భారత రక్షణ పరిశోధనా అభివృద్ధి సంస్థ అత్యాధునిక డిఫెన్స్ సిస్టమ్‌ను పరీక్షించింది. బాలిస్టిక్ క్షిపణులను ఎదుర్కొనే రక్షణ వ్యవస్థలతో పాటు యాంటీ షిప్ మిస్సైళ్లను ఎదుర్కొనే టెక్నాలజీని పరీక్షించినట్లు శనివారం డీఆర్డీవో వెల్లడించింది. ఈ ట్రయల్ పరీక్షలు జూన్ 10,11వ తేదీల్లో నిర్వహించారు. ప్రస్తుతం ఆధుని టెక్నాలజీతో వస్తున్న క్షిపణులు, మారీటైం ముప్పును ఎదుర్కొనే రీతిలో ఉండే కొత్త తరహా టెక్నాలజీ ఆధారిత ఆయుధాలను పరీక్షించినట్లు డీఆర్డీవో పేర్కొన్నది. స్వదేశీ రక్షణ సామర్థ్యాన్ని పెంచుకోవాలన్న దీక్షతో భారత్ తన ఆయుధ పరీక్షలను చేపట్టింది. మూడు రకాల ఫ్లయిట్ టెస్ట్‌లను నిర్వహించినట్లు రక్షణ శాఖ ప్రకటించింది. ఈ విన్యాసాల్లో భాగంగా ఇంటర్‌సెప్టార్ క్షిపణులను లాంచ్ చేశారు. నిర్దేశిత టార్గెట్లపై వాటిని పరీక్షించారు. అనుకున్న లక్ష్యాలను అందుకున్నట్లు తెలిసింది. బాలిస్టిక్ మిస్సైల్ డిఫెన్స్ సిస్టమ్‌కు చెందిన పలు దశలను ఈ పరీక్షల్లో టెస్ట్ చేశారు. దూసుకు వస్తున్న క్షిపణులను నిర్వీర్యం చేసేందుకు కావాల్సిన టెక్నాలజీని పరీక్షించారు. మిస్సైల్‌ను డిటెక్ట్ చేసి, ట్రాక్ చేసి దాన్ని ధ్వంసం చేసే టెక్నాలజీని పరీక్షించారు. భారత వ్యూహాత్మక భద్రత అంశంలో ఇదొక ముందడుగు అని ప్రభుత్వ అధికారులు పేర్కొన్నారు. బాలిస్టిక్ క్షిపణుల నుంచి వచ్చే ముప్పును ఎదుర్కొనే దేశాల్లో ఇప్పుడు ఇండియా కూడా చేరినట్లు రక్షణ శాఖ పేర్కొన్నది. కొన్ని దేశాల వద్ద మాత్రమే ఈ టెక్నాలజీ అందుబాటులో ఉన్నది. బాలిస్టిక్ నుంచి ఖండాతర క్షిపణులను కూడా ఎదుర్కొనే రీతిలో కొత్త టెక్నాలజీని పరీక్షించారు. బీఎండీ సామర్థం ఉన్న ఎలైట్ దేశాల్లో ఇండియా చేరినట్లు రక్షణ శాఖ తెలిపింది. నావల్ యాంటీ షిప్ మిస్సైల్ మీడియం రేంజ్ పరీక్ష కూడా డీఆర్డీవో విజయవంతంగా పరీక్షించింది. యాంటీ షిప్ మిస్సైల్ ముప్పును కూడా సమర్థవంతంగా ఎదుర్కొన్నారు. అయితే మారీటైం దళాలకు ఇది చాలా శక్తిని ఇస్తుందని అధికారులు చెబుతున్నారు. సముద్రం మార్గంలో ఉన్న శత్రువులను చిత్తు చేసేందుకు యాంటీషిప్ మిస్సైల్ టెక్నాలజీ మన నౌకాదళాన్ని బలోపేతం చేస్తుందన్నారు. విదేశీ రక్షణ వ్యవస్థల కన్నా స్వదేశీ రక్షణ వ్యవస్థలపై ఆధారపడే రీతిలో డీఆర్డీవో పరీక్షలు చేపట్టినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఇవాళ డీఆర్డీవోకు శుభాకాంక్షలు తెలిపారు. మూడు రకాల పరీక్షల్లో పాల్గొన్న బృందాలకు ఆయన కంగ్రాట్స్ చెప్పారు. దేశ రక్షణ సామర్థ్యాన్ని పెంచే కీలకమైన టెక్నాలజీ పరీక్షలను భారత్ విజయవంతంగా చేపట్టినట్లు ఆయన తన ఎక్స్ అకౌంట్‌లో పేర్కొన్నారు. విభిన్న రకాల శత్రువులను ఎదుర్కొన్న రీతిలో ఆ రక్షణ పరీక్షలు జరిగినట్లు ఆయన వెల్లడించారు. లాంగ్ రేంజ్ బాలిస్టిక్ మిస్సైళ్లు, యాంటీ షిప్ మీడియం రేంజ్ సామర్థ్యాన్ని పరీక్షించినట్లు ఆయన చెప్పారు. బీఎండీ పరీక్షలో భాగంగా ఇంటర్‌సెప్టార్‌లు కచ్చితత్వంతో టార్గెట్లను ఛేధించినట్లు తెలిపారు. ఐసీబీఎంలను కూడా ఎదుర్కొనే సామర్థం భారత్ వద్ద ఉందన్నారు.

# కోర్టులో విడాకుల కేసు నడుస్తున్నా.. మామపై అల్లుడి దయాగుణం

## సొంతడబ్బుతోఖరీదైన వైద్యం..

## కోర్టులోనే కాళ్లపైపడి క్షమాపణ కోరిన భార్య



**న్యూఢిల్లీ,జూన్ 13:** విడాకులకోసం దరఖాస్తుచేసి భర్త, ఆమె కుటుంబాన్ని ముప్పుతిప్పలు పెట్టిన మామకు అత్యున్నతస్థాయి చికిత్సను అందించి ఆదుకున్న యువకుడి ఉదంతం అన్నివర్గాలప్రశంసలకు నోచుకుంది. ఢిల్లీకి చెందిన శిఖ, సౌరభ్‌లమధ్య చిన్నపాటి అహంకార పోరాటంతో విచ్ఛిన్నం అయింది. 2020లో శిఖ, సౌరభ్‌ల వివాహం ఎన్నో ఆశల మధ్య వైభవంగా జరిగింది. పెళ్లయిన కొద్దిరోజులకే వారి మధ్య అభిప్రాయ బేధాలు తలెత్తాయి. ఒకరినొకరు అర్థం చేసుకునే సహనం లోపించింది. ఈ క్రమంలో శిఖ భర్తపై, అతని కుటుంబంపై కోర్టులో వరకట్న వేధింపుల కేసు నమోదు చేసింది. ఆ క్షణం నుంచి ఆ కుటుంబంలో ప్రశాంతత కరువైంది. ఏ తప్పు చేయని భర్త, అతని తల్లిదండ్రులు కోర్టుల చుట్టూ, లాయర్ల చుట్టూ తిరగాల్సి వచ్చింది. ఏళ్ల తరబడి విచారణలు సాగాయి కానీ, అటు శిఖ అహం తగ్గలేదు ఇటు సౌరభ్ వైపు నుంచి సయోధ్య కుదరలేదు. న్యాయపోరాటాలు ఎప్పుడూ ఇరువైపులా విధ్వంసాన్నే మిగులుస్తాయి. కూతురి పెళ్లి పేరిట కోర్టుల చుట్టూ తిరగడం, లాయర్ల ఫీజులు భరించడం, సమాజంలో తలెత్తుకోలేకపోవడం శిఖ తండ్రిని తీవ్ర మానసిక క్షోభకు గురిచేసింది. కూతురి భవిష్యత్తు ఏమైపోతుందోనన్న ఆందోళన, నిరంతర ఒత్తిడి ఆయన ఆరోగ్యాన్ని క్షీణింపజేశాయి. ఒకరోజు ఆ భారం తట్టుకోలేక ఆయనకు తీవ్రమైన గుండెపోటు వచ్చింది. అత్యవసర స్థితిలో ఆయనను ఒక ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్చారు. ఆర్థిక ఇబ్బందుల వల్ల, సరైన వైద్య సదుపాయాలు అందక ఆయన అక్కడ మరణంతో పోరాడుతున్నారు. కూతురు పెట్టిన కేసు చివరికి కన్నతండ్రి ప్రాణాలకే ముప్పుగా పరిణమించిన దారుణ పరిస్థితి అది. తనను, తన కుటుంబాన్ని కోర్టుల చుట్టూ తిప్పి నరకం చూపించిన భార్య తండ్రి చావుబతుకుల్లో ఉన్నాడనే వార్త భర్త సౌరభ్‌కు తెలిసింది. సాధారణంగా అయితే కక్ష సాధింపులు, కేసు వ్యవహారాలు.. వాళ్ల మధ్య దూరాన్ని పెంచుతాయి. కానీ, సౌరభ్ తనలోని అహాన్ని పక్కన పెట్టాడు. తక్షణమే స్పందించి, ఆయన్ను ప్రభుత్వ ఆసుపత్రి నుండి దేశంలోనే అత్యుత్తమమైన కార్పొరేట్ హాస్పిటల్ మేదాంత్తకు తరలించాడు. తన సొంత డబ్బు ఖర్చు పెట్టి, దగ్గరుండి పర్యవేక్షించి, ఒక కన్నకొడుకులా నిలబడి ఆ ముసలి ప్రాణాన్ని కాపాడాడు. ఆ తర్వాత కొద్దిరోజులకే కోర్టులో తదుపరి విచారణ వాయిదా వచ్చింది. జడ్జి బెంచ్ మీదకు వచ్చారు. లాయర్లు తమ వాదనలు వినిపించడానికి సిద్ధమయ్యారు. విడాకుల పత్రాలు టేబుల్ మీద ఉన్నాయి. అందరినీ దిగ్భ్రాంతికి గురిచేస్తూ శిఖ ముందడుగు వేసింది. లాయర్ చేతిలోని విడాకుల పత్రాలను లాక్కుని, జడ్జి ముందే వాటిని ముక్కలు ముక్కలుగా చింపేసింది. కన్నీళ్లతో భర్త సౌరభ్ కాళ్లపై పడింది. ఏ చట్టాలు, ఏ లాయర్లు, ఏళ్ల తరబడి సాగిన కోర్టు వాదనలు మార్చలేని ఆమె కఠిన హృదయాన్ని భర్త చూపిన ఆ ఒక్క మానవత్వం, నిష్కల్మషమైన కరుణ పూర్తిగా మార్చేసింది. తప్పుడు కేసుల కంటే, ఈగోల కంటే బంధం గొప్పదని గ్రహించిన ఆమె భర్తతో కలిసి జీవించడానికి సిద్ధమైంది. ఈ విడాకుల ఉదంతం నేటి ఆధునిక సమాజానికి, ముఖ్యంగా వైవాహిక బంధాల్లో ఉన్నవారి సంబంధాలకు అద్దం పడుతోంది. కోర్టులు, కాగితాలు మనసులను కలపలేవు.

# జులై 9న ఖొమేనీ అంత్యక్రియలు



**టెహ్రాన్,జూన్ 13:** ఇరాన్ మాజీ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ అంత్య క్రియలు వచ్చే నెల 9న జరగనున్నాయి. ఖమేనీ స్వస్థలమైన మషాద్‌లో అంత్య క్రియలు నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని ఇరాన్ ప్రభుత్వం ప్రకటించింది. జూలై 4 నుంచి ఖమేనీ అంత్యక్రియల ప్రక్రియ మొదలవుతుందని తెలిపింది. అమెరికాఇజ్రా యెల్ సైన్యాలు ఫిబ్రవరి 28న ఇరాన్ పై చేసిన దాడుల్లో ఖమేనీ మర ణించారు. అయితే భీకర యుద్ధం కారణంగా ఆయన అంత్య క్రియలు వాయిదాపడుతూ వస్తున్నాయి. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులు, భద్రతా కారణాలు, మొహర్రం మాసంలో ప్రజల సంతాప కార్యక్రమాలు ఉన్నందున వాయిదా పడ్డాయి. ఇస్లామిక్ ప్రకారం మొదటి నెల అయిన మొహర్రం ప్రారంభంలో మూడు రోజుల కార్యక్రమాన్ని నిర్వహించాలని ఇరాన్ అంతకుముందు భావించింది. అయితే కర్బలా యుద్ధంలో అమరులైన ప్రముఖ షియా నాయకుడు ఇమామ్ హుస్సేన్ స్మారకార్థం సంతాప కార్యక్రమాలను పూర్తి చేసుకునేందుకు అంత్యక్రియలు నిర్వహించాలని నిర్ణయించారు.

# భారత్‌కు భద్రతామండలి సభ్యత్వం సహేతుకమే

## అంతర్జాతీయ అణుఇంధనసంస్థ ఛీఫ్ మారియానో గ్రాస్సీ



**వియన్నా,జూన్ 13:** అంతర్జాతీయంగా భౌగోళిక రాజకీయాలు వేగంగా మారుతున్న తరుణంలో అంతర్జాతీయ వేదికపై భారత్‌కు అరుదైన మైలేజ్ లభించింది. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో భారత్‌కు శాశ్వత సభ్యత్వం లభించాలనే డిమాండ్ అత్యంత సహేతుకమైనదని అంతర్జాతీయ అణుశక్తి సంస్థ అధినేత రాఫెల్ మరియానో గ్రాస్సీ స్పష్టం చేశారు. ఐక్యరాజ్యసమితి తదుపరి సెక్రటరీ జనరల్ రేసులో అత్యంత కీలక అభ్యర్థిగా ఉన్న గ్రాస్సీ వియన్నాలో ప్రత్యేక ఇంటర్వ్యూలో ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రపంచ అణు పర్యవేక్షణ సంస్థ అధినేతగా, సుదీర్ఘ అనుభవం ఉన్న అంతర్జాతీయ దౌత్యవేత్తగా ఆయన చేసిన ఈ వ్యాఖ్యలు భద్రతా మండలి విస్తరణపై భారత్ చేస్తున్న సుదీర్ఘ పోరాటానికి బలమైన మద్దతుగా నిలిచాయి. ఐక్యరాజ్యసమితి ప్రస్తుత నిర్మాణాన్ని మార్చాల్సిన అవసరాన్ని రాఫెల్ గ్రాస్సీ బలంగా సమర్థించారు. భారత్ లాంటి దేశాలు ఈ రకమైన ఆకాంక్షను కలిగి ఉండటం కేవలం సహేతుకమే. ఎందుకంటే 1945 నాటి ప్రపంచం వేరు, ప్రస్తుత 2026 నాటి ప్రపంచం వేరని ఆయన వ్యాఖ్యానించారు. ఐక్యరాజ్యసమితి ప్రస్తుత నిర్మాణం పాతబడిపోయిందని, సమకాలీన వాస్తవాలకు అనుగుణంగా తక్షణ సంస్కరణలు అవసరమని భారత్ ఎప్పటి నుంచో చెప్తున్న వాదనతో ఆయన ఏకీభవించారు. అయితే ఒక దౌత్యవేత్తగా సమతుల్యతను పాటిస్తూ సమితి సెక్రటరీ జనరల్ పదవికి కొన్ని పరిమితులు ఉంటాయని ఎవరికి సభ్యత్వం ఇవ్వాలనేది సభ్య దేశాల మధ్య విస్తృతమైన ఒకకాభిప్రాయంపైనే ఆధారపడి ఉంటుందని గుర్తుచేశారు. కానీ అధికారిక సభ్యత్వంతో సంబంధం లేకుండానే నేడు ప్రపంచంలో భారత్ యొక్క ప్రభావం, ఆర్థిక, భౌగోళిక రాజకీయ బలం ఎవరూ తిరస్కరించలేని విధంగా పెరిగిందని ఆయన కొనియాడారు. ప్రస్తుత యూఎన్ సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రెస్ రెండో విడత పదవీ కాలం 2026 డిసెంబర్ 31తో ముగియనుంది. దీంతో 2027 జనవరి నుంచి కొత్త చీఫ్ బాధ్యతలు చేపట్టనున్నారు. ఈ రేసులో రాఫెల్ గ్రాస్సీ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది.

అయితే ఈసారి ఐరాస చరిత్రలోనే మొదటి సారిగా ఒక మహిళా నేతకు ఈ అత్యున్నత పీఠాన్ని అప్పగించాలనే డిమాండ్ కూడా బలంగా ఉంది. చిలీ మాజీ అధ్యక్షురాలు మిచెల్ బాచెలెట్, సీనియర్ ఐరాస అధికారి రెబెకా గ్రిన్‌స్పాన్ వంటి మహిళా నేతలు ఈ రేసులో ఉన్నారు.

# ట్రంప్ 80వ బర్త్‌డేకు వైట్‌హౌస్‌లో ప్రత్యేక ఏర్పాట్లు!



**వాషింగ్టన్,జూన్ 13:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ 80వ పుట్టినరోజు వేడుకలు వేడుకలు స్పెషల్‌గా నిర్వహించేందుకు వైట్‌హౌస్‌లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఇందుకు సంబంధించిన ఫొటోలు వైరల్ అవుతున్నాయి. జూన్ 14న నిర్వహించే రాత్రి ఈవెంట్‌కు దాదాపు రూ.500 కోట్లు ఖర్చు చేస్తున్నట్లుగా తెలుస్తోంది. ఇక ట్రంప్ పుట్టినరోజును పురస్కరించుకుని వైట్‌హౌస్ దగ్గర అల్టిమేట్ ఫైటింగ్ ఛాంపియన్‌షిప్ ఫ్రీడమ్ 250 ఈవెంట్‌గా నిర్వహిస్తున్నారు. ఇందు కోసం సన్నాహాలు జరుగుతున్నాయి. పలు దేశాలకు చెందిన ఫైటర్లు ఇందులో పాల్గొననున్నారు. ఒకవైపు ట్రంప్ బర్త్‌డే వేడుకలు ఇంకోవైపు ఛాంపియన్‌షిప్ క్రీడలతో వైట్‌హౌస్ కళకళలాడుతోంది. ఈ వేడకను అమెరికన్ పోరాట స్ఫూర్తికి తరంలో ఒక్కసారే వచ్చే వేడుక అని వైట్ హౌస్ అభివర్ణించింది. ఇక అమెరికా 250 స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఫ్రీడం 250 అని ఈవెంట్‌కు పేరు పెట్టారు. గతేడాది రెండోసారి ట్రంప్ అధికారంలోకి వచ్చారు.

అయితే ఈసారి చాలా దూకుడుగా వెళ్తున్నారు. రెండోసారి అధికారంలోకి రాగానే ప్రపంచ దేశాలపై వాణిజ్య యుద్ధాన్ని ప్రకటించారు. ఇక ఏడాది ప్రారంభంలో వెనిజులా అధ్యక్షుడు మదురోను కిడ్నాప్ చేయించారు. ఇక ఇరాన్‌పై యుద్ధం ప్రకటించారు. ప్రస్తుతం ఇరాన్‌తో శాంతి ఒప్పందం దిశగా ట్రంప్ వెళ్తున్నారు. ఇలాంటి తరుణంలో ట్రంప్ బర్త్‌డే సెలబ్రేషన్స్ చేసుకుంటున్నారు. ఇక వచ్చే వారం ఫ్రాన్స్‌లో జరిగే జీ7 సదస్సుకు కూడా హాజరు కాబోతున్నారు.

# సంక్షిప్త వార్తలు

## 130 కిలోమీటర్లు కారు డ్రైవ్ చేసిన సిఎం విజయ్

**చెన్నై,జూన్ 13:** తమిళనాడు రాజకీయాల్లో సంచలన విజయం సాధించి, ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహించిన కోలీవుడ్ స్టార్ విజయ్ తనదైన స్టైల్‌తో అందరినీ ఆశ్చర్యపరుస్తున్నారు. పరిపాలన చేపట్టిన కొన్ని రోజులకే తన అసాధారణమైన శైలితో వార్తల్లో నిలుస్తున్నారు.

తాజాగా నిన్న ఆయన కర్ణాటకలోని ప్రముఖ కొల్లూరు మూకాంబిక అమ్మవారి ఆలయాన్ని సందర్శించిన సంగతి తెలిసిందే. అక్కడ దర్శనం ముగించుకున్న తర్వాత ఆయన చేసిన ఒక పని ఇప్పుడు సోషల్ మీడియాను షేక్ చేస్తోంది.

గుడి నుంచి ఎయిర్‌పోర్ట్ వరకు దాదాపు 130 కిలోమీటర్ల మేర తన కారును ఆయనే స్వయంగా డ్రైవ్ చేసుకుంటూ వెళ్లారు. కొల్లూరు మూకాంబిక ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన సీఎం విజయ్.. అమ్మవారికి 1.6 కేజీల బరువున్న భారీ వెండి ఖడ్గాన్ని కానుకగా సమర్పించారు.

## టెక్సాస్‌లో కాల్పులు.. ఒకరి మృతి, 10 మందికి గాయాలు



**హూస్టన్,జూన్ 13:** అమెరికాలోని టెక్సాస్‌లో కాల్పుల ఘటన జరిగింది. ఓ ఆగంతకుడు జరిపిన కాల్పుల్లో ఒకరు మృతిచెందగా, మరో పది మంది గాయపడ్డారు. పోలీసులతో జరిగిన ఎదురుకాల్పుల్లో అనుమానిత షూటర్ హతమయ్యాడు. శుక్రవారం తెల్లవారుజామున వెస్ట్ టెక్సాస్ మిడ్‌లాండ్ ఆయిల్ సిటీలో ఈ ఘటన జరిగింది. షూటింగ్ జరుగుతున్న ఎమర్జెన్సీ కాల్స్ రావడంతో ఆ ప్రాంతానికి పోలీసులు వెళ్లారు. ఆ షూటర్‌ను తరిమే ప్రయత్నం చేశారు. ఆ క్రమంలో ఎదురుకాల్పులు జరిగాయి. ఓ వెటర్నరీ క్లినిక్‌లోకి ప్రవేశించిన దుండగుడిని చుట్టుముట్టి కాల్చేశారు.

## అహ్మదాబాద్ ఎయిర్‌పోర్టులో రూ.4.27 కోట్ల బంగారం స్వాధీనం

**అహ్మదాబాద్,జూన్ 13:** గుజరాత్‌లోని అహ్మదాబాద్‌ఎయిర్‌పోర్టులో కస్టమ్స్ అధికారులు రూ.4.27 కోట్ల విలువైన బంగారాన్ని స్వాధీనంచేసుకున్నారు. ఈమొత్తం బంగారం ఒక స్పీకర్ బాక్స్‌లో ఉంచి విమానం మరుగుదొడ్డిలో ఉంచారు. సర్దార్ వల్లభ్‌భాయ్‌పటేల్ అంతర్జాతీయ విమానాశ్రయంలో శుక్రవారం ఇండిగో విమానంలో ఈ సంఘటన జరిగింది. దుబాయ్‌నుంచి వచ్చిన ఈ విమానంలో బంగారం స్మగ్లింగ్ జరుగుతోందన్న సమాచారంతో కస్టమ్స్ అధికారులు నిఘావేసారు. విమానం క్షుణ్ణంగా ఇంజినీర్లతోకలిసి తనిఖీచేసారు. నల్లటి ప్లాస్టిక్ టేపులు వేసి ఉన్న రెండు పౌచ్‌లు స్పీకర్‌బాక్స్‌లో ఉంచినట్లు గుర్తించారు.

## అమెరికా దాడులు.. రక్తపిపాసి హతం

**వాషింగ్టన్, జూన్ 13:** వెనుజులాలో మాదకద్రవ్యాల అక్రమ రవాణా నెట్‌వర్క్‌పై దృష్టి పెట్టిన అగ్రరాజ్యం అమెరికా తాజాగా కీలక ఆపరేషన్ చేపట్టింది. ఇందులో డ్రగ్స్‌ముఠా ట్రెన్ డి ఆరాగ్వా గ్యాంగ్‌కు చెందిన లీడర్ హెక్టర్ రస్తెన్‌ఫోర్డ్ గురెరో ఫ్లోర్స్ హతమయ్యాడు. ఈ విషయాన్ని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్వయంగా వెల్లడించారు. 'ట్రెన్ డి ఆరాగ్వా ఉగ్రవాదులకు వెనుజులాలోనే కాదు.. ఈ భూమ్మీద ఎక్కడా సురక్షిత స్థావరం ఉండదు. హంతకులు, డ్రగ్ లార్డ్స్‌ఎక్కడున్నా వేటాడుతాం. వారిని నరకానికి పంపిస్తాం' అని ట్రంప్ వెల్లడించారు. ఈ వారం ఆరంభంలో అమెరికా ఈ ఆపరేషన్‌ను చేపట్టింది. అత్యంత పక్కా సమాచారంలో ట్రెన్ డి ఆరాగ్వా ముఠాకు చెందిన ఓ కాంపౌండ్‌పై బాంబుల వర్షం కురిపించింది.

## దారి మళ్లించిన షార్జా సౌదీ అరేబియా విమానం!

**కొచ్చిన్, జూన్ 13:** షార్జా నుంచి కోజికోడ్ చేరుకోవాల్సిన ఎయిర్ అరేబియా విమానాన్ని శనివారం దారి మళ్లించారు. ఆ విమానం కొచ్చిన అంతర్జాతీయ ఎయిర్‌పోర్టులో ల్యాండ్ అయ్యింది. సాంకేతిక సమస్య తలెత్తడం వల్ల దాన్ని దారి మళ్లించారు. ఎయిర్ అరేబియా ఫ్లయిట్ జీ9 454 విమానంలోని ఇంజిన్ రివర్స్ థ్రస్ట్ సిస్టమ్‌లో సాంకేతిక సమస్య తలెత్తిందని, దాని వల్ల దాన్ని కొచ్చిన్‌లో దించారని కొచ్చిన ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్ ప్రతినిధి తెలిపారు. ప్రోటోకాల్ ప్రకారం ఇవాళ తెల్లవారుజామున కొచ్చిన్ విమానాశ్రయంలో ఎమర్జెన్సీ ప్రకటించారు.



14-6Pg6exHMNWJQE_14-6Pg6exHMNWJQE.qxd 13/Jun/26 11:58 PM Page 1





## అభివృద్ధి పనులు, ప్రయాణికుల సౌకర్యాల సమీక్ష

### తిరుపతి రైల్వే స్టేషన్‌లో సౌత్ కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్

**తిరుపతి,జూన్ 13ప్రభాతవార్తప్రతినిధి:** సౌత్ కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్ సందీప్ మాథూర్ శనివారం తిరుపతి రైల్వే స్టేషన్‌ను తనిఖీ చేశారు. కొత్తగా ఏర్పాటైన సౌత్ కోస్ట్ రైల్వే జోన్ ఏర్పాటైన అనంతరం, ఈ విభాగంలో ఆయన తొలి తనిఖీచేపట్టారు. విజయవాడ- గూడూరు- తిరుపతి రైల్వే మార్గంలో విస్తృత తనిఖీలు నిర్వహించిన అనంతరం, తిరుపతి రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న వివిధ మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులు, ప్రయాణికుల సౌకర్యాల కల్పనపై ఆయన సమీక్ష నిర్వహిం చారు. ముఖ్యంగా స్టేషన్ పునర్వికాస ప్రాజెక్టు పురోగతిని పరిశీలించిన జనరల్ మేనేజర్, సర్క్యులేటింగ్ ఏరియా, లిఫ్టులు, ఎస్కలేటర్లు, ప్లాట్‌ఫారాలు, కాంకోర్స్ ప్రాంతం తదితర సౌక ర్యాలను తనిఖీ చేశారు. నిర్మాణ పనులు నిర్వ హిస్తున్న అధికారులతో మాట్లాడి, పనుల పురోగతిపై వివరాలు తెలుసుకున్నారు. నిర్దేశిత గడువులో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం గుం తకల్ రైల్వే డివిజన్ అధికారులు నిర్వ హించిన సమగ్ర ప్రజెంటేషన్‌లో కొనసాగుతున్న ప్రాజెక్టులు, అభివృద్ధి కార్యక్రమాలు, ఆపరేషనల్ విజయాలు, భవిష్యత్ కార్యాచరణ ప్రణాళి కలపై జనరల్ మేనేజర్‌కు వివరించారు. ఈ తనిఖీల సందర్భంగా సౌత్ కోస్ట్‌రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ ఇంజనీర్ బీఎస్‌కే రాజ్‌కుమార్, ప్రిన్సిపల్ చీఫ్ సిగ్నల్ టెలికాం ఇంజనీర్ ఓబీ సురేష్ కుమార్, ప్రిన్సిపల్ చీఫ్‌ఆపరేషన్స్ మేనేజర్ వినీత్ కుమార్, చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ అంకుష్ గుప్తా,గుంతకల్ డివిజనల్ రైల్వే మేనేజర్ చంద్రశేఖర్ గుప్తా, తిరుపతి స్టేషన్ డైరెక్టర్ కుప్పాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



## ముక్కంటీశుని చెంత రాహుకేతుదోష నివారణ పూజలు

**శ్రీకాళహస్తి, జూన్ 13 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తీశ్వరాలయం శనివారం భక్తులతో కిట కిట లాడింది. త్రయోదశి కావటంతో భక్తులు కదలి తరంగాల్లా కదలి వచ్చారు. శనీశ్వరునికి మూడు సార్లు అభిషేకాలు నిర్వహించారు. ఉదయం నుంచి ఆల యంలో ఎటు చూసినా భక్తుల శివనామస్మ రణతో పునీతమైంది. శనీశ్వరుని ఆలయం వద్ద భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు. వేదపండితులు, అర్చకులు స్వామి సన్నిధిలో వేద మంత్రాలను పఠిస్తూ షోడషాభిషేకాలు జరిపారు. ఇక రాహు కేతుదోష నివారణ పూజలు కూడా రికార్డు స్థాయిలో జరిగాయి. ఆలయంలో అడుగుపెడితే భక్తిభావంతో తన్మయత్వం చెందుతున్నారు. స్వామి వారిని దర్శించుకొని వచ్చిన భక్తులకు 'అభయ వెంకటేశ్వరస్వామి' దర్శనం పునీతం చేస్తుంది. ముఖ్యంగా రాహు కేతుదోష నివారణ పూజలు జరిపించుకుంటున్న వారి సంఖ్య గణనీయంగా పెరిగింది. శనివారం ఓ వైపు సామాన్య భక్తుల తాకిడి మరోవైపు అతిథులతో కళకళ లాడింది.

దేవస్థానం అందించిన సమాచారం మే రకు సుమారు 30వేల మంది శనివారం స్వామి అమ్మవార్లును దర్శనం చేసుకున్నారని ఆలయాధికారులు చెబుతున్నారు. రికార్డుస్థాయిలో రాహుకేతుదోష నివారణ పూజలు జరిగినట్లు వివరించారు.

## డీఎస్సీ నియామకాలపై సీబీఐ విచారణ జరిపించాలి: మాజీ సిఎం జగన్

**విజయవాడ జూన్ 13 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నిర్వహించిన డీఎస్సీ నియామకాలపై మాజీ ముఖ్యమంత్రి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. మెగా డీఎస్సీగా ప్రచారం చేసిన నియామక ప్రక్రియ వాస్తవానికి మెగా స్కామ్‌గా మారిందని ఆరోపిస్తూ ఈ వ్యవహారంపై స్వతంత్ర సీబీఐ దర్యాప్తు జరపాలని డిమాండ్ చేశారు. సోషల్ మీడియా వేదిక ఎక్స్‌లో స్పందించిన జగన్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ కుట్ర కారణంగా లక్షలాది మంది అభ్యర్థుల భవిష్యత్తు దెబ్బతిన్నదని విమర్శించారు. 16వేల టీచర్ పోస్టుల భర్తీలో పాదర్శకత పూర్తిగా దెబ్బతిందని నియామక ప్రక్రియపై ఆనేక అనుమానాలు నెలకొన్నాయని పేర్కొన్నారు. డీఎస్సీ ప్రక్రియలో ప్రభుత్వ సంస్థాగత భద్రతా వ్యవస్థలను కావాలనే నిర్వీర్యం చేశారని జగన్ ఆరోపించారు. ప్రశ్నపత్రాల తయారీ, పరీక్షల నిర్వహణ వంటి కీలక బాధ్యతలను ఒకే అధికారికి అప్పగించడం అనుమానాలకు తావిస్తోందన్నారు. అలాగే అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు గోప్యమైన బాధ్యతలు అప్పగించడం కూడా ప్రశ్నలు రేకెత్తిస్తోందని పేర్కొన్నారు. ప్రశ్నపత్రాల తయారీ ప్రక్రియలో భాగమైన ఒక ఉద్యోగి ఫస్ట్ ర్యాంక్ సాధించడం పేపర్ లీక్‌కు నిదర్శనమని ఆరోపించారు.

## బిజెపి పాలనలో ప్రజలకు మేలు శూన్యం

### రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులు ఏమయ్యాయి!

### కాణిపాకం దేవస్థాన ఉద్యోగాల్లో దళితులకు ప్రాధాన్యత: మాజీ కేంద్ర మంత్రి చింతామోహన్

**కాణిపాకం, జూన్ 13 ప్రభాతవార్త:** గత పన్నెండు సంవత్సరాల భారతీయ జనతా పార్టీ పాలనలో దేశంలో ప్రజలకు జరిగిన మేలు శూన్యమని, ప్రతి ఇంట్లో ఆర్థిక సంక్షోభం కన్పిస్తోందని, దళితులు దుర్భర జీవితాలను గడుపుతున్నారని మాజీ కేంద్ర మంత్రి చింతామోహన్ అన్నారు. 11 సంవత్సరాలు వైఎస్ కుటుంబం, 19 సంవత్సరాలు నారా వారి కుటుంబం కలిపి 30 సంవత్సరాలు రాష్ట్రంను రెండు కుటుంబాలు పాలించాయని, తద్వారా ఆ రెండు కుటుంబాలు కోటీశ్వరులు అయ్యాయని విమర్శించారు. ప్రస్తుతం గ్యాస్ ధర, ఎరువులు, పెట్రోల్,



కాణిపాకం ఎస్సీకాలనీలో ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న మాజీ కేంద్ర మంత్రి చింతామోహన్

శనివారం కాణిపాకం ఎస్సీ కాలనీలో మాజీ కేంద్ర మంత్రి చింతామోహన్ పర్యటించి దళితులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాజీ కేంద్ర మంత్రి విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రెండేళ్ళ పాలన, అభివృద్ధిపై తిరుపతిలో కోట్ల రూపాయలు ఖర్చు చేసి సభ నిర్వహించారని, దీనివల్ల ఉపయోగమేమిటని ఆయన ప్రశ్నించారు. రాష్ట్రానికి 23 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు తీసుకువచ్చామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చెప్తున్నారని, అయితే శ్రీకాకుళం నుండి చిత్తూరు జిల్లా వరకకు ఏ జిల్లాలో అభివృద్ధి మాత్రం కన్పించడం లేదని ఎద్దేవా చేశారు. పేద ప్రజల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చిన ఎస్సీ, ఎస్టీ, ఓబిసీ కార్పొరేషన్లను చంద్రబాబునాయుడు, వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వాలు రద్దు చేశాయని ధ్వజమెత్తారు. రద్దు చేసిన ఈ కార్పొరేషన్లను తిరిగి పునరుద్దరించాలని చింతామోహన్ డిమాండ్ చేశారు. 19 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు రాష్ట్రానికి చేసిన అభివృద్ధి ఏమిటో చెప్పాలని నిలదీశారు. డిజీల్, బియ్యం, మందులు, నిత్యవసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయని, కానీ సామాన్యుల జీవితాల్లో మార్పు రాలేదని చింతామోహన్ పేర్కొన్నారు. రాష్ట్రంలో తెలుగుదేశం, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పాలన చూశాక తమిళనాడు రాష్ట్రం తరహాలో ప్రజలు కాంగ్రెస్ వైపు మొగ్గు చూపుతున్నారని, కాంగ్రెస్ మళ్ళీ అధికారంలోకి రావాలని ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. ఇదిలా వుండగా కాణిపాకం దేవస్థానంలో ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో దళితులకు ప్రాధాన్యత కల్పించాలని మాజీ మంత్రి చింతామోహన్ డిమాండ్ చేశారు. దేవస్థానంలో కాణిపాకం ఎస్సీ కాలనీకు చెందిన దళితులు ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ పద్దతిలో చిన్న చిన్న ఉద్యోగాలు చేస్తున్నారని వారికి వయో పరిమితి విధించి విధుల నుండి తొలగించడం దారుణమన్నారు. ప్రభుత్వం స్పందించి తొలగించిన కార్మికులను సత్వరం విధుల్లోకి తీసుకోవాలని చింతామోహన్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పిసిసి మాజీ కార్యదర్శి పరదేశి తదితరులు పాల్గొన్నారు.

# యూరియాపై అపోహలు వీడండి

## జిల్లాలో సమృద్ధిగా యూరియా: కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి

**కోవూరు (నెల్లూరు), జూన్ 13, ప్రభాతవార్త :** రైతు సంతోషంగా ఉంటేనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి పేర్కొన్నారు. శనివారం నెల్లూరులోని తమ కార్యాలయం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ జిల్లాలో సమృద్ధిగా యూరియా నిల్వలు ఉన్నాయని, అన్నదాతలు యూరియా పై అపోహలు వీడాలని అన్నారు. కోవూరు నియోజకవర్గంలో యూరియా కొరత ఉందనేది కేవలం అపోహ మాత్రమే అన్నారు. ప్రతిపక్షాలు పనిలేక చేస్తున్నారని, రైతులు అర్థం చేసుకోవాలన్నారు. ప్రస్తుత సీజన్‌లో కోవూరు నియోజకవర్గంలో మొత్తం 55 వేల ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారన్నారు. ఇప్పటికే 42 వేల ఎకరాల్లో నాట్లు పూర్తయ్యాయన్నారు. మరో 10 రోజుల్లో మిగతా 13 వేల ఎకరాల్లో నాట్లు పూర్తవుతాయన్నారు. నియోజకవర్గానికి మొత్తం 7 వేల టన్నుల యూరియా అవసరం ఉండగా ఇప్పటికి 4.5వేల టన్నుల యూరియా పంపిణీ చేశామన్నారు. ప్రస్తుతం వెయ్యి టన్నులు రైతులకు అందుబాటులో యూరియా నిల్వలు ఉన్నాయన్నారు. అదనంగా కోవూరు మండలంలోని



ఇనమడుగు గోదాముల్లో మరో 2.5 వేల టన్నులు సిద్ధంగా ఉన్నాయన్నారు. అవసరమైతే కొన్ని గంటల్లోనే సొసైటీలు, డీలర్ల వద్దకు చేరుతాయన్నారు. కోవూరు మండలంలో 9 వేల ఎకరాలకు గాను 850 టన్నులు ఇచ్చామని, కొడవలూరు మండలంలో 10,200 ఎకరాలకు గాను 1100 టన్నులు ఇచ్చామన్నారు. విడవలూరు మండలంలో 8,800 ఎకరాలకు గాను 1 వెయ్యి టన్నులు పంపిణీ చేయగా, బుచ్చిరెడ్డి పాళెం మండలంలో 7600 ఎకరాలకు గాను 1350 టన్నులు ఇచ్చామన్నారు. ఇందుకూరుపేటలో 6 వేల ఎకరాలకు గాను 600 టన్నులు ఇవ్వడం జరిగిందన్నారు. క్షేత్ర స్థాయిలో రైతులకు యూరియా కొరత ఉండకూడదని, యూరియా పంపిణీలో అక్రమాలకు తావు లేకుండా ఉండాలని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏపీ ఏఐఎంఎస్ యాప్ తీసుకువచ్చిందన్నారు. ఈ యాప్ ప్రయోగాత్మకంగా నెల్లూరులో ప్రారంభించడం జరిగిందన్నారు. జిల్లాలో వ్యసాయశాఖ యాప్ ద్వారానే యూరియా పంపిణీ చేస్తోందన్నారు. యాప్‌లో మొదట ఎకరాకు ఒకటిన్నర బస్తాలు ఉండగా అది సరిపోదని సిఎం నారా చంద్రబాబు నాయుడుకి, మంత్రుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. వారు రెండున్నర బస్తాలకు పెంచారన్నారు. రైతుల విజ్ఞప్తి మేరకు మళ్లీ సంప్రదించి ఇప్పుడు ఎకరాకు 3 బస్తాలు వచ్చేలా చేశామన్నారు. భూమి యజమానులకు, చెరువు భూములు, వెబ్‌ల్యాండ్ రిజిస్టర్ కాని వారికి కూడా యాప్‌లో సమస్యలు లేవన్నారు. కేవలం కొందరు కౌలు రైతులకు మాత్రమే పంపిణీలో ఆలస్యం అవుతోందని, కౌలు రైతులకు భూమి యజమాని వివరాలు తెలియక పోవడమే ఈ ఆలస్యానికి కారణమన్నారు. వ్యవసాయ శాఖా అధికారులు రైతుల వివరాలు సేకరించి యాప్‌లో నమోదు చేస్తున్నారని త్వరలోనే సమస్య తీరిపోతుందన్నారు. బుచ్చిరెడ్డిపాలెంలో 7600 ఎకరాలకు 1350 టన్నుల యూరియాను ఈపాటికి అందజేశామని,రాష్ట్ర అభివృద్ధి చూసి ఓర్వలేక వేరే పని లేక యూరియాపై రాద్ధాం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పెన్నాడెల్టా కమిటి ఛైర్మెన్ జెట్టి రాజగోపాల్ రెడ్డి, రాష్ట్ర ఎంఎస్ఎంఈ డైరెక్టర్ రావిళ్ల వీరేంద్రనాయుడు, కోవూరు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కొల్లారెడ్డి సుధాకర్ రెడ్డి, సీనియర్ టిడిపి నాయకులు బెజవాడ వంశీకృష్ణారెడ్డి, కొల్లారెడ్డి సునీల్ కుమార్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## వైభవంగా నృసింహుని కల్యాణోత్సవం

### రాబడి రూ. 11,79,036

**రాపూరు (నెల్లూరు), జూన్ 13, ప్రభాతవార్త :** ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో పెద్ద ఎత్తున శ్రీ పెనుశిల లక్ష్మీనృసింహా స్వామి వారి దర్శనానికి వచ్చిన భక్తులతో శనివారం ఆలయ ప్రాంగణం నిండిపోయింది. పెద్ద ఎత్తున భక్తులు కోనకు చేరుకొని తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకొని స్వామి వారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. ఇందులో బాగంగా తెల్లవారుజామున స్వామి వారి మూల మూర్తికి ప్రత్యేకంగా అభిషేకం, గోపూజ, పూలాంగి సేవ, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 9.30కి స్వామి వారికి ఆదిలక్ష్మీ, చెంచులక్ష్మీ అమ్మవార్లతో వైభవంగా స్వామి వారి కళ్యాణాన్ని ఆలయ అర్చక స్వాములు, వేద పండితులు వేదమంత్రోచ్ఛరణలతో శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం స్వామి వారికి తిరుచ్చి ఉత్సవం, గిరిజన వాయిద్యాల నడుమ వేడుకగా నిర్వహించారు. అనంతరం స్వామి వారికి సహస్ర దీపాలంకరణ సేవ నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు ఈ కార్యమంలో పాల్గొని స్వామి వారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. పెద్ద ఎత్తున వచ్చిన భక్తులకు కావలసిన భోజన, వసతి సౌకర్యాలతో పాటు, క్యూలైన్లలో భక్తులకు మంచినీరు, మజ్జిగ పంపిణీ వంటి ఏర్పాట్లను ఆలయ ఉప కమీషనర్ కోవూరు జనార్ధన్ రెడ్డి ప్రత్యక్ష



పర్యవేక్షణ నిర్వహించారు.

శనివారం స్వామి వారికి భక్తుల ద్వారా రూ.11,79,036 రాబడి వచ్చినట్లు ఆలయ ఉప కమీషనర్ కోవూరు జనార్ధన్ రెడ్డి తెలిపారు. స్వామి వారి నిత్య అన్నదానానికి విరాళల రూపేణా రూ.4,23,460లు, శ్రీవారి అభిషేకం టిక్కెట్ల విక్రయం ద్వారా రూ. 29,250లు, నిత్య కళ్యాణం ద్వారా రూ, 50,061లు, 100 రూపాయిల ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా రూ.2,22,200లు,దేవస్థానం వసతి ద్వారా రూ.27,500లు, తలనీలలు 2,799 మంది సమర్పించగా తద్వారా రూ. 1,11,900 లు, లడ్డు ప్రసాదాల విక్రయం ద్వారా రూ. 2,77,250లు, పులిహోరా విక్రయం ద్వారా రూ.36,350లు,వాహనాల పూజల ద్వారా రూ.1,065లు చొప్పున మొత్తం రూ.13,62,798 రాబడి వచ్చినట్లు జనార్ధన్ రెడ్డి తెలిపారు. స్వామి వారి అన్న ప్రసాదాన్ని 2466 మంది స్వీకరించారని, రాత్రి 7 గంటల 20 నిమిషాల వరకు మొత్తం 9,950 మంది భక్తులు స్వామి,అమ్మవార్లను దర్శించుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ సూపరిడెంట్ పాలవల్లి లక్ష్మీ నారాయణ, ప్రధానార్చకులు గుండ్లూరు రామయ్య స్వామి, పెంచల పెంచలయ్య స్వామి, ముఖ్య అర్చక స్వామి గుండ్లూరు శశి స్వామి, అర్చక స్వాములు మధు స్వామి, వర్ధన్ స్వామి, వెంకట బాలాజీ స్వామి, వినోద్ స్వామి, నాగరాజు స్వామి, సాయి స్వామి, దేవస్థానం సిబ్బంది తదితరులున్నారు.

## రేపు గన్నవరం విమానాశ్రయంలో ప్రత్యేక కార్యక్రమాలు

**విజయవాడ, జూన్ 13, ప్రభాతవార్త :** విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయంలో గత 12ఏళ్ళ ప్రగతిని పురస్కరించుకుని ఈనెల 15వతేదీ యాత్రీ సువిధా దివస్ నిర్వహించేందుకు విమానాశ్రయ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. 15వతేదీ విమానాశ్రయం నుండి రాకపోకలు సాగించే ప్రయాణికులకు తిలకంతో బొట్టుపెట్టి స్వాగతం పలుకనున్నారు. ప్రయాణికుల కోసం ఉచిత వైద్యశిబిరాలు, రక్తదాన శిబిరం నిర్వహించటంతోపాటు, వృక్షారోహణ కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నారు. విమానాశ్రయంపై అవగాహన కల్పించేందుకు విద్యార్థులకు విమానాశ్రయం పరిచయ కార్యక్రమం ఏర్పాటు చేసి విమానాశ్రయంలోని వివిధ విభాగాలను విద్యార్థులు చూపించనున్నారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈసందర్భంగా విమానాశ్రయం టెర్మినల్ భవనాన్ని ప్రత్యేకంగా అలంకరిస్తున్నారు.

## సాఫ్ట్‌వేర్ ఉద్యోగి దారుణహత్య

**గంగవరం, జూన్ 13, ప్రభాతవార్త:** చిత్తూరు జిల్లా పలమనేరు నియోజకవర్గం గంగవరం మండలం దండపల్లె కురప్పల్లెలో సాఫ్ట్ వేర్ ఉద్యోగి జయదీప్ దారుణహత్యకు గురయ్యాడు. అమ్మాయి పిలిచిందని వెళితే అమ్మాయి బంధువులు కుటుంబ సభ్యులు జయదీప్‌ను కొట్టి మిద్దెపై నుండి కిందకు పడవేసినట్లు ఆరోపణలు వెలువడుతున్నాయి. ఈ నెల 3న అర్ధరాత్రి జరిగిన ఈ సంఘటన అలస్యంగా వెలుగులోకి రాగా తీవ్రంగా గాయపడ్డ జయదీప్ శుక్రవారం రాత్రి మృతిచెందాడు. బంగారుపాళ్యం మండలం జి.కురప్పల్లెకు చెందిన హేమావతి కుమారుడు జయదీప్ బెంగళూరులో సాఫ్ట్ వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. ఈ నేపథ్యంలో ఈ నెల 3న సొంతగ్రామానికి వచ్చిన జయదేవ్‌కు దండపల్లె కురప్పల్లెలో ఒక అమ్మాయి నుండి ఫోన్‌కాల్ వచ్చినట్లు ఇంటివద్ద ఎవరూలేరు వెంటనే బయలుదేరి రావాలని ఫోన్‌చేసినట్టు సమాచారం. ఫోన్‌కాల్ అందుకున్న జయదేవ్‌ను వినీత్ అనే మరో యువకుడు మోటార్ సైకిల్‌పై ఈ నెల 3న సాయంత్రం 5గంటల సమయంలో దండపల్లె కురప్పల్లెలో లింగప్ప ఇంటికి తీసుకు వచ్చినట్లు తెలుస్తోంది. ఐతే నలుగురు యువకులు కొట్టి మిద్దెపైనుండి కిందకు తోసివేయడంతో జయదేవ్ అపస్మారక స్థితిలో పడిపోయాడు. విషయం తెలుసుకున్న అదే గ్రామానికి చెందిన మునిరాజ్ వెంటనే వేలూరు సిఎంసి ఆసుపత్రికి తరలించారు. 9 రోజుల పాటు చికిత్సపొందినా ఫలితంలేక పోవడంతో తగిన స్థోమత లేక పలమనేరులో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ జయదేవ్ శుక్రవారం రాత్రి మృతిచెందాడు. ఐతే ప్రమాదవశాత్తు మిద్దెపైనుండి పడ్డాడని లింగప్ప కుటుంబ సభ్యులు చెపుతుండగా కొట్టి చంపేశారని మృతుని బంధువులు అరోపిస్తున్నారు. మృతదేహాన్ని శవ పరక్ష నిమిత్తం పలమనేరు ప్రభుత్వఆసుపత్రిలో వుంచారు. గంగవరం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## గుంతకల్ డివిజన్‌లో విస్తృత తనిఖీలు

**గుంతకల్ రైల్వే జూన్ 13, ప్రభాతవార్త :** గుంతకల్ రైల్వే డివిజనల్ లో దక్షి ణ కోస్తా రైల్వే జనరల్ మేనేజర్ సందీప్ మాథూర్ గుంకల్ డివిజన్ పరిధిలోని తిరుపతి నుండి గుంతకల్ డివిజన్ పరిధిలోని ప్రధాన రైల్వే స్టేషన్లు, ముఖ్యంగా తిరుపతి రైల్వే స్టేషన్ మరియు తిరుపతి, గుంతకల్ సెక్షన్‌లో విస్తృత తనిఖీ నిర్వహిం చారు. కొత్తగా ఏర్పడిన దక్షి ణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాటైన తరువాత సెక్షన్‌లో ఆయన చేపట్టిన తొలి తనిఖీ నిర్వహించారు. తనిఖీలో భాగంగా సందీప్ మాథూర్ రాయచోటి,రాజంపేట రైల్వే స్టేషన్‌ను సందర్శించి, సర్క్యులేటింగ్ ఏరియా, వెయిటింగ్ హాల్, పార్కింగ్ ప్రాంతం మరియు ఇతర ప్రయాణికుల సౌకర్యాల అభివృద్ధి పనులను సమీక్షి ంచారు. కడప రైల్వే స్టేషన్‌లో అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద జరుగుతున్న పనుల పురోగతిపై ప్రత్యేక దృష్టి సారించి, సర్క్యులేటింగ్ ఏరియా, ప్లాట్‌ఫారాలు మరియు ఇతర ప్రయాణికుల సౌకర్యాలను వివరంగా పరిశీలించారు. పనుల నాణ్యతను అంచనా వేసి, అన్ని ప్రాజెక్టులను సమయానికి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. జనరల్ మేనేజర్ తాడిపత్రి, గుత్తి మధ్య విండో ట్రైలింగ్ ఇన్‌స్పెక్షన్ నిర్వహించి, ట్రాక్ పరిస్థితులు, భద్రతా అంశాలు మరియు కొనసాగుతున్న పనులను సమీక్షి ంచారు. గుత్తి లో యార్డ్ రీమోడలింగ్ పనులను పరిశీలించి, వాటిని వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. గుంతకల్లు లో రైల్వే స్టేషన్ లో ఏర్పాటు చేసిన పాత వస్తువులతో తయారుచేసిన నమూనాలను పరిశీలించారు. రైల్వే డ్రైవర్ల క్రూ లాబీని తనిఖీ చేసి, క్రూ నిర్వహణ వ్యవస్థలు, సంక్షేమ సదుపాయాలు, భద్రతా విధానాలు, అత్యవసర ప్రక్రియలను పరిశీలించారు. గుంతకల్లు లో నార్త్ కాలనీ లో నూతన అధికారుల భవనాలను రిబ్బన్ కటింగ్ చేసి ప్రారంభించారు.

ఈ కార్యక్రమంలో స్థానిక గుంతకల్ డిఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా మరియు ఎడిఆర్ఎం శివప్రసాద్ మరియు ఈ తనిఖీలో ప్రిన్సిపల్ చీఫ్ ఇంజినీర్ బి.ఎస్.కె. రాజ్‌కుమార్, ప్రిన్సిపల్ చీఫ్ సిగ్నల్ టెలికాం ఇంజినీర్ ఓ.బి. సురేష్ కుమార్, ప్రిన్సిపల్ చీఫ్ ఆపరేషన్స్ మేనేజర్ వినీత్ కుమార్, చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ అంకుష్ గుప్తా వై. బాలాజీ కిరణ్ (ముఖ్య ప్రజా సంబంధాల

## భూగర్భజలాల పెంపునకు రీఛార్జ్ బావులు నిర్మించాలి : కలెక్టర్ బాలాజీ

**గన్నవరం, జూన్ 13, ప్రభాతవార్త :** రోజురోజుకీ అడుగంటిపోతున్న భూగర్భజలాల మట్టాన్ని పెంపొందించేందుకు చేపట్టిన రీఛార్జ్ బావుల నిర్మాణాన్ని సక్రమంగా పూర్తిచేయాలని కృష్ణాజిల్లా కలెక్టర్ డికె.బాలాజీ అధికారులను ఆదేశించారు. గన్నవరం మండలం ముస్తాబాద గ్రామంలో పైలట్ ప్రాజెక్టుగా చేపట్టిన రీఛార్జ్‌బావి పనులను కలెక్టర్ శనివారం పరిశీలించారు. ప్రాజెక్టు అమలు విధానం, నిర్మాణ వ్యయం, భూగర్భజలాల పునరుద్దరణకు కలిగే ప్రయోజనాలను అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఒక్కొక్క రీఛార్జ్ బావి నిర్మాణానికి రూ. 2లక్షలు ఖర్చు అవుతున్నట్లు అధికారులు తెలిపారు. ఈప్రాజెక్టు నిర్మాణంలో ఎదురైన అనుభవాలను సమీక్షించి భూగర్భజలశాఖ గుర్తించిన ఇతర ప్రాంతాల్లోనూ బావుల నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. అనంతరం ఇదే గ్రామంలో ఉపాధిహామీ పనులను కలెక్టర్ పరిశీలించారు. ఉపాధిహామీ



ముస్తాబాద గ్రామంలో ఉపాధి పనులు పరిశీలిస్తున్న కృష్ణా కలెక్టర్ బాలాజీ

పథకంలో భాగంగా గ్రామంలో పంటబోదె పూడికతీత పనులను పరిశీలించిన కలెక్టర్ కూలీలతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఈకార్యక్రమంలో డ్వామా పిడి శివప్రసాద్, ఇరిగేషన్ ఎస్ఈ గుణకర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ప్రోత్సాహాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలి : ఎన్‌టిఆర్ కలెక్టర్




అవగాహనా సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశా

**విజయవాడ, జూన్ 13, ప్రభాతవార్త :** మహిళా పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహాన్ని సద్వినియోగం చేసుకుని మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఎన్‌టిఆర్‌జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశా పిలుపునిచ్చారు. ఇబ్రహీంపట్నం మండలం గుంటుపల్లిలోని రైజ్‌సెంటర్‌లో మహిళలకు సోలార్ డ్రైయింగ్ పౌడర్ ప్రాసెసింగ్‌పై శనివారం అవగాహనా సదస్సును కలెక్టర్ ప్రారంభించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహిళా సాధికారతకు నైపుణ్యాభివృద్ధి, స్వయం ఉపాధి అవకాశాలు అత్యంత కీలకమన్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో సహజ సిద్ధమైన ఆహార ఉత్పత్తులకు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని సోలార్ డ్రైయింగ్ సాంకేతికత ద్వారా విలువ ఆధారిత ఉత్పత్తులను తయారు చేయగలిగితే మంచి ఆదాయం వస్తుందన్నారు. వ్యవసాయ, ఉద్యాన, పంటలతోపాటు పలు రకాల పండ్లను సోలార్ డ్రైయింగ్ ద్వారా నిల్వచేసి పొడిరూపంలోకి మార్చి విక్రయించటం ద్వారా మంచి లాభాలు ఆర్జించవచ్చాన్నారు. మార్కెట్‌లో కూరగాయ పంటలకు గిట్టుబాటు ధరలు లేని సమయంలో వాటని ఈపద్దతిలో ప్రోసెసింగ్ చేయటం ద్వారా గిట్టుబాటుధరలు పొందవచ్చని కలెక్టర్ తెలిపారు. రైజ్‌సెంటర్ ద్వారా అందిస్తున్న శిక్షణా కార్యక్రమాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈసందర్భంగా సోలార్‌డ్రైయింగ్ ప్రక్రియ, ఉత్పత్తుల తయారీ, నాణ్యత ప్రమాణాలు, మార్కెటింగ్ అవకాశాలపై నిపుణులు వివరించారు.

## తప్పుడు ప్రచారకర్తలపై కఠిన చర్యలు : ఇఒ వికె శీనా నాయక్

**ఇంద్రకీలాద్రి, జూన్ 13, ప్రభాతవార్త :** దుర్గమ్మవారి ఆలయంలో ఈనెల 17న మహామండపంలోని 6వ అంతస్థులో నిజ జేష్ఠమాస తదియ నాడు దేవస్థానం ఆధ్వర్యంలో ఉచితంగా 250 మందికి నిర్వహించబోయే సామూహిక అక్షరాభ్యాసాల కార్యక్రమానికి సంబంధించి ప్రచారంలో వున్న తప్పుడు ప్రచారాలపై ఇఒ వికె శీనా నాయక్ హెచ్చరికలు చేశారు. దేవస్థానానికి సంబంధించిన అంశాలపై తప్పుడు ప్రచారాలు చేసే వారిని కఠినంగా చట్టప్రకారం శిక్షిస్తామన్నారు. శాఖంబరీ ఉత్సవాలు, ఆషాఢ సారె, ఉచిత అక్షరాభ్యాసాలు మరియు కృష్ణానదీ పుణ్య హారతులపై అధికారులకు దిశానిర్దేశం చేశారు.

శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వారి దేవస్థానం భద్రతను అత్యున్నత స్థాయికి తీసుకెళ్లేందుకు యాక్షన్ ప్లాన్‌ను అమలు చేస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి వి.కె.శీనా నాయక్ తెలిపారు. దుర్గమ్మ వారి ఆలయంలో నిర్వహిస్తున్న నిత్య అన్నదాన పథకానికి రు.1,00,116 విరాళాన్ని కడపకు చెందిన కె గోపిరెడ్డి వారి కుటుంబీకులు అయ్య వరమ్మ అందించారు. విజయవాడకు చెందిన వై.కనకదుర్గ మరియు కుటుంబీకులు పేరున రూ.1,01,116లు విరాళమును, విశాఖపట్నంకు చెందిన గోగినేని సావిత్రి, మౌత్విక, మోహినీష్ సాయి ల పేరిట శనివారం రు.1లక్ష విరాళం అందించారు.

# హెల్త్ అవేర్‌నెస్ వీక్ ద్వారా కీలక సంస్కరణలు, సేవల విస్తరణ



**ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో ఆరోగ్య శాఖ పనితీరు ప్రశంసనీయం**

**అధికారులు, వైద్యులు, సిబ్బందిని అభినందించిన తెలంగాణ మంత్రి దామోదర రాజనర్సింహ**

**హైదరాబాద్, జూన్ 13, ప్రభాతవార్త:** రాష్ట్రంలో హెల్త్ అవేర్‌నెస్ వీక్ ద్వారా ఆరోగ్య రంగంలో కీలక సంస్కరణలు, సేవల విస్తరణ చేపట్టినట్టు వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. ప్రజా పాలన- ప్రగతి ప్రణాళికలో భాగంగా 99 రోజుల కార్యక్రమం విజయవంతంగా ముగిసిన సందర్భంగా ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు, వైద్యులు, నర్సులు, పారా మెడికల్ సిబ్బంది, క్షేత్రస్థాయి ఆరోగ్య కార్యకర్తలను మంత్రి దామోదర రాజనర్సింహ అభినందించారు. ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా ఆరోగ్యశాఖ చేపట్టిన కార్యక్రమాలు ప్రజల్లో విశేష స్పందన పొందాయని, ప్రభుత్వ లక్ష్యాల సాధనలో ఆరోగ్యశాఖ కీలక పాత్ర పోషించిందని మంత్రి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రివర్గ సహచరులు, ప్రజా ప్రతినిధులు ఆరోగ్య శాఖ పనితీరును ప్రత్యేకంగా అభినందించిన విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. ప్రజలకు అత్యంత అవసరమైన విద్య, వైద్య రంగాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ఆరోగ్య తెలంగాణ నిర్మాణ లక్ష్యంతో వైద్య సేవల విస్తరణ, ఆధునికీకరణ, మానవ వనరుల బలోపేతం, ప్రజా రోగ్య అవగాహన కార్యక్రమాలను సమాంతరంగా అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా ఏప్రిల్ 6 నుంచి 11వ తేదీ వరకు నిర్వహించిన హెల్త్ అవేర్‌నెస్ వీక్ రాష్ట్రవ్యాప్తంగా విశేష విజయాన్ని సాధించిందన్నారు. వారంరోజుల పాటు 20కిపైగా ప్రధాన కార్యక్రమాలను నిర్వహించి ఆరోగ్యకర జీవనశైలి, వ్యాధుల నివారణ, మాతాశిశు ఆరోగ్యం, మానసిక ఆరోగ్యం, ఫుడ్ సేఫ్టీ, డ్రగ్ సేఫ్టీ, హెచ్‌ఐవీ నియంత్రణ, క్యాన్సర్ అవగాహన వంటి అంశాలపై ప్రజల్లో విస్తృత చైతన్యం కల్పించామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 35 ప్రభుత్వ జనరల్ ఆసుపత్రుల్లో డీ అడిక్షన్ కౌన్సెలింగ్ సెంటర్లు, స్పెషల్ ఇంటాక్సికేషన్ కేర్ యూనిట్లను ప్రారంభించి మత్తు వ్యసన బాధితులకు స్క్రీనింగ్, చికిత్స, కౌన్సెలింగ్, పునరావాస సేవలను అందు బాటులోకి తీసుకు వచ్చామన్నారు. హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన పెంపొందించేందుకు హైదరాబాద్ కేబుల్ బ్రిడ్జ్‌పై భారీ మానవహారం నిర్వహించామని, రాష్ట్రవ్యాప్తంగా హెచ్‌ఐవీ, టీబీ స్క్రీనింగ్ క్యాంపులు ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రజలకు నాణ్యమైన ఔషధాలు అందుబాటులో ఉండేలా, యాంటీబయాటిక్స్ దుర్వినియోగాన్ని అరికట్టేలా డ్రగ్ కంట్రోల్ అండ్ రెగ్యులేటరీ స్ట్రెంథెనింగ్ డే నిర్వహించామని మంత్రి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలు నిర్వహించి యాంటీబయాటిక్ రెసిస్టెన్స్ ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పించామని పేర్కొన్నారు. నకిలీ మందులు, నాసిరకం ఔషధాలు, మెడిసిన్ల దుర్వినియోగంపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటోందని తెలిపారు. 692 మంది సివిల్ అసిస్టెంట్ సర్జన్ స్పెషలిస్టులు, 174 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు సహా మొత్తం 866 మంది వైద్యులకు నియామక పత్రాలు అందజేశామని తెలిపారు. 2322 నర్సింగ్ ఆఫీసర్ పోస్టుల భర్తీ ప్రక్రియను పూర్తి చేశామని పేర్కొన్నారు. గత రెండున్నర సంవత్సరాల్లో ఆరోగ్యశాఖలో భర్తీ చేసిన ఉద్యోగాల సంఖ్య సుమారు 15 వేలకు చేరుకుందని వెల్లడించారు. వైద్య విద్య, సేవల విస్తరణలో భాగంగా మహబూబ్‌నగర్‌ను దక్షిణ తెలంగాణ మెడికల్ హబ్‌గా అభివృద్ధి చేసేందుకు చర్యలు ప్రారంభించామని, ప్రభుత్వ వైద్య కళాశాలలు, ఆసుపత్రుల మౌలిక సదుపాయాలను మరింత బలోపేతం చేస్తున్నామని మంత్రి స్పష్టం చేశారు. ప్రజా పాలన -ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహించిన హెల్త్ అవేర్‌నెస్ వీక్ ఆరోగ్య సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడంలో, ప్రజారోగ్యంపై అవగాహన పెంపొందించడంలో, ఆధునిక వైద్య సేవలను విస్తరించడంలో, ఆరోగ్య వ్యవస్థను బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషించిందని మంత్రి దామోదర్ రాజనర్సింహ పేర్కొన్నారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో కూడా ప్రతి కుటుంబానికి నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు ఆరోగ్యశాఖ కృషి కొనసాగిస్తుందని మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు.

## తెలంగాణ పోలీసు శాఖకు ఇన్‌స్టిట్యూషనల్ ఫెర్ఫార్మెన్స్ అవార్డు

**19న ఢిల్లీలో అందుకోనున్న డిజిపి ఆనంద్**

**హైదరాబాద్ జూన్ 13, ప్రభాతవార్త:** పాస్‌పోర్టుల దరఖాస్తుల పరిశీలన, ధ్రువీకరణ ప్రక్రియ వేగవంతంగా నిర్వహిస్తున్నందుకు తెలంగాణ పోలీసు శాఖకు కేంద్ర విదేశాంగ శాఖ ఇన్‌స్టిట్యూషనల్ పెర్ఫార్మెన్స్ అవార్డును ప్రకటించింది. ఈ మేరకు విదేశాంగ శాఖ నుంచి పోలీసు శాఖకు శనివారం సమాచారం అందింది. దీనికి సంబంధించిన అవార్డును ఈ నెల 19న ఢిల్లీలో జరిగే ఓ కార్యక్రమంలో డిజిపి సి.వి ఆనంద్ అందుకోనున్నారు. రాష్ట్ర పోలీసు శాఖకు మరో అవార్డు వరించింది. టెక్నాలజిని వాడడం, నేరాల నియంత్రణ, సిసిటి ఎన్ఎస్‌ను సమర్థవంతంగా నిర్వహిస్తున్నందుకు అనేక అవార్డులు రాగా పాస్‌పోర్టుల దరఖాస్తుల పరిశీలన, వాటికి సంబంధించిన ధ్రువీకరణ ప్రక్రియను దేశంలోనే వేగంగా చేస్తున్నందుకు విదేశాంగ శాఖ 2025-26కు ఇన్‌స్టిట్యూషనల్ ఫెర్ఫార్మెన్స్ అవార్డును తెలంగాణ పోలీసు శాఖకు ప్రకటించింది. పాస్‌పోర్టుల దరఖాస్తుల పరిశీలన, ఇతర అంశాలను వేగంగా నిర్వహించినదుకు రాష్ట్ర పోలీసు శాఖకు ఇంతకుముందు పలు అవార్డులు వరించాయి. ఇప్పుడు వీటి సరసన ఇన్‌స్టిట్యూషనల్ ఫెర్ఫార్మెన్స్ అవార్డు చేరింది. ఈ అవార్డును ఈ నెల 19న కేంద్ర విదేశాంగశాఖ మంత్రి జయశంకర్ నుంచి డిజిపి ఆనంద్ అందుకోనున్నారు. కాగా రాష్ట్ర పోలీసు శాఖకు ఇన్‌స్టిట్యూషనల్ ఫెర్ఫార్మెన్స్ అవార్డు రావడంపై డిజిపి ఆనంద్ సంతోషం వ్యక్తం చేశారు. పాస్‌పోర్టుల దరఖాస్తుల పరిశీలనలో ధ్రువీకరణ ప్రక్రియ కీలకమైన అంశమని, దీనిని నిర్వహించడంలో రాష్ట్ర పోలీసులు పారదర్శకంగా, సమర్థవంతంగా సేవలందించారని డిజిపి తెలిపారు.

## ఎల్‌నినోపై లఘుచిత్రం

**పంటల సాగుపై రైతులకు మెలకువలు**

**రాష్ట్ర వ్యవసాయ శాఖ వినూత్నప్రచారం**

**హైదరాబాద్, జూన్ 13, ప్రభాతవార్త:** ఎల్‌నినో ప్రభావం నైరుతి రుతుపవనాలపై పడి వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ఎదురయ్యే ముప్పు మరింత వాస్తవరూపం దాల్చనున్నట్లు కనిపిస్తోంది. పంటల సాగులో ఎల్‌నినో పర్యవసానాలపై రైతుల్లో అవగాహన కల్పించేందుకు వ్యవసాయ శాఖ సిద్ధమైంది. ఇందుకు ప్రత్యేకంగా ఒక లఘు చిత్రాన్ని రూపొందింపచేసింది. ఎల్‌నినో తీవ్రత, అలాగే వర్షాలు సరిగ్గా కురవకపోవడం వల్ల కలిగే ప్రభావాలను నివారించడానికి రాష్ట్రంలోని రైతులు ఏమి చేయాలో తెలియజేస్తూ ఒక లఘు చిత్రాన్ని రాష్ట్రంలోని అన్ని సినిమా థియేటర్లలో ప్రదర్శించనున్నారు. సుమారు నాలుగు నిమిషాల నిడివి గల ఈ లఘు చిత్రంలో, ఖరీఫ్ పంట కాలం ప్రారంభమవుతున్న తరుణంలో, ఎల్‌నినో అంటే ఏమిటి, ప్రత్యా మ్నాయ సాగు పద్ధతులు, స్వల్పకాలిక పంటలపై ఇచ్చే సలహాలను ఎందుకు పాటించాలి, అలాగే వ్యవసాయ శాఖ మార్గ దర్శకాలను ఎందుకు అనుసరించాలి అనే విషయాలపై రైతులు చర్చిస్తున్నట్లు ఈ లఘు చిత్రంలో చూపించారు. ఈ సీజన్‌లో ఎల్‌నినో అవగాహన, సురక్షిత వ్యవసాయ పద్ధతులపై రూపొందించిన ఈ లఘుచిత్రం ప్రదర్శించడం రైతుల్లో మరింత చర్చను తీసుకురావడమే లక్ష్యంగా రూపొందించబడిందని వ్యవసాయ శాఖ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. వ్యవసాయ శాఖ రూపొందించిన ఇలాంటి అనేక ఇతర లఘుచిత్రాలను ఇప్పటికే వాట్సాప్ ద్వారా లక్షలాది మంది రైతులతో పంచుకోగా, వ్యవసాయ శాఖ తన ఎక్స్ హ్యాం డిల్‌లో కూడా వాటిని పొందుపరచింది. ఇప్పుడు వీటికి అదనంగా ఈ లఘుచిత్రాన్ని థియేటర్లలో విడుదల

## ప్రత్యేక ఆర్డినెన్స్ ద్వారా ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుండి మినహాయింపు ఇవ్వాలి

**ప్రభుత్వానికి తపస్ డిమాండ్**

**హైదరాబాద్, జూన్ 13, ప్రభాతవార్త:** ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు ప్రత్యేక ఆర్డినెన్స్ ద్వారా టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్(టెట్) నుంచి మినహాయింపు ఇవ్వాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) డిమాండ్ చేసింది. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు వొద్నాల రాజశేఖర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తెల్కలపల్లి పెంటయ్య, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి హన్మంత్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తపస్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం శనివారం జరిగింది. ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు ఎన్‌సిటిఈ నిబంధనలకు అనుగుణంగా సెప్టెంబరు 1, 2025లో సుప్రీం కోర్టు తీర్పు వెలువడిందని, దీంతో ఆందోళన చెందిన సర్వీస్ ఉపాధ్యాయులు 65 రివ్యూ పిటి షన్స్ వేశారని తపస్ నేతలు తెలిపారు. నిబంధనల ఆధారంగానే సుప్రీంకోర్టు ఆ రివ్యూలను కొట్టివేస్తూ 2028 ఆగష్టు 31 లోపు ఇన్ సర్వీస్ టీచర్స్‌కు చివరి అవకాశమని తీర్పు ఇచ్చింద న్నారు. దీని ప్రకారం సర్వీస్ రిమూవ్ చేసే అవకాశం ఉందని, తెలంగాణలో 30వేల మంది ఉపాధ్యా యులకు టెట్ పాస్ కావాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. ఇన్‌సర్వీస్ టీచర్లకు ప్రత్యేకంగా 2సార్లు టెట్ నిర్వహిస్తామని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం కాస్త ఊరట మాత్రమేన న్నారు. విద్యా హక్కు చట్టం అమలు ద్వారా టెట్ అంశం ప్రస్తావనకు వచినచదన్నారు. ఏప్రిల్ 1,2010 కంటే ముందు న్యాయబద్ధంగా నోటి ఫికేషన్ వచ్చి నియామకం అయిన ఉపాధ్యా యులకు ఆనాడు టెట్ అవసరం లేదు స్పష్టంగా పేర్కొనడం జరిగిందని, తర్వాత డీఎస్సీ నోటిఫికేషన్‌లో టెట్ అర్హత ఆధారంగానే నియా మకాలు జరుగుతున్నాయన్నారు. గత 30 సంవత్సరాల నుండి ఉపాధ్యాయులు ఎంపిక చేసుకున్న విషయంలో భోదిస్తున్నారని, టెట్‌లో మాత్రం అన్ని విషయాలు కలిపి పరీక్షలు పెట్టడం జరుగుతుందని, దీంతో భాషా ఉపాధ్యాయులకు, ఇతర సబ్జెక్టు ఉపాధ్యాయులు కూడా తమ బోధనకు సంబంధం లేని సబ్జెక్టు చదవి పరీక్షలు రాయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. అలాంటప్పుడు ప్రత్యేకంగా టెట్ ఎన్ని సార్లు పెట్టిన ప్రయోజనం లేదనే భావన ఉపాధ్యాయుల్లో ఉందన్నారు. ఎన్‌సిఈఆర్‌టీ, ఎస్‌సీఈ ఆర్‌టీ ఆధ్వర్యంలో, దీక్ష నిష్ఠ, లాంటి అనేక ఆన్‌లైన్ వృత్యంతర శిక్షణ ఇస్తూనే ఉన్నారన్నారు.

## తెలంగాణలో భారీ వర్షాలు..

**విద్యుత్ శాఖ అప్రమత్తం**

**హైదరాబాద్, జూన్ 13, ప్రభాతవార్త:** తెలంగాణలో నైరుతి రుతుపవనాలు విస్తరించాయి. ప్రస్తుతం చురుగ్గా కదులుతున్నాయి. ఇదే సమయంలో బంగాళాఖాతంలో ఓ ఉపరితల ఆవర్తనం, అరేబియా సముద్రం నుండి బంగాళాఖాతం వరకు ద్రోణి కొనసాగుతోంది. వీటన్నింటి ప్రభావంతో రాష్ట్రంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా రాబోయే రెండు, మూడు రోజుల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, ఈ మేరకు పలు జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ అయ్యాయి. రాష్ట్రంలోని నల్గొండ, సూర్యాపేట, రంగారెడ్డి, వనపర్తి, నారాయణపేట జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. వీటితో పాటు హైదరాబాద్‌తో సహా దాదాపు 30కి పైగా జిల్లాల్లో గంటకు 40 నుండి 50 కిలోమీటర్ల వేగంతో వీచే ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడే సూచనలు ఉన్నాయి. ఈ నెల 14, 15 తేదీల్లో మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, గద్వాల, ఖమ్మం, కొత్తగూడెం తదితర జిల్లాల్లో 30 నుండి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తూ తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు కురుస్తాయని అధికారులు తెలిపారు. మరోపక్క శనివారం రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ఒక మోస్తరు నుండి భారీ వర్షాలు కురిశాయి. హకీంపేట్‌లో రాష్ట్రంలోనే అత్యధిక వర్షపాతం నమోదైంది. హైదరాబాద్, ఖమ్మం, నిజామాబాద్ జిల్లాల్లో ఒక మోస్తరు నుండి భారీ వర్షాలు కురిశాయి. గడచిన 24 గంటల్లో హకీంపేట్‌లో 63 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు కాగా, హైదరాబాద్‌లో 23.6 మిల్లీ మీటర్లు, ఖమ్మంలో 15.2 మిల్లీ మీటర్లు, మెదక్‌లో 15 మిల్లీ మీటర్లు, నిజామాబాద్‌లో 17.5 మిల్లీ మీటర్లు, పఠాన్‌చెర్వులో 16 మిల్లీ మీటర్ల వర్షపాతం రికార్డయింది. కాగా ప్రకృతి వైపరీత్యాలు, భారీ గాలివానలు, వర్షాలు సంభవించిన సమయంలో ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని విద్యుత్ శాఖ సూచించింది. తెగిపోయిన విద్యుత్ వైర్లు, కూలిపోయిన విద్యుత్ స్తంభాలు లేదా విద్యుత్ సంబంధిత ప్రమాదకర పరిస్థితులు కనిపించిన వెంటనే కాల్ సెంటర్ 1912కు సమాచారం అందించాలని కోరింది. ప్రజలు స్వయంగా విద్యుత్ వైర్లు లేదా ఇతర విద్యుత్ పరికరాలను తాకేందుకు, తొలగించేందుకు లేదా మరమ్మత్తులు చేయడానికి ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రయత్నించరాదని స్పష్టం చేసింది.

## ప్రభుత్వ బడుల మూసివేత ప్రకటనను ముఖ్యమంత్రి ఉపసంహరించుకోవాలి

**సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ డిమాండ్**

**హైదరాబాద్, జూన్ 13, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల మూసివేతపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన ప్రకటనను ఉపసం హరించుకోవాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ డిమాండ్ చేశా రు. రాష్ట్రంలోని 23వేల ప్రభుత్వ పాఠశాలలను మూసివేసి, వాటిని కేవలం 4వేలకు కుదిస్తామంటూ ముఖ్యమంత్రి ఒక ఇంటర్వ్యూలో చేసిన ప్రకటనను జాన్‌వెస్లీ తీవ్రంగా ఖండించారు. తక్షణమే ప్రభుత్వ పాఠశాలల మూసివేత ఆలోచనను వెనక్కి తీసుకోవాలని, ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేవిధంగా ఆలోచించాలని డిమాండ్ చేశా రు. విద్యార్థుల ఆవాసాలకు సమీపంలోనే పాఠశాల అందుబాటులో ఉండాలని, ఈ బాధ్యతను ప్రభుత్వమే తీసుకోవాలని విద్యా హక్కు చట్టం 2009లో ప్రాథమిక హక్కుల్లో పొందుపర్చారని, కానీ ముఖ్యమంత్రి వ్యాఖ్యలు గ్రామీణ, పేద, దళిత, గిరిజన పిల్లల ప్రాథమిక విద్యా హక్కును కాలరాసే విధంగా ఉందన్నారు.

**ఉద్యోగ నోటిఫికేషన్ ప్రాసెసింగ్ ఫీజుల పెంపు భారం తగదు**

తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) ఉద్యోగ దరఖాస్తుల ప్రాసెసింగ్ ఫీజును రూ. 200 నుండి రూ. 1,000కి పెంచడాన్ని సిపిఎం రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, టీజీపీఎస్సీ స్పందించి ఈ ఫీజు పెంపు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని జాన్‌వెస్లీ డిమాండ్ చేశారు.

## దేశ భద్రతలో సీఐఎస్ఎఫ్ పాత్ర కీలకం

**హకీంపేటలో ఎన్ఐఎస్ఎ దీక్షాంత్‌పెరేడ్‌లో పాల్గొన్న తెలంగాణ గవర్నర్ శివప్రతాప్‌శుక్లా**



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 13:** దేశ భద్రతా వ్యవస్థలో కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం (సీఐఎస్ఎఫ్) కీలక పాత్ర పోషిస్తుందని గవర్నర్ శివప్రతాప్‌శుక్లా అన్నారు. హకీంపేటలోని నేషనల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ అకాడమీ (ఎన్ఐఎస్ఏ) ప్రాంగణంలో శనివారం నిర్వహించిన 39వ బ్యాచ్ అసిస్టెంట్ కమాండెంట్ ప్రొబేషనర్లు, 9వ బ్యాచ్ సబ్‌ఇన్‌స్పెక్టర శిక్షణార్థుల దీక్షాంత్ పరేడ్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. కఠినమైన శిక్షణను విజయవంతంగా పూర్తి చేసిన 76 మంది అసిస్టెంట్ కమాండెంట్ ప్రొబేషనర్లు, 124 మంది సబ్‌ఇన్‌స్పెక్టర్ శిక్షణార్థులను గవర్నర్ అభినందించారు. పరేడ్‌లో ప్రదర్శించిన క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, వృత్తి నైపుణ్యం వారి అంకితభావానికి నిదర్శనమని పేర్కొన్నారు. దేశంలోని విమానాశ్రయాలు, ఓడరేవులు, అణు కేంద్రాలు, అంతరిక్ష సంస్థలు, ఇంధన ప్రాజెక్టులు, మెట్రో నెట్‌వర్క్‌లు, కీలక పారిశ్రామిక సంస్థల భద్రతలో సీఐఎస్ఎఫ్ విశిష్ట సేవలందిస్తోందని గవర్నర్ అన్నారు. సంస్థల భద్రతతో పాటు దేశ ఆర్థికాభివృద్ధి, ప్రజల విశ్వాసాన్ని కాపాడటంలో కూడా సీఐఎస్ఎఫ్ పాత్ర ఎంతో కీలకమని తెలిపారు. ప్రస్తుత కాలంలో ఉగ్రవాదం, సైబర్ నేరాలు, డ్రోన్ ఆధారిత ముప్పులు వంటి సవాళ్లు పెరుగుతున్న నేపథ్యంలో భద్రతా సిబ్బంది మరింత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. సాంకేతిక పరిజ్ఞానం, వృత్తి నైపుణ్యం, వేగవంతమైన నిర్ణయ సామర్థ్యంతో యువ అధికారులు ఈ సవాళ్లను సమర్థంగా ఎదుర్కొంటారని విశ్వాసం వ్యక్తం చేశారు. అధికారుల భుజాలపై అలంకరించిన నక్షత్రాలు కేవలం హోదాకు ప్రతీకలు మాత్రమే కాకుండా దేశం ఉంచిన విశ్వాసానికి, బాధ్యతకు, కర్తవ్యనిష్ఠకు సంకేతాలని గవర్నర్ అన్నారు. నాయకత్వానికి అధికారం కంటే వ్యక్తిత్వం, నిజాయితీ, ధైర్యం, సేవాభావమే నిజమైన పునాదులని సూచించారు. సాయుధ దళాల్లో సేవలందించిన అనంతరం మళ్లీ యూనిఫాం సేవను ఎంచుకున్న మాజీ సైనిక శిక్షణార్థులను ప్రత్యేకంగా అభినందించిన గవర్నర్, వారి దేశభక్తి, అంకితభావం ఆదర్శప్రాయమని కొనియాడారు. ఎన్ఐఎస్ఏ డైరెక్టర్ హర్ ప్రీత్ కౌర్ సోహి పాసింగ్ అవుట్ అవుతున్న అధికారులతో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం అసిస్టెంట్ కమాండెంట్ లలోప్రతిభ కనబర్చిన శిక్షణార్థులు సుమిత్ లాత్వల్ (ఆల్ రౌండర్ , స్వోర్డ్ ఆఫ్ ఆనర్ కేటగిరి) ,ఆర్యన్ తివారి ( బెస్ట్ ఇన్ అవుట్ డోర్), అలోక్ తోమర్ ( బెస్ట్ ఇన్ ఇండోర్), సురేంద్ర కుమార్ మీనా ( బెస్ట్ ఇన్ ఫైరింగ్), సబ్ ఇన్స్పెక్టర్ ( ఎక్స్ సర్వీస్ మెన్ ) కేటగిరి లో ప్రతిభ కనబర్చిన సురేష్ కుమార్ (ఆల్ రౌండర్ కేటగిరి) , దీపక్ కుమార్ సింగ్( బెస్ట్ ఇన్ అవుట్ డోర్), గౌరవ్ శర్మ ( బెస్ట్ ఇన్ ఇండోర్), సురేంద్ర ధర్మేందర్ సింగ్( బెస్ట్ ఇన్ ఫైరింగ్) లకు గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా పురస్కాలు అందించి అభినందించారు. అంతకు ముందు గవర్నర్ దేశ సేవలలో అమరులైన సిఐఎస్ఎఫ్ అధికారులకు నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సీఐఎస్ఎఫ్ డైరెక్టర్ జనరల్ ప్రవీర్ రంజన్, అదనపు డైరెక్టర్ జనరల్ ( హెడ్ క్వార్టర్స్) విజయ్ ప్రకాశ్, ఎన్ఐఎస్ఏ డైరెక్టర్ హర్ ప్రీత్ కౌర్ సోహి, సీఐఎస్ఎఫ్ సీనియర్ అధికారులు, శిక్షకులు, శిక్షణార్థులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## నేటి నుంచి 21 వరకు సాలార్‌జంగ్ మ్యూజియం ప్లాటినం జూబ్లీ వారోత్సవాలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 13:** సాలార్ జంగ్ మ్యూజియం ప్లాటినం జూబ్లీ వారోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు మ్యూజియం అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. సాలార్ జంగ్-3 నవాబ్ మీర్ యూసుఫ్ అలీ ఖాన్ జయంతిని పురస్కరించుకుని నిర్వహించనున్న ఈ ఉత్సవాల్లో ప్రత్యేక ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు, విద్యా సంబంధిత కార్యక్రమాలు, ప్రత్యేక ప్రచురణలు, ప్రజా అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. మ్యూజియం చారిత్రక వైభవాన్ని, అరుదైన కళాఖండాల ప్రాముఖ్యతను ప్రజలకు మరింత చేరువ చేయడంతో పాటు యువతలో వారసత్వ సంపద పట్ల అవగాహన పెంపొందించే లక్ష్యంతో ఈ వారోత్సవాలను నిర్వహిస్తున్నారు. రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ఆదివారం సాయంత్రం 04.30 గంటలకు సాలార్ జంగ్ మ్యూజియంకు చేరుకుని సాలార్ జంగ్ మ్యూజియం ప్లాటినం జూబ్లీ వారోత్సవాలను ప్రారంభిస్తారు.

**నేడు ఉదయం 07.00 గంటలకు**

**ర్యాలీని ప్రారంభించనున్న గవర్నర్**

ఆదివారం ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ మార్గ్‌లో బి ఆర్ అంబేద్కర్ విగ్రహం నుండి సాగే ర్యాలీని రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్లా ఉదయం 07.00 గంటలకు జెండా ఊపి ప్రారంభించనున్నారు. అనంతరం లోక్‌భవన్ లో సంస్కృతి కమ్యూనిటీ హాల్లో ప్రపంచ రక్తదాతల దినోత్సవం పురస్కరించుకొని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని రాష్ట్ర గవర్నర్ ప్రారంభించనున్నారు.



## జాతీయ రహదారిపై ఘోరప్రమాదం

**ఇద్దరు మృతి.. మరో నలుగురికి గాయాలు**

**రఘునాథపల్లి, జూన్ 13, ప్రభాతవార్త :** వరంగల్-హైదరాబాద్ జాతీయ రహదారిపై జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం గోవర్ధనగిరి గ్రామంవద్ద శనివారం తెల్లవారుజామున ఘోర ప్రమాదం జరిగింది. ఈప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందగా మరో నలుగురికి గాయాల్లయ్యాయి. హైదరాబాద్ నుంచి హన్మకొండ వైపు వెళ్తున్న టీజీ24 బి9237 నెంబర్‌గల ఎర్టిగా కారు ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురు ప్రయాణిస్తున్నారు. తెల్లవారుజామున సుమారు 2.30గంటల సమయంలో గోవర్ధనగిరి గ్రామం దర్గా సమీపంలో కారు అదుపుతప్పి రోడ్డుదిగి పక్కనే ఉన్నకాలువలో పడిపోయింది. ఈప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందగా మరో నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. మృతిచెందిన వారిలో ఎండి.అసద్ (26) సాఫ్ట్‌వేర్ ఉద్యోగి, అఫ్సాహబీబ్ (27) బీడీఎస్ వైద్యురాలుగా గుర్తించారు. వీరు వరంగల్‌లోని నయీంనగర్‌కు చెందినవారని పోలీసులు తెలిపారు. ప్రమాదంలో గాయపడిన రహముద్దీన్ ఖాన్ (డ్రైవర్), షాహీన్‌బేగం, ఇలేషా, రేష్మాలను వెంటనే జనగామ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఘటనపై కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ డి.నరేష్ తెలిపారు.

**ఘటన స్థలాన్ని పరిశీలించిన జనగామ డిసిపి**

వరంగల్ జాతీయ రహదారిపై శనివారం తెల్లవారు జామున రఘు నాథపల్లి మండలం గోవర్ధనగిరి వద్ద జరిగిన రోడ్డుప్రమాద స్థలాన్ని జనగామ డిసిపి రాజమహేంద్ర నాయక్ సందర్శించారు. ప్రమాదం జరిగిన తీరును అడిగి ఆయన బాధిత కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. వరంగల్ నుండి కర్ణాటకలోని వివాహ రెసెప్షన్‌కు వెళ్లి తిరిగి వస్తుండగా ఈ దుర్ఘటన చోటు చేసుకున్నట్లు బాధితు కుటుంబసభ్యులు పోలీసులకు వివరించారు. డ్రైవర్ అజాగ్రత్తవల్లే ఈ ప్రమాదం సంభవించినట్లు వారు భావిస్తున్నారు. డ్రైవర్‌పై కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు డిసిపి వెల్లడించారు. ఆయనవెంట ఎస్ఐ నరేష్ తదితరులు ఉన్నారు.

## మొక్కజొన్న అమ్మకానికి టెండర్లు

**మూడు విడతలుగా విక్రయాలు**

**రేపు 4.60 లక్షల టన్నుల వేలం**

**హైదరాబాద్, జూన్ 13, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని రైతుల నుండి సేకరించిన మొక్కజొన్న నిల్వలను విక్రయించాలని తెలంగాణ రాష్ట్ర కోపరేటివ్ మార్కెటింగ్ ఫెడరేషన్ (మార్క్‌ఫెడ్) నిర్ణయించింది. ఈ నేపథ్యంలో ఈ మొక్కజొన్న నిల్వల విక్రయానికి మార్క్‌ఫెడ్ ఈ నెల 7వ తేదీన ఈ టెండర్లను అహ్వానించింది. రాష్ట్ర వ్యాప్తంగా నిల్వ ఉంచిన మొక్కజొన్నను మూడు విడతలుగా వేలం వేయడం ద్వారా విక్రయించనున్నారు. మొదటి విడతలో 16 లాట్లను ఈ నెల 15న వేలం వేసి విక్రయించనుండగా, రెండవ విడతకు జూలై 16, 17 తేదీలలో మరో రెండు విడతల్లో బిడ్లు నిర్వహిస్తారు. ప్రతి విడతలో సగటున 4.60 లక్షల మెట్రిక్ టన్నుల మొక్కజొన్న వేలం వేయనున్నట్లు మార్క్‌ఫెడ్ అధికారవర్గాల సమాచారం. కాగా తెలంగాణలో వరి తర్వాత మొక్కజొన్న అత్యంత ప్రాముఖ్యమైన రెండవ ప్రధాన పంట.

రాష్ట్ర వ్యాప్తంగా యాసంగి సీజనుకు సంబంధించి 16.37 లక్షల ఎకరాల్లో మొక్కజొన్న పంటను రైతులు సాగు చేశారు. తద్వారా మొత్తంగా 43 లక్షల టన్నుల మొక్కజొన్న ఉత్పత్తి అయ్యింది. రాష్ట్రంలోని నిర్మల్, వరంగల్, ఖమ్మం, మహబూబాబాద్, కొత్తగూడెం, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో అత్యధికంగా మొక్కజొన్న పంటను రైతాంగం సాగు చేసింది. రైతులు నష్టపోకూడదనే ఉద్దేశ్యంతో, రాష్ట్ర ప్రభుత్వం నేరుగా మార్క్‌ఫెడ్ ద్వారా మొక్కజొన్నను కొనుగోలు చేస్తూ ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఈ నేపథ్యంలో 22 లక్షల టన్నుల మొక్కజొన్నను కొనుగోలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించినా, మార్క్‌ఫెడ్ రాష్ట్రం మొత్తం మీద దాదాపు 15 లక్షల టన్నులకు వరకూ మాత్రమే రైతుల వద్ద నుండి కొనుగోలు చేసింది. ఈ లెక్కన నిర్ధారించిన లక్ష్యం కన్నా ఇంకా సుమారు 7 లక్షల టన్నులకు పైగా మొక్కజొన్న తక్కువగా కొనుగోలు చేసింది. ఇప్పుడు ఈ మొక్కజొన్న నిల్వలను విక్రయించాలని మార్క్‌ఫెడ్ చర్యలు చేపట్టింది.



ప్రసంగిస్తున్న రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య

## ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై గందరగోళం వద్దు

**బిసి సంఘాల డిమాండ్**

**హైదరాబాద్, జూన్ 13, ప్రభాతవార్త :** ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం పై ప్రభుత్వం నిత్యం జారీ చేస్తున్న జీవోలతో విద్యార్థులు, తల్లి దండ్రులు తీవ్రగందర గోళానికి గురవుతున్నారని బీసీ సంఘాల ప్రతి నిధులు మండి పడ్డారు. పాత విధానాన్నే యథాతథంగా కొనసా గించాలని, పెండింగ్‌లో ఉన్న రూ. 6 వేల కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. శనివారం బీసీ భవన్‌లో డాక్టర్ ర్యాగ అరుణ్ కుమార్ అధ్యక్షతన 18 బీసీ సంఘాల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. 'ప్రభుత్వం జీవో నంబర్ 7ను జారీ చేసి, వ్యతిరేకత రావడంతో తాజాగా 8, 9 జీవోలను తీసుకురావడం దారుణం. రోజుకో జీవోతో విద్యార్థుల భవిష్యత్తును సందిగ్ధంలో పడేస్తున్నారు. పథకాన్ని ఎత్తివేయాలనుకుంటే ధైర్యంగా చెప్పండి, ప్రజాక్షేత్రంలో తేల్చుకుందాం' అని సవాలు విసిరారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 33 నెలలు గడిచినా, బకాయిలు చెల్లించలేదని, ఇప్పుడు నెలకు రూ. 300 కోట్లు ఇస్తామంటే ఎలా నమ్మాలని ప్రశ్నించారు. ప్రభుత్వం వెంటనే పాత విధానాన్ని పునరుద్ధరించి, పెండింగ్ బకాయిలను విడుదల చేయాలని, ఈ అంశంపై ముఖ్యమంత్రి అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

## ప్రజాపాలనలో పర్యాటక రంగానికి కొత్తఊపు

**మంత్రి జూపల్లి కృష్ణారావు**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 13:** ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమం విజయ వంతంగా ముగిసిందని పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం రెండున్నరేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా పర్యాటక, సాంస్కృతిక, వారసత్వ రంగాల్లో సాధించిన ప్రధాన విజయాలను మంత్రి ఒక ప్రకటనలో వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణను ప్రపంచస్థాయి పర్యాటక గమ్యస్థానంగా తీర్చిదిద్దడం, రాష్ట్ర సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షించడం, కళాకారుల సంక్షేమాన్ని ప్రోత్సహించడం, పర్యాటక మౌలిక సదుపాయాలను విస్తరించడం, పెట్టుబడులను ఆకర్షించడం, స్థానిక ఉపాధి అవకాశాలను పెంపొందించడం వంటి లక్ష్యాలతో సమగ్ర కార్యాచరణ చేపట్టిందని మంత్రి తెలిపారు. తెలంగాణ ఆవిర్భావం అనంతరం తొలిసారిగా తెలంగాణ టూరిజం పాలసీ 2025-2030ను అమలు చేశామని మంత్రి తెలిపారు. ఈ విధానం ద్వారా రూ.15 వేల కోట్ల పెట్టుబడులు, 3 లక్షల ఉద్యోగాల కల్పన లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. పీపీపీ విధానంలో మౌలిక సదుపాయాల అభివృద్ధి, సుస్థిర పర్యాటకం, డిజిటల్ ప్రచారం, అంతర్జాతీయ బ్రాండింగ్, నైపుణ్యాభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. టూరిజం కాన్‌క్లేవ్2025 ద్వారా 24 మంది పెట్టుబడిదారుల నుంచి రూ.15,285 కోట్ల పెట్టుబడి ప్రతిపాదనలు లభించాయని మంత్రి తెలిపారు. అదేవిధంగా తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్2025లో 18 మంది పెట్టుబడిదారులతో రూ.8,456 కోట్ల విలువైన అవగాహన ఒప్పందాలు కుదిరాయని చెప్పారు. వీటి ద్వారా 10 వేల ప్రత్యక్ష, 30 వేల పరోక్ష ఉద్యోగాలు సృష్టించబడనున్నాయని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో రూ.181 కోట్ల విలువైన ప్రాజెక్టులు మంజూరయ్యాయని తెలిపారు. బుద్ధవనం, రామప్ప, సోమశిల, నిజాంసాగర్, బల్కంపేట ఆలయం అభివృద్ధి పనులు కొనసా గుతున్నాయని చెప్పారు. రాష్ట్రంలో పర్యాటకుల సంఖ్య గణనీయంగా పెరిగిందని మంత్రి తెలిపారు. 2023లో 5.84 కోట్లుగా ఉన్న దేశీయ పర్యాటకుల సంఖ్య 2024లో రికార్డు స్థాయిలో

14-06pg10.qxdo/p:14-06pg10.qxd 1/1/02 7:11 AM Page 1






# డెబ్యూ మ్యాచ్‌లోనే వికెట్ల పంట

(వార్త క్రీడా విభాగం)

డెబ్యూ మ్యాచ్‌లోనే గుర్నూర్ బ్రార్, హర్ష్ దూబే అదరగొట్టాడు. టీమిండియా తరపున గ్రాండ్‌తో ఎంట్రీ ఇచ్చారు. అఫ్గానిస్తాన్‌తో జరిగిన తొలి వన్డేలోనే ఇద్దరూ కుర్రాళ్లు మూడేసి వికెట్లు తీసి ఆ జట్టును కట్టడిచేశారు.

పంజాబ్‌కు చెందిన కుడిచేతివాటం పేసర్ గుర్నూర్ బ్రార్.. వస్తూనే తొలి ఓవర్ అయిదో బంతికే వికెట్ సాధించాడు. ఓపెనర్ జద్రాన్‌ను అద్భుత బంతితో పెవలియన్‌కు చేర్చి అఫ్గానిస్తాన్ వికెట్ పతనానికి నాంది పలికాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో తను వేసిన తొలి ఓవర్లో రెండు పరగులిచ్చి వికెట్ పడగొట్టడం ద్వారా ఆకట్టుకున్నాడు. ఇక ఆఫ్ఘన్ ఇన్నింగ్స్‌లో చివరి ఓవర్ వేసిన గుర్నూర్ బ్రార్.. ఆ ఓవర్లో ఏకంగా రెండు వికెట్లు పడగొట్టాడు. మొదట రషీద్ ఖాన్‌ను క్లీన్ బౌల్డ్ చేసిన గుర్నూర్... ఆ తర్వాతి రెండో బంతికే జియావుర్ రహమాన్‌కు చమ్కా ఇచ్చి అఫ్గానిస్తాన్ ఇన్నింగ్స్‌ను194రన్స్‌కు తెరదించాడు. వికెట్లపతనాన్ని ప్రారంభించిన గుర్నూర్..వికెట్ల ముగింపును శాసించాడు. మొత్తంగా 4.5 ఓవర్లలో 27 రన్స్ ఇచ్చి 3వికెట్లు పడగొట్టాడు. కెప్టెన్ గిల్ నమ్మకాన్ని నిలబెట్టాడు.

ఇక మరో డెబ్యూ బౌలర్ హర్ష్ దూబే కూడా సత్తా చాటాడు. అయితే తన తొలిఓవర్లోనే 16రన్స్‌తో కాస్ట్‌లీగా తేలాడు. రెండో ఓవర్‌లో మరో పది పరుగులిచ్చాడు. బ్రేక్ తర్వాత మరోసారి బౌలింగ్‌కు వచ్చి వికెట్లు సాధించాడు. 17వ ఓవర్లో కేవలం ఒక పరుగే ఇచ్చి హాస్మతుల్లాను బోల్తా కొట్టించి తొలి వికెట్ సాధించాడు. తన అయిదో ఓవర్లో మొదట అజ్మతుల్లాను, రెండుబంతుల తర్వాత ఘజన్‌ఫర్‌ను వికెట్లు కూల్చాడు. ఈ విధంగా ఒకే ఓవర్లో రెండు వికెట్లు సాధించాడు. మొత్తంగా 5 ఓవర్లు వేసి 47 పరుగులిచ్చి 3 వికెట్లు తీశాడు.

**గిల్ మెచ్చిన క్రికెటర్ గుర్నూర్**

గుర్నూర్ బౌలింగ్ యాక్షన్ డెయిల్ స్టెయిన్‌లా ఉంటుంది. చిన్న వయసులో క్రికెట్ కంటే ఫుట్‌బాల్, టెన్నిస్ ఇష్టపడేవాడు. అయితే హైట్ అడ్వాంటేజ్ కారణంగా కొందరి మిత్రుల సలహాతో క్రికెట్‌లోకి ఎంట్రీ ఇచ్చాడు. రెండేళ్లలోనే ఇండియా అండర్19 జట్టుకు ఎంపియ్యాడు. అక్కడే గుర్నూర్‌కు గిల్ పరిచయమయ్యాడు. అతడి టాలెంట్‌ను గమనించిన గిల్ కొన్ని సూచనలు, సలహాలు ఇచ్చాడు. అలా పంజాబ్ అండర్ 23 జట్టులో చోటు దక్కించుకున్న గుర్నూర్ బ్రార్ 2021లో లిస్ట్‌ఏతో పాటు ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో అరంగేట్రం చేశాడు. 2023లో పంజాబ్ కింగ్స్‌కు నెట్‌బౌలర్‌గా వచ్చిన గుర్నూర్ బ్రార్‌కు అనుకోకుండా జట్టుకు ఆడే అవకాశం వచ్చింది. సెలెక్టర్ల దృష్టిలో పడిన గుర్నూర్ బ్రార్‌ను గతేడాది ఇండియాఏ జట్టుకు ఎంపిక చేయడంతో అతడి కెరీర్ మలుపు తిరిగింది.

**నిఖార్సైన స్పిన్ ఆల్‌రౌండర్**

విదర్భకు చెందిన హర్ష్ దూబే నిఖార్సైన ఆల్‌రౌండర్, 2024-25సీజన్‌లో 69వికెట్లు తీసి విదర్భను రంజీ ఛాంపియన్‌గా నిలిపాడు. ఈ ప్రదర్శనతో ఇండియా-ఏ జట్టులోకి ఎంపికయ్యాడు. ఇక విజయ్ హజారే ట్రోఫీలో కెప్టెన్‌గా విదర్భను నడిపించిన హర్ష్‌దూబే ఆ జట్టుకు తొలి టైటిల్ అందించాడు. దేశవాళీ క్రికెట్‌లో ప్రదర్శనతో హర్ష్‌ను ఐపీఎల్ 2025 సీజన్‌కు ముందు ఎస్ఆర్‌హెచ్ కొనుగోలు చేసింది. ఢిల్లీ క్యాపిటల్స్ మ్యాచ్‌తో ఐపీఎల్‌లో అరంగేట్రం చేసిన హర్ష్ దూబే ఆ సీజన్‌లో మూడు మ్యాచ్‌ల్లో ఐదు వికెట్లు తీశాడు. 2026 సీజన్‌కు ఎస్ఆర్‌హెచ్ అతడిని రిటైన్ చేసుకుంది. ఈ సీజన్‌లో 8 మ్యాచ్‌లాడిన హర్ష్‌దూబే 8 వికెట్లు తీశాడు.



# పరాగ్వేపై అమెరికా సూపర్ విక్టరీ

**న్యూయార్క్:** ఫిఫా వరల్డ్ కప్‌లో ఆతిథ్య అమెరికా శుభారంభం చేసింది. పరాగ్వేపై ఆధిపత్యం ప్రదర్శిస్తూ 4-1 గోల్స్ తేడాతో సూపర్ విక్టరీ నమోదు చేసింది. ఫిఫా ప్రపంచకప్ చరిత్రలోనే ఒక మ్యాచ్‌లో నాలుగు గోల్స్ చేయడం అమెరికాకిదే తొలిసారి. సొంత ప్రేక్షకుల మధ్య మొదట్నుంచీ దూకుడుగా ఆడిన అమెరికా.. పరాగ్వేకు ఏమాత్రం అవకాశం ఇవ్వలేదు. ఆట ప్రారంభమైన ఏడు నిమిషాలకే డామియన్ గోల్ సాధించి అమెరికాకు ఆధిక్యం అందించాడు. ఇక ఫోలారిన్ వరుసగా రెండు గోల్స్ కొట్టడంతో తొలి అర్ధభాగం సమయానికే 3-0 ఆధిక్యం పొందింది. రెండో అర్ధభాగం 73వ నిమిషంలో మోరిసియో.. పరాగ్వేకు గోల్ అందించాడు. ఇక ఆట అదనపు సమయంలో అమెరికా ప్లేయర్ గివోన్నిరీనా అదిరిపోయే గోల్ సాధించిపెట్టాడు. దీంతో అమెరికా 4-1 తేడాతో పరాగ్వేపై నెగ్గింది.

**కెనడా-బోస్నియా మ్యాచ్ డ్రా**

అంతకుముందు అర్ధరాత్రి మరో ఆతిథ్య దేశం కెనడా తన తొలి మ్యాచ్‌ను డ్రా చేసుకుంది. బోస్నియాతో జరిగిన పోరులో 1-1తో కెనడా సమంగా నిలిచింది. అయితే ఫిఫా ప్రపంచ కప్‌లో తొలిసారి కెనడా పాయింట్‌ను సాధించడం గమనార్హం. గత ఎడిషన్లలో ఆరు మ్యాచుల్లోనూ కెనడా ఓడింది.

# గిల్ కెప్టెన్ ఇన్నింగ్స్ భారత్ బిగ్ విక్టరీ

**ధర్మశాల:** అఫ్గానిస్తాన్‌తో సొంతగడ్డపై జరుగుతున్న వన్డే సిరీస్‌లో టీమిండియా శుభారంభం చేసింది. ధర్మశాల వేదికగా జరిగిన తొలి వన్డేలో 7 వికెట్ల తేడాతో ఘన విజయాన్ని అందుకుంది. వర్షం అంతరాయంతో మ్యాచ్‌ను 25 ఓవర్లకు కుదించారు. అఫ్గానిస్తాన్ విధించిన 195 పరుగుల లక్ష్యాన్ని టీమిండియా 22.5 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి ఛేదించింది. మూడు వన్డేల సిరీస్‌లో 1-0తో ఆధిక్యంలో నిలిచింది.

లక్ష్య ఛేదనలో రోహిత్ శర్మ(16)వికెట్‌ను 46 పరుగుల వద్ద కోల్పోయింది. జోరుమీద కనిపించిన రోహిత్ రనౌట్‌గా వెనుదిరిగాడు. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (66 బంతుల్లో 84 నాటౌట్).. ఇషాన్ కిషన్(34)తో కలిసి రెండో వికెట్‌కు 70 రన్స్ జోడించాడు. శ్రేయాస్‌అయ్యర్(12) నిరాశపరిచినా... రాహుల్ అండగా కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడాడు. చివర్లో కేఎల్ రాహుల్ (19 బంతుల్లో 39 నాటౌట్) ధనాదన్ ఇన్నింగ్స్‌తో టీమిండియాకు విజయాన్ని అందించాడు. ఆఫ్ఘన్ బౌలర్లలో రషీద్, రెహమాన్ షరీఫీ చెరొక వికెట్ తీశారు.

అంతకముందు తొలుత బ్యాటింగ్ చేసిన అఫ్గానిస్తాన్ 24.5 ఓవర్లలో 194 పరుగులకు




ఆలౌటైంది. ఓపెనర్ రహ్మానుల్లా గుర్బాజ్ (102) శతకంతో అదరగొట్టాడు. హాస్మతుల్లా (26) రాణించాడు. భారత బౌలర్లలో హర్ష్‌దూబే, గుర్నూర్ బ్రార్ చెరో 3 వికెట్లు తీయగా, నితీశ్ కుమార్ రెడ్డి, అర్ష్‌దీప్ సింగ్‌లు 2 వికెట్లు పడగొట్టారు. ఇరుజట్ల మధ్య రెండో వన్డే బుధవారం లక్నో వేదికగా జరగనుంది.

# సెమీస్‌లో సింధూకు మరోసారి నిరాశ

**సిడ్నీ:** ఆస్ట్రేలియన్ ఓపెన్ సూపర్ 500 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత షట్లర్ల పోరాటం ముగిసింది. ఏకైక ఆశాకిరణంగా ఉన్న పీవీ సింధూ కూడా ఫైనల్ చేరకుండానే వెనుదిగిరింది. మహిళల సింగిల్స్ సెమీఫైనల్లో సింధూ 20-22, 12-20తో వరుస గేమ్‌ల్లో టాప్ సీడ్ జపాన్ షట్లర్ అకానే యమగుచి చేతిలో ఓడింది. 43 నిమిషాల పాటు జరిగిన ఈ సెమీస్ పోరులో నెగ్గిన ప్రపంచ ఛాంపియన్ యమగుచి ఫైనల్లో ప్రవేశించింది.

సెమీఫైనల్ పోరును పీవీ సింధూ మంచి ఈజ్‌తో ప్రారంభించింది. చక్కని నెట్ గేమ్‌తో దూకుడు ప్రదర్శించిన సింధూ.. 12-6తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. అయితే బ్రేక్ తర్వాత వరుసగా ఆరు పాయింట్లు సాధించిన సమవుజ్జీగా నిలిచింది. ఇద్దరూ పోటీపోటీగా పాయింట్లు రాబట్టడంతో 20-20 వరకు స్కోరు సమంగా కొనసాగింది. ఈ దశలో సింధూ గేమ్ లయ తప్పింది. కీలక దశలో ఎర్రర్స్ చేయడంతో.. దీన్ని సద్వినియోగం చేసుకుంటూ యమగుచి వరుసగా రెండు పాయింట్లు సాధించి గేమ్‌ను సొంతం చేసుకుంది. ఇక రెండో గేమ్‌లో సింధూ తేలిపోయింది. మరోవైపు జపాన్ షట్లర్ సింధూకు ఎలాంటి అవకాశం ఇవ్వకుండా ఆధిక్యంలో దూసుకుపోయింది. రెండే గేమ్‌ను మరింత అలవోకగా 21-12తో ముగించి ఫైనల్లో ప్రవేశం



చింది. ఈ ఓటమితో 2026 సీజన్‌లో తొలి బీడబ్ల్యూఎఫ్ టైటిల్ అందుకోవాలన్న సింధూ కల చెదిరింది. కాగా ఈ సీజన్ బీడబ్ల్యూఎఫ్ టూర్‌లో సింధూ... సెమీఫైనల్లో ఓడడం ఇది రెండోసారి. జనవరిలో జరిగిన మలేషియా ఓపెన్ సూపర్ 1000 టోర్నీలోనూ సింధూ సెమీస్‌లో చైనా షట్లర్ వాంగ్ జియి చేతిలో ఓడింది. చివరగా 2024లో లక్నో వేదికగా జరిగిన సయ్యద్ మోదీ ఇంటర్నేషనల్ టైటిల్ నెగ్గింది.

# నెయ్‌మార్‌కు గాయం:మొరాకోతో బ్రెజిల్ తొలి పోరు


**న్యూజెర్సీ:** ఫిఫా వరల్డ్ కప్‌లో మరో హాట్ ఫేవరెట్ బ్రెజిల్ తొలి మ్యాచ్‌ను సిద్ధమైంది. ఆదివారం తెల్లవారుజామున 3.30 గంటలకు మొరాకోతో తలపడనుంది. ఈ కీలక పోరుకు ముందు బ్రెజిల్‌కు బిగ్ షాక్ తగిలింది. స్టార్ ఫుట్‌బాలర్ నెయ్‌మార్ గాయం కారణంగా తొలి మ్యాచ్‌కు దూరమయ్యాడు. యువ ఆటగాళ్లపై బ్రెజిల్ ఆశలు పెట్టుకుది. రఫిన్హా, వినిసియస్ జూనియర్, మాథ్యూస్ కున్హామెరుగైన ఫామ్‌లో ఉన్నారు. అలాగే ఎండ్రిక్, ఇగోర్ థియాగో వంటి యువ ఆటగాళ్లు కూడా ఆశలు రేకెత్తిస్తున్నారు. మిడ్‌ఫీల్డ్‌లో కాసెమిరో, బ్రూనో గిమారెస్, లూకాస్ పక్వేటా కీలక పాత్ర పోషించనున్నారు. మొరాకోను తేలికగా తీసుకునే పరిస్థితి లేదు. ప్రస్తుతం మంచి ఫామ్‌లో ఉంది. కెప్టెన్ అష్రఫ్ హాకీమ్, స్టార్ ఫార్వర్డ్ బ్రాహిమ్ డియాజ్ జట్టుకు ప్రధాన బలంగా ఉన్నారు. గత ప్రపంచకప్‌లో సంచలన ప్రదర్శన చేసిన మొరాకో ఈసారి కూడా డార్క్ హార్స్‌గా బరిలోకి దిగుతోంది. సమష్టి ఆటతో ప్రత్యర్థు లకు గట్టి పోటీ ఇవ్వగల సామర్థ్యం ఆ జట్టుకు ఉంది. బ్రెజిల్, మొరాకో జట్లు ఇప్పటివరకు రెండుసార్లు తలపడగా 1-1 విజయంతో సమవుజ్జీగా ఉన్నాయి. దీంతో ఈ మ్యాచ్‌పై ఆసక్తి మరింత పెరిగింది.






# వడ్డీరేట్లు పెంచిన కెనరా, బరోడా

**ముంబయి, జూన్ 13:** ప్రభుత్వ రంగానికి చెందిన రెండు దిగ్గజ బ్యాంకులు బ్యాంక్ ఆఫ్ బరోడా, కెనరా బ్యాంకు సడెన్ షాక్ ఇచ్చాయి. మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్స్ బేస్డ్ లెండింగ్ రేట్లను పెంచేశాయి. ఎంపిక చేసిన టెన్యూర్లపై గరిష్ఠంగా 5 బేసిస్ పాయింట్ల వరకు ఎంసీఎల్‌ఆర్ పెంచాయి. సవరించిన ఎంసీఎల్‌ఆర్ రేట్లు జూన్ 12 నుంచి అమల్లోకి వచ్చాయని బ్యాంకులు పేర్కొన్నాయి. నిధుల వ్యయ ఆధారిత వడ్డీ రేటుగా చెబుతుంటారు. ఇప్పుడు ఎంసీఎల్‌ఆర్ పెంచిన నేపథ్యంలో ఎంసీఎల్‌ఆర్‌కు లింక్ అయి ఉన్న లోన్ వడ్డీ రేట్లు పెరుగుతాయని చెప్పొచ్చు. ఇప్పటికే ఫ్లోటింగ్ రేటుపై లోన్లు తీసుకున్నవారికి ఈఎంఐ పెరుగుతుంది. ఫిక్స్‌డ్ వడ్డీ రేటుకు తీసుకున్నవారిపై ప్రభావం చూపించదని చెప్పొచ్చు. ఆర్బీఐ తన ద్రవ్య పరపతి విధాన సమీక్ష నిర్ణయాల్లో కీలక రెపోరేటును మూడోసారి 5.25శాతం వద్ద స్థిరంగానే ఉంచింది. ఎంసీఎల్‌ఆర్ అనేది కనీస వడ్డీ రేటు. అంటే బ్యాంకులు, ఆర్థిక సంస్థలు ఇంతకంటే తక్కువ వడ్డీకి లోన్లు ఇచ్చేందుకు వీల్లేదు. అన్ని బ్యాంకులకు ఒకే విధానం ఉండాలన్న ఉద్దేశంతో కేంద్ర బ్యాంక్ 2016లో ఈ విధానం తీసుకొచ్చింది. కెనరా బ్యాంకు ప్రధానంగా తన షార్ట్ టర్మ్ టెన్యూర్లపై ఎంసీఎల్‌ఆర్ సవరించింది. ఓవర్‌నైట్ ఎంసీఎల్‌ఆర్ 5 బేసిస్ పాయింట్లు పెరగ్గా 7.90 శాతం నుంచి 7.95 శాతానికి చేరింది. ఒక నెల ఎంసీఎల్‌ఆర్ 8శాతం, 3 నెలల ఎంసీఎల్‌ఆర్ 8.25 శాతం, 6 నెలల ఎంసీఎల్‌ఆర్ కూడా 5 బేసిస్ పాయింట్లు పెరిగి 8.60 శాతానికి పెరిగింది. ఎక్కువగా కన్జూమర్ లోన్లకు లింక్ అయి ఉండే ఏడాది టెన్యూర్ ఎంసీఎల్‌ఆర్ 8.75 శాతంగా ఉంది. బ్యాంక్ ఆఫ్ బరోడా వడ్డీ రేట్లు మరో ప్రభుత్వ రంగ బ్యాంక్ బ్యాంక్ ఆఫ్ బరోడా 5 టెన్యూర్లపై ఎంసీఎల్‌ఆర్ పెంచింది. ఓవర్‌నైట్ ఎంసీఎల్‌ఆర్ 5 బేసిస్ పాయింట్లు పెరిగి 7.80 శాతం నుంచి 7.85 శాతానికి చేరింది. ఒక నెల ఎంసీఎల్‌ఆర్ 7.95 శాతం, 3 నెలల ఎంసీఎల్‌ఆర్ 8.20 శాతానికి చేరింది. 6 నెలల ఎంసీఎల్‌ఆర్ 8.50 శాతం, ఏడాది టెన్యూర్ ఎంసీఎల్‌ఆర్ 5 బేసిస్ పాయింట్లు పెరగడంతో 8.75 శాతానికి చేరింది.




## వాడకంలో లేని బ్యాంకు ఖాతాలు తొలగించండి

# కస్టమర్లకు బ్యాంకర్ల హెచ్చరికలు

**ముంబయి, జూన్ 13:** డిజిటల్ చెల్లింపులు పెరిగిన తర్వాత యూపీఐ చాలా మందికి రోజువారీ జీవితంలో భాగమైంది. డబ్బు పంపాలన్నా, బిల్లు చెల్లించాలన్నా యూపీఐనే ఎక్కువగా ఉపయోగిస్తున్నారు. వాడకంలో లేని బ్యాంకు ఖాతాలను తొలగించుకోవాలని బ్యాంకింగ్ నిపుణులు హెచ్చరిస్తున్నారు. యూపీఐలో ఒకమొబైల్ నంబర్‌కు ఒకటి కంటే ఎక్కువ బ్యాంక్ ఖాతాలను లింక్ చేసే అవకాశం ఉంటుంది. కొత్తబ్యాంక్ ఖాతా జోడిస్తే పాతది ఆటోమేటిక్‌గా తొలగిపోదు. అది కూడా యాప్‌లో కనిపిస్తూనే ఉంటుంది. అందుకే అవసరం లేని అకౌంట్లను స్వయంగా తొలగించాలి. వాడని బ్యాంక్‌ఖాతా యూపీఐలో ఉంటే కొన్ని ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది. ముఖ్యంగా ఆ ఖాతా ఇక యాక్టివ్‌లో లేకపోతే లావాదేవీలు విఫలమవుతాయి. రిఫండ్‌లు ఆలస్యమయ్యే అవకాశం ఉంటుంది. కొన్ని ఆటో డెబిట్ చెల్లింపులు కూడా ప్రభావితమవుతాయి. ఒకే యాప్‌లో చాలా బ్యాంక్ ఖాతాలు కనిపిస్తే ఏ ఖాతా ప్రస్తుతం ఉపయోగంలో ఉందో గుర్తించడం కష్టమవుతుంది. ముఖ్యంగా వృద్ధులు లేదా డిజిటల్ చెల్లింపులకు కొత్తగా అలవాటు పడుతున్న వారికి ఇది గందరగోళం కలిగించవచ్చు. అందుకే ప్రస్తుతం వాడుతున్న ఖాతాలను మాత్రమే ఉంచుకోవాలని బ్యాంకింగ్ నిపుణులు సూచిస్తున్నారు. బ్యాంక్ ఖాతామార్చిన తర్వాత యాక్టివ్ ఆటోపేలు, ఈఎంఐలు, సబ్‌స్క్రిప్షన్లు ఏ ఖాతాకు లింక్ అయ్యాయో ఒకసారి చెక్ చేయాలి. కొంతకాలానికోసారి యూపీఐలో ఉన్న బ్యాంక్ ఖాతాల జాబితాను పరిశీలించడం మంచిది. అవసరం లేని ఖాతాలను తొలగిస్తే యాప్ వినియోగం సులభంగా ఉంటుంది.

# ఈవీ డెలివరీ కోసం మూడునెలల వెయిటింగ్!

**ముంబయి, జూన్ 13:** పెట్రోలు డీజిల్‌ధరలు ఆకాశాన్నంటుతున్న క్రమంలో, వాహనదారులు ఎలక్ట్రిక్ వాహనాలు ఈవీల వైపు మళ్లుతుండటంతో ఈవీ కార్లకు ఒక్కసారిగా గిరాకీ పెరిగి, డెలివరీ కోసం నెలల తరబడి వేచిచూడాల్సిన పరిస్థితి నెలకొంది. మారుతి సుజుకి, టాటా మోటార్స్, మెర్సిడెస్‌బెంజ్, మహీంద్రా వంటి ప్రముఖ కంపెనీల పాపులర్ మోడళ్ల కోసం ప్రస్తుతం 3 నెలల వరకు వెయిటింగ్ పీరియడ్ నడుస్తోంది. పశ్చిమాసియా ఉద్రిక్తతల పుణ్యమా అని బయ్యర్లు ఇపుడు విద్యుత్ వాహనాలవైపు దృష్టి మార్చారు. అధిక ధరలు, ఛార్జింగ్ సదుపాయాల కొరత వంటి కారణాలతో ఈవీల కొనుగోలుకు వెనుకాడిన వినియోగదారులు, ఇప్పుడు వాటపైనే ఆసక్తి కనబరుస్తున్నారు.

మార్చి నెల నుంచి తమ బ్యాటరీ ఎలక్ట్రిక్ వాహనాల (బీఈవీ) డిమాండ్ 40 శాతం మేర పెరిగిందని మెర్సిడెస్‌బెంజ్ ఇండియా వెల్లడించింది. ఏప్రిల్‌లో విడుదలైన సీఎల్ఏ బీఈవీ మోడల్‌కు రెండు నుంచి 3 నెలల వెయిటింగ్ పీరియడ్ సమయం ఉందని,




దీనివల్ల డీలర్లు కొత్త బుకింగ్స్‌ను నిలిపివేశారని కంపెనీ ఎండీ సంతోష్ అయ్యర్ తెలిపారు. బీఎండబ్ల్యూ ఇండియా సైతం ఇదే తరహాపరిస్థితులను ఎదుర్కొంటోంది. మేనెలలో ఆ కంపెనీ మొత్తం అమ్మకాల్లో ఈవీల వాటా 33 శాతానికి చేరుకోవడం విశేషం.

దేశీయ దిగ్గజ కార్ల తయారీ సంస్థ మారుతి సుజుకికి చెందిన కొత్త ఈవిటారా ఎస్‌యూవీ బుకింగ్స్ గత నెలలో రెట్టింపయ్యాయని, దీంతో 6 నుంచి 8 వారాల నిరీక్షణ తప్పడం లేదని కంపెనీ సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పార్థో బెనర్జీ వివరించారు. అదే విధంగా మహీంద్రా ఎక్స్‌యూవీ 9ఈ మోడల్‌కు 6నుంచి 8 వారాలు, టాటా మోటార్స్ పంచ్, టియాగో ఈవీలకు 6 వారాల వెయిటింగ్ పీరియడ్ కొనసాగుతోంది. 2026 మేలో ఎలక్ట్రిక్ కార్ల అమ్మకాలు రికార్డు స్థాయిలో 26,000 యూనిట్లను దాటాయి. ఇది గతేడాదితో పోలిస్తే 80 శాతం అధికం కావడం గమనార్హం. మొత్తం ప్యాసింజర్ వాహనాల్లో ఈవీల వాటా తొలిసారిగా 11 శాతాన్ని అధిగమించింది. పెరిగిన డిమాండ్‌కు అనుగుణంగా ఉత్పత్తిని పెంచేందుకు ఆటోమొబైల్ సంస్థలు తీవ్రంగా ప్రయత్నిస్తున్నప్పటికీ, సరఫరా వ్యవస్థలో తలెత్తిన సమస్యలు సవాలుగా మారాయి. ఇంధన ధరల అనిశ్చితి నేపథ్యంలో, ఆర్థికంగా పొదుపు మార్గంగా వినియోగదారులు సహజంగానే ఈవీల వైపు ఆకర్షితులవుతున్నారు.



## ఫోర్బ్స్ జాబితాలో భారత సంతతి సిఇఒ

# రూ.57వేల కోట్లతో ఏడో స్థానం

**సిలికాన్‌వ్యాలీ, జూన్ 13:** అమెరికా ఐటి నగరం సిలికాన్ వ్యాలీలో ఒక ఎన్ఆర్ఐ మహిళ రికార్డు సాధించారు. గ్లోబల్ టెక్నాలజీ సంస్థ అరిస్టా నెట్‌వర్క్స్ ప్రెసిడెంట్, సీఈఓ అయిన జయశ్రీ ఉల్లాల్ అగ్రరాజ్యంలో సరికొత్త రికార్డుని నెలకొల్పారు. 2026 సంవత్సరానికి గాను ఫోర్బ్స్ ప్రకటించిన సొంతంగా ఎదిగిన అత్యంత సంపన్న మహిళలు జాబితాలో ఆమె అత్యున్నత స్థానాన్ని దక్కించుకున్నారు. ఈ ప్రతిష్టాత్మక లిస్ట్‌లో నిలిచిన ఏకైక భారత సంతతి మహిళ జయశ్రీ. ఫోర్బ్స్ జాబితా ప్రకారం జయశ్రీ ఉల్లాల్ నికర ఆస్తి విలువ ఏకంగా 6.8 బిలియన్ డాలర్లు అంటే భారత కరెన్సీలో సుమారు రూ. 56,700 కోట్లకు పైగా ఉంది. ఈ భారీ సంపదతో ఆమె ఫోర్బ్స్ వార్షిక జాబితాలో ఏడో స్థానాన్ని కైవసం చేసుకున్నారు. ప్రస్తుత రియల్ టైమ్ మార్కెట్ విలువ ప్రకారం ఆమె ఆస్తి 6.5 బిలియన్ డాలర్లుగా ఉన్నప్పటికీ ప్రపంచ బిలియనీర్ల సరసన ఆమె అగ్రస్థానంలో కొనసాగుతున్నారు. నెట్‌వర్కింగ్, సెమీకండక్టర్ రంగాలలో ఆమె మూడు దశాబ్దాలుగా అందించిన అద్భుతమైన నాయకత్వ పటిమకు ఈ విజయం నిదర్శనంగా నిలిచింది.

2008 నుంచి ఆమె సారథ్యం వహిస్తున్న అరిస్టా నెట్‌వర్క్స్ సాధించిన విజయాలే ఆమెను ఈ స్థాయికి చేర్చాయి. జయశ్రీ ఉల్లాల్ లండన్‌లో జన్మించినప్పటికీ ఆమె బాల్యమంతా దేశ రాజధాని న్యూఢిల్లీలోనే గడిచింది. చిన్నతనం నుంచే టెక్నాలజీ, ఇంజినీరింగ్ రంగాలపై ఆమెకు అమితమైన ఆసక్తి ఉండేది. ఉన్నత విద్య కోసం ఆమె అమెరికాకు వలస వెళ్లారు. శాన్ ఫ్రాన్సిస్కో స్టేట్ యూనివర్శిటీ నుంచి ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్‌లో బ్యాచిలర్ డిగ్రీ పూర్తి చేసిన జయశ్రీ ఉల్లాల్ ఆ తర్వాత శాంటా క్లారా యూనివర్శిటీ నుంచి ఇంజినీరింగ్ మేనేజ్‌మెంట్‌లో మాస్టర్స్ పట్టా పొందారు.

అరిస్టా నెట్‌వర్క్స్ బాధ్యతలు చేపట్టడానికి ముందు జయశ్రీ సిలికాన్ వ్యాలీలోని దిగ్గజ సంస్థలైన ఏఎండీ, ఫెయిర్‌చైల్డ్ సెమీకండక్టర్స్ వంటి కంపెనీల్లో కీలక బాధ్యతలు నిర్వహించారు. ప్రస్తుతం అరిస్టా సంస్థలో జయశ్రీకి 3 శాతం వాటా ఉంది. దీంతో పాటు జయశ్రీ ఉల్లాల్ ప్రముఖ క్లౌడ్ కంపెనీ స్నోఫ్లేక్ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్‌లోనూ సేవలు అందిస్తున్నారు.

# స్పేస్‌ఎక్స్ ఐపిఒతో మిలియనీర్లుగా ఉద్యోగులు!

**న్యూయార్క్, జూన్ 13:** అంతరిక్ష పరిశోధన సంస్థ స్పేస్‌ఎక్స్ భారీ స్థాయిలో నిర్వహించిన ఐపీఓ సంస్థ ఉద్యోగులను మిలియనీర్లు చేసింది. సంస్థ షేర్ల లిస్టింగ్ అనంతరం 4,400 మందికి పైగా ఉద్యోగులు మిలియనీర్లుగామారిపోయారు. నాస్‌డాక్‌లో ఒక్కో షేర్‌ను 150 డాలర్ల ధరకు స్పేస్‌ఎక్స్ లిస్టింగ్ చేయగా, ట్రేడింగ్ ప్రారంభమైన వెంటనే షేరు ధర మరింత పెరిగింది. దీంతో సంస్థలో పనిచేస్తున్న ఇంజినీర్లు, రాకెట్ ప్రయోగాల సిబ్బంది, గంటల వారీ వేతనంపై పనిచేసే కార్మికులు సైతం భారీ సంపదను సొంతం చేసుకున్నారు. వీరిలో దాదాపు 400 మంది ఉద్యోగుల ఆస్తుల విలువ 100మిలియన్ డాలర్లకు మించి ఉండనున్నట్లు అంచనా. సాధారణంగా చాలా ఐపీఓల్లో వ్యవస్థాపకులే బిలియనీర్లుగా మారుతారు. కానీ 400 మంది ఉద్యోగులు ఈ స్థాయికి చేరుకోవడం అరుదైన విషయమని హిల్ డాట్‌కో విశ్లేషకుడు ఆండ్రూబెన్సన్ పేర్కొన్నారు.



ఇక స్పేస్‌ఎక్స్ వ్యవస్థాపకుడు ఎలాన్ మస్క్ ఈ లిస్టింగ్‌తో ప్రపంచంలో తొలి ట్రిలియనీర్‌గా నిలిచారు. కంపెనీ ఉద్యోగుల్లో గావిన్ పెటిట్ అనే ఉద్యోగి 2012లో 80వేల డాలర్ల జీతంతో సంస్థలో చేరాడు. ఆ సమయంలో ఒక్కో షేర్ విలువ కేవలం 13.80డాలర్లే. అప్పట్లో స్పేస్‌ఎక్స్ రాకెట్ ప్రయోగాలు వరుసగా విఫలమవుతున్నప్పటికీ, నగదు బోనస్‌లకు బదులుగా షేర్లను స్వీకరించాలని ఆతడు తీసుకున్న నిర్ణయం ఇపుడు అతనికి అపార సంపదను తెచ్చిపెట్టింది. ప్రస్తుతం అతని వద్ద 50,000కు పైగా షేర్లు ఉన్నాయి.

# ద్రవ్యోల్బణ పెరుగుదలతో రెపోరేట్లలో మార్పులు




**ముంబయి, జూన్ 13:** దేశంలో ద్రవ్యోల్బణం మళ్లీ పెరుగుతుండటంతో భారతీయ రిజర్వ్ బ్యాంక్ వడ్డీ రేట్లను పెంచేదిశగా అడుగులు వేస్తోందని ఐసీఐసీఐ బ్యాంక్ గ్లోబల్ మార్కెట్స్ నివేదిక అంచనా వేసింది. రాబోయే రోజుల్లో ఆర్‌బీఐ రెపో రేటును 50 నుంచి 75 బేసిస్ పాయింట్ల వరకు పెంచే అవకాశం ఉందని పేర్కొంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ద్వితీయార్థంలో ఈ మార్పులు చోటుచేసుకోవచ్చని ఆర్థిక నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఐసీఐసీఐ బ్యాంక్ విశ్లేషణ ప్రకారం 2026-27ఆర్థిక సంవత్సరంలో దేశీయ ద్రవ్యోల్బణం 5 శాతానికి చేరే అవకాశం ఉంది. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడిచమురు ధరల హెచ్చుతగ్గులు, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు మరియు దేశంలో మారుతున్న వాతావరణ పరిస్థితుల వల్ల ఆహార వస్తువుల ధరలు పెరగడం ఇందుకు ప్రధాన కారణాలుగా మారుతున్నాయి. ద్రవ్యోల్బణాన్ని అదుపులో ఉంచడానికి ఆర్‌బీఐ సాధారణంగా వడ్డీ రేట్లను పెంచుతుంది. ప్రస్తుతం ఆర్‌బీఐ రెపో రేటు 5.25 శాతం వద్ద కొనసాగుతోంది. ఒకవేళ ఐసీఐసీఐ బ్యాంక్ అంచనాలే నిజమైతే, 50-75 బేసిస్ పాయింట్ల పెంపుతో రెపోరేటు 5.75నుంచి 6.00 శాతానికి చేరే ప్రమాదం ఉంది. గత కొన్ని త్రైమాసికాలుగా యథాతథ స్థితిని కొనసాగించినప్పటికీ మారుతున్న ఆర్థిక సమీకరణాల దృష్ట్యా రానున్న ద్రవ్య పరపతి సమీక్షల్లో కఠిన నిర్ణయాలు తీసుకోక తప్పదని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి. ఆర్‌బీఐ గనుక రెపో రేటును పెంచితే, వాణిజ్య బ్యాంకులు కూడా తమ రుణాలపై వడ్డీ రేట్లను పెంచుతాయి.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No. 64861/96 , Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14